CHANDAMAMA (Telugu) JULY 1973 Regd. No. M. 4854




మిత్రభేదం



దక్షిణ భారతంలో మహిళారూప్య మనే నగరాన్ని అమరశక్తి అనే రాజు పాలించేవాడు. ఆయన శక్తివంతుడు, ధీమంతుడు, దయావంతుడు; లలిత కళాకౌశలమూ, రాజకీయ చతురతా కలవాడు.

ఆయనకు వసుశక్తీ, ఉగ్రశక్తీ, అనేకశక్తీ అని ముగ్గురు కుమారులు. వారికి చదువు రాలేదు, లోకజ్ఞానం లేదు. వారికి రాజనీతీ, రాజతంత్రమూ, సాధారణ జ్ఞానమూ సైతం లేకపోవటం చూసి రాజుకు విచారం కలిగింది.

ఆయన ఒకనాడు తన మంత్రులను పిలిచి, "నా కొడుకులు మూఢులన్న సంగతి మీ రెరుగుదురు. జ్ఞానమూ, సద్బుద్ధీ లేని కొడుకు గొడ్డుమోతు ఆవు లాగా నిరర్థకం. అలాటి కొడుకులను కనేకన్న భార్య గొడ్రాలుకావటం మేలు; సన్యసించటం మేలు. అందుచేత నా కొడుకులలో జ్ఞానాన్ని వికసింపచేసి, వారిలో రాజనీతీ, పరిపాలనా దక్షతా కలిగించేమార్గం ఏదో చెప్పండి." అన్నాడు.

"ఈ నగరంలోనే విష్ణుశర్మ అనే గురువు ఉన్నాడు. ఆయన సమస్తకళలను కాచి వడబోసినవాడు. అంతే కాదు. ఆయన అమిత సులువుగా విద్యాబోధ చెయ్యగలడు. ఆయనకు మహారాజుగారు తమ కుమారులను అప్పగించినట్టయితే అతి శీఘ్రకాలంలో ఆయన వారిని రాజనీతిలోనూ, ప్రపంచ జ్ఞానంలోనూ ఆరితేరేటట్టు చేయగలడు." అని ఒక మంత్రి చెప్పాడు.

రాజు విష్ణుశర్మను పిలిపించి, తన కొడుకులకు రాజనీతీ, వివేకమూ నేర్పినట్టయితే నూరుగ్రామాలు బహుమానంగా ఇస్తానన్నాడు.

"మహారాజా, నేను విద్యను విక్రయించను. ఎనభైఏళ్ళవాణ్ణి, నాకు ధనం

అట్ట చివరి బొమ్మ



ఎందుకు? అడిగిన వారికి విద్యాదానం చెయ్యటం నా విధి. ఆరుమాసాలలో నేను మీ పిల్లలకు రాజనీతీ, వివేకమూ కలిగిస్తాను," అన్నాడు విష్ణుశర్మ.

రాజు సంతోషించి, తన పిల్లలను ఆయనకు అప్పగించాడు: ఆయన వారికి పంచతంత్రం అనేది అయిదు భాగాలుగా చెప్పాడు. ఆ భాగాలేవంటే, మిత్రభేదం, మిత్రసంప్రాప్తి, కాకోలూకీయం, లబ్ధప్రణాశం, అపరీక్షితకారకం.

విష్ణుశర్మ చెప్పిన ఈ పంచతంత్రం ద్వారా రాజకుమారులు అయిదు మాసాలలో రాజనీతిలోనూ, లోకజ్ఞానంలోనూ ఆరితేరిన వారైనారు.

### 1. సింహమూ, ఎద్దు.

దక్షిణదేశంలో మహిళారూప్య మనే నగరంలో వర్ధమాను డనే వర్తకుడు ఉండేవాడు. ఆయన గొప్ప ధనికుడూ, నీతిపరుడూ, దాతకూడానూ. ఆయన ధనాన్ని తేలికగా సంపాదించి, వివేకంతో ఖర్చు చేసేవాడు.

ఒకనాడు ఆయన రెండెడ్లబళ్ళ మీద ఖరీదైన వర్తకపు సరుకులు వేసుకుని, యమునా తీరాన గల మధురానగరానికి బయలుదేరాడు. ఒక బండికికట్టిన నందికం, సంజీవకం అనేవి మేలైన ఎద్దులు.

కొన్నాళ్ళకు బిడారు యమునా తీరానగల అడవిని చేరుకున్నది. ఆ అడవిలో అనేక రకాల చెట్లూ, అడవి జంతువులూ ఉండేవి. ఇక్కడ సంజీవకం అనే ఎద్దు బురదనేల మీద కాలుజారి, మడమ విరిగి, పడిపోయి, కదలలేకపోయింది. బండివాడు వర్ధమానుడికి ఈ సంగతి చెప్పాడు.

వర్ధమానుడు ఎంతో చింతించి, అయిదు రోజులపాటు ప్రయాణం నిలిపి, సంజీవకానికి చికిత్సలు చేయించాడు, కాని ప్రయోజనం లేకపోయింది. ఆయన శీఘ్రంగా మధుర చేరుకుని, పని చూసుకోవలసి ఉండటం చేత, సంజీవకానికి బండివాణ్ణీ, మరొక సేవకుణ్ణీ తోడు ఉంచి, తగినంత మేతా, డబ్బూ వారికి ఇచ్చి, "ఎద్దును

శ్రద్ధగా సంరక్షించి, బాగుకాగానే నా వద్దకు తీసుకురండి. ఒకవేళ అది చావటం జరిగితే, దానికి శ్రద్ధగా దహన సంస్కారాలు జరిపి మీరు వచ్చెయ్యండి," అన్నాడు.

ఇలా చెప్పి ఆయన తన బళ్ళనూ, సరుకునూ మధురకు తరలించుకుని వెళ్ళిపోయాడు. ఆ ఇద్దరు మనుషులూ ఒంటరిగా అడవిలో ఉండటానికి భయపడి, ఎద్దును అక్కడే వదిలేసి, మర్నాడే తమ యజమానిని చేరుకుని, ఎద్దు చచ్చిపోయిందని చెప్పారు.

అయితే అదృష్టవశాన సంజీవకం కోలుకున్నది. అది క్రమంగా లేచి, కుంటుతూ తిరగ సాగింది. అది నింపాదిగా నడుచుకుంటూ, అరణ్యంగుండా యమునానది ప్రవహించే చోటుకు చేరుకున్నది. అది నది ఒడ్డున గల పుష్టికరమైన గడ్డిమేసి, స్వచ్ఛమైన నదీ జలం తాగి త్వరలోనే బలాన్నీ, ఆరోగ్యాన్నీ పొంది, శివుడి వాహనమైన నందికి సమానంగా తయారైంది.

ఆ అరణ్యంలోనే పింగళకం అనే సింహం, నక్కలనూ, ఇతర జంతువులనూ పరివారంగా పెట్టుకుని నివసిస్తున్నది. ఆ సింహం ఒకనాడు యమునలో నీరు తాగబోయి, సంజీవకం పెట్టిన పెద్ద రంకె విని, అలాటి భయంకర ధ్వనిచేసే ప్రాణి ఏమై ఉంటుందో తెలియక బెదిరిపోయింది.



అది తన భయాన్ని పైకి తెలియనివ్వక, నీరు తాగే ప్రయత్నం మాని, మర్రిచెట్టు కింద తన నివాసానికి తిరిగి వచ్చి, జరిగిన దాన్ని గురించి ఆలోచించ సాగింది. ఇతర మృగాలు దాన్ని పరివేష్టించి ఉన్నాయి. భయపడి నప్పటికీ దాని గాంభీర్యం తగ్గలేదు. మృగరాజుకు మనిషి రాజులలాగా అభిషేకమూ, దుస్తులూ, చదువులూ, అవసరం లేదు. ప్రకృతే దానిని రాజుగా సృష్టించింది.

సింహం వెంట ఉన్న జంతువులలో కరటకమూ, దమనకమూ అనే రెండు నక్కలున్నాయి. అవి పూర్వం సింహం కింద కొలువు చేసిన జంతువు బిడ్డలు.

ప్రస్తుతం వాటికి పదవి లేదు. సింహం నది దాకా వెళ్ళికూడా నీరు తాగకుండా తిరిగి రావటం దమనకం గమనించింది. అది తన తోబుట్టువైన కరటకాన్ని ఎడంగా తీసుకు పోయి, "మన ఏలిక అయిన పింగళకాన్ని చూశావా? నీరు తాగటానికి యమున వద్దకు వెళ్ళింది. నీరు తాగకుండా ఆకస్మికంగా ఎందుకు తిరిగి వచ్చిందీ? దాని ముఖం దీనంగానూ, విహ్వలంగానూ ఎందుకు ఉన్నదీ?" అన్నది.

దానికి కరటకం, "తమ్ముడూ, రాజుకు సంబంధించిన విషయాలలో జోక్యం కలిగించుకోకు. అలా చపలచిత్తంతో లేనిపోని విషయాలలో జోక్యం కలిగించుకునే వాళ్ళు సీల పెరికిన కోతి లాగా వెంటనే నశించి పోతారు," అన్నది.

"అదెలాగ?" అన్నది దమనకం.

కరటకం చిలిపికోతి కథ ఇలా చెప్పింది:

ఒక నగరం వెలపల ఒక వర్తకుడు ఆలయం కట్టిస్తున్నాడు. ప్రతిరోజూ మధ్యాహ్నం వేళ పనివాళ్ళు తిండి తినటానికి నగరానికి పోతారు. ఆ ప్రదేశమంతటా పెద్ద పెద్ద దుంగలను రంపాలతో కోస్తారు.

ఒకనాడు, కట్టుతూ ఉన్న దేవాలయం దగ్గిరికి కోతుల మంద వచ్చింది. ఒక బ్రహ్మాండమైన మాను సగం కోసి ఉన్నది. పనివాళ్ళు కోత ఆగిన చోట దుంగలో ఒక సీల గుచ్చారు.

కోతులన్నీ గెంతుతూ ఆడుతూ ఉంటే ఒక చిలిపి కోతి ఆ సీలను చూసి, "ఇది ఇక్కడ ఎందుకున్నదీ?" అనుకుని, సీలను రెండు చేతులా పట్టి బలం కొద్దీ పెరికింది. సీల లాగగానే, ఎడంగా ఉన్న దుంగ భాగాలు కలుసుకున్నాయి. కోతి వాటి సందున నలిగి చచ్చిపోయింది.

కరటకం ఈ కథ చెప్పి, "అందుకే నువు లేనిపోని విషయాల జోలికి పోవద్దన్నాను. పిచ్చివాడా, మనకు కొలువు లేక పోయినా, ప్రభువు వదిలిన ఆహారం తిని బాగానే బతుకుతున్నాం. ఈ కాస్త పోగొట్టుకోవటం దేనికి?" అన్నది.

—(ఇంకా వుంది)





# మిత్రభేదం

## 2

కరటకం కోతి కథ చెప్పగానే దమనకం ఇలా అన్నది:

"అన్నా, తన స్వార్థమే చూసుకుంటూ, ఏదో విధంగా పొట్ట పోసుకోవటమే లక్ష్యంగా పెట్టుకున్నవాడు పైకిరాలేడు. కడుపు నిండిన మాత్రాన ఉత్తమ జీవితం అలవడదు. చివరకు కాకికూడా తన ముక్కుకు అందిన చెత్త తిని కడుపు నింపుకుంటుంది. మిత్రులకూ, గురువులకూ, భృత్యులకూ, ఆపదలో ఉన్నవారికీ ఉపకరించని జీవితం ఏమి జీవితం? ఒక ఎముక దొరికితే, దానితో కడుపు నిండక పోయినా కుక్క సంతృప్తి చెందుతుంది. తోక ఆడిస్తూ, నోరు తెరిచి, వెల్లికిలాపడి తిండి కోసం ప్రాధేయ పడే జంతువును చూసి మనం ఎలా హర్షించగలం? ఏనుగు అలా కాదు; అది ఆత్మాభిమానం గలది; ఎంతో బతిమాలితేనే గాని ఏమీ తినదు. సింహం తన పంజాకు అందుబాటులో ఉన్న నక్కను కూడా కొట్టదు; అది మదపుటేనుగును మాత్రమే చంపుతుంది. చంపటంలో కూడా ప్రకృతి ధర్మం ఉంటుంది. అలాటప్పుడు జీవించటంలో ఇంకెంత ఉండవచ్చు? చిన్న గుంట త్వరగా నిండుతుంది. అలాగే హీనులు కొద్ది ఆర్జనతో తృప్తిపడతారు. మంచి చెడ్డలకూ, ఉచ్చ నీచలకూ తేడా లేకపోయినా; సంస్కారం సంపాదించిన మనం విధిని ధిక్కరించక, పశుప్రవృత్తితో తృప్తిచెందినా; మానవులు మానవమృగాలుగా ఉండిపోతారే తప్ప; వారికీ జంతువులకూ తేడా ఏమిటి?"

"కాని, ఇందులో మన కర్తవ్యం ప్రసక్తి ఏమున్నది? మనం సింహం కింద కొలువు చెయ్యటం లేదుగదా!" అన్నది కరటకం.

అట్ట చివరి బొమ్మ



"పిచ్చివాడా, ఉద్యోగాలు ఉంటాయి, ఊడుతాయి. కర్తవ్యం మటుకు ఎల్లప్పుడూ ఉంటుంది. అర్హులకు పదవుల అవకాశం లేకపోదు. అనర్హులే త్వరగా తమ పదవులను కోల్పోతారు. క్రియకు గౌరవా గౌరవాలు మన అర్హతను బట్టే కలుగుతాయి. రాయిని కొండమీదికి ఎక్కించటం కష్టం, కిందికి దొర్లించటం తేలిక. అలాగే గౌరవ మర్యాదలు సంపాదించటం శ్రమతో కూడిన పని. కుక్షింభరులైన చవటలుగా ఉండి పోవటానికి ఏ శ్రమా అవసరం లేదు," అన్నది దమనకం.

"సరే, ఇంతకూ నీ ఉద్దేశం ఏమిటి? మన ఏలిక అయిన సింహాన్ని ఏమి అడుగుదామనుకుంటున్నావు?" అని కరటకం అడిగింది.

"మన ఏలిక దేన్నో చూసి గాని, ఏదో విని గాని భయపడినట్టున్నది. దాని భయం చూసి, దాని భృత్యులైన మిగిలిన మృగాలు భయపడ్డాయి. మన ఏలికకు ఏం చెయ్యటానికీ పాలుబోకుండా ఉన్నది," అన్నది దమనకం.

"సింహం వద్దకు వెళ్ళి, 'నువు భయపడ్డావు,' అని చెప్పటం ప్రమాదం. అందుచేత, మాట్లాడక ఊరుకో," అన్నది కరటకం.

"ధైర్యం గల వారికి ప్రమాద భయం ఉండదు. రాజుకు హితమైనది అడగకపోయినా చెప్పటం పౌరుడి ధర్మం. అదీగాక రాజుగారి మన్ననలు పొందగోరే వాళ్ళు రాజుకు సన్నిహితంగా ఉండాలి. రాజుకు సన్నిహితుడై మసలేవాడు, రాజుగారి తత్వం గ్రహిస్తాడు," అన్నది దమనకం.

"సరే, నీ కంత పట్టుదలగా ఉంటే వెళ్ళు. కాని జాగ్రత్తగా ఉండు సుమా. మన ఇద్దరి అదృష్టమూ నీ విజయం మీద ఆధారపడి ఉన్నది," అన్నది కరటకం.

దమనకం తన అన్నకు నమస్కారంచేసి పింగళకం వద్దకు వెళ్ళింది.

పింగళకం దమనకాన్ని చూసి, "దాన్ని నా దగ్గిరికి రానివ్వండి. అది నా పాత

భృత్యుడి కొడుకు," అని తన అనుచరులతో అన్నది. దమనకం సింహం సన్నిధికి వచ్చి, సింహానికి నమస్కరించి, సింహం అనుమతితో కూర్చున్నది.

"కులాసాగా ఉన్నావా? ఇంత కాలం నాకు కనపడలేదేం? ఇప్పుడు రావటానికి కారణ మేమిటి?" అని పింగళకం అడిగింది.

"ఏలిక పిలపనంపక పోయినా, రావటం నా ధర్మమని తోచింది. నా వంటి అల్పుడి వల్ల కూడా ప్రయోజనం ఉంటుంది. తరతరాలుగా తమను కొలిచిన వాళ్ళం కావటం చేత మంచి కాలంలోనూ, కష్టకాలంలోనూ మాకు తమరిని అనుసరించటం విధాయకం. 'నన్ను ఇంత కాలం ఎందుకు చూడ రాలేదు?' అని తమరు అడిగారు. నన్ను తమరు తమ మంత్రివర్గంలో చేర్చారా? ఆలోచనకు రమ్మని పిలిచారా? భృత్యులలో అర్హులెవరో, అనర్హులెవరో యజమాని గ్రహించనప్పుడు అర్హులైనవారు యజమానులకు దూరంగా ఉండి పోతారు," అన్నది దమనకం.

"నక్కా, ఇంతకూ నువు చెప్పదలిచినదేమిటి?" అన్నది పింగళకం.

"నక్కనని నన్ను తమరు చిన్నచూపు చూడవద్దు. మేలైనపట్టు పురుగుల నుంచి వస్తుంది. రాతి నుంచి బంగారం వస్తుంది.



కర్ర నుంచి అగ్ని వస్తుంది. దీనిని బట్టి జన్మలో ఏమీ లేదు, గుణం ప్రధానం అని తెలుస్తుంది. అందుచేత నన్ను తమరు హీనంగా చూడవద్దు. నేను విశ్వాస పాత్రుణ్ణి, ఇతరులలాగా స్వలాభం చూసుకునే వాణ్ణి కాను," అన్నది దమనకం.

"నాకు తెలియదా? ఇవాళ నీ రాకకు కారణం ఏమిటో చెప్పు," అన్నది పింగళకం.

"నేనొక ముఖ్య విషయం తమతో చర్చించాలి. ప్రభువువారు నీరు తాగటానికి నది వద్దకు వెళ్ళి, అంతలోనే తాగకుండా ఎందుకు తిరిగి వచ్చారు?" అని దమనకం అడిగింది.

తన భయం గురించి ఈ నక్కకు తెలియనివ్వటం మంచిది కాదని, "ప్రత్యేకించి కారణం ఏమీ లేదు. తాగబుద్ధి కాలేదు," అన్నది పింగళకం.

"చెప్పకూడని రహస్యమైతే పోనియ్యండి. అన్ని విషయాలూ అందరితోనూ చెప్పదగినవి కావు," అన్నది దమనకం.

దమనకం బుద్ధి సూక్ష్మతలో గురికుదిరి, పింగళకం, "మన అరణ్యంలోకి ఒక భయంకరమైన మృగం వచ్చింది. దాని రంకె మహాభయంకరం! నేను ఈ అరణ్యాన్ని విడిచిపెట్టి పోదామనుకుంటున్నాను," అన్నది.

"అదేమిటి? ఏలిన వారు ధ్వనికే భయపడుతున్నారా? తమ పూర్వీకులు కష్టపడి సంపాదించిన ఈ అరణ్యరాజ్యాన్ని విడిచిపుచ్చటం భావ్యమా? అదీగాక ధ్వనులన్నీ ప్రమాదం కలిగించవు. ఉరుములు వింటాం. తుపాకు ధ్వని వింటాం. కాని ఇవి మనకు కీడుచేయవు. ధైర్యశాలి దేనికీ భయపడడు, విధికికూడా జడియడు. మీరు ధైర్యంగా ఉండండి. మీరు విన్న రంకెను లక్ష్యపెట్టకండి. మీరు రణదుందుభి కథ వినలేదా?" అన్నది దమనకం.

"ఏమిటా కథ?" అని పింగళకం అడిగింది.

దమనకం ఇలా చెప్పింది.

ఆకలి గొన్న ఒక నక్క ఆహారం కోసం వెతుకుతూ యుద్ధభూమికి వెళ్ళింది. అక్కడ దానికొక భయంకరమైన ధ్వని వినవచ్చింది. నక్క భయపడి, "చచ్చానురా, దేవుడా!" అనుకున్నది. తీరాచూస్తే, ఒక చెట్టు కింద కొమ్మకు ఒక రణదుందుభి కట్టి ఉన్నది. గాలికి కొమ్మలు కదిలి, దాన్ని కొట్టటం చేత ధ్వని వస్తున్నది. దాని నిండా మాంసం ఉంటుంది, తినవచ్చుననుకుని ఆ నక్క దాన్ని ఒక పక్కనుంచి కొరికి రంధ్రం చేసింది. కాని ఆ దుందుభిలో కొయ్యా, చర్మమూ తప్ప నక్కకు ఏమీ కనిపించ లేదు.

దమనకం ఈ కథ చెప్పి, "ధ్వనులను బట్టి ఏమీ నిర్ణయించరాదు," అన్నది.



CHANDAMAMA (Telugu) AUGUST 1973 Regd. No. M. 4854




మిత్రభేదం



# మిత్రభేదం

## 3

దమనకం చెప్పిన నక్క కథ విని సింహ రాజు పింగళకం, "కాని మన పరివార మంతా భీతిచెంది, అరణ్యం నుండి పారి పోవాలనుకుంటున్నారు," అన్నది.

"స్వామీ, అది వారి తప్పు కాదు. రాజును బట్టే ప్రజలు. మీరు ధైర్యం వహించి ఇక్కడే ఉన్నట్టయితే నేను వెళ్ళి, ఆ భయంకరమైన రంకె వేసిన ప్రాణియొక్క తత్వం తెలుసుకుని వస్తాను. ఆ తరవాత తమ చిత్తం," అన్నది దమనకం.

"వెళ్ళి కనుక్కురా. అయితే నీకు అక్కడికి వెళ్ళే ధైర్యం ఉన్నదా?" అని పింగళకం అడిగింది.

"యజమాని అనతిస్తే మంచి సేవకుడైనవాడు సంశయిస్తాడా? సముద్రాలలో దూకుతాడు, అగ్నిలో చొరబడతాడు!" అన్నది దమనకం.

"అయితే వెళ్ళి రా! శుభమస్తు!" అన్నది పింగళకం.

దమనకం సింహానికి నమస్కరించి, రంకె వినిపించిన యమునానది దిక్కుగా బయలుదేరింది.

పింగళకం ఇలా ఆలోచించింది: "నేను నా భయాన్ని వీడికి తెలియనివ్వటం పొరపాటయిందా? వీడు వెళ్ళి ఆ భయంకర మృగాన్ని తెచ్చి, మోసంతో నన్ను చంపించడు గద? ఆశ్రయం లభించని సేవకులు ఎంత పని అయినా చేస్తారు. నేను మరెక్కడైనా వేచి ఉంటాను."

ఇలా అనుకుని పింగళకం ఆత్మరక్షణకు అనువైన చోటికి వెళ్ళి, "నమ్మిన బలవంతుడు బలహీనుడికి కూడా ఓడుతాడు; జాగ్రత్త గల బలహీనుడు బలవంతుడికి కూడా లొంగడు," అనుకున్నది.

అట్ట చివరి బొమ్మ

ఈ లోపల దమనకం వెళ్ళి, రంకెలు పెడుతున్న సంజీవకాన్ని చూసి, అది మామూలు ఎద్దేనని తెలుసుకుని ఆశ్చర్య పోయింది. పింగళకానికి గల భయాం దోళనలు ఆధారం చేసుకుని దాన్ని తన అధీనంలో ఉంచుకోవటం తేలిక అని అది అనుకున్నది. భృత్యులు తమ యజ మానికి క్లిష్టసమస్యలు కలగాలని కోరు కుంటారు. ఎందుకంటే వాటిని పరిష్క రించే మిష మీద తాము లాభం పొంద వచ్చు. ఏ సమస్యలూ లేని రాజులకు మంత్రాలోచన చేసే వారితో ఏం పని? ఆరోగ్యవంతుడికి వైద్యులూ, ఔషధాలూ ఎందుకూ? దమనకం పింగళకం వద్దకు తిరిగి వెళ్ళింది.

"ఏంరా, అబ్బీ? ఆ భయంకర మృగాన్ని చూశావా?" అని పింగళకం అడిగింది.

"తమ దయవల్ల చూశాను. చూసి ఆ మృగంతో తమ బలపరాక్రమాలను గురించి చెప్పాను; తమకు జోహారు లర్పించమన్నాను. నేను వెళ్ళి, అతన్ని తమ సన్నిధికి తెచ్చి, తమకు పాదా క్రాంతుడు చేస్తాను," అన్నది దమనకం.

పింగళకం ఈ మాట విని అమితానందం చెంది, "వెళ్ళు. వెంటనే అతగాణ్ణి తీసుకు రా!" అన్నది.

దమనకం సంజీవకం వద్దకు వెళ్ళి, "ఇలా రా, తెంపరి ఎద్దూ. ఇంత అమ ర్యాదగా, మాకు చిరాకు కలిగిస్తూ, ఈ నది ఒడ్డున ఎందుకు రంకెలు



పెడుతున్నావో మా రాజు పింగళకంగారు తెలుసుకో గోరుతున్నారు," అన్నది.

"బాబ్బాబు! ఎవరు నువు చెప్పే ఈ పింగళకం?" అన్నది సంజీవకం.

"ఏమిటీ? మా రాజు పింగళకాన్నే ఎరగవుగా! చెబితే గడగడలాడి పోతావు. ఆయన ఒక గొప్ప సింహం. వన రాజు. అన్ని జంతువులూ ఆయన పరివారం. ఆయన పెద్ద మఱ్ఱిచెట్టు కింద కొలువు తీరి ఉంటారు. ఈ అరణ్యంలో ఉండే సమస్త ప్రాణులకూ ఆయన యజమాని," అన్నది దమనకం.

ఈ మాటలు విని సంజీవకం భయపడి దమనకంతో, "బాబ్బాబు! నువు మంచి వాడివి లాగున్నావు. నన్ను వారి దగ్గికిరి తీసుకుపోవలిసే ఉంటే ముందుగా వారి నుంచి నాకు అభయం ఇప్పించు," అన్నది.

"నీ కోరిక సబబుగానే ఉన్నది. రాజుల చిత్తం అగాధం. నువు ఇక్కడే ఉండు," అని దమనకం పింగళకం వద్దకు పోయి, "మహారాజా, ఆ జంతువు సామాన్యుడు కాడు. సాక్షాత్తూ శివుడి వాహనమట. శివానుజ్ఞతో ఈ వనంలో మేత మేస్తున్నట్టు చెప్పాడు," అన్నది.

పింగళకం ఈ మాట విని దడుచుకుని, "నాకు ముందే తెలుసురా, అబ్బీ! ఈశ్వరుడి అనుమతి లేకుండా ఈ వనంలో స్వేచ్ఛగా తిరుగుతూ, భయంకరంగా రంకెలు పెట్టజాలరు. ఇంతకూ నువు అతనితో ఏమన్నావు?" అన్నది.



"'మా రాజు సాక్షాత్తూ పార్వతీదేవి వాహనం. పార్వతీదేవే మా రాజుకు ఈ వనాన్ని ఇచ్చింది. నువు ఇక్కడికి అభ్యాగతిగా వచ్చినవాడివి. అందుచేత నువు మా రాజును కలుసుకుని, వారితో సంధి చేసుకుని, సఖ్యంగా తిను, తాగు, తిరుగు, ఆడు; వారి అనుమతితో జీవించు,' అన్నాను. అందుకు అతను ఒప్పుకుని తమ వద్ద నుండి అభయం తెమ్మన్నాడు. ఇస్తారో, ఇయ్యరో అది తమ ఇష్టం," అన్నది దమనకం.


ఈ మాటకు పింగళకం మహా సంతోష పడిపోయి, "భేష్ రా, అబ్బీ! భేష్! అతడికి అభయం ఇచ్చాను, వెళ్ళి పిలుచుకు రా!" అన్నది.


సంజీవకాన్ని తీసుకురావటానికి వెళ్ళేటప్పుడు దమనకం హృదయం ఆనందంతో పొంగిపోయింది. రాజుకు తనపై అనుగ్రహం కలిగింది. రాజానుగ్రహం పాయసం లాటిది; చలిలో కుంపటిలాటిది; అప్తులను కలుసుకోవటంలాటిది.

దమనకం సంజీవకాన్ని చేరుకుని, "మిత్రమా, నీ యెడ మా రాజు అనుగ్రహం సాధించాను. ఆయన నీకు అభయం ఇచ్చారు. నువ్వీక నిశ్శంకగా నా వెంట రావచ్చు. కాని గుర్తుంచుకో, నీకు రాజానుగ్రహం సంపాదించినది నేను. నువు నా చెప్పు చేతలలో ఉండాలి. రాజుకు ఆత్మీయుణ్ణి అని విర్రవీగక, పరిపాలన అంతా నా చేతి మీదుగా జరగనీ. అలాచేస్తే ఇద్దరికీ సుఖం ఉంటుంది. ఒకడు వేట మృగాన్ని కదిలిస్తాడు, రెండోవాడు దాన్ని కొట్టుతాడు; ఇద్దరూ కలిసి దాన్ని పంచుకుంటారు. అది వేట ధర్మం. అదీకాక, నువు నాకు అసంతృప్తి కలిగించావంటే నశిస్తావు. రాజభృత్యులను సంతోష పెట్టని వాళ్ళు వెనకటికి దంతిలుడి లాగా భంగపాటు చెందుతారు," అన్నది.

"అదెలాగా?" అని సంజీవకం దమనకాన్ని అడిగింది.

దమనకం దంతిలుడి కథ చెప్పనారంభించింది.






మిత్రభేదం



# మిత్రభేదం

## 4

### దంతిలుడి కథ

సంజీవకానికి దమనకం దంతిలుడి కథ ఇలా చెప్పింది:

వర్ధమాన నగరంలో దంతిలుడు అనే ఒక గొప్ప వర్తకుడుండేవాడు. ఆయన నగరపాలకుడుగా ఉండి, నగరానికి సంబంధించిన విషయాలన్నీ చూసేవాడు. ఆయన రాజుగారి సొంత ఖర్చు వెచ్చాలు కూడా చూసేవాడు. ఆయన అటు రాజుగారినీ, ఇటు ప్రజలనూ కూడా సంతోషపెట్టి, అందరి మన్ననలనూ పొందుతూ వచ్చాడు. రాజుకు హితుడైన వాణ్ణి ప్రజలు ద్వేషిస్తారనీ, ప్రజలకు హితుడైన వాణ్ణి రాజు ద్వేషిస్తాడనీ, రాజ క్షేమానికీ, ప్రజా క్షేమానికీ వైరుధ్యం ఉండటం చేత ఉభయులనూ తృప్తిపరచటం చాలా అరుదనీ చెబుతారు. కాని దంతిలుడు అలాటి అరుదైనమనిషి.

ఒకప్పుడు దంతిలుడు తన కుమార్తె వివాహం జరిపాడు. దానికి ఆయన పౌరులనూ, రాజోద్యోగులనూ ఆహ్వానించి, విందు భోజనాలు పెట్టి, విలువైన బట్టలు పెట్టి పంపేశాడు. వివాహం పూర్తి అయాక ఆయన వధూవరులను ఆశీర్వదించటానికి రాజునూ, ఆయన భార్యలనూ ఆహ్వానించాడు. వారు ఆహ్వానం అందుకున్నారు. ముందుగా దివాణం నుంచి అనేక మంది ఉద్యోగులూ, నౌకర్లూ దంతిలుడి ఇంటికి వచ్చారు. వారిలో రాజుగారి ఇంట కసవు ఊడ్చేవాడు గోరభుడు అనే వాడు కూడా ఉన్నాడు. గోరభుడు మాన మర్యాదలు పాటించక, రాజ పురోహితుడి కొరకు ఏర్పాటు చేసిన ఆసనంలో వెళ్ళి కూర్చుని, లేవ నిరాకరించాడు. అందుచేత దంతిలుడు

అట్ట చివరి బొమ్మ



వాణ్ణి బయటికి గెంటించాడు. తరవాత రాజు తన రాణులతో సహా వచ్చి, దంతిలుడు చేసిన సత్కారాలు పొందాడు.

తనకు జరిగిన అవమానానికి ఉడికి పోతూ గోరభుడు ఆ రాత్రి నిద్రపోలేదు. వాడు ఇలా ఆలోచించాడు: "ఈ అవమానానికి ప్రతిక్రియ ఏమిటి? దంతిలుడిపై రాజుకు ఆగ్రహం తెప్పించి, అవమానం పాలు చెయ్యగలనా? లేక నేను ఏమీ చెయ్యలేక అవమానంతో కృశించి పోవలసినదేనా? పగ తీర్చుకోలేకుండా ఆగ్రహం చెందే వాడు సిగ్గుమాలిన వాడు. పెనం మీద వేసిన ఆవగింజ ఎంత ఎగిరి పడినా పెనాన్ని విరగగొట్టలేదు. నేను కసువు ఊడ్చేవాణ్ణి, ఆయన కోటీశ్వరుడూ, నగర పాలకుడూ; అయినా నన్ను అవమానించి ఆయన తప్పించుకు పోలేడని చూపిస్తాను."

రాజుగారు పక్క వదలక ముందే రాజుగారి శయనాగారం చిమ్మటం గోరభుడి పని. ఇది జరిగిన మర్నాటి ఉదయం రాజుగారు నిద్రలేచి, ఇంకా పక్కమీదనే ఉండగా, గోరభుడు గది చిమ్ముతూ, "దంతిలుడు పెద్ద రాణీగారిని ఆలింగనం చేసుకోవటం ఎంత సాహసం!" అని గొణుక్కున్నాడు.

ఈ మాటలు విని రాజు చివాలున లేచి," ఒరే, నువు ఇప్పుడు గొణిగినది నిజమా? దంతిలుడు పెద్దరాణిని కౌగలించుకున్నాడా?" అని అడిగాడు.

"దొరా, రాత్రి పొద్దుపోయి పాచికలాడుతూ మేలుకుని ఉండటంచేత, నిద్ర మత్తుతో జోగుతూ ఏమన్నానో నాకే తెలీదు," అన్నాడు గోరభుడు.

రాజు తనలో, "రాణులుండే గదులలోకి వెళ్ళే పర పురుషులు దంతిలుడూ, ఈ గోరభుడూ మాత్రమే. అందుచేత దంతిలుడు పెద్దరాణిని ఆలింగనం చేసుకోవటం ఈ గోరభుడి కంటపడి ఉండవచ్చు. నిన్న సాయంకాలం దంతిలుడు పెద్ద రాణి పట్ల, మిగిలిన రాణుల పట్లకన్న, హెచ్చు శ్రద్ధ చూపటమూ, ఆవిడ

అతనితో కొంచెం హెచ్చు చనువుగా ఉండటమూ గమనించి అదంతా లాంఛన మనుకున్నాను. కాని వీడు అనే మాటలన్ను బట్టి అందులో విశేషార్థం కనిపిస్తున్నది. తాగుబోతుల నోటా, నిద్రపోయేవారి నోటా రహస్యాలు బయట పడతాయి. అనేక మంది భార్యలు ఉండటం చేత నేను పెద్ద రాణి పట్ల నిర్లక్ష్యంగా ఉంటున్న మాట నిజమే. అందుచేత ఆమె దంతిలుడి ప్రేమ కోసం ఆశపడి ఉండవచ్చు. నాకు ఎంత కష్టం వచ్చింది!" అనుకుని, దంతిలుణ్ణి రాజభవనంలో అడుగుపెట్ట నివ్వవద్దని ద్వారపాలకులకు ఉత్తరువిచ్చాడు.

ఆ ఉదయం దంతిలుడు ఎప్పటిలాగే రాజభవనానికి వచ్చి, ద్వారపాలకులు తనను లోనికి పోనివ్వక పోవటం చూసి ఆశ్చర్యపడి, "నన్ను లోపలికి పోవద్దనటానికి మీకెన్ని గుండెలు!" అన్నాడు.

"అయ్యా. మా పైన కోప్పడకండి. ఇది రాజుగారి ఉత్తరువు," అన్నారు వాళ్ళు.

"రాజుగారి ఉత్తరువా? ఆయన అలాటి ఉత్తరువు ఒక్కనాటికీ ఇయ్యడు," అన్నాడు దంతిలుడు.

"సరేలెండి. రాజుగారికి మీమీద ఎందుకో చాలా కోపం వచ్చి ఉండాలి. ఆయన ఉత్తరువు ఇచ్చారు. దాన్ని పాలించటం మా విధాయకం," అన్నారు ద్వారపాలకులు.



రాజుగారికి తనపై గలిగిన అకారణ క్రోధానికి దంతిలుడు నిర్ఘాంతపోయి తనలో ఇలా అనుకున్నాడు: "డబ్బు రావటంతో గర్వించనివాడూ, భోగలాలసత వల్ల ఏదో ఒక చిక్కు రానివాడూ, రాజుగారి ప్రేమకు నిజంగా పాత్రుడైనవాడూ, చావును తప్పించుకున్నవాడూ, గౌరవం పొందిన యాచకుడూ ఉండడని పెద్దలు చెబుతారు. కాకిలో శౌచమూ, జూదరిలో నిజమూ, తాగుబోతులో వేదాంతమూ ఎవరు చూశారు? నేను రాజుకు గాని, రాజ బంధువులకు గాని కలలో కూడా ఎలాంటి అన్యాయమూ చేసి ఎరగనే, రాజుకు నా పై ఆగ్రహం ఏల కలిగింది?"

దంతిలుడు నిస్సహాయుడై నిలబడి ఉండటం చూసి గోరభుడు ద్వారపాలకులతో, "నన్ను ఈయనగారు బయటికి గెంటేసినట్టే మీరు ఈయనగారిని బయటికి గెంటండి," అన్నాడు.

ఇది విని దంతిలుడు, ఈ గోరభుడే దీనికంతకూ కారకుడని గ్రహించి, ఆ రాత్రి గోరభుణ్ణి తన ఇంటికి పిలిచి, వాడికి మేలైన బట్టలు పెట్టి, "నాయనా, నేను నిన్ను పొగరెక్కి అవమానించలేదు. రాజపురోహితుడి ఆసనం మీద కూర్చుని, దిగమంటే దిగక, చేజేతులా అవమానం తెచ్చి పెట్టుకున్నావు," అన్నాడు.

గోరభుడు తనకు పెట్టిన బట్టలు చూసి మహదానందం చెంది, "ఆ అవమానం అప్పుడే పోయిందిలెండి. రాజుగారికి మీమీద అనుగ్రహం కలిగేటట్టు ఎలా చేస్తానో చూడండి," అని వెళ్ళిపోయాడు.

మర్నాడు ఉదయం రాజుగారు పక్క మీద మేలుకుని పడుకుని ఉండగా గోరభుడు గది చిమ్ముతూ, "రాజుగారికి ఇంగితజ్ఞానం లేదేం? దొడ్డికి వెళ్ళి దోసకాయలు తింటాడు!" అని గొణిగాడు.

రాజుగారు ఆ మాట విని, గోరభుణ్ణి దగ్గిరికి పిలిచి, "ఎందుకురా అబద్ధాలాడుతున్నావు? మరొకడైతే చంపేసి ఉందును. నేను దొడ్డికి పోయి దోసకాయలు తినగా నువు చూశావురా?" అని అడిగాడు.

"దొరా, రాత్రి చాలా పొద్దుపోయినదాకా పాచికలాడటం చేత నిద్రమత్తున ఏమన్నానో నాకే తెలీదు. క్షమించండి," అన్నాడు గోరభుడు.

వాడి మాటకు ఏమీ విలువ లేదని రాజుకు తెలిసిపోయింది. దంతిలుడికి తాను చాలా అన్యాయం చేశాడు. అతను చాలా పెద్దమనిషి; తప్పుడు పనులు చెయ్యడు. అదీగాక, దంతిలుణ్ణి ఒకరోజు రానివ్వక పోయేసరికి దివాణం పనులూ, నగరం పనులూ అస్తవ్యస్తమయిపోయాయి. అందుచేత రాజు దంతిలుణ్ణి పిలపనంపి, ఆయనకు మంచి బట్టలూ, కానుకలూ ఇచ్చి, ఎప్పటిలాగే పదవిలో ఉండనిచ్చాడు.



CHANDAMAMA ( Telugu ) OCTOBER 1973 Regd. No. M. 4854




మిత్రభేదం



# మిత్రభేదం

## 5

దమనకం చెప్పిన దంతిలుడి కథ విని సంజీవకం, "నువు చెప్పిన కథ సరిగానే ఉన్నది. అందుచేత నువ్వన్నట్టే కానీ," అన్నది.

తరవాత దమనకం సంజీవకాన్ని పింగళకం వద్దకు తీసుకుపోయి, "మహారాజా, ఇదుగో సంజీవకం. ఆ పైన దేవర చిత్తం." అన్నది.

సంజీవకం పింగళకానికి ప్రణామం చేసి, ఎంతో నమ్రతగా ఎదట కూర్చున్నది.

పింగళకం వాడీ, భయంకరమూ అయిన గోళ్ళు గల బలమైన తన కుడి పంజా చాచి, "స్వాగతం. నీ ఆరోగ్యం ఎలా ఉన్నది? నువు ఈ అరణ్యానికి ఎందుకు వచ్చావు?" అని అడిగింది.

తాను వర్ధమానుడి బిడారు వెంట వచ్చి ఒంటరిగా దిగబడిపోవటమూ, తరవాత జరిగినదీ యావత్తూ సంజీవకం సింహానికి చెప్పింది.

"మిత్రమా, నీకు ఎలాంటి భయమూ వద్దు. నువు నీ ఇచ్ఛానుసారం ఈ అరణ్యంలో జీవించు. కాని ఎల్లప్పుడూ నా కనుచూపు మేరలో ఉండు. ఎందుకంటే, నిన్ను నేను కనిపెట్టి ఉండలేనప్పుడు నీకు అపకారం చేసే క్రూరమృగాలు, పాపభీతి లేనివి, ఈ అరణ్యంలో చాలా ఉన్నాయి." అన్నది పింగళకం.

"చిత్తం," అని సంజీవకం యమునా నదికి వెళ్ళి, కడుపు నిండా నీరు తాగి, వెనకటిలాగా యథేచ్ఛగా, నిర్భయంగా అరణ్యంలో సంచరించసాగింది.

రోజులు గడిచే కొద్దీ పింగళకానికీ, సంజీవకానికి మధ్య స్నేహబంధం దృఢం కాజొచ్చింది. పింగళకం ప్రతిదీ సంజీవ

అట్ట చివరి బొమ్మ



కంతో సంప్రతించేది. సంజీవకం చాలా తెలివైనది. అది కరటకం, దమనకం మొదలైన వాటి రహస్యచర్యలు కనిపెట్టి, వాటిని గురించి పింగళకాన్ని హెచ్చరించింది. ఆ కారణంగా పింగళకం వాటిని దూరంగా ఉంచి, సంజీవకం చెప్పే సలహాలు మాత్రమే స్వీకరిస్తూ వచ్చింది.

"అన్నా, కరటకం! మనం నిరాశ్రయులమయిపోయాం. పింగళకానికి సంజీవకంతో కబుర్లు చెప్పటంలో ఎంత ఆనందంగా ఉందంటే, అతగాడు వేటకు కూడా పోవటం లేదు. అందుచేత మనకు బొత్తిగా తిండి లేకుండా పోయింది. ఏం చెయ్యాలి?" అన్నది దమనకం.

"నువ్వు వెళ్ళి హెచ్చరించు. రాజులు వినిపించుకోకపోయినా మంత్రులు హెచ్చరించాలి. గడ్డి తినే ఈ ప్రాణిని రాజుకు పరిచయం చెయ్యటం నీదే బుద్ధితక్కువ." అన్నది కరటకం.

"నిజమే, తప్పు నాదే, రాజుది కాదు. స్వయంకృతాపరాధం. స్వయంకృతాపరాధాలు ఎలా చెరుపు చేసేదీ దేవశర్మ కథ చెబుతుంది గద!" అన్నది దమనకం.

"ఎలాగెలాగూ?" అని కరటకం అడిగింది.

దమనకం ఇలా చెప్పసాగింది:

## దేవశర్మ కథ

ఒక మారుమూల ప్రదేశంలో, జనపదాలకు చాలా దూరంగా, ఒక మఠం ఉండేది. దేవశర్మ అనే యతి ఆ మఠంలో ఒంటరిగా ఉంటూ శివలింగాన్ని అర్చిస్తూ ఉండేవాడు. అనేకమంది భక్తులు ఆ మఠానికి విలువైన వస్త్రాలు దానం చేసేవారు. సర్వసంగ పరిత్యాగం చేసి యతి అయినప్పటికీ, దేవశర్మకు బంగారం మీద భ్రాంతి ఉండేది. ఒకనాడు ఆయన మారువేషం వేసుకుని, విలువైన వస్త్రాలన్నిటినీ మూటగట్టి దూరాన ఉండే నగరానికి తీసుకుపోయి, వాటిని బంగారానికి అమ్మి, ఆ బంగారాన్ని ఒక గుడ్డ సంచిలో పెట్టి, సంచీని తన చంకకు తగిలించుకుని,

మఠానికి తిరిగి వచ్చాడు. అటు పిమ్మట, ఆయన ఎవరినీ నమ్మక, రాత్రింబగళ్ళు ఆ సంచీని తన చంకలోనే ఉంచుకునే వాడు. "సంపదను సాధించటం కష్టం; సంరక్షించటం కష్టం; అది పోవటం దుఃఖం, ఖర్చు కావటం దుఃఖం; దాని మూలమే ఖేదం, దాని ఫలితాలు విషాదం," అని ఊరికే చెప్పారా?

ఆషాఢభూతి అనే వాడు దుర్మార్గుడు; పాపభీతి లేనివాడు. ఇతరులది కాజెయ్యటమే వాడి లక్ష్యం. దేవశర్మ చంకలో ఉండే బంగారం ఒకనాడు వాడి కంట పడింది. దాన్ని ఎలా కాజెయ్యటమా అని ఆలోచించాడు. మఠం గోడలు రాతితో కట్టినవి కావటంచేత వాటికి కన్నం వెయ్యటం సాధ్యంకాదు. కిటికీలు చాలా ఎత్తున ఉన్నాయి. అందుచేత ఆషాఢభూతి దేవశర్మ దగ్గిర శిష్యుడుగా చేరి, తియ్యటి కబుర్లతో ఆయనకు విశ్వాసపాత్రుడు కావాలనుకున్నాడు.

ఇలా అనుకుని ఆషాఢభూతి దేవశర్మ వద్దకు వెళ్ళి, "పరమశివుడికి ప్రణామం!" అంటూ ఆయన కాళ్ళపై సాష్టాంగ పడ్డాడు. తరవాత అతను దేవశర్మతో వినయంగా, "మహాత్మా, జీవితసాగరం నిరుపయోగమైనది. ఎండుగడ్డి మంటలాగా క్షణభంగురమైనది. సుఖాలు నిర్జల మేఘాలు. బంధు



పుత్ర కళత్రాదులు కలలోని భ్రాంతి. ఈ విషయం పూర్తిగా గ్రహించి మోక్షమార్గం తెలుసుకోవటానికి తమ వద్దకు వచ్చాను," అన్నాడు.

దేవశర్మ ఈ మాటలు విని, "నాయనా, ఇంత చిన్న ప్రాయంలో లౌకికలంపటాన్ని వదిలించుకున్న నీవు ధన్యుడవు. యౌవనంలో సాధించిన నిగ్రహమే నిజమైన నిగ్రహం. నన్ను మోక్షమార్గం అడిగావు. 'ఓం నమశ్శివాయ' అంటూ శివుడి పైన ఒక్క పుష్పం ఉంచిన వాడికి మరి జన్మ లేదు," అన్నాడు.

ఆషాఢభూతి దేవశర్మ కాళ్ళుపట్టుకుని, "స్వామీ, ఆ మంత్రం ఎలా పునశ్చరణ

చేయాలో చెప్పి, నన్ను ధన్యుణ్ణి చెయ్యండి," అన్నాడు.

"చెబుతాను, నాయనా. అయితే నువ్వు రాత్రివేళ మఠంలోకి రాగూడదు. యతి ప్రాపంచిక బంధాలకు దూరంగా ఉండాలి. అందుకుగాను రాత్రివేళ ఒంటరిగా ఉండటం అవసరం. ఉపదేశం పొందిన అనంతరం నువ్వు బయట ఉన్న పర్ణకుటీరంలో పడుకో," అన్నాడు దేవశర్మ.

ఆషాఢభూతి, "స్వామీ, తమ అజ్ఞ శిరసా వహిస్తాను," అన్నాడు.

ఆ రాత్రి పడుకోబోయేముందు దేవశర్మ అషాఢభూతికి మంత్రోపదేశం చేసి, అతన్ని తన శిష్యుడుగా చేర్చుకున్నాడు. అతను రోజూ గురువుగారికి కాళ్ళూ, చేతులూ పట్టి, పూజకు పూలూ, పత్రీ తెచ్చిపెట్టి సంతోష పరిచాడు. అయినప్పటికీ దేవశర్మ తన చంకలో ఉండే సంచీని ఆషాఢభూతికి అందనిచ్చే ధోరణి ఏమీ కనబరచలేదు.

కాలం గడుస్తున్నది. "ఈ మనిషి నన్ను పూర్తిగా ఎప్పటికీ నమ్మడా? పట్టపగలే ఇతన్ని హత్యచేయాలా? లేక విషం పెట్టనా? లేక గొడ్డును చంపినట్టు కొట్టి చంపనా?" అనుకున్నాడు ఆషాఢభూతి.

ఇంతలో ఒక భక్తుడి కొడుకు వచ్చి, దేవశర్మను మర్నాడు తమ యింట జరిగే యజ్ఞోపవీత ధారణకు దయచెయ్యమని ఆహ్వానించాడు.

మర్నాడు దేవశర్మ ఆషాఢభూతిని వెంటబెట్టుకుని, ఆహ్వానం వచ్చిన గ్రామానికి బయలుదేరాడు. వాళ్ళు కొంత దూరం వెళ్ళేసరికి ఒక నది వచ్చింది. దేవశర్మ తన బట్టలు విప్పి, చంకలోని సంచీతీసి బట్టల మధ్య చుట్టిపెట్టి, స్నానం చెయ్యబోతూ, కాలకృత్యాలు నిర్వర్తించ వలసిన అవసరం వచ్చి, "ఆషాఢభూతీ, ఇప్పుడే వస్తాను. అంతదాకా ఈ బట్టలూ, ముఖ్యంగా ఈ సంచీ చూస్తూ ఉండు. అది శివుడి సొత్తు!" అని చెప్పి వెళ్ళిపోయాడు. దేవశర్మ కనుమరుగైన దాకా ఉండి, బంగారం ఉన్న సంచీ సంగ్రహించి, కాలి సత్తువ కొద్దీ పారిపోయాడు ఆషాఢభూతి.




Vapa



# మిత్రభేదం

## 6

కరటకం దమనకానికి ఆషాఢభూతి పలాయనం విషయం చెప్పి, ఇంకా ఇలా చెప్పసాగింది:
ఆషాఢభూతి మీద పూర్తి నమ్మకంతో తన కాలకృత్యాలు నిర్వర్తించటానికి అవతలికి వెళ్ళిన దేవశర్మ తన సమీపంలోనే ఒక దృశ్యం చూశాడు. పొటేళ్ళమంద ఒకటి మేత మేస్తున్నది. అందులో రెండు పొటేళ్ళు పోట్లాడ సాగాయి. అవి రెండూ పరిగెత్తుకుంటూ వచ్చి, తలలు ఢీ కొట్టుకుని, మళ్ళీ వెనక్కు వెళ్ళి పరిగెత్తుకుంటూ వచ్చి బలంగా తలలు ఢీ కొట్టు కుంటు న్నాయి. వాటి తలలు పగిలి రక్తం నేల మీద కారుతున్నది. నేల మీద కారిన రక్తాన్ని నాకాలన్న ఆత్రంతో ఒక నక్క వచ్చింది. పొటేళ్ళు ఆ సమయంలో ఎడంగా వెళ్ళాయి.

దేవశర్మ ఆ నక్కను చూసి, "ఈ నక్కకు బుద్ధిలేదు. ఈ సారి పొటేళ్ళు తలలు ఢీ కొట్టినప్పుడు ఇది నిశ్చయంగా వాటి మధ్య నలిగి చస్తుంది," అనుకున్నాడు.

ఆయన అనుకున్నట్టే పొటేళ్ళు మళ్ళీ పరిగెత్తుకుంటూ వచ్చి తలలు మోటిం చాయి. రక్తం తాగటంలో మైమరచి ఉన్న నక్క ఆ పొటేళ్ళ తలల మధ్య నలిగి చచ్చింది.

చచ్చిన నక్క గురించి చింతిస్తూ దేవ శర్మ తన శిష్యుడు ఉండిన చోటికి వచ్చాడు. ఆషాఢభూతి కనిపించలేదు. దేవశర్మ గబగబా స్నానం చేసి వచ్చి చూసేసరికి ఆయన బట్టలమూట ఉన్నది గాని, బంగారం మూట లేదు.

"అయ్యో, నా బంగారం పోయింది." అంటూ దేవశర్మ మూర్ఛపోయాడు. కొద్ది



సేపటికి స్పృహ వచ్చి ఆయన, "ఒరే, ఆషాఢభూతీ! నన్ను మోసగించి ఎక్కడికి పోయావురా? జవాబు చెప్పరా!" అని వైన వైనాలుగా ఏడుస్తూ, వాణ్ణి కలుసుకుందామనే ఆశతో, వాడి అడుగు జాడలను బట్టి బయలుదేరాడు.

సాయంకాలం అయే సరికి ఆయన ఒక గ్రామం చేరాడు. కల్లు అంగడికి పోతున్న సాలెదంపతులు ఆయనకు కనిపించారు. ఆయన సాలెవాడితో, "నాయనా, అసుర సంధ్యవేళ నేను నీకు అతిథిగా వచ్చాను. నాకు ఇక్కడ ఎవరూ తెలియదు. అందుచేత నన్ను అతిథిగా స్వీకరించి, ఆతిథ్యం ఇయ్యి," అన్నాడు.

ఈ మాటలు విని సాలెవాడు తన భార్యతో, "ఏమే, ఈయనను మన ఇంటికి తీసుకుపోయి, కాళ్ళు కడిగి, భోజనంపెట్టి, పక్కవేసి ఆయనకు ఏం కావాలో చూస్తూ ఇంటి దగ్గిరే ఉండు. నేను వెళ్ళి నీకు ఇంత మాంసమూ, కల్లూ తెస్తాను," అన్నాడు.

సాలెవాడి భార్య కులట. తన ప్రియుడైన దేవదత్తుణ్ణి కలుసుకోవటానికి మంచి అవకాశం దొరికినందుకు పరమానంద భరితురాలై ఆమె దేవశర్మను వెంటబెట్టుకుని ఇంటికి బయలు దేరింది.

ఇంటికి చేరగానే ఆమె దేవశర్మకు ఒక కుక్కమంచం చూపి, "నా స్నేహితురాలు ఒకతె ఇవాళే వాళ్ళ గ్రామంనుంచి వచ్చింది. దానితో మాట్లాడి ఇప్పుడే వస్తాను. నేను వచ్చేదాకా ఇల్లు కాస్త చూస్తూ ఉండండి," అని, మంచి బట్టలూ, నగలూ ధరించి, దేవదత్తుణ్ణి కలుసుకోవటానికి వెళ్ళింది.

కాని దారిలో ఆమెకు తన భర్త, తప్ప తాగి తూలుతూ, అడుగులు తడబడుతూ, జుట్టురేగి, చేతిలో కల్లుముంత పట్టుకుని వస్తూ కనిపించాడు. అది చూసి ఆమె అతి వేగంగా ఇంటికి పరిగెత్తుకుని వచ్చి, తన మంచి బట్టలూ, అలంకారాలూ తీసేసి, పాత బట్టలు ధరించింది. అయితే ఆమె మంచి బట్టలూ, అలంకారాలూ ధరించి పరిగెత్తిపోతూ ఉండటం సాలెవాడు చూసి

కూడా చూడనట్టు నటించాడు. తన భార్య తిరుగుళ్ళను గురించి అతడెరుగును.

అతను ఇంటికి వచ్చి భార్యను చూసి, పట్టరాని కోపంతో, "ఓసీ, నీచురాలా! కులటా! ఎక్కడికి పోతున్నావు?" అన్నాడు.

"నిన్ను వదిలినాక నేను ఎక్కడికీ పోలేదే? ఎందుకా తాగుడు వాగుడు? తాగిన వాడి నోటికి శుద్ధీ, బుద్ధీ ఉండదంటారు." అన్నది అతని భార్య.

తన భార్య పొగరు మాటలు విని, ఆమె చీరమార్చి ఉండటం గమనించి సాలెవాడు, "నీ పోకిళ్ళు గురించి అదివరకే విన్నాలే. ఇవాళ కళ్ళారాచూశాను. నిన్ను ఏం చేస్తానో చూడు!" అంటూ ఒక దుడ్డుకర్ర తీసుకుని తన భార్య ఒళ్ళంతా హూనంచేసి, ఆమెను స్తంభానికి పలుపుతో కట్టేసి, తాగిన మైకంలో పడుకుని నిద్రపోయాడు.

ఈ సాలెవాడి భార్యకు తిరుగుళ్ళు మరిగిన స్నేహితురాలు మంగలిది ఒకతె ఉన్నది. ఆమె వచ్చి, సాలెవాడు నిద్ర పోతున్నాడని రూఢి చేసుకుని, అతని భార్యతో, "దేవదత్తుడు నీ కోసం కనిపెట్టుకుని ఉన్నాడు. త్వరగా వెళ్ళు." అన్నది.

"నేను ఎలా వెళ్ళేది? ఏ స్థితిలో ఉన్నానో చూడు. నన్ను పలుపుతో కట్టేశాడు. నా మొగుడేమో ఇంటోనే ఉన్నాడాయె." అన్నది సాలెవాడి భార్య.



"నేను నిన్ను విప్పుతాను. నీ మొగుడు రేపు మొహం మీద ఎండ పడినదాకా లేవడు. అంతగా అయితే నీకు బదులు నన్ను కట్టు. నీ మొగుడు ఒక రాత్రివేళ లేచినా మైకంలో నన్ను చూసి నువే అనుకుంటాడు. నువు దేవదత్తుడి వద్దకు వెళ్ళి త్వరగారా." అన్నది స్నేహితురాలు.

సాలెవాడి భార్య తన కట్లు విప్పించుకుని, తన స్థానంలో తన స్నేహితురాలిని స్తంభానికి కట్టి, దేవదత్తుణ్ణి కలుసుకోవటానికి వెళ్ళింది.

ఆమె వెళ్ళిన కొంతసేపటికి సాలెవాడు శాంతపడి లేచి, "ఒసే, గయ్యాళి గంపా! ఇక ముందు ఇల్లు కదలననీ, నాతో పొగ

రుగా మాట్లాడనని మాట ఇస్తే నీ కట్లు విప్పుతాను," అన్నాడు.

మంగలి మనిషి, తన గొంతు గుర్తిస్తాడని, సాలెవాడికి సమాధానం చెప్పలేదు. సాలెవాడికి ఒళ్ళు మండి, పదునైన కత్తి తెచ్చి, మంగలిదాని ముక్కు కోసి, "ఎప్పటికీ ముక్కిడి ముండవుగా ఉండిపో," అని మళ్ళీ వెళ్ళి నిద్రపోయాడు.

బంగారాన్ని పోగొట్టుకున్న బాధకు ఆకలీ, దప్పితోడై, నిద్రపోలేకుండా ఉన్న దేవశర్మ ఈ నాటకమంతా కళ్ళారా చూశాడు.

కొంతసేపు గడిచాక సాలెమనిషి తిరిగి వచ్చి మంగలి మనిషిని, "ఎలా ఉన్నావు? నేను వెళ్ళినాక ఆ దుర్మార్గుడు లేచాడా?" అని అడిగింది.

"నేనైతే బాగానే ఉన్నాను గాని, నీ మాయదారి మొగుడు లేచి, నా ముక్కు కోశాడు. వాడు లేచి నా చెవులు కూడా కోసే లోపల, కట్టు విప్పి నన్ను ఇంటికి పోనీ," అన్నది మంగలి మనిషి.

సాలెమనిషి మంగలిదాని కట్లు విప్పి, దాని స్థానంలో తాను కట్టించుకున్నది. తరవాత ఆమె భర్తను ధిక్కరిస్తూ, "ఓ మూఢుడా! నా వంటి శీలవతిని గాయపరచటమూ, వికృతం చెయ్యటమూ నీ తరమా? ఓ దిక్పాలకులారా! సూర్యచంద్రులారా! అగ్నిహోత్రుడా! వాయుదేవుడా! వినండి! నేనే పతివ్రతనైతే నా ముక్కును యథాప్రకారం చెయ్యండి!.. చూశావా, దుర్మార్గుడా? నా శీలబలం చేత నా ముక్కు ఎప్పటిలాగే అయింది!" అన్నది.

తన భార్య అబద్ధం ఆడుతూంటే దాన్ని అగ్నికి ఆహుతి చేద్దామని, సాలెవాడు మండే కొరివితో వచ్చి, తన భార్య ముక్కు ఎప్పటి లాగే ఉండటం చూసి నిర్ఘాంతపోయాడు. తాను నిజంగా ముక్కు కోయలేదేమో అనుకుందామంటే నేల మీద రక్తం మడుగు ఉన్నది. అతను వెంటనే ఆమె కట్లు విప్పి, ఆమెకు వెయ్యి క్షమాపణలు చెప్పుకుని, ఆమెను సంతోషపెట్టటానికి సర్వవిధాలా యత్నించాడు.






మిత్రభేదం



# శిథిలాలయం

## 7

సాలెవాడి భార్య చేసినమాయ అంతా కళ్ళారా చూసిన దేవశర్మ తనలో, "అహా, స్త్రీలు ఎంత మాయలమారి వాళ్ళు! వాళ్ళ తెలివితేటల ముందు శుక్రుడూ, బృహస్పతీ ఎందుకు పనికి వస్తారు ?" అనుకున్నాడు

ఈ లోపల మంగలి స్త్రీ, తెగిపోయిన ముక్కును చేత బట్టుకుని, ఏం చెయ్యాలా, తెగిపోయిన ముక్కును ఎలా కప్పి పెట్టాలా అని ఆలోచిస్తూ ఇంటికి వెళ్లింది.

ఇంతలో తెల్లవారింది. రాత్రి అంతా రాజభవనంలోనే ఉండిపోయిన దాని భర్త వచ్చి, "నా పొది ఇలా తీసుకు రావే," అన్నాడు. అసలే తెలివిగలది, ముక్కు తెగి పోవటంతో తెలివి రెట్టింపయిన మంగలిది ఒక్క మంగలి కత్తి మాత్రమే బయటికి గిరవాటు వేసింది. పొది ఇయ్యమంటే ఒక్క కత్తి మాత్రమే పారేసిందని భార్య మీద మండిపడి, మంగలి ఆ కత్తిని ఆమె కేసి విసిరి కొట్టాడు. వెంటనే ఆమె చేతులు పైకెత్తి, "రక్షించండి! రక్షించండి! దుర్మార్గుడు, నా మొగుడు, నా ముక్కు కాస్తా కోసేశాడు!" అని కేకలు పెట్టింది.

ఆ కేకలు విని రక్షకభటులు పరిగెత్తుకుంటూవచ్చి, మంగలిని చావతన్ని, వాణ్ణీ, వాడి భార్యనూ, తెగిన ముక్కునూ తీసుకుపోయి న్యాయాధికారుల ముందు పెట్టి, "ఈ దుర్మార్గుడు ఈ స్త్రీరత్నాన్ని అకారణంగా హింసించాడు. వీడికి ఏ దండన విధిస్తారో విధించండి," అన్నారు.

న్యాయాధికారులు మంగలిని, "ఇలాటి ఘోరం ఎందుకు చేశావు? నీ భార్య ఏం చేసింది ?" అని అడిగారు.

అట్ట చివరి బొమ్మ



మంగలి అసలే మూఢుడు. ఏమి జరిగినదీ వాడికీ అర్థం కాక, మౌనంగా ఉండిపోయాడు.

న్యాయాధికారులు శిక్షాస్మృతులన్నీ తిరగవేసి, మంగలికి మరణదండన విధించారు. మంగలిని వధ్యస్థానానికి తీసుకుపోయారు. దేవశర్మ ఈ సంగతి వినటమే గాక, వధ్యస్థానానికి పోతున్న మంగలిని చూశాడు. ఆయన న్యాయాధికారుల వద్దకు పరిగెత్తి వెళ్లి, "అయ్యలారా, ఈ అమాయకుడైన మంగలిని అన్యాయంగా చంపబోతున్నారు. నిజం నేను చెబుతాను వినండి. అనవసరమైన విషయాలలో జోక్యం కలిగించుకుని నక్కా, నేనూ, మంగలిదీ ఆపదలు తెచ్చుకున్నాం," అన్నాడు.

"అది ఎలా జరిగింది?" అని న్యాయాధికారులు దేవశర్మను అడిగారు.

దేవశర్మ వారికి పోట్లాడుకున్న పొట్టేళ్ల కథా, తన బంగారం కాజేసిన ఆషాఢభూతి కథా, తప్పతాగిన సాలెవాడి కథా వివరంగా చెప్పాడు.

న్యాయాధికారులు దేవశర్మ చెప్పిన కథలను ఆశ్చర్యంతోనూ, ఉత్సాహంతోనూ విని, వెంటనే మంగలిని విడుదల చేశారు. కాని వారు మంగలి భార్యను విడిచి పెట్టక, ఆమె ముక్కు పోగొట్టుకుని కొంత శిక్ష అనుభవించింది కనక, ఆమె చెవులు కూడా కోయించి, ఆమె చేసిన దుర్మార్గానికి శిక్ష పూర్తిచేశారు.

నక్క పొందిన శిక్షా, మంగలిది పొందిన శిక్షా చూసిన మీదట దేవశర్మకు తన బంగారం పోయిందన్న విచారం పోయింది. ఆయన తన మఠానికి తిరిగి వచ్చి, శివుడి ముందర సాష్టాంగపడి, "మహాదేవా, నీ దయవల్ల మా ముగ్గురిలోనూ తక్కువ ఆపద పొందిన వాణ్ణి నేనే. రక్తదాహంతో నక్క తన ప్రాణాలనే పోగొట్టుకున్నది. మంగలిది ముక్కూ, చెవులూ పోగొట్టుకున్నది. నీ అనుగ్రహం చేత బంగారం మీది వ్యామోహంతో బంగా

రాన్ని మాత్రమే పోగొట్టుకున్నాను. ఇక దాన్ని కోరను," అన్నాడు....

దమనకం చెప్పిన దేవశర్మ కథ విని కరటకం, "సరే, మనం ఇప్పుడు ఏం చెయ్యాలి?" అని అడిగింది.

దానికి దమనకం, "తప్పు తోవలో పడి పోయిన మన రాజును సరి అయిన తోవకు మళ్ళించాలి. మన రాజు పింగళకానికి ఇప్పుడు సలహాదార్లు ఎవరూ లేరు. కేవలమూ ఎద్దు స్నేహాన్ని, సలహానూ పురస్కరించుకుని మన రాజు గడ్డి తినే నీతి అవలంబించటం జరిగింది. ఆయనను అటు నుంచి మళ్ళించాలి," అన్నది.

"మన వంటి దుర్బలులకు అది ఎలా సాధ్యం?" అని కరటకం అడిగింది.

"దేహబలం చాలనప్పుడు యుక్తులు పని చేస్తాయి. భయంకరమైన పామును చంపటానికి ఆడకాకి బంగారు హారాన్ని ఉపయోగించలేదా?" అన్నది దమనకం.

"ఆ కథ ఏమిటి?" అని కరటకం అడిగింది.

దమనకం ఇలా చెప్పింది:

### పామును చంపిన కాకుల కథ

ఒక ప్రాంతంలో ఒక పెద్ద మర్రిచెట్టు ఉండేది. దాని మీద ఒక కాకుల జంట నివసించేది. ఆ కాకులు పొదిగిన పిల్లలను ఒక పాము తిని పోసాగింది. చాలా



కాలంగా అదే చెట్టు మీద ఉంటున్న ఆ కాకులకు, పిల్లలు దక్కటం లేదన్న విచారం ఉన్నప్పటికీ, చెట్టును విడిచి పోబుద్ధి కాలేదు.

పాము విడవకుండా చెట్టు ఎక్కి వచ్చి, రెక్కలు రాని కాకిపిల్లలను మింగేస్తూ ఉండటం చేత ఒక్క పిల్ల అయినా బతికి బట్టకట్టటం జరగలేదు. చిట్టచివరకు ఆడకాకి మగకాకి కాళ్ళపై పడి, "ప్రాణనాథా, దుష్టసర్పం మన పిల్లలందరినీ పొట్టబెట్టుకున్నది. మనకు పుట్టబోయే పిల్లల గతి కూడా ఇంతే అవుతుంది. అందుచేత మనం ఇంకెక్కడికైనా పోయి, దూరాన మరొక చెట్టు మీద నివాసం

ఏర్పాటు చేసుకుందాం. కన్న పిల్లల మీది ప్రేమా, వారు మరణిస్తే కలిగే శోకమూ ఇంతా అంతా కాదు. అందుచేత మనం వేరొక చోటికి పోదాం," అన్నది.

దానికి మగ కాకి, "ప్రియా, మనం ఎంతో కాలంగా ఈ చెట్టును ఆశ్రయించి ఉన్నాం. అందుచేత నాకు దీన్ని వదిలి పెట్టటం ఇష్టం లేదు. పిడికెడు గడ్డీ, పుడిసెడు నీరూ మాత్రమే కోరే లేడి ఎక్కడైనా బతకగలదు; కాని అది ఎన్ని అపాయాలకైనా ఓర్చి తన జన్మస్థానమైన అరణ్యంలోనే ఉంటుంది. లేడి కూడా చెయ్యని పని, తెలివితేటలు గల కాకులం చెయ్యటమా? ఏదో ఒక ఉపాయం చేత నేనీ పాపిష్ఠి పామును చంపేస్తాను," అన్నది.

"అది విషసర్పం. దాన్ని ఎలా చంపుతావు?" అని ఆడకాకి అడిగింది.

"నేను స్వయంగా ఆ పని చెయ్యలేక పోతే నేం? ధర్మశాస్త్రమూ, రాజనీతి తెలిసిన ఉద్దండ పండితులు, నాకు మిత్రులు ఉన్నారు. నేను వారితో సంప్రతించి, వారి సలహా పొంది, శీఘ్రమే ఈ పామును చంపేస్తాను," అన్నది మగ కాకి.

అది రోషంతో ఎగిరి పోయి మరొక చెట్టును చేరి, అక్కడ నివసించే తన ఆప్తమిత్రుడైన నక్కను పిలిచి, తనకు వచ్చిన కష్టం చెప్పుకుని, "మిత్రమా, మా పిల్లలనన్నిటినీ పొట్టన పెట్టుకున్న దుర్మార్గపు పామును చంపటానికి మంచి ఉపాయం ఉంటే చెప్పు," అన్నది.

దానికి నక్క, "నేనొక చక్కని ఉపాయం ఆలోచించాను. ఇక నీ కష్టాలు గట్టెక్కుతాయి. చెడ్డపనులు చేసేవారు, నది ఒడ్డున ఉన్న చెట్టులాగా తమకు తామే నాశనమైపోతారు. వెనకటికి కొంగ చేపలన్నిటినీ తిని కూడా తృప్తి తీరక చివరకు ఎండ్రకాయ చేత చావలేదా?" అన్నది.

"ఏమిటా కథ?" అని మగ కాకి అడిగింది.



CHANDAMAMA (Telugu) JANUARY 1974 Regd. No. M. 4854



మిత్రభేదం




## 8

నక్క కాకికి కొంగా, ఎండ్రకాయల కథ ఇలా చెప్పింది:

### కొంగా, ఎండ్రకాయల కథ

ఒక చెరువు గట్టున ఒక కొంగ నివసిస్తూ ఉండేది. అది ముసలిదైపోయి, శ్రమ లేకుండా చేపలను తినాలనుకున్నది. అది నీటి అంచున దైన్యంతో నిలబడి, తనకు సమీపంగా వచ్చిన చేపలను కూడా తినటం మానేసింది.

చేపల మధ్య ఒక ఎండ్రకాయ ఉన్నది. అది కొంగను సమీపించి, ''మామా, ఇవాళ నువు తిండీ, ఆటలూ మానేసి నట్టున్నావేమిటి ?'' అని అడిగింది.

దానికి కొంగ, ''ఎంతోకాలం చేపలను తిని సుఖంగా జీవించాను. అవి నా మిత్రులు. మీ కందరికీ గొప్ప విపత్తు రానున్నది. అందుచేత, ఈ వార్థక్యంలో నాకు సుఖజీవనం లేకుండా పోబో తున్నది. అదే నాకు పట్టుకున్న విచారం,'' అన్నది.

''ఈ రాబోయే కష్టం ఎలాటిది, మామా?'' అన్నది ఎండ్రకాయ.

''ఇవాళ ఉదయం కొందరు జాలర్లు అనుకుంటుంటే విన్నాను: 'ఇది చాలా పెద్ద చెరువు. ఇందులో చాలా చేప లున్నాయి. ఆదివారం సాయంకాలాని కల్లా మిగిలిన నాలుగు చెరువులలోనూ వేట ముగించి, సోమవారం తెల్లవారే సరికి ఇక్కడికి వచ్చి, మనం కొత్తగా చేసిన వలలతో చేపలనూ, ఇతర జల చరాలనూ పట్టేద్దాం,' కనక, వారం తిరిగే సరికి ఈ చెరువులో ఒక్క చేప గాని, ఇతర జలచరం గాని మిగలదు. ఇవాళ సోమవారం గద. ఈ వార్థక్యంలో

అట్ట చివరి బొమ్మ



నాకు నోటి ముందరి కూడు కాస్తా పోతుంది,'' అన్నది కొంగ.

కొంగ చెప్పిన మాయమాటలు విని, చెరువులోని చేపలూ, ఇతర జీవాలూ ప్రాణభయంతో కొట్టుకుపోయాయి. అవి అన్నీ తమ తమ వయసునూ, హోదానూ బట్టి కొంగను 'తండ్రీ, తాతా, మామా, అన్నా, మిత్రమా, గురూ' అని సంబోధిసూ, ''ఆపద గురించి ముందుగా మాకు తెలియజేయటం మంచిదయింది. ఈ ఆపద నుంచి మమ్మల్ని కాపాడటం నీకు సాధ్యం కాకపోదు,'' అన్నాయి.

''అండజాన్ని అయిన నేను పిండజులైన మనుషులతో ఏం పోటీ చేయగలను. అయినా నాకొక ఆలోచన తట్టింది. మీరంతా నాతో సహకరిస్తే ప్రయత్నం ఫలించవచ్చు. కొద్ది దూరంలో ఒక పెద్ద దేవాలయం ఉన్నది. దాని పక్కన లోతైన కోనేరున్నది. దాని నిండా తామర పూలు ఉన్నాయి. ఆ కోనేట్లో చేపలు పట్టరాదు. అక్కడ మీరు క్షేమంగా ఉండవచ్చు. జట్లు, జట్లుగా మిమ్మల్ని నా వీపు మీద ఎక్కించుకుపోయి, అక్కడ చేర్చగలను,'' అని కొంగ అన్నది.

ఈ మాటలు విని మోసపోయి చేపలన్నీ ఆనందంతో కొంగకు తమ కృతజ్ఞత తెలుపుకున్నాయి. కొంగ కూడా లోలోపల నవ్వుకుని, చేపలను మోసగించి తేలికగా తినవచ్చుననుకున్నది.

అది ఒక్కొక్క జట్టు చేపలనూ తన వీపు మీద ఎక్కించుకుని, దేవాలయపు కోనేరు కని బయలుదేరి, ఎండకు కాలిన ఒక కొండరాతి మీద వాలి, దిక్కులేని చేపలను దాని మీద పడేసి, తింటూ వచ్చింది. రోజు రోజుకూ దాని ఆనందం పెరిగిపోతున్నది. చెరువులో మిగిలి ఉన్న చేపలకు అనుమానం కలగకుండా, కొలను చేరిన చేపల నుంచి సందేశాలు తెచ్చి చెబుతూ ఉండేది.

ఎండ్రకాయకు కూడా ప్రాణభయం పట్టుకుని, జాలరులు వచ్చే రోజు దగ్గిర

పడుతూ ఉండటం చేత, ''మామా, నన్ను కూడా రక్షించుదూ!'' అని కొంగను వేడుకున్నది.

రోజూ చేపలను తిని మొహం మొత్తి ఉండటం చేత కొంగ, కొత్తరకం ఆహారం తినవచ్చునన్న ఆశతో, ఎండ్రకాయను తన వీపు మీద ఎక్కించుకుని ఉత్సాహంగా ఎగిరిపోయి, కొండరాయి మీద వాలబోయింది.

''మామా, దేవాలయం ఏది? లోతైన కోనేరేది?'' అని ఎండ్రకాయ కొంగను అడిగింది.

కొంగ వెటకారంగా, ''ఆ రాయిని చూశావా? నేను చెరువు నుంచి తెచ్చిన చేపలన్నీ దాని మీదనే శాశ్వత శాంతి సంపాదించు కున్నాయి,'' అన్నది.



ఎండ్రకాయ తొంగి చూసేసరికి ఆ రాతి మీద అనేకంగా చేపల ఎముకలు కనిపించాయి. అప్పుడది తనలో, ''ఈ ప్రపంచంలో తెలివిగల వాళ్ళు తమ స్వార్థం కొరకు మిత్రులై ఉండి కూడా శత్రువులు గానూ, శత్రువులై ఉండి కూడా మిత్రులుగానూ అభినయిస్తారు. శత్రువులై ఉండి కూడా మిత్రులుగా నటించే వారితో చెలిమి చెయ్యటం కన్న పాములతో చెలిమి మంచిది. కొంగ చేపలన్నిటినీ అదివరకే తినేసిందన్నమాట. వాటి ఎముకలే ఇవన్నీ. వాటి కోసం పగతీర్చు కోవటానికి ఇది అద్భుతమైన అవకాశం'', అనుకున్నది.

కొంగ రాతి మీద వాలబోతుండగా ఎండ్రకాయ, కొంగ తనను రాతి మీద పడెయ్యక ముందే దాని మెడను తన గిట్టలతో గట్టిగా పట్టేసింది. ఆ పరిస్థితిలో కొంగ ఎండ్రకాయను ఏమీ చెయ్యలేక పోయింది. అది అక్కడ నుంచి ఎగిరి పోబోయింది. కాని ఎండ్రకాయ సన్నగా ఉన్న కొంగ మెడను గిట్టల మధ్య గట్టిగా పట్టి, తెగిపోయే దాకా నొక్కింది.

తరవాత ఎండ్రకాయ కొంగతలను పట్టుకుని చెరువుకు తిరిగి వచ్చింది.

అక్కడ ఉన్న చేపలు ఎండ్రకాయను, "అన్నా, తిరిగి వచ్చావేం?" అని అడిగాయి.

ఎండ్రకాయ వాటికి కొంగ తలను చూపి, "ఈ దుర్మార్గుడు మనల నందరినీ మోసగించాడు. ఈ దుష్టుడి మాటలు నమ్మి, పాపం, చేపలన్నీ చచ్చిపోయాయి. ఈ నమ్మకద్రోహిని చంపి, వాడి తల తెచ్చాను. పల్లెకారుల కథ అంతా ఈ దుర్మార్గుడి కల్పన," అన్నది.

నక్క ఈ కథ చెప్పిన తరవాత కాకి, "మిత్రమా, పామును ఎలా చంపాలో చెప్పు," అన్నది.

నక్క ఇలా అన్నది: "ఏదైనా గుడికో, కోనేరుకో వెళ్ళు: ధనికులది ఏ రత్న హారమో, మరేదైనా నగో తీసుకుని వచ్చెయ్యి. జనం నీ వెంట పడతారు. వాళ్ళు చూసేటట్టుగా ఆ నగను పాము పుట్టలో పడెయ్యి. వారు ఆ నగ కోసం తప్పక పుట్టను తవ్వుతారు, అప్పుడు పామును తప్పక చంపేస్తారు."


కాకి తన ఇంటికి వెళ్ళి, నక్క చెప్పిన ఉపాయం తన భార్యకు చెప్పింది. రెండూ బయలుదేరి రాజభవనం లోని కొలనుకు వెళ్ళాయి. త్వరలోనే రాణి స్నానానికి కొలనుకు వచ్చి, తన రత్న హారమూ, ఇతర నగలూ తీసి ఒడ్డున పెట్టి, కొలనులోకి దిగి జలకాలాడ సాగింది. ఆడ కాకి చప్పున రత్నహారాన్ని తీసుకుని తన గూడు ఉన్న చెట్టు కేసి నింపాదిగా ఎగురుతూ పోయింది. ఇది చూసి మనుషులు గట్టిగా అరుస్తూ, దుడ్డుకర్రలతో వెంటపడ్డారు.

ఆడ కాకి రత్నహారాన్ని పాముపుట్టలో పడేసి, ఎడంగా ఒక కొమ్మ మీద వాలి గమనించ సాగింది. ప్రతీహారులూ, సేవకులూ హారం కోసం పుట్ట తవ్వారు. పాముకు కోపం వచ్చి, పుట్టలో నుంచి పైకి వచ్చింది. అందరూ చేరి పామును చంపి, హారం తీసుకుపోయారు.

ఈ విధంగా కాకులకు పాము బెడద తీరిపోయింది.



CHANDAMAMA (... FEBRUARY 1974 Regd. No. M. 4854




మిత్రభేదం



# మిత్రభేదం

## 9

దమనకం కరటకానికి పామును చంపిన కాకుల కథ చెప్పి, "తెలివిని మించిన శక్తిలేదు. బుద్ధిబలం కలిగిన కుందేలు సింహం దురహంకారాన్ని రెచ్చగొట్టి, దానికి చావు తెప్పించింది కాదా?" అన్నది.

"అది ఎలా జరిగింది?" అని కరటకం అడిగింది. దమనకం ఈ కథ చెప్పింది:

### నీడ తెచ్చిన చావు

ఒకప్పుడు అరణ్యంలో భాసురకం అనే సింహం, సాటిలేని బలం గలది ఉండేది. అది బలదర్పం కొద్దీ నిత్యమూ అనేక లేళ్ళనూ, కుందేళ్ళనూ, ఇతర మృగాలనూ, అకారణంగా చంపుతూ ఉండేది.

ఒకనాడు అడవిలో ఉండే లేళ్ళూ, మేకలూ, ఎనుములూ, కుందేళ్ళూ, ఇతర మృగాలూ ఏకమై సింహం వద్దకు వెళ్ళి, "మహారాజా, తాము తమ కంట బడిన ప్రతి ప్రాణినీ చంపటం ఇక మీద మానాలి. తమ కడుపు నిండటానికి రోజుకు ఒక జంతువు చాలును. అలాటప్పుడు ఇన్ని ప్రాణాలు తీయనేల? మాతో ఒక ఒప్పందానికి రండి. ఈ రోజు నుంచీ మాలో మేము వంతులు వేసుకుని, ఒక జంతువును తామున్న చోటికే పంపుతాము. తమరు కదిలిరావలిసిన పని కూడా ఉండదు. తమరు ఈ ఒప్పందానికి ఒడబడినట్టయితే తమకు కావలిసిన ఆహారం శ్రమలేకుండా లభిస్తుంది. రాజు ప్రజల సంపదను ఆవులను పాలు పిండినట్టుగా పిండి, కొంత లేగలకు వదిలి, మంద వృద్ధి అయేటట్టు చూడాలి. అప్పుడే అతను ధర్మపాలన చెయ్య

అట్ట చివరి బొమ్మ



గలడు. ఆవులను పాలు పితకటం మాత్రమే కాదు, వాటికి మేత కూడా వేయాలి. చెట్టుకు ఎరువు వేసి, నీరు పోస్తే గాని ఫలాల నివ్వదు. ఆఖరుకు అతి చిన్న విత్తు కూడా, సరిఅయిన పోషణ జరిగితే, మహావృక్షంగా తయారై, ఎంతో లాభం కలిగిస్తుంది. ప్రజలైనా అంతే,'' అన్నాయి.

''మీ రన్నది నిజం. మీ ఏర్పాటుకు సమ్మతించాను. కాని ఏ ఒక రోజున అయినా నా వద్దకు మృగం రాక పోయిందో, నేను మీ అందరి ప్రాణాలూ తీస్తాను,'' అన్నది సింహం. మృగాలు అందుకు సమ్మతించి వెళ్ళిపోయాయి.

ఆ రోజు మొదలు మృగాలన్నీ అరణ్యంలో స్వేచ్ఛగా తిరగ నారంభించాయి. అవి వంతులు వేసుకుని, సింహం వద్దకు రోజు కొక జాతి జంతువును మిట్టమధ్యాన్నం వేళకు పంపుతూ వచ్చాయి. ఇలా ఉండగా ఒకనాడు కుందేలుకు వంతు వచ్చింది. సింహానికి ఆహారం కావాలంటే కుందేలుకు చాలా విచారం కలిగింది. అది అడుగులో అడుగు వేసుకుని అతినింపాదిగా నడుస్తూ, ఈ సింహాన్ని చంపెయ్యటానికి ఉపాయం లేదా అని ఆలోచించసాగింది.

సింహం భోజనం చేసే వేళ దాటి పోయింది. కాని కుందేలు ఇంకా ఆలోచిస్తూనే ఉన్నది. అది ఇలా అనుకున్నది:

''ఈ క్రూరసింహాన్ని ఎలాగైనా చంపాలి. తెలివిగల వాడు సాధించలేనిదీ, దృఢ తీర్మానం గల వాడు జయించలేనిదీ, మధురవాక్కు గల వాడికి సిద్ధించనిదీ ఏదీ ఉండదంటారు."

ఇలా అనుకుంటూ అది ఒక బావి వద్దకు వచ్చింది. ఆ బావిలోకి తొంగి చూసే సరికి, దాని అడుగున ఉన్న నీటిలో దాని ప్రతిబింబం కనబడింది. అది ఒక్క క్షణం ఆలోచించి, ''దిక్కుమాలిన సింహాన్ని చంపటానికి అద్భుతమైన ఉపాయం తట్టింది. దానికి



వల్లమాలిన రోషం తెప్పించి, ఈ బావిలో పడి చచ్చేటట్టు చేస్తాను,'' అనుకున్నది.

ఇలా అనుకుని కుందేలు చాలా ఆలస్యంగా సింహం వద్దకు వెళ్ళింది. సకాలంలో తిండి అందక, ఆకలితో అలమటిస్తూ, సింహం అమితమైన కోపంతో ఉన్నది. అది పెదవులు నాక్కుంటూ, ''రేపు జంతువుల నన్నిటినీ చంపేస్తాను,'' అనుకుంటున్నది.

ఇంతలో కుందేలు వచ్చి, సింహానికి ఎదురుగా నిలబడింది.

అసలే పిడికెడు జంతువు, అందులోనూ ఆలస్యంగా వచ్చింది. సింహం దాన్ని చూసి కోపోద్రేకంతో, ''ఒక్క పంటికిందికి రావు, ఆలస్యంగా కూడా వస్తావా? ఇప్పుడు నిన్ను చంపితిని, రేపు మిగిలిన మృగాలన్నిటినీ చంపేస్తాను,'' అన్నది.

కుందేలు సింహం ముందు సాష్టాంగ పడి, ''మహారాజా, నా వల్లగాని, ఇతర మృగాల వల్లగాని ఏ దోషమూ లేదు. నేను ఆలస్యంగా రావటానికీ, మీకు చిన్న భోజనం ఉండటానికీ అసలు కారణం చెబుతాను, వినండి. ఇవాళ తమకు ఆహారం అయేవంతు మా కుందేళ్ళకు వచ్చింది. ఒక్క కుందేలుతో తమకు కడుపు నిండదని, నాతో కలిపి అయిదు కుందేళ్ళను తమ వద్దకు పంపారు. మేము అయిదుగురమూ తమ వద్దకు వస్తూండగా, నేలలో ఉన్న ఒక గుంటలో నుంచి ఒక పెద్ద సింహం పైకి వచ్చి, 'మీరంతా ఎక్కడికి పోతున్నారు? మీకు ఆయువు తీరిపోయింది గనక ఇష్టదేవతా ప్రార్థన చేసుకోండి,' అన్నది. 'మేము ఒప్పందం ప్రకారం మధ్యాహ్నాని కల్లా భాసురక మనే మహా సింహానికి ఆహారం కావాలి!' అని చెప్పాం. 'అర్థంలేని మాట! ఈ అరణ్యం నాది. మీరు ఒప్పందాలు నాతో చేసుకోవాలి, ఎవరో భాసురకో మనే దొంగతో కాదు. ఆ భాసురకాన్ని ఇలా పిలుచుకు

రండి. ఎవరు ఏమిటో మేము తేల్చుకుంటాం. మాలో ఎవరు గెలిస్తే వాళ్ళే మృగాలన్నిటికీ అధిపతి,' అన్నది. ఆ ప్రకారమే నేను తమ వద్దకు వచ్చి, సంగతి విన్నవించాను. నా ఆలస్యానికి ఇదే కారణం. నేను తిరిగి రాకపోతానేమో నని, ఆ సింహం మిగిలిన కుందేళ్ళను ఉంచేసుకున్నది. అందుకే నేను తమకు అల్పాహారంగా కనిపిస్తున్నాను,'' అన్నది.

ఈ మాటలు విని సింహం, "మిత్రుడా, అలా అయితే నాకు ఆ ప్రత్యర్థి సింహాన్ని చూపించు. నాకు జంతువుల మీద వచ్చిన కోపాన్నంతా దానిపై వెళ్ళగక్కి, మనశ్శాంతి పొందుతాను. శత్రువును శీఘ్రంగా నిర్మూలించకపోతే వాడు బలపడి మననే చంపుతాడు,'' అన్నది.

దానికి కుందేలు, "మహారాజా, అతని బలం తెలుసుకోకుండా తమరు అతనితో యుద్ధానికి పోవటం మంచిది కాదు,'' అన్నది.

'' ఎందుకీ వ్యర్థప్రలాపాలు? నాకు ఆ సింహాన్ని చూపించు. వాణ్ణి చంపేస్తాను,'' అన్నది సింహం చిరాకుగా.

కుందేలు సింహాన్ని బావి వద్దకు తీసుకుపోయి, '' ఇదే ఆ సింహం ఉండే కోట,'' అన్నది. అది బావిలోకి తొంగి చూసి, '' తమరు వస్తున్నారని తెలిసి ఆ సింహం అప్పుడే బెదిరిపోయి నట్టున్నది. ఇలా రండి,'' అన్నది.

మతిమాలిన సింహం బావిలోకి తొంగి చూసి, తన ప్రతిబింబాన్ని మరొక సింహం అనుకుని, ఆగ్రహావేశంతో గర్జించింది. ఆ గర్జన బావిలో రెట్టింపు ధ్వనితో ప్రతిధ్వనించింది. ఆ సింహం తనను సవాలు చేస్తున్నదనుకుని, బుద్ధిలేని భాసురకం, ఒళ్ళు తెలియని ఆవేశంతో ఆ లోతైన బావిలోకి దూకేసింది.

కుందేలుకు పరమానంద మయింది. పాపిష్ఠి సింహం పీడ వదిలించి నందుకు మిగిలిన జంతువులన్నీ కుందేలును మెచ్చుకుని, సుఖంగా జీవించాయి.





మిత్రభేదం



# మిత్రభేదం

## 10

యుక్తితో కుందేలు క్రూరమైన సింహాన్ని చంపిన కథ దమనకం చెప్పగా విని, కరటకం, "ఇలాటి యుక్తులు ఎల్లప్పుడూ పారుతాయని ఎలా చెప్పగలవు?" అని అడిగింది.

"మనం ప్రమాదాలకు సిద్ధపడాలి. లేకపోతే లాభం పొందలేం. ధైర్యవంతుడికి దేవతలు కూడా తోడ్పడతారు. సాలెవాడు సాహసంతో విష్ణువుపాత్ర ధరించబట్టేగదా మహా సౌందర్యవతి అయిన రాజకుమార్తెను పొందగలిగాడు?" అన్నది దమనకం.

"అదెలాగ?" అని కరటకం అడిగింది. ఆ కథను దమనకం ఇలా చెప్పింది:

### సాలెవిష్ణువు కథ

వంగదేశంలోని పుండ్రవర్థనం అనే నగరంలో ఆప్తమిత్రులైన ఒక సాలెవాడూ, వడ్రంగీ ఉండేవారు. వాళ్ళు తమ వృత్తులలో గొప్ప నిపుణులు కావటం చేత, అంతులేని సంపాదనలు కలిగి, అందమైన భవంతులలో నివసిస్తూ, డబ్బును మంచినీటి లాగా ఖర్చు చేసేవారు; సువాసనలు గల పూలు ధరించి, అత్తరువులు పూసుకుని, సుగంధ తాంబూలాలు సేవించేవారు.

ఒకసారి ఒక గొప్ప ఉత్సవం జరిగింది. వేడుకలు జరిగే ప్రతి స్థలానికీ జనం మంచి బట్టలు ధరించి తండోపతండాలుగా వస్తున్నారు.

సాలెవాడూ, వడ్రంగీ కూడా చక్కగా అలంకరించుకుని, బయలుదేరారు. అక్కడ వాళ్లు ఉత్సవం జరిగే ప్రతి చోటికీ తిరిగి ఆనందిస్తూ, ఇతరులు చేసుకున్న అలంకరణలను పరిశీలించసాగారు.

అట్ట చివరి బొమ్మ



ఒక మహాభవనం గవాక్షంలో రాజకుమార్తె సుదర్శన చెలికత్తెలను వెంట ఉంచుకుని వారి కళ్ళపడింది. ఆమె నవయౌవనంలో ఉన్నది. ఆమె అపురూప సౌందర్యవతి. ఆమెను చూస్తూనే సాలెవాడు తీవ్రమైన మోహానికి గురి అయినాడు. అతను తన వికారాన్ని ఎలాగో బయట పడకుండా దాచుకుని, ఇంటికి తిరిగి వచ్చాడు. కాని తన ఇంట్లో ఒంటరిగా ఉన్నప్పుడు ఎటు చూసినా అతనికి రాజకుమార్తె రూపమే కనబడసాగింది. అతను ఎంతో విచారంగా మంచం మీద పడిపోయి, ఆమెనే ధ్యానిస్తూ పడుకున్నాడు.

అతను తన స్థితిని గురించి ఆలోచిస్తూ, ''అందం ఉన్న చోట మంచితనం కూడా ఉంటుందంటారు గదా, ఈ అందగత్తె నన్ను ఎందుకిలా బాధిస్తున్నది? ఎవడైనా తన కొంపను తానే దహించుకుంటాడా? ఈ రాజకుమార్తె నా హృదయంలో తిష్ఠవేసుకుని, దాన్ని ఎందుకు దహిస్తున్నది? దేవుడు నా ప్రాణం తీయదలిస్తే అందుకు మరేదన్నా సాధనం చూడక ఈమెను ఎందుకు ఉపయోగించుతున్నాడు? ప్రపంచంలో ప్రతిదీ క్షణికమేనని బుద్ధుడు చెప్పిన మాట నిజం కాదు. నిజమైతే, రాజకుమార్తె మీద నాకు కలిగిన మోహం పోదేం?'' అనుకున్నాడు.

ఇలా పిచ్చి పిచ్చి ఆలోచనలతో సాలెవాడు ఆ రాత్రి అంతా జాగరం చేశాడు. మర్నాడు మామూలు వేళకు వడ్రంగి అతన్ని చూడటానికి చక్కగా అలంకరించుకుని వచ్చి, తన మిత్రుడు శవంలాగా మంచం మీద పడి ఉండటం చూసి, ''మిత్రమా, నీకేమయింది?'' అని అడిగాడు.

సాలెవాడు నిట్టూర్పులు విడిచాడే గాని జవాబు చెప్పలేదు. వైద్యం కొంత తెలిసిన వడ్రంగి తన స్నేహితుడి నాడి పరీక్షించి, నుదురు తాకి చూసి,



" మిత్రమా, నీది ప్రేమజ్వరం లాగుంది. ఎవతెను ప్రేమించావు ?" అని అడిగాడు.

సాలెవాడు ఆశ్చర్యంతో లేచి కూర్చుని, "బాధను ప్రేమించిన భార్యతోగాని, మిత్రుడితోగాని పంచుకుంటే తగ్గుతుం దంటారు," అంటూ తన బాధను బయట పెట్టాడు.

వడ్రంగి అంతా విని, "సుప్రతివర్మ మహారాజు క్షత్రియుడు. నువు వైశ్యుడివి. నీ కన్న గొప్ప కులానికి చెందిన స్త్రీని కోరటానికి నీకు జంకులేదా ?" అని అడిగాడు.

"క్షత్రియుడు క్షత్రియ, వైశ్య, శూద్ర, కన్యలను వివాహం ఆడవచ్చు. ఈమె రాజుకు వైశ్య భార్య వల్ల పుట్టినదే అయి ఉంటుంది. లేకపోతే నాకు ఆమె పైన ప్రేమ కలిగి ఉండదు. ఇటువంటి వాటికి అంతరాత్మే సాక్షి!" అన్నాడు సాలెవాడు.

"ఇప్పుడు ఏం చెయ్యాలి ?" అని వడ్రంగి అడిగాడు.

"నాకు చితి సిద్ధం చెయ్యి. నాకు రాజకుమార్తె లభించటం అసంభవం. ఆమె లభించకపోతే నేను బతకటం అసంభవం. అంతులేని శరీర బాధా, మనోవేదనా అనుభవించి నేను చావక తప్పదు," అన్నాడు సాలెవాడు.

"అదంతా కట్టిపెట్టు. ధనంతోగాని, బుద్ధితోగాని సాధించరానిది ప్రపంచంలో ఏదీ లేదు. నువు లేచి, స్నానం చేసి, భోజనం చేసి, మామూలుగా ఉండు. నీకు రాజకుమార్తె దక్కే వైనం నేను ఆలోచిస్తాను," అన్నాడు వడ్రంగి.

తన మిత్రుడి తెలివితేటలలో అపార మైన విశ్వాసం ఉండటం చేత సాలె వాడు విచారం కట్టిపెట్టి, మామూలు ప్రకారం జీవించసాగాడు.

కొద్ది రోజుల అనంతరం వడ్రంగి సాలెవాడి వద్దకు గరుడ రూపంలో గల విమానాన్ని తెచ్చాడు. అది చక్కగా రంగులు వేసి ఉన్నది. దాన్ని నడపటా

నికి ఒక కాడ ఉన్నది. అలాటి విమా నాన్ని పూర్వం ఎన్నడూ ఎవరూ చూసి ఉండరు.

దాన్ని ఎలా నడపాలో సాలెవాడికి చెబుతూ, "పైకిలేచి ఎగురుతూ వెళ్ళా లంటే, ఈ కాడను బయటికి లాగు, కిందికి దిగి ఆగదలిస్తే కాడను లోపలికి నొక్కెయ్యి," అన్నాడు వడ్రంగి.

సాలెవాడు ఆ గరుడ విమానాన్ని నడపటం పూర్తిగా నేర్చుకున్నాడు.

"సుప్రతివర్మ మహారాజూ, ఆయన కుటుంబమూ, ముఖ్యంగా రాజకుమార్తె సుదర్శనా, నారాయణభక్తులు. వారి పూర్వీ కుడు ఒకడికి నారాయణ ప్రత్యక్షమై, వరాలు ఇచ్చినట్టు కూడా చెప్పుకుంటారు. కనక నువు శంఖు, చక్ర, గదా, పద్మాలు ధరించి, ఈ గరుడ విమానం మీద వెళ్ళి, రాజభవనం పైభాగాన వాలు. అక్కడే రాజకుమార్తె శయన మందిరం ఉన్న దనీ, అందులో ఆమె ఒంటరిగా పడు కుంటుందనీ నేను వాకబుచేసి తెలుసు కున్నాను. నువు నారాయణ లాగా నటిస్తూ, గాంధర్వ విధిని ఆమెను నీ భార్యను చేసుకో," అన్నాడు వడ్రంగి.

ఆ పగలల్లా సాలెవాడు ఆనందంగా ఊహలలో విహరించి, రాత్రి పడగానే ఖరీ దైన పట్టుబట్టలు కట్టుకుని, సుగంధ లేపనాలు ఒంటికి పూసుకుని, శంఖుచక్ర గదా పద్మాలు వెంటబెట్టుకుని గరుడ వాహనం ఎక్కి, తిన్నగా వెళ్ళి, రాజ కుమార్తె శయనమందిరం ముందు డాబా మీద వాలాడు.

అది పండు వెన్నెల రాత్రి. రాజ కుమార్తె పంచలో మంచం మీద పడుకుని, అకస్మాత్తుగా నారాయణను తనకు సమీ పంలో గరుడవాహనం మీద చూసింది. సాలెవాడు చాలా అందగాడు. అతని రూపం నారాయణుడి వర్ణనకు తగినట్టే ఉన్నది. ఆమె చప్పున లేచి, సాలెవాడి ముందు సాష్టాంగపడి, "స్వామీ, నా పైన అనుగ్రహం కలిగి ఇలా రావటానికి కారణం ఏమిటి?" అని అడిగింది.






మిత్రభేదం



# మిత్రభేదం

## 11

రాజకుమార్తె అడిగిన దానికి విష్ణు రూపంలో వున్న సాలెవాడు, "ఓ, సుదర్శనా! నేను నీ కోసమే వచ్చాను. నన్ను కౌగలించుకో," అన్నాడు.

"స్వామీ, మీరు దేవతలు. నేను మనుష్య స్త్రీని. మనకు పొత్తు ఎలా కుదురుతుంది?" అని సుదర్శన అన్నది.

"ప్రియా, నువు నా అర్థాంగి అయిన లక్ష్మివి. నీకు గుర్తు లేదా? శాపవశాన నువు మనుష్యజన్మ ఎత్తటమూ, మనకు కొద్దికాలం ఎడబాటు కలగటమూ జరిగింది. నేను మానవ రూపంలో కొంత కాలం నీకు భర్తగా ఉన్నమీదట శాపం తీరిపోతుంది. నిన్ను మనుష్య భర్త నుంచి కాపాడటానికి వచ్చాను. మనం గాంధర్వ వివాహం చేసుకుందాం." అన్నాడు సాలెవాడు.

రాజకుమార్తె పరమానందం చెంది, అతనికి భార్య కావటానికి ఒప్పుకున్నది.

ఇలా చాలా రోజులు వారికి సుఖంగా గడిచాయి. అర్ధరాత్రి సమయాన సాలెవాడు తన గరుడవాహనం మీద రాజకుమార్తె వద్దకు వచ్చి, తెల్లవారబోయే ముందు ఎవరికంటా పడకుండా తిరిగి వెళ్ళిపోతూ ఉండేవాడు. వెళ్ళే ముందు వాడు రాజకుమార్తెతో తాను వైకుంఠానికి పోతున్నాననీ, మళ్ళీ రాత్రికి వస్తాననీ చెప్పేవాడు.

కొంత కాలం గడిచినాక రాజకుమార్తె చెలికత్తెలు రాజకుమార్తె వద్దకు ఎవరో వచ్చిపోతున్నారని పసికట్టి, రాజుగారు తమ అశ్రద్ధ తెలిసి దండిస్తాడని భయపడి, రాజు వద్దకు వెళ్ళి, ఆయన కాళ్ళ మీద పడి, "మహారాజా, మాకు అభయం

అట్ట చివరి బొమ్మ



ఇయ్యండి. మేము తమరికి ఒక సంగతి మనవి చెయ్యాలి,'' అన్నారు.

''అలాగే ఇచ్చాను. మీరు చెప్పేది చెప్పండి,'' అన్నాడు రాజు.

''మహారాజా, మేము రాజకుమార్తె సుదర్శనను వెయ్యి కళ్ళతో కనిపెట్టి ఉన్నప్పటికీ ఎవడో ఆమె వద్దకు వచ్చి పోతున్నాడు. వాడు ఎలా వస్తున్నాడో, ఎలా పోతున్నాడో మాకు తెలియటంలేదు. వాడు మెట్లెక్కి రాజకుమార్తె గదికి పోవటంలేదు; అలా చేస్తే మాకు తెలుస్తుంది. వాడు ద్వారం కుండానూ రావటం లేదు; అక్కడ కాపలావాళ్ళు ఉన్నారు. మేము రాత్రి పది గంటల దాకా రాజకుమార్తె వెంటనే ఉండి, ఆమెను పడుకోనిచ్చి వచ్చేస్తాం. తిరిగి తెల్లవారు ఝామున అయిదు గంటలకు ఆమె వద్దకు పోతాం. ఈ మధ్యకాలంలో ఆమె పిలిస్తే తప్ప ఆమె శయన మందిరంలోకి వెళ్ళం. ఆ వచ్చేవాడు ఆ సమయంలోనే వస్తూ ఉండాలి. ఎలా వస్తాడో, ఎలాపోతాడో ఊహించ రాకుండా ఉన్నది. ఇది నిజం. ఆ పైన దేవరవారి చిత్తం,'' అన్నారు రాజకుమార్తె చెలికత్తెలు.

ఈ సంగతి విని రాజు చాలా చింతించాడు. గొప్ప వంశంలో పుట్టి కూడా తన కుమార్తె నీచమైన దారి తొక్కింది. ఇందులో తన అశ్రద్ధ ఏమీ లేదు. ఆడపిల్లను కన్నవారికి అన్నీ అగచాట్లే గద! ఇలా అనుకుంటూ రాజు తన భార్య వద్దకు వెళ్ళి, తాను విన్నదంతా చెప్పి, ''ఎవడో దుర్మార్గుడికి అయువు తీరిపోతున్నది,'' అన్నాడు.

రాణి లబ లబ లాడుతూ తన కుమార్తె మందిరానికి వెళ్ళి, ''వంశం చెడబుట్టిన నిర్భాగ్యురాలా, నీ శీలం చెడగొట్టుకున్నావా? నీ వద్దకు వచ్చే అల్పాయుష్కుడు ఎవడు?'' అన్నది.

రాజకుమార్తె సిగ్గుతో తల వంచుకుని తల్లికి, నారాయణ గరుడవాహనం మీద తన కోసం వచ్చిపోతున్న వార్త తెలిపింది.



ఈ అద్భుత కథ విని రాణికి అమిత మైన ఆనందం కలిగింది. ఆమె గగుర్పాటు చెందుతూ తన భర్త వద్దకు పోయి, "మీరు ధన్యులు! మన కుల దేవత అయిన నారాయణమూర్తి ప్రతి రాత్రి మన అమ్మాయి కోసం వస్తున్నాడట. అది లక్ష్మి అవతారమట! వాళ్ళిద్దరికీ గాంధర్వ వివాహం జరిగింది. ఇవాళ రాత్రి మనం కిటికీ కుండా నారాయణ మూర్తివారి దర్శనం చేసుకుందాం. ఆ దేవుడు మనలాటి మానవ మాత్రులను పలకరించడను కోండి!" అన్నది.

రాజుకు కూడా అపారమైన ఆనందం కలిగింది. ఆ పగలు ఆయన అతి కష్టం మీద గడిపాడు. రాత్రి అయింది. రాజూ, రాణీ కిటికీ వద్ద చేరి, ఆత్రంగా ఆకాశం కేసి చూడసాగారు. శంఖుచక్ర గదా పద్మాలు ధరించి సాలెవాడు గరుడ వాహనం మీద రావటం వారి కంట పడింది. ఆనందపారవశ్యంలో రాజు రాణితో, "ప్రపంచంలో మన కంటె ధన్యులు లేరు! లక్ష్మినే మనం గర్భ వాసాన కన్నాం. సాక్షాత్తూ నారాయణ మూర్తే మనకు అల్లుడయాడు! మన కలలు పండాయి. మన అల్లుడి ప్రతాపంతో నేను ప్రపంచమంతా జయిస్తాను," అన్నాడు.

ఇది జరిగిన కొంత కాలానికి విక్రమ సేన చక్రవర్తి మనుషులు సుప్రతివర్మ నుంచి కప్పం తీసుకు పోవటానికి వచ్చారు. ఇప్పుడు శ్రీమన్నారాయణ మూర్తివారి మామగారు కావటం చేత సుప్రతివర్మ చక్రవర్తి దూతలకు మామూలు మర్యాదలు చెయ్యలేదు. వాళ్ళు ఆగ్రహించి, "రాజా, కప్పం కట్టే గడువు దాటిపోయినా, నువు ఇంకా కట్ట లేదు. విక్రమసేన మహారాజు ఆగ్రహం కార్చిచ్చులాటిది. ఏ దేవుడో నిన్ను ఆదుకుంటాడనుకుంటున్నావా?" అన్నారు.

రాజు వాళ్ళ బెదిరింపును ఏమాత్రమూ లక్ష్యపెట్టలేదు. వాళ్ళు చక్రవర్తి వద్దకు

తిరిగి వెళ్ళి, తమకు జరిగిన అవమానాన్ని వెయ్యింతలుగా చేసి చెప్పారు. విక్రమసేనమహారాజు తన సామంతులందరినీ వెంట బెట్టుకుని, పెద్ద సేనతో సుప్రతివర్మ ఏలే దేశం మీదికి ఎత్తి వచ్చాడు. అతను జనహింస ప్రారంభించే సరికి, బాధితులైన ప్రజలు పుండ్రవర్ధనానికి వచ్చి, రాజభవనం ముందు ఆక్రోశించారు. అయినా రాజు చలించలేదు.

త్వరలోనే విక్రమసేనుడు పుండ్రవర్ధనానికి వచ్చి, నగరాన్ని ముట్టడించాడు. మంత్రులూ, పురోహితులూ, నగర ముఖ్యులూ రాజు వద్దకు వచ్చి, తాత్సారం దేనికి అని అడిగారు.

రాజు చిరునవ్వుతో, "విచారించకండి. శత్రువును నిర్మూలించే మార్గం నాకు తెలుసు. రేపు ఉదయానికల్లా ఈ పని జరగటం మీరే చూస్తారు," అన్నాడు.

ఆయన తన కుమార్తె సుదర్శనను పిలిపించి, ఆమెతో మధురంగానూ, గౌరవంగానూ, "అమ్మా, నీ భర్త బలం చూసుకుని నేను శత్రువుతో యుద్ధం తెచ్చుకున్నాను. అందుచేత, ఈ రాత్రి వారు నీ వద్దకు వచ్చినప్పుడు, తెల్లవారే సరికల్లా శత్రు నాశనం జరిగేలాగు చూడు," అన్నాడు.

సాలెవాడు ఆ రాత్రి తన వద్దకు వచ్చినప్పుడు రాజకుమార్తె అతనితో సంగతి అంతా చెప్పింది.

వాడు చిరునవ్వు నవ్వుతూ, "ప్రియా, హిరణ్యకశిపుణ్ణీ, కంసుణ్ణీ, మధుకైటభులనూ చంపిన నాకు మానవమాత్రులను చంపటమనగా ఎంత? నా చక్రాయుధంతో శత్రువులను నిర్మూలిస్తానని నీ తండ్రికి చెప్పు," అన్నాడు.

సుదర్శన గర్వంతో ఈ మాట తన తండ్రికి చెప్పింది. ఆయన పరమానందం చెందాడు. మర్నాడు ఉదయానికల్లా విక్రమసేనుడు వధించబడతాడనీ, ఆయన సొత్తు ఎవరికి దొరికినది వారు ఉంచుకోవచ్చుననీ రాజు నగరంలో చాటింపు వేయించాడు. ప్రజలు హర్షించారు.



CHANDAMAMA (Telugu) MAY 1974 Regd. No. M. 4834




మిత్రభేదం



# 12

సాలెవాడు మాత్రం రాజకుమార్తెకు మాటఇచ్చిన మరుక్షణం నుంచీ విచారంలో మునిగిపోయాడు. తాను ఏం చెయ్యాలి? గరుడవాహనం మీద తాను ఎక్కడైనా పారిపోవచ్చు. కాని తన ప్రియురాలు తనకు దక్కదు. విక్రమసేనుడు తన మామను చంపి, సుదర్శనను ఎత్తుకుపోయి పెళ్ళి చేసుకుంటాడు. తాను యుద్ధం చేస్తే తన చావు తప్పదు. ప్రియురాలి ఎడబాటు వల్ల కూడా తనకు చావే కలుగుతుంది. ఎలాగూ చావు తప్పనప్పుడు ధైర్యంగా చావటమే వివేకం. తాను నారాయణమూర్తి వేషంలో యుద్ధానికి పోతే శత్రువు భ్రమపడి, బెదిరి, పారిపోనూవచ్చు.

సాలెవాడు ఇలా నిర్ణయించుకునేసరికి, అసలు వైకుంఠంలో గరుత్మంతుడు శ్రీమన్నారాయణమూర్తి వారితో భూలోకంలో జరిగినదంతా చెప్పి, "దేవా, నీ రూపం ధరించి తిరుగుతున్న ఈ సాలెవాడు యుద్ధంలో చస్తే ఇక మీకు పూజా పునస్కారాలుండవు. మీలో ప్రజలకు విశ్వాసం పోతుంది. మరి ఏం చేస్తారో ఆలోచించండి," అన్నాడు.

దానికి నారాయణమూర్తివారు, "పక్షిరాజా, అక్రమంగా కప్పాలు వసూలు చేస్తున్నందుకు విక్రమసేనుడు చావాలి. పైపెచ్చు, వాడు నా భక్తులైన రాజు వంశాన్ని నిర్మూలించ జూస్తున్నాడు. నేను సాలెవాణ్ణి ఆవహించి, వాడి చక్రంలో ప్రవేశిస్తాను," అన్నాడు.

తెల్లవారు ఝామునే సాలెవాడు రాజకుమార్తె సహాయంతో యుద్ధసన్నద్ధుడైనాడు. రాజు కూడా తన సైన్యంతో

అట్ట చివరి బొమ్మ



సహా యుద్ధం చెయ్యటానికి నగరం వెలువడ్డాడు. రెండు సేనలూ యుద్ధానికి తలపడ్డాయి. సాలెవాడు తన గరుడవాహనం మీద ఆకాశం మీదుగా ఎగురుతూ యుద్ధరంగానికి వెళ్ళి, సేనలకు ఎగువగా గాలిలో నిలిచి, శంఖం పూరించాడు.

శంఖనాదం విని పైకి చూసి శత్రుసేనలు, విష్ణుమూర్తే తమతో యుద్ధానికి వచ్చాడనుకుని బెదిరిపోయాయి. చాలా మంది పడిపోయారు. కొందరు మూర్ఛపోయారు. కొందరు వెర్రిగా ఆకాశం కేసి చూస్తూ ఉండిపోయారు. ఆ సమయంలో సాలెవాడు తన చక్రాన్ని విక్రమసేనుడిపై విసిరాడు. అది విక్రమసేనుణ్ణి రెండుగా నరికి, సాలెవాడి చేతికి తిరిగి వచ్చింది. అతని సామంతులందరూ సాలెవాడి ముందు సాష్టాంగపడి, శరణు వేడారు.

"ఇక నుంచీ మీరు సుప్రతివర్మకు లోబడి ఉండండి," అన్నాడు సాలెవాడు.

అందరూ అందుకు ఒప్పుకున్నారు. విక్రమసేనుడి బలాలన్నీ సుప్రతివర్మ పరం అయాయి. అనంతరం సాలెవాడు శాశ్వతంగా రాజకుమార్తెతో సమస్త సుఖాలూ అనుభవించాడు.

దమనకం చెప్పిన సాలెవిష్ణువు కథ విని కరటకం, "సరే, నీ కంత నమ్మకం ఉన్నది గనక, పింగళకం వద్దకు వెళ్ళి, నీ యుక్తి పారుతుందేమో చూడు. విజయీ భవ!" అన్నది.

దమనకం పింగళకం వద్దకు వెళ్ళి, వంగి నమస్కరించి, పింగళకం అనుమతితో కూర్చున్నది.

"నన్ను ఇంతకాలం చూడవచ్చావు కావేం?" అని పింగళకం అడిగింది.

"ఏలినవారి క్షేమ భద్రతల దృష్ట్యా ఒక అతి ముఖ్య విషయం మనవిచేయటానికి ఇలా వచ్చాను. ఒక్కొక్కసారి, యజమానికి రుచించని మాటలు కూడా భృత్యులు మనసు విప్పి చెప్పవలసి ఉంటుంది. రుచించని సత్యాలు చెప్పే

ధైర్యం విశ్వాసపాత్రులైన భృత్యులకే ఉంటుంది,'' అన్నది దమనకం.

"ఏమిటి నువు చెప్పదలచిన సంగతి?" అని పింగళకం ఆసక్తితో అడిగింది.

''మహారాజా, ఏలినవారి ఆదరానికి పాత్రమైన సంజీవకం రాజద్రోహానికి ఒడిగట్టాడు. తమరిని చంపి, సింహాసనం చేజిక్కించుకునే ఎత్తుగడలను చాలా మందికి తెలిపాడు. ఇవాళే ఈ కుట్ర అమలు జరుగుతుందట. అనువంశికంగా తమ కొలువు చేస్తున్న నా విధి గనక, తమర్ని హెచ్చరించటానికి వచ్చాను,'' అన్నది దమనకం.



ఈ వార్త విని పింగళకం అదిరిపోయింది. అది గమనించి దమనకం, ''మహారాజా, కదిలిన పంటిని పెరికెయ్యాలి. వ్యాధిని అంకురంలోనే తుంచెయ్యాలి. శత్రువుగా తయారైన వాణ్ణి నాశనం చెయ్యాలి. పరిపాలన యావత్తూ ఈ ఎద్దుకు అప్పగించి, తమరు పెద్ద చిక్కులో పడ్డారు,'' అన్నది.

''కాని, సంజీవకం ఉన్నట్టుండి నాకెందుకు ద్రోహం తలపెట్టాలి? నేను అతనికి అసంతృప్తి కలిగించటానికి ఏమీ చెయ్యలేదే?'' అని పింగళకం అడిగింది.

''దుర్మార్గుడికి కారణాలు కావాలా, మహారాజా? అతను మొదటి నుంచీ ద్రోహబుద్ధితోనే ఉన్నాడని అనుమానం. తమరూ, ఈ ఎద్దూ లాటి బలశాలులు ఇద్దరికి ఈ అరణ్యంలో తావులేదు. అతను కపటంగా తమ అనుగ్రహం సంపాదించి, పెట్టిన చేతినే కరిచే ఉద్దేశంలో ఉన్నాడు. మీరు కృతఘ్నుడి కథ వినలేదా?'' అన్నది దమనకం.

''ఏమిటా కథ?'' అని పింగళకం అడిగింది.

దమనకం ఇలా చెప్పింది:

### కృతఘ్నుడి కథ

యజ్ఞదత్తు డనే పనికిమాలిన దరిద్రుడికి గంపెడు పిల్లలు. ఒక రోజల్లా ఇంటిల్లిపాదీ పస్తులున్న మీదట యజ్ఞ

దత్తుడి భార్య కోపంవచ్చి, "పనికిమాలిన కటికవాడా, నీ పిల్లలు ఆకలికి మాడటం కనబడటం లేదా? ఏమీ పట్టనట్టు చేతులు కట్టుకుని కూర్చున్నావేం? ఎక్కడైనా వెళ్ళి ఏమైనా సంపాదించి మరీ తిరిగిరా," అన్నది.

ఈ మాటకు నొచ్చుకుని ఆ బ్రాహ్మడు ఇంటి నుంచి బయలుదేరాడు. చాలా దూరం వెళ్ళగా ఒక అడవి వచ్చింది. అతనికి దాహంవేసి, నీటి కోసం వెతక సాగాడు. కీకారణ్యం మధ్య ఒక లోతైన గుంట కనిపించింది. దాని చుట్టూ గడ్డి ఏపుగా పెరిగి ఉన్నది గాని, అందులో నీరు లేదు. యజ్ఞదత్తుడు అందులోకి తొంగిచూసే సరికి అతనికి ఒక పులీ, ఒక కోతీ, ఒక పామూ, ఒక మనిషీ కనిపించారు. గుంటలో వున్న వాళ్ళు అతన్ని చూశారు.


పులి యజ్ఞదత్తుడితో, "మహాత్మా, ప్రాణరక్షణను మించిన పుణ్యం లేదు. అందుచేత నన్ను బయిటికి తీసి, నా వారిని కలుసుకునేటట్టు చెయ్యి," అన్నది.

"నీ పేరు చెబితేనే ప్రాణులకు భయం కదా, నేను నిన్ను గుంట లోపలి నుంచి ఎలా పైకి తీయను?" అన్నాడు యజ్ఞదత్తుడు.


"అయ్యా, ఏ పాపానికైనా ప్రాయశ్చిత్తం ఉన్నదిగాని కృతఘ్నతకు పరిహారం లేదు. నా గురించి నువు భయపడవలసిన పనిలేదు. ప్రాణాపాయస్థితిలో వున్న నన్ను జాలిదలచి పైకి తియ్యి," అన్నది పులి.

ప్రాణరక్షణ యత్నంలో ప్రాణం పోయినా పుణ్యమే గదా అనుకుని ఆ బ్రాహ్మడు, వనలతలను బలమైన మోకుగా చేసి, దాని సహాయంతో పులిని పైకి లాగాడు.

"అయ్యా, నన్ను కూడా పైకి లాగు," అని కోతి బతిమాలింది. పాము కూడా అలాగే కోరింది. బ్రాహ్మడు ఆ రెంటినీ గుంట నుంచి పైకి లాగాడు.



CHANDAMAMA (Telugu) JUNE 1974 Regd. No. M. 4854




మిత్రభేదం



# మిత్రభేదం

## 13

గుంట నుంచి పైకి వచ్చిన మూడు మృగాలూ బ్రాహ్మడితో, "గుంటలో ఉన్న మనిషి పరమపాపి. వాణ్ణి బయటికి లాగకు, వాడి మాట నమ్మకు," అన్నాయి.

తరవాత పులి బ్రాహ్మడితో, "దూరాన కనబడే ఆ కొండ చూశావా? దాని ఉత్తర పార్శ్వపు లోయలో నా నివాసం. నువు అక్కడికి వచ్చినట్టయితే నీకు ప్రత్యుపకారం చేసి, నీ ఋణం తీర్చుకుంటాను," అన్నది.

అది వెళ్ళిపోగానే కోతి, "పులి ఉండే చోటుకు ఎదురుగా ఒక జలపాతం ఉన్నది. దాని సమీపంలో ఉన్న మర్రి చెట్టు నా నివాసం. నీకు అవసరం అని తోచినప్పుడు ఎప్పుడైనా అక్కడికి రా," అని వెళ్ళిపోయింది.

"నీకు ఎప్పుడైనా అపాయం తటస్థించినట్టయితే నన్ను తలుచుకో," అని పాము కూడా వెళ్ళిపోయింది.

జంతువులన్నీ వెళ్ళిపోయాక గోతిలో ఉన్న మనిషి, "బ్రాహ్మడా, నన్ను కూడా పైకి లాగు," అని కేక పెట్టాడు.

సాటివాడు గదా అని బ్రాహ్మడు జాలి దలచి ఆ మనిషిని కూడా పైకి లాగాడు.

పైకి వచ్చినాక వాడు, "నేను భరుకచ్ఛానికి చెందిన స్వర్ణకారుణ్ణి. నీ కేవైనా బంగారు నగలు చేయించుకోవాలని ఉంటే నా వద్దకు రా," అని చెప్పి వెళ్ళిపోయాడు.

తరవాత బ్రాహ్మడు చాలా రోజులు తిరిగాడు గాని ఏమీ సంపాదించలేక పోయాడు. అతను నిరాశతో ఇంటి ముఖం పట్టాడు. తిరుగు ప్రయాణంలో అతను

అట్ట చివరి బొమ్మ



61



కోతి ఉంటే చోటికి వెళ్ళాడు. కోతి అతనికి అమృతప్రాయమైన పళ్ళు తినటానికి ఇచ్చింది. వాటిని తిని అతను ఆకలి తీర్చుకున్నాడు.

కోతి అతనితో, ''పళ్ళు కావాలంటే రోజూ రా,'' అన్నది.

''నీ ఋణం తీరిపోయింది. పులిని చూపించు,'' అన్నాడు బ్రాహ్మడు.

కోతి అతనికి పులిని చూపింది. పులి అతనికి ఒక చంద్రహారమూ, ఇతర ఆభరణాలూ ఇస్తూ, ''ఎవరో రాజకుమారుడు ఎక్కిన గుర్రం అతని వశం తప్పి పరిగెత్తుతూ అతన్ని పడేసింది. అతను చచ్చిపోయాడు. అతని ఆభరణాలన్నీ నీ కోసం దాచి ఉంచాను. కనక వీటిని తీసుకుని, యథేచ్ఛగా వెళ్ళు,'' అన్నది.

బ్రాహ్మడు ఆ ఆభరణాలను తీసుకుని, స్వర్ణకారుడు వాటిని తన కోసం అమ్మిపెట్టగలడని ఆలోచించి, అతని వద్దకు వెళ్ళాడు.

స్వర్ణకారుడు అతనికి స్వాగతం చెప్పి, కాళ్ళు కడిగి, ఆసనం ఇచ్చి, విందు భోజనం పెట్టి, "నా వల్ల ఏమైనా కావాలంటే ఆజ్ఞాపించు,'' అన్నాడు.

''కొంత బంగారం తెచ్చాను. దాన్ని అమ్మిపెట్టు,'' అన్నాడు బ్రాహ్మడు.

స్వర్ణకారుడు బ్రాహ్మడి వద్ద నుంచి ఆభరణాలు తీసుకుని, అవి తాను రాజకుమారుడి కోసం చేసినవేనని గ్రహించాడు. ఆ రాజకుమారుడి కోసం వెతకగా వెతగా అతని శవం కీకారణ్యం మధ్య ఇటీవలనే దొరికింది. అతని నగలు మాత్రం లేవు. హత్య జరిగిందని నిర్ధారణ చేసుకుని, రాజు హంతకుణ్ణి పట్టి ఇచ్చిన వాడికి పెద్ద బహుమానం ప్రకటించాడు. ఈ బ్రాహ్మడే హంతకుడై ఉండాలనుకుని, స్వర్ణకారుడు బ్రాహ్మణ్ణి రాజుకు అప్పగించి బహుమానం పొంద నిశ్చయించాడు.

''అయ్యో, నువు ఇక్కడే ఉండు. నేను ఇద్దరు, ముగ్గురు బంగారు వర్తకు

లకు ఈ నగలు చూపించి, ఇప్పుడే వస్తాను,'' అని అతను రాజభవనానికి వెళ్ళి, రాజుకు ఆభరణాలు చూపించి, వాటిని తెచ్చిన బ్రాహ్మడు తన ఇంటి వద్ద ఉన్నాడని చెప్పాడు.

రాజభటులు వెళ్ళి, ఆ బ్రాహ్మణ్ణి చేతులూ, కాళ్ళూ బంధించి రాజు వద్దకు తెచ్చారు. ఆ బ్రాహ్మడు ఏమి చెప్పేదీ వినకుండానే రాజు అతనికి మరణ దండన విధించాడు.

అప్పుడు బ్రాహ్మడు పామును తలుచుకున్నాడు. వెంటనే పాము అతడి దగ్గిరకు వచ్చి, ''నా వల్ల ఏం సహాయం కావాలి?'' అని అడిగింది.

''నన్ను ఈ కాళ్ళకూ, చేతులకూ వున్న బంధాల నుంచీ, చెర నుంచీ విడిపించు,'' అన్నాడు బ్రాహ్మడు.

పాము బ్రాహ్మడికి చెప్పవలసినది చెప్పి, వెళ్ళి రాణిని కాటు వేసింది. అంతఃపురంలో రోదనధ్వనులు బయలుదేరాయి. నగరం అట్టుడికి పోయింది. వైద్యులూ, మంత్రవేత్తలూ, పాము మంత్రాలు తెలిసినవాళ్ళూ వచ్చి ఏమేమి తంత్రాలో చేశారు. కాని స్పృహతప్పి పడిపోయిన రాణి కళ్ళు తెరవలేదు.

రాజు హతాశుడై, రాణిని బతికించిన వారికి గొప్ప బహుమానం ఇస్తానని



దండోరా వేయించాడు. దండోరా విని, ఖైదులో ఉన్న బ్రాహ్మణుడు, రాణిని తాను బతికిస్తానన్నాడు. వెంటనే అతన్ని విడుదల చేసి, రాజు వద్దకు తీసుకుపోయారు. రాణికి చికిత్స చెయ్యటానికి రాజు అనుమతించాడు. బ్రాహ్మణుడు రాణి చెయ్యి తాకగానే విషం విరిగిపోయి, రాణి కళ్ళు తెరిచింది.

రాజు పరమానందభరితుడై, బ్రాహ్మణుడికి అంతులేని కానుక లిచ్చి, ''అయ్యా, మీకు ఆ నగలు ఎలా వచ్చాయి?'' అని అడిగాడు. బ్రాహ్మణుడు జరిగినదంతా చెప్పాడు. రాజు, కృతఘ్నుడైన స్వర్ణకారుడికి శిక్ష విధించి,

బ్రాహ్మణ్ణి తన మంత్రిగా నియమించి, అతనికి అనేక గ్రామాలు ఇచ్చాడు. బ్రాహ్మడు తన భార్యనూ, బిడ్డలనూ తెచ్చుకుని, వారితో సుఖంగా ఉన్నాడు.

పింగళకానికి కృతఘ్నుడి కథ చెప్పి దమనకం ఇంకా ఇలా అన్నది:

''మిత్రుడయేది, బంధువుడయేది, గురువయేది, రాజయేది నేరం చేస్తే దండన పొందాలని మనువు చెప్పాడు. మహారాజా, ఈ యెద్దు ద్రోహి. అతనితో అలాగే తమరు వ్యవహరించాలి. అతనితో పొత్తు పాముల పుట్టపై శయనించటం లాటిది, తగలబడుతున్న ఇంట నివసించడం లాటిది.''

''నువు చెప్పినది నిజమే, మిత్రమా. అందుచేత అతన్ని హెచ్చరిస్తాను,'' అన్నది పింగళకం.

''ఏమిటీ? హెచ్చరించటమా! అలాంటి వాడి పట్ల చర్యలే తప్ప మాటలు పనికిరావు. తమ చాటున ఇప్పటికే చాలా కాలం పుంజుకున్నాడు. నల్లి కథలోలాగ ఇతన్ని తక్షణం చంపి పారెయ్యాలి,'' అన్నది దమనకం.

''ఏమిటా కథ?'' అని పింగళకం అడిగింది.

దమనకం ఇలా చెప్పింది:

నల్లి కథ

పూర్వం ఒక రాజు ఉండేవాడు. అతనికి ఉత్తమమైన శయనాగారం ఉండేది. అందులో అత్యంత సుఖప్రదమైన పరుపు ఉండేది. ఆ పరుపు ముడతలలో, తెల్లని దుప్పటి కింద దాగి మందవిసర్పిణి అనే ఆడ పేను జీవిస్తూ, రోజూ పక్కలు పరిచేటప్పుడు తెలివిగా తప్పించుకునేది. దుప్పట్లు మార్చేటప్పుడు పరుపులో దాక్కునేది. రాత్రి పూట రాజు వచ్చి పడుకుని నిద్రపోగానే, ఆ పేను రాజు తలలో ప్రవేశించి, ఆయన రక్తం తాగేది. అది ఎంత నాజూకుగా రాజును కొరికేదంటే, ఆయనకు నిద్రాభంగం కలిగేది కాదు. ఇలా రాచనెత్తురు తాగి ఆ పేను తెగబలిసి, సుఖంగా జీవిస్తూ వచ్చింది.



CHANDAMAMA (Telugu) JULY 1974 Regd. No. M. 4854



మిత్రభేదం



# మిత్రభేదం

## 14

ఒకనాడు ఢుండుకం అనే నల్లి సంచారం చేస్తూ రాజు పడుకునే మంచం మీదికి వచ్చి, అక్కడవున్న పేనును చూసింది.

"రాజుగారి పడక మీదికి ఎందుకు వచ్చావు. వెంటనే వెళ్ళిపో," అన్నది పేను నల్లితో.

దానికి నల్లి, "అమ్మా, అలా మాట్లాడకు. ఇంటికి వచ్చిన అతిథి పట్ల అలా ప్రవర్తించరాదు. తెలిసినవారు ఏం చెబుతారంటే, ఎంత తక్కువ వాడు వచ్చినా సత్పురుషులు, 'లోపలికి దయచెయ్యండి. కూర్చుని విశ్రాంతి తీసుకోండి. మీరు తరచుగా రారేం? ఏమిటి విశేషాలు? మీ ఆరోగ్యం బాగున్నదా? మీరు వచ్చినందుకు చాలా సంతోషం,' అనాలి. అలా ఆతిథ్యం ఇచ్చినందువల్ల స్వర్గప్రాప్తి కలుగుతుంది. నేను నీ అతిథిని. నేను రకరకాల మనుషుల రక్తం చవి చూశాను. ఆహార దోషాల వల్ల వారి రక్తం కటువుగానే, కారంగానో, చేదుగానో, పుల్లగానో ఉంటుంది. ఇలాటి దోషాలు లేని తియ్యని రక్తం ఇంత వరకు చవి చూసి ఎరగను. ఈ రాజు మహా రుచికరమైన వంటకాలూ, మంచి మంచి ఫలాలూ, అపురూపమైన మృగాల, పక్షుల మాంసమూ తింటాడు. గొప్ప వైద్యులు ఆయన రక్తం శుద్ధంగా ఉండేటట్టు చూస్తూ వుంటారు. నువు అనుమతించితే ఈ రాజుగారి రక్తం, అమృతంలాటిది, తాగి ఆనందించాలని ఉన్నది. రాజయినా, బిచ్చగాడయినా సుఖభోజనం కోరుతారుగద. జిహ్వాచాపల్యం రేకెత్తించే రుచికరమైన వస్తువులే ప్రపంచంలో లేకపోతే ఒకడికి మరొకడు సేవకుడు

అట్ట చివరి బొమ్మ



కావటమూ, చెప్పుచేతలలో ఉండటమూ ఎందుకు జరుగుతుంది? పొట్టకోసమే గదా మనిషి అబద్ధాలాడతాడు, పనికి మాలిన వారికి ఊడిగం చేస్తాడు, దేశాంతరాలకు పోతాడు! అందుచేత, ఆకలితో వచ్చిన నీ అతిథిని రాజు రక్తం చవి చూడనియ్యి,'' అన్నది.

'' అది ఎంతమాత్రమూ కుదరదు. నీ తొండం చాలా పదునైనది. కుట్టి నప్పుడు చాలా బాధ కలుగుతుంది. పైపెచ్చు నువు విడవకుండా కరుస్తావు. నీ కాట్లకు రాజు తప్పక నిద్రలేస్తాడు. అది మన యిద్దరికీ ప్రమాదం. కనక, నువు వెళ్ళిపో,'' అన్నది పేను.

నల్లి పేను కాళ్ళమీదపడి, ఉండ నియ్యమని ప్రాధేయపడింది. ఇది చూసి పేను మెత్తబడింది.

''సరే, అలాగే ఉండు,'' అన్నది పేను.

రాత్రి రాజు వచ్చి పక్కమీద పడు కున్నాడు. ఆయనకు కునుకుపట్టే లోపలనే నల్లి, ఆయన రక్తం రుచి చూడాలనే జిహ్వాచాపల్యంతో, రాజు పెదవిని బలం కొద్దీ కొరికింది. సూదితో గుచ్చినట్టు బాధ కలిగి రాజు లేచి నౌకర్లను పిలిచి, '' నన్నేదో నల్లో, పేనో కుట్టింది. వెతికి చంపండి,'' అన్నాడు.

వాళ్ళు వచ్చి పక్క అంతా గాలిం చారు. నల్లి యుక్తిగా మంచం నెర్రెలోకి దూరిపోయింది. పరుపులో దాగి ఉన్న పేనును కనిపెట్టి, నౌకర్లు చంపేశారు.

పింగళకానికి ఈ కథ చెప్పి దమనకం, '' ఈ ఎద్దు లాగా స్వజాతిని విడిచి జాత్యే తరులతో చేరేవాళ్ళు, కుకుద్రుమరాజు అనే నీలినక్క లాగా, అకాలమరణం వాతపడతారు,'' అన్నది.

'' ఏమిటా కథ? '' అని పింగళకం అడిగింది.

దమనకం ఇలా చెప్పింది.:

### కుకుద్రుమరాజు కథ

ఒక బస్తీకి సమీపాన గల అరణ్యంలో చండరవం అనే నక్క ఉండేది. ఒక

నాటి రాత్రి అది ఆహారం వెతుక్కుంటూ బస్తీ ప్రవేశించింది. కుక్కలు దాన్ని చూసి భయంకరంగా మొరుగుతూ, చీల్చి చంపాలన్న ఉద్దేశంతో దాని వెంట పడ్డాయి. నక్క హడలిపోయి, ప్రాణాలు దక్కించుకునేటందుకు పరిగెత్తుతూ ఒక కలంకారీ వాడి ఇంట జొరబడి, వాడు బట్టలకు రంగు వెయ్యటానికి నీలిరంగు నిలువ చేసి ఉంచే తొట్టెలో పడిపోయింది. అది చూసి కుక్కలు దూరంగావుండి కొంతసేపు మొరిగి వెళ్ళి పోయాయి.



నక్క నీలి రంగులో బాగా నానటం చేత దాని శరీరమంతా దట్టమైన నీలం రంగు పట్టుకున్నది. మూఢుడూ, ఆడదీ, ఎండ్రకాయా, తాగుబోతూ, నీలిరంగూ పట్టుకుంటే వదలవని సామెతే ఉన్నది గద! అమిత ప్రయాసపడి ఎలాగైతేనేం నక్క నీలిరంగుతొట్టె నుంచి బయటపడి, పారిపోయింది. ఈ సారి కుక్కలు దాని రంగు చూసి నక్క అని పోల్చుకోలేక దాన్ని పోనిచ్చాయి.

నక్క అరణ్యానికి తిరిగి వచ్చింది. సింహమూ, ఏనుగూ, పెద్దపులీ, చిరుత పులీ, తోడేలూ, ఎలుగుబంటూ, ఇతర అరణ్యమృగాలూ ఒకదానిని ఒకటి రహస్యంగా, "ఎన్నడూ ఎరగమే. ఎవరీ అద్భుతమైన నీలం ప్రాణి?" అని అడుగుకున్నాయి.

ఈ కొత్త జంతువు బల శౌర్య పరాక్రమాలు తమకు తెలియని కారణంచేత అవి నక్కకు ఎడంగా తప్పుకుని తిరగ సాగాయి.

తనను చూసి ఇతర జంతువులు భయపడుతూ ఉండటం చూసి చండరవం, "ఓ వన్యమృగాల్లారా, నన్ను చూసి ఎందుకు బెదిరిపోతున్నారు? మిమ్మల్ని పాలించటానికి రాజు లేడని గ్రహించి ఇంద్రుడు, మీకు రాజుగా ఉండి, మిమ్మల్ని కాపాడటానికి నన్ను పంపాడు. అందుకే నేను వచ్చాను.

నా పాలనలో మీరు క్షేమంగా ఉండండి. ఇకనుంచీ నేనే మీ రాజును. నా పేరు కుకుద్రుమం,'' అన్నది.

ఈ మాటలు విని సింహమూ, పెద్ద పులీ, ఏనుగూ, చిరుతపులీ, ఎలుగు బంటూ, తోడేలూ, కోతీ, లేడీ, కుందేలూ, ఇతర మృగాలూ నక్క ముందు సాష్టాంగ పడి, ''తమరు చెప్పినట్టు వింటాం,'' అన్నాయి.

కుకుద్రుమం సింహాన్ని తన మంత్రి గానూ, ఇతర మృగాలను ఇతర హెూదాల లోనూ నియమించి, తన జాతికి చెందిన నక్కలను హీనంగా చూసి, దూరంగా తరమగొట్టింది. సింహం మొదలైన జంతువులు వేటాడి, మాంసం తెచ్చి కుకుద్రుమానికి సమర్పించేవి. ఆ మాంసాన్ని తినగలిగినంత తిని, మిగిలినదాన్ని రాజధర్మం ప్రకారం కుకుద్రుమం అన్ని జంతువులకూ పంచేది.

కొంతకాలం పాటు కుకుద్రుమం పరిపాలన అద్భుతంగా సాగింది.

ఒక రాత్రి నక్క భోజనం ముగించి పవ్వళించింది. సింహమూ, పెద్దపులీ, ఏనుగూ, చిరుతపులీ, కోతీ దానికి కావలి కాస్తున్నాయి.

ఉన్నట్టుండి నక్కలమంద ఊళలతో అరణ్యం మారుమోగింది. కుకుద్రుమం తనను తాను మరచిపోయింది. దాని రోమాలు నిక్కబొడుచుకున్నాయి. ఉద్రేకంతో దాని కళ్లలోకి అశ్రువులు దిగాయి. అది ఆనందపారవశ్యంలో పడకమీది నుంచి దూకి, బలంగా ఊళ పెట్టింది.

ఇది చూసి సింహం మొదలైన జంతువులు, ''ఇది మామూలు నక్కే'' అనుకుని అవమానంతో క్షణంపాటు తలలు దించేసుకున్నాయి. కాని అంతలోనే వాటికి ఆగ్రహం వచ్చేసింది. ''ఈ క్షుద్ర జంతువు మన సేవలు పొందుతుందా? దీన్ని చంపాలిసిందే!'' అని అవి అనటం విని, నక్క తప్పించుకు పారిపోబోయింది. కాని, పెద్దపులి దాన్ని పట్టుకుని, చీల్చి చంపేసింది.



CHANDAMAMA (Telugu) AUGUST 1974 Regd. No. M. 4854




మిత్రభేదం



# మిత్రభేదం

## 15

దమనకం చెప్పిన కుకుద్రుమం కథ విని పింగళకం, ''సంజీవకం ద్రోహం తలపెట్టినట్టు నాకు రుజువెలా లభిస్తుంది?'' అని అడిగింది.

''అతను కొమ్ములు ముందుకు చాచి ఏలినవారి వద్దకు వచ్చినట్టయితే పొడవటానికి వస్తున్నట్టు తమరు గ్రహించవచ్చు.'' అన్నది దమనకం.

అది సింహం వద్ద సెలవు పుచ్చుకుని, విచారంతో కుంగిపోతున్నట్టు నటిస్తూ సంజీవకం వద్దకు వెళ్ళింది.

''ఏం, బాబూ? ఎందుకు విచారంగా ఉన్నావు?'' అని సంజీవకం అడిగింది.

''రాజును ఆశ్రయించిన తరవాత విచారం కాక మరేమిటి? ఎల్లప్పుడూ తన ప్రాణం గురించీ, తన మిత్రుల ప్రాణం గురించీ రాజసేవకుడికి భయమే గద! పేదవాడూ, రోగీ, దేశబహిష్కృతుడూ, మూఢుడూ, రాజసేవకుడూ జీవచ్ఛవాలు. వారికి స్వేచ్ఛ లేదు. కుక్కలకైనా ఉన్నది గాని, వారికి లేదు. రాజసేవకుడు యతి లాగా జీవించాలి. ఎందుకు? పాపపంకిలంలో పొర్లటానికి! మిత్రమా, నువ్వింకా ఈ సంగతి గ్రహించినట్టు లేవు.'' అన్నది దమనకం.

''రాజుకు సన్నిహితుడుగా ఉండటం చేత నాకు ప్రాణాపాయం ఉన్నదంటావా?'' అని సంజీవకం అడిగింది.

''అదే నా అభిప్రాయం. మిత్రుడివి గనక, ఏమైనా సరే, ఉన్నమాట అనేస్తాను. మన యజమాని పింగళకం ఎందుకో నీ మీద అలిగాడు. 'సంజీవకాన్ని చంపి, అందరికీ విందుచేస్తాను.' అని ఆయన ఇవాళ నాతో అన్నాడు. ఇది విని

అట్ట చివరి బొమ్మ

నేను కుంగి పోయానని వేరే చెప్పాలా? ఈ క్లిష్టపరిస్థితిని ఎదుర్కొనటానికి నువు సిద్ధంగా ఉండాలి,'' అన్నది దమనకం.

ఈ మాట విని సంజీవకానికి పిడుగు పడినట్టు అనిపించింది.

'' అయ్యో, నాకీ దుర్గతి ఎలా దాపరించింది? రాజును విశ్వాసంతో సేవించినందుకు ఫలితం చావా? శత్రుత్వానికి కారణం తెలిస్తే చక్కబెట్ట గలను. కాని అకారణ వైరాన్ని ఎలా సరిచెయ్యటం? నేను పింగళకానికి ఏం ద్రోహం చేశాను? " అన్నది సంజీవకం.

'' మిత్రమా, రాజుల బుద్ధే అలాటిది. మరీ బలవంతులని తోచిన వారి మీద దెబ్బ తీస్తారు,'' అన్నది దమనకం.

'' నిజమే, నిజమే. తప్పు నాదే. ఆకులూ అలములూ తినే నాబోటివాడు కేవల మాంసాహారి అయిన సింహంతో ఎన్నడూ స్నేహం చేసి ఉండరాదు. వెనకటికి హంస లాగా, సమానులు కాని వారితో స్నేహం చేసిన వాళ్ళు నశించి పోతారు.'' అంటూ సంజీవకం హంస కథ ఇలా చెప్పింది :

### హంస – గుడ్లగూబ కథ

ఒకానొక అరణ్యంలో ఒక సరస్సు ఉండేది. అందులో ఒక హంస ఒంటరిగా ఉంటూ, నీటిలో ఈదుతూ, ఆహారం తింటూ హాయిగా కాలక్షేపం చేసేది.

ఒకనాడు ఆ ప్రాంతానికి ఒక గుడ్ల గూబ వచ్చింది.



"నువ్వు ఎక్కడి దానివి? ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అని హంస గుడ్లగూబను అడిగింది.

దానికి గుడ్లగూబ, "నేను ఇలాటి మరొక సరస్సు పక్కన ఉన్న తామరల తోపులో ఉంటాను. నీ స్నేహం చేసి పాపాలన్నీ పోగొట్టుకుందామని వచ్చాను," అన్నది.

హంస ఈ మాటలకు ఉబ్బిపోయి, "నీ యిష్టం వచ్చినంత కాలం ఉండు," అన్నది. గుడ్లగూబ అలాగే చేసింది.

రెండూ కలిసి చాలా రోజులు సుఖంగా గడిపిన మీదట, గుడ్లగూబ తన చోటికి వెళ్ళిపోతూ, "నీకు నాపై స్నేహభావం ఉంటే, నా చోటికి వచ్చి, నా అతిథిగా ఉండాలి," అన్నది.

హంస ఒక ఉదయం తామరల తోపుకు వెళ్ళింది. కాని, గుడ్లగూబ ఒక కొండ గుహలో నిద్రపోతూ కనిపించింది.

"నీ మిత్రుడైన హంసను, నిన్ను చూడ వచ్చాను," అన్నది హంస.

"నాకు పగలు కళ్ళు కనిపించవు. చీకటి పడినప్పుడు కలుసుకుందాం," అన్నది గుడ్లగూబ.

హంస చీకటిపడే దాకా వేచి ఉన్నది. అప్పుడు గుడ్లగూబ బయటికి వచ్చి, హంసను కుశలం అడిగింది. తరవాత హంస గుహ బయట నిద్రపోయింది.

ఒక బిడారు ఆ రాత్రి సరస్సు పక్కన మజిలీ చేసింది. తెల్లవారుఝామున బిడారు వాళ్ళు ప్రయాణ సన్నాహాలు ప్రారంభించి, శంఖం ఊదారు.

ఆ ధ్వని విని గుడ్లగూబ ఉలిక్కిపడి, గట్టిగా అరిచి, చప్పున గుహలోకి పోయింది. హంస మాత్రం గుహ వెలపలనే ఉండిపోయింది.

ప్రయాణ సమయంలో గుడ్లగూబ అరవటం దుశ్శకునమని బిడారునాయకుడు ధ్వనిని బట్టి గుర్తించి ఆ పాడు గుడ్లగూబను కొట్టమన్నాడు. విలుకాడు అలాగే చేసేసరికి ఆ బాణం హంసకు తగిలి, అది కాస్తా చచ్చింది.



CHANDAMAMA (Telugu) SEPTEMBER 1974 Regd. No. M. 4854



మిత్రభేదం



# మిత్రభేదం

## 16

సంజీవకం దమనకానికి హంస కథ చెప్పి, "నమ్మిన మూఢుడు వెనకటికి ఒంటె లాగా జిత్తులమారి అయిన దుర్మార్గుడి మూలాన మోసపోతాడు," అన్నది.

"ఏమిటా కథ?" అని దమనకం అడిగింది.

సంజీవకం ఇలా చెప్పింది :

### మోసపోయిన ఒంటె కథ

సాగరదత్తుడు అనే గొప్ప వర్తకుడు ఉండేవాడు. అతను ఒకసారి నూరు ఒంటెల మీద మేలురకం వస్త్రాల మూటలు ఎక్కించి, వర్తకం నిమిత్తం తన ఊరి నుంచి బయలుదేరాడు.

ఆ ఒంటెలలో వికటం అనే ఒంటె మీద బరువు ఎక్కువగా పడింది. ఆ బరువు మొయ్యలేక ఆ ఒంటె, కాళ్ళు నీరసమై పోయి, కూలబడి పోయింది. అది కదలలేని స్థితిలో ఉండటం చూసి, వర్తకుడు దాని మీది మూటలను ఇతర ఒంటెల మీద సర్ది, అది భయంకరమైన అరణ్యప్రాంతం కావటం చేత, అక్కడ మజిలీ చెయ్యటం ఇష్టం లేక, ఒంటెను దాని కర్మానికి వదిలి, వెళ్ళిపోయాడు.

వర్తకుడు వెళ్ళిపోయిన చాలా కాలానికి, వికటం అనే ఆ ఒంటె, అటూ ఇటూ కదిలేస్థితికి వచ్చి, అడవి పచ్చిక మేస్తూ, గుంటలలో నీరు తాగుతూ క్రమంగా పుంజుకున్నది.

అదే అరణ్యంలో మదోత్కటం అనే సింహం ఉండేది. దానికి ఒక చిరుత పులీ, ఒక కాకీ, ఒక నక్కా సేవకులుగా ఉండేవి. ఆ సింహం తన భృత్యులను వెంటబెట్టుకుని అరణ్యంలో సంచారం

అట్ట చివరి బొమ్మ

చేస్తూ ఒంటెను చూసి, "ఈ వికారా కారం గల వింత జంతువు ఏమిటి? ఇది అరణ్యంలో ఉండే జంతువో, గ్రామాలలో ఉండేదో తెలుసుకు రండి." అని తన సేవకులతో అన్నది.

ఒంటెలను గురించి అదివరకే ఎరిగిన కాకి సింహంతో, "ఇది పెంపుడుజంతువు. దీన్ని ఒంటె అంటారు. దీని మాంసం చాలా రుచిగా ఉంటుంది," అన్నది.

దానికి సింహం, "నాలో విశ్వాసం ఉంచి నా ఇంటికి వచ్చిన ప్రాణిని ఎన్నడూ చంపను. 'ఇంటికి వచ్చిన అతిథిని చంపితే బ్రహ్మహత్యతో సమానమైన పాపం చుట్టుకుంటుందంటారు. అందు చేత, ఆ ఒంటెకు అభయం ఇచ్చి, దాన్ని నా వద్దకు తీసుకురండి. అది వచ్చిన పని ఏమిటో తెలుసుకుంటాను," అన్నది.

సింహం సేవకులు వెళ్ళి, ఒంటెకు అభయం ఇచ్చి, దాన్ని తీసుకు వచ్చాయి. ఒంటె తన ముందు సాష్టాంగపడినాక, సింహం దాన్ని, "నువు అరణ్యానికి ఎలా వచ్చావు?" అని అడిగింది.

ఒంటె సింహానికి తన కథ అంతా చెప్పింది. అప్పుడు సింహం, "నువు మీ ఊరికి తిరిగి వెళ్ళకు. బరువులు మోయకు. నాతోపాటు అరణ్యంలోనే ఉండి, పచ్చని గడ్డి తిను." అన్నది.



ఒంటె ఆ ప్రకారమే అరణ్యంలో నిశ్చింతగా ఉండిపోయి, సింహానికి నాలుగో భృత్యుడు అయింది.

కొంతకాలం గడిచింది. సింహం ఒక ఏనుగుతో తలపడి పోరాడటంలో, ఏనుగు తన దంతాలతో సింహాన్ని పొడిచి తీవ్రంగా గాయపరిచింది. అందుచేత అది తన గుహ నుంచి కదలలేని స్థితిలో ఉండిపోయింది.

అయిదు రోజులు ఇలా గడిచేసరికి, సింహమూ, దాని ముగ్గురు పరిచారకులూ తిండికి మాడి చచ్చే పరిస్థితి ఏర్పడింది. ఎందుకంటే, సింహం బయటికి వెళ్ళి ఆహారం కోసం వేటాడటం లేదు. పచ్చిక

తిని బతుకుతున్న ఒంటె మాత్రం బాగా కొవ్వి ఉన్నది.

తన అనుచరుల దీనస్థితి గమనించి సింహం, "నేను గాయపడి, జబ్బు చేసి, వేటాడలేను గనక, వెనకటి లాగా మీకు ఆహారం ఇయ్యలేను. మీరే ఎలాగైనా తంటాలు పడి, ఏ జంతువునైనా సంపాదించి తినండి," అన్నది.

"ఏలినవారు ఈ స్థితిలో ఉండగా మా శరీరపోషణ గురించి మేం ఏమి ఆలోచించగలం?" అన్నాయి మిగిలినవి.

"ఆహా, మీకు నా పట్లగల భక్తి విశ్వాసాలు మెచ్చదగినవి. మీరు వెళ్ళి ఏదైనా జంతువును నాకు కానుకగా పట్టుకురండి. అందరమూ తిందాం," అన్నది సింహం.

మిగిలిన జంతువులు దీనికి జవాబు చెప్పలేదు.

"మొహమాట పడకండి. వెళ్ళి, ఏ జంతువునైనా చూడండి. ఈ స్థితిలో కూడా నేను వచ్చి, దాన్ని చంపి, మీకు ఆహారం ఇస్తాను," అన్నది సింహం.


సింహం అనుచరులు నాలుగూ జంతువుల కోసం వెతుకుతూ బయలుదేరాయి. కాని వాటికి ఒక్క జంతువూ కనబడలేదు. నక్కా, కాకీ రహస్యాలోచనకు దిగాయి.

"కాకి మిత్రమా, మనం అర్థం లేకుండా ఎందుకు తిరగాలి? ఈ ఒంటె వికటం కొవ్వి ఉన్నది గదా! దీన్ని చంపి తింటే మనకు చాలా రోజులు సుఖంగా జరిగిపోతుంది గద!" అన్నది నక్క.

దానికి కాకి, "మిత్రమా, ఆ మాట నిజమేగాని, ఈ ఒంటెకు మన యజమాని అభయం ఇచ్చి ఉండగా మనం ఎలా చంపుతాం?" అన్నది.

"అలా అయితే, నేను యజమాని వద్దకు వెళ్ళి, ఒంటెను చంపటానికి అనుమతి సంపాదిస్తాను," అని నక్క కాకితో రహస్యంగా అని, పైకి మిగిలిన వాటితో, "మిత్రులారా, మీరు ఇక్కడే ఉండండి. నేను యజమాని వద్దకు వెళ్ళి కర్తవ్యం తెలుసుకుని వస్తాను," అన్నది.






మిత్రభేదం



# మిత్రభేదం

## 17

నక్క సింహం వద్దకు వెళ్ళి, "మహా ప్రభూ, అరణ్యం అంతా గాలించాం. ఎక్కడా ఒక్క జంతువైనా కనిపించలేదు. మాకు శోష వచ్చేసింది. ఒక్క అడుగు కదలలేం. మీకు కూడా ఆహారం ఎంతైనా అవసరం. మీరు ఒప్పుకుంటే వికటాన్ని చంపి, మంచి మాంసం సంపాదించవచ్చు!" అన్నది.

ఈ మాటలు విని సింహం మండిపడి, "ఛీ, వెధవా! అలాటి పాపిష్ఠి మాట మరొకసారి అన్నావే నిన్ను తక్షణం చంపేస్తాను. నేను వికటానికి అభయం ఇచ్చి ఉన్నాను. అలాటప్పుడు దాన్ని ఎలా చంపగలను? అభయదానం గోదానం కన్నా, భూదానం కన్నా, అన్నదానం కన్నా ఎక్కువైనదని చెబుతారు," అన్నది.

"అభయం ఇచ్చిన మీరే ఒంటెను చంపితే, అది పాపమే అవుతుంది. కాని అదే వచ్చి మీ కాళ్ళ మీద పడి, తనను చంపమని ప్రార్థించినట్టయితే మీరు దాన్ని చంపవచ్చు. ఇందుకు కూడా ఏలివారు ఒప్పుకోక పోతే, మా మిగిలిన ముగ్గురిలో ఎవరినన్నా తినెయ్యండి. ఎందుకంటే మీకు ఆహారం ఎంతైనా అవసరం. మీరే ఆకలితో చావటం జరిగితే, మేమంతా మీ చితి మీద కాలిపోవలసిన వాళ్ళమే గద!" అన్నది నక్క.

"సరే, నీ యిష్టం!" అన్నది సింహం.

నక్క మిగిలిన ముగ్గురి వద్దకూ తిరిగి వచ్చి, "మన రాజుకు ప్రాణం నిలిచేటట్టు లేదు. ఆయన ఆకలికి చావకుండా మనం మన శరీరాలను అర్పించాలి," అన్నది.

అట్ట చివరి బొమ్మ



నాలుగూ కలిసి సింహం వద్దకు వెళ్ళి, నమస్కారం చేసి, కన్నీరు కార్చుతూ ఉండిపోయాయి.

తన వద్దకు తిరిగి వచ్చిన భృత్యులను చూసి ఆ సింహం, "ఆహారంగా జంతు వేదైనా దొరికిందా?" అని అడిగింది.

"మహారాజా, అరణ్యమంతా మరొకసారి గాలించాం. ఎక్కడా ఒక్క జంతువు కనిపించలేదు. అందుచేత, నన్ను అనుగ్రహించి ఆహారంగా తీసుకుని, విలువైన మీ ప్రాణాలు కాపాడుకోండి. అందువల్ల నాకు ఇహమూ, పరమూ కూడా ఉంటాయి," అన్నది కాకి.

ఈ మాట విని నక్క, "నువు అల్ప ప్రాణివి. నిన్ను తిని మన యజమానికి ప్రాణాలు నిలవటం అసంభవం. పైగా నిన్ను తింటే పాపమని శాస్త్రాలు చెబు తున్నాయి. కాకి మాంసమూ, కుక్క మాంసమూ ఆరోగ్యాన్ని పాడుచేస్తాయట. అయితే నీ స్వామిభక్తి చాలా గొప్పది. నీ కీర్తి మూడు లోకాలా వ్యాపిస్తుంది. అందుచేత పక్కకు జరుగు. నేను కూడా ప్రభువుకు విజ్ఞాపన చేసుకోవాలి," అని, సింహంతో తనను తిని ప్రాణాలు నిలుపుకో మని విన్నవించు కున్నది.

నక్క ఇలా అనే సరికి చిరుతపులి, తాను కూడా కుట్రలో చేరినదే కనక, "ఓ నక్కా, ఎంత చక్కగా చెప్పావు! నువు కూడా అల్ప ప్రాణివే. అదీగాక నువు కూడా గోళ్ళున్న జంతువే గనక; సింహం కులానికి చెందిన మృగానివే అవుతావు. నిన్ను సింహం తినరాదు," అన్నది. తరవాత అది సింహంతో, "మహారాజా, మీ ప్రాణాలు నిలుపుకునే టందుకు నన్ను తిని నాకు ఈ లోకంలో శాశ్వతకీర్తీ, పరలోకంలో శాశ్వత సుఖమూ కలిగించండి! అంతకన్న నేను కోరేదేమీ లేదు," అన్నది.

మిగిలిన జంతువులన్నీ ఇలా అనటం విని ఒంటె, "ఈ ముగ్గురూ ఎంతో ఉదా రంగా మాట్లాడారు. కాని సింహం వీటిలో

ఎవరినీ చంపలేదు. అందుచేత నేను కూడా నన్ను తినమని వేడుకుంటాను. ఈ మూడూ నా ప్రాణానికి అడ్డుపడతాయి,'' అనుకున్నది.


ఒంటె ఇలా అనుకుని, ''ఓ చిరుతపులీ! నువు చాలా గొప్పగా మాట్లాడావు. అయితే నువు కూడా మరి గోళ్ళున్న జంతువువేగద. మన యజమాని నిన్ను తినటం ఎలా పొసగుతుంది? నువు పక్కకు తొలగు. నేను కూడా విజ్ఞాపన చేసుకోవాలి,'' అని తాను కూడా సింహం ముందుకు వచ్చి, నమస్కరించి, ''మహాప్రభూ, ఈ ముగ్గురూ తమకు ఆహారంగా పనికిరారు. అందుచేత నన్ను తిని మీ అమూల్యమైన ప్రాణాలు రక్షించుకోండి. యజమాని కోసం ప్రాణాలు అర్పించిన వాళ్ళకు వచ్చే స్వర్గ సుఖం యజ్ఞాల వల్లా, యోగం వల్లా కూడా రాదంటారు,'' అన్నది.

ఒంటె ఇలా అనగానే సింహం సైగ చేసింది. వెంటనే నక్కా, చిరుతపులీ దానిమీద పడి, క్షణంలో చీల్చి చంపేశాయి. ఆ ఒంటెను తిని సింహమూ, దాని ముగ్గురు భృత్యులూ తమ ప్రాణాలు పోకుండా కాపాడుకున్నాయి.

సంజీవకం దమనకానికి ఈ కథ చెప్పి, ''అబ్బీ, ఎవరో కుట్ర వెధవలు నా మీద పింగళకం మనస్సు విరిచారని నా అనుమానం. మంచి మంత్రులు గల చెడ్డరాజు కన్న చెడ్డ మంత్రులు గల మంచి రాజు మరీ అన్యాయం. గద్దలు మంత్రులుగా గల హంస కన్న, హంసలు మంత్రులుగా గల గద్ద మేలు. ఎవరో దుర్మార్గులు నాకూ, పింగళకానికీ మధ్య భేదం కలిగించారు. ఇప్పుడు నేను ఏం చెయ్యాలన్నది సమస్య. పోరాడటం తప్ప చేసేది ఏమీ కనబడదు. మంచి మాటలూ, కానుకలూ, కుట్రలూ ఇక పని చెయ్యవు. సామదానభేదాలు లాభం లేదు గనక యుద్ధం తప్పదు. అందులో ఓడానా, స్వర్గానికి పోతాను. గెలిచానా, హాయిగా జీవిస్తాను,'' అన్నది.



CHANDAMAMA (Telugu) NOVEMBER 1974 Regd. No. M. 4854





# మిత్రభేదం

## 18

ఈ మాట విని దమనకం తనలో, ''వీడికి చాలా బలం ఉన్నది. వాడిగల కొమ్ములు ఉన్నాయి. విధి కలిసి వస్తే, వీడు నా యజమానిని యుద్ధంలో చంపినా చంపవచ్చు. అలా ఎన్నటికీ జరగరాదు. అందుచేత వీడి బుద్ధి యుద్ధం మీది నుంచి మళ్ళేటట్టు చెయ్యాలి,'' అనుకుని, పైకి, ''మిత్రమా, అవతలి వాడి బలం అంచనా వెయ్యకుండా యుద్ధానికి తలపడి లాభం లేదు. నీ వంటి ఎద్దు పింగళకం లాంటి సింహంతో ప్రత్యక్ష పోరాటానికి దిగి గెలవటం ఎలా సాధ్యమవుతుంది? అందుకు శక్తివంతులా, యుక్తిపరులా సహాయం ఉండాలి. వెనకటికి ఉల్లంకి పిట్ట అలాగే కదా సముద్రాన్ని గెలవ గలిగింది?'' అన్నది.

''ఏమిటా కథ?'' అని సంజీవకం దమనకాన్ని అడిగింది.

దమనకం ఇలా చెప్పింది:

సముద్రాన్ని జయించిన ఉల్లంకిపిట్ట

ఒక మహా సముద్రం తీరాన ఉల్లంకి పిట్టల జత ఉండేది. ఆడపిట్ట గర్భిణిగా ఉండి, గుడ్లు పెట్టటానికి మంచి స్థలం చూడమని తన భర్తను అడిగింది.

''మనం ఉంటున్న ఈ సముద్ర తీరానే గుడ్లు పెట్టు. ఇది మనకు అనాదిగా వున్న స్థానం,'' అన్నది మగపిట్ట.

''వద్దు, వద్దు. సముద్రం మరీ దగ్గిరలో ఉన్నది. సముద్రం పొంగినప్పుడు నా గుడ్లు కాస్తా కొట్టుకు పోవచ్చు,'' అన్నది ఆడపిట్ట.

''పిచ్చిదానా, సముద్రం నన్ను అలా అన్యాయం చేయటానికి సాహసించలేదు.

అట్ట చివరి బొమ్మ



దానికి నా సత్తా తెలుసు. ఎన్నో చేపలూ, ఇతర ప్రాణులూ తనలో సుఖంగా జీవిస్తుండగా సముద్రం అలాటి పని తెగించి చెయ్యగలదా ?'' అన్నది మగపిట్ట.

ఆడపిట్టకు తన మొగుడి సామర్థ్యం తెలుసు గనక, '' అలా ప్రగల్భాలు పలికి అపహాస్యంపాలు కాబోకు. నీ కున్న బలమెంతో ఎరగవా ? వాచాలత్వం తోనే గదా తాబేలు నాశనమయింది ? '' అన్నది.

'' ఏమిటా కథ ? '' అని మగ పిట్ట అడిగింది.

ఆడ పిట్ట తాబేలు కథ ఇలా చెప్పింది:

ఒక చెరువులో కంబుగ్రీవం అనే తాబేలు ఉండేది. దానితో సంకటం, వికటం అని రెండు కొంగలు స్నేహంగా ఉండేవి. కొంత కాలానికి నీటి కరువు వచ్చి, చెరువు ఎండి పోసాగింది. అందుచేత కొంగలు మరొక చెరువుకు మారదలచుకుని, ఆ సంగతి తమ మిత్రుడైన తాబేలుతో చెప్పాయి.

''మీ కన్న నేను ఎక్కువగా నీటిలో జీవిస్తాను. నన్ను కూడా ఎలాగైనా ఇక్కడి నుంచి తీసుకుపోయే మార్గం చూడండి,'' అన్నది తాబేలు.

''నువు ఎగరలేవు గద ! మేం ఏం చెయ్యగలం ? ఇలా రాసి పెట్టి ఉన్నది,'' అన్నాయి కొంగలు.

''మిత్రులారా, ఆపదలో నిరాశ పనికి రాదు. ధైర్యం ఉన్న వారికి ఏదో మార్గం దొరుకుతుంది. వివేకవంతులు తమ ఆప్తులను కాపాడాలని మనుధర్మశాస్త్రం చెబుతున్నది,'' అన్నది తాబేలు.

మూడూ చాలాసేపు ఆలోచించిన మీదట తాబేలుకు ఒక ఉపాయం తట్టింది. ఒక కర్రపుల్ల తెచ్చి, దాన్ని కొంగలు రెండు చివరలా ముక్కులతో పట్టుకుని, తాను దాని మధ్య భాగాన్ని నోటితో పట్టుకుంటే, కొంగలు ఎగురుతూ తనను కూడా తీసుకుపోవచ్చు !

ఈ పద్ధతి చాలా ప్రమాదమనీ, దారిలో తాబేలు మాట్లాడటానికి ప్రయత్నిస్తే


ప్రాణం పోతుందనీ కొంగలు అన్నాయి. దారిలో తాను నోరు విప్పనని తాబేలు ప్రమాణం చేసింది. కొంగలు ఒక కర్ర పుల్ల తెచ్చి, దాని మధ్య భాగాన్ని తాబేలును నోటితో పట్టుకోమని, తాము దాని చివరలు ముక్కులతో పట్టుకుని, పడితే ప్రమాదం లేకుండా కొద్ది ఎత్తులోనే ఎగురుతూ పోసాగాయి.

అవి ఒక ఊరు మీదిగా పోతూండగా గ్రామస్థులు కొంగలనూ, తాబేలునూ చూసి హాస్యాలాడసాగారు. తాబేలుకు కోపం వచ్చి, "ఈ మనుషులకు బుద్ధి లేదా?" అనబోయింది. కాని మాట పూర్తి కాకుండానే కింద పడింది. గ్రామస్థులు దాన్ని పట్టుకుని, చంపి తినేశారు.

అడ ఉల్లంకి పిట్ట తాబేలు కథ చెప్పి, ఇంకా ఇలా అన్నది :

"అరణ్యం మధ్య ఒక మడుగులో అనాగతవిధాతా, ప్రత్యుత్పన్నమతీ, యద్భవిష్యతీ అనే మూడు పెద్ద చేపలు స్నేహంగా ఉండేవి. ఒకనాడు కొందరు జాలర్లు ఆ మడుగు పక్కగా పోతూ, 'ఈ మడుగులో చాలా పెద్ద పెద్ద చేపలున్నాయి. రేపు వచ్చి పట్టుకుందాం,' అనుకున్నారు. ఈ మాటలు అనాగతవిధాత విన్నది. అది ఆందోళనపడి తన మిత్రులను పిలిచి, 'మనం మరొక మడుగుకు వలస పోదాం,' అన్నది.

"ప్రత్యుత్పన్నమతి నవ్వి, 'రాబోయే దాన్ని గురించి ముందుగానే దిగులు పడటం దేనికి? నేనిక్కడ చాలా కాలంగా సుఖంగా ఉన్నాను. ఎన్నో అపాయాలను యుక్తిగా తప్పించుకున్నాను. జాలర్లు బహుశా రారు, వచ్చినా నేను ఉపాయంగా తప్పించుకోగలను,' అన్నది. యద్భవిష్యతి కూడా, 'నాకూ వెళ్ళే ఆలోచన లేదు. ఇంకెక్కడా చేపలు లేనట్టు జాలర్లు ఈ మారుమూల మడుగుకు ఎందుకు వస్తారు? ఒకవేళ ఇలా జరగాలని రాసి పెట్టి ఉంటే దాన్ని ఎవరు తప్పించగలరు?' అన్నది. ఇది విని అనాగతవిధాత మరొక మడుగుకు వెళ్ళింది.



HANDAMAMA (Telugu) DECEMBER 1974 Regd. No. M. 4854



మిత్రభేదం



# మిత్రభేదం

## 19

''మర్నాడు జాలర్లు వచ్చి, వలలు వేసి, మడుగులోని చేపలన్నిటినీ పట్టేశారు. ప్రత్యుత్పన్నమతి యుక్తిగా చచ్చినట్టు పడి ఉన్నది. దాన్ని చూసిన జాలర్లు, 'ఈ చేప చచ్చింది. దీన్ని ఒడ్డున ఉంచి, మిగిలిన చేపలన్నీ చచ్చినాక వాటితో పాటు పట్టుకుపోదాం.' అనుకున్నారు. వాళ్ళు తనను ఒడ్డు మీద ఉంచిన మీదట ప్రత్యుత్పన్నమతి చల్లగా తిరిగి నీటిలోకి జారుకున్నది. యద్భవిష్యతి మాత్రం వలలో తన్నుకుంటూ ఉండగా జాలర్లు దాన్ని చంపేసి, మిగతా చిన్న చేపలతో బాటు పట్టుకుపోయారు.''

తన భార్య చెప్పిన చేపల కథ విని మగ ఉల్లంకి పిట్ట, ''నేను యద్భవిష్యతి లాటి వాణ్ణి అనుకున్నావా? నేను ముందు ఆలోచించి, నా యుక్తులన్నీ వేసుకుని మరీ ఏ పనైనా చేస్తాను. నేనుండగా నీకు వచ్చిన భయం ఏమీ లేదు,'' అన్నది.

దాని మాట నమ్మి ఆడపిట్ట సముద్రం ఒడ్డున గుడ్లు పెట్టింది.

ఆడ ఉల్లంకి పిట్ట సముద్ర తీరాన గుడ్లు పెట్టక పూర్వం పక్షి దంపతుల మధ్య నడిచిన సంభాషణ అంతా సముద్రం విన్నది; విని, ''ఈ మగపిట్టకు ఇంత పొగరా? దీనికి గట్టిగా బుద్ధి చెప్పాలి,'' అనుకున్నది.

మర్నాడు ఉల్లంకి దంపతులు రెండూ ఆహారం కోసం వెళ్ళినప్పుడు, సముద్రం పెద్ద కెరటాన్ని పంపి, గుడ్లను లాగేసుకున్నది. పిట్టలు తిరిగి వచ్చేసరికి గుడ్లులేవు.

ఆడ పిట్ట మగ పిట్టతో, ''మన గుడ్లు ఏమయాయో చూడు. నువు యద్భవిష్యతి

అట్ట చివరి బొమ్మ

లాగే కోరి కీడు తెచ్చావు. పిల్లలను పోగొట్టుకుని జీవించలేను; మంటలలో పడి ఆత్మహత్య చేసుకుంటాను,'' అన్నది.

''నువు తొందరపడి అఘాయిత్యం చెయ్యకు. ఈ సముద్రాన్ని ఎండ గట్టి, నా తడాఖా చూపుతాను," అన్నది మగ ఉల్లంకి పిట్ట.

''రెక్కల పురుగు జ్వాలతో పోరాడినట్టే ఉంటుంది నువు సముద్రంతో పోరాడటం,'' అన్నది ఆడపిట్ట.

"అలా అనకు. నా ముక్కుతో సముద్రంలోని నీరంతా లాగేసి ఇసుక పఱ్ఱ మిగిలేటట్టు చేస్తాను,'' అన్నది మగపిట్ట.



''నీ ముక్కులో ఒక్క నీటి చుక్కకన్న పట్టదుగదా! గంగా సింధుల లాటి అరువేల నదులూ, డెబ్భైఅయిదువేల ఉపనదులూ వచ్చి అనుక్షణమూ కలిసే సముద్రాన్ని ఎలా ఎండగట్టుతావు?'' అన్నది ఆడపిట్ట.

''ఎందుకీ నిరుత్సాహపు మాటలు? దీక్షతోనూ, మనో నిబ్బరంతోనూ పూనిక చేస్తే సాధించలేనిదంటూ ఉంటుందా?'' అని మగపిట్ట అడిగింది.

''కనీసం మిగిలిన పక్షులన్నిటి సహకారమూ సంపాదించు. ఒక్కరివల్ల కాని పని పది మందివల్ల అవుతుంది. ఒక్కడు ఎన్నడూ ఏనుగును బంధించలేదు; కాని నూరు పేటల తాళ్ళతో పేనిన మోకు ఏనుగును సులభంగా నిగ్రహిస్తుంది. వడ్రంగి పిట్టా, పిచ్చుకా, కప్పా, మేకా ఏకమై ఏనుగును మట్టుబెట్టాయి కావా?" అన్నది ఆడపిట్ట.

''ఏమిటా కథ?'' అని మగపిట్ట అడిగింది. ఆడపిట్ట ఇలా చెప్పింది:

### పిచ్చుకా — ఏనుగూ

ఒక అరణ్యంలో ఒక పెద్ద చెట్టు కొమ్మమీద గూడు కట్టుకుని ఒక పిచ్చుకల జంట నివసిస్తూ ఉండేది. ఆడపిచ్చుక అప్పుడే గుడ్లు పెట్టింది. ఆ మర్నాడు ఒక ఏనుగు అటుగా పోతూ, మధ్యాన్నపు ఎండకు తట్టుకోలేక, ఆ చెట్టు నీడన

నిలిచి, ఆకతాయితనం కొద్దీ చెట్టు కొమ్మ విరిచింది. ఆ కొమ్మ మీదనే పిచ్చుకల గూడు ఉన్నది. ఆ గూట్లో ఉన్న గుడ్లన్నీ కిందపడి పగిలిపోయాయి. అదృష్టవశాన పిచ్చుకల జంటకు చావు తప్పింది.

గుడ్లు నాశనమయినందుకు ఆడ పిచ్చుక మహా శోకించింది. దాని శోకాలు విని, పొరుగున ఉంటున్న దాని స్నేహితురాలు వడ్రంగిపిట్ట వచ్చి, శోక కారణం తెలుసుకుని, "పిచ్చిదానా, ఏడ్చి లాభమేమిటి? గతించిన దానికి బుద్ధిమంతులు శోకించరు. చచ్చిపోయిన వాళ్ళ కోసం ఏడవటం రెట్టింపు బాధ. చేతనైనమటుకు వారి చావుకు ప్రతీకారం చెయ్యాలి," అన్నది.


దానికి ఆడపిచ్చుక, "అదంతా నిజమే. కాని ఈ దుర్మార్గపు ఏనుగు కేవలమూ పొగరుబోతుతనంతో నా బిడ్డల ప్రాణాలు తీసింది. నీవు నిజమైన స్నేహితురాలివైతే, ఈ రాకాసి ఏనుగును చంపే ఉపాయం ఆలోచించు," అన్నది.


"మనకు ఆపత్సమయంలో ఆదుకున్నవాడే మిత్రుడు. కలిగిన వేళ అందరూ మిత్రులే. కలిసి రాని కాలంలో అండగా నిలిచినవాడే హితుడు; తిండి పెట్టినవాడే తండ్రి; నమ్మినవాడే మిత్రుడు; సుఖ పెట్టినదే భార్య. నా స్నేహం ఎలాటిదో త్వరలో చూపుతాను. వీణారవం అనే నా తుమ్మెద స్నేహితురాలిని తెస్తాను. ఏనుగును చంపే మార్గం అది చెబుతుంది," అన్నది వడ్రంగిపిట్ట.

ఆడపిచ్చుకను వెంట బెట్టుకుని వడ్రంగిపిట్ట తుమ్మెద వద్దకు వెళ్ళి, జరిగిన అన్యాయం చెప్పి, "ఏనుగును చంపేఉపాయం నువు చెప్పాలి," అన్నది.

"అయ్యో, పాపం! ఈమెకు ఇంత కష్టం కలిగిందా? మేఘదూత అనే కప్ప నాకు మంచి స్నేహితుడు. అతనితో కూడా సంప్రదించుదాం. శ్రేయోభిలాషులనూ, సజ్జనులనూ, రాజనీతి తెలిసిన వాళ్లనూ, విజ్ఞానులనూ సంప్రదించి చేసే పనులు ఫలిస్తాయంటారు," అన్నది తుమ్మెద.




VAPA



# మిత్రభేదం

## 20

పిచ్చుకా, వడ్రంగిపిట్టా, తుమ్మెదా కలిసి కప్పను చూడ బోయాయి. కప్ప అంతా విని, "మన లాటి గొప్ప వాళ్ళు పూనుకుంటే ఈ ఏనుగు లాటి పరమమూఢుణ్ణి కడతేర్చట మెంత పని? మిత్రమా, తుమ్మెదా, నువు ఝుంకారం చేస్తూ వెళ్ళి, ఏనుగు కళ్ళముందు ఎగురుతూ, కుట్టటానికి ప్రయత్నాలు చెయ్యి. ఏనుగు భయపడి కళ్ళు మూసుకుంటుంది. అప్పుడు వడ్రంగిపిట్ట దాని కన్ను ఒకటి పొడిచేస్తుంది. ఏనుగు కంగారుపడి రెండో కన్ను కూడా మూసుకుని పరిగెత్త నారంభిస్తుంది. అప్పుడు వడ్రంగిపిట్ట దాని వెంటపడి రెండో కన్ను కూడా పొడిచేస్తుంది. ఏనుగు నీటిమడుగులో చేరదామని వెర్రిగా అటూ ఇటూ పరిగెత్తుతుంది. అప్పుడు నేను ఒక అగాధం అంచున కూర్చుని బెకబెకలాడతాను. నేను అరిచే దిక్కుగా నీటిమడుగు ఉన్నదనుకుని, ఏనుగు పరిగెత్తుకుంటూ వచ్చి, అగాధంలోపడి చచ్చి ఊరుకుంటుంది. ఆ విధంగా దాని పీడ విరగడై పోతుంది," అన్నది.

కప్ప చెప్పినట్టే చేసి, తుమ్మెదా, వడ్రంగిపిట్టా కలిసి, ఏనుగును అగాధంలో పడేసి చంపేశాయి.

తన భార్య చెప్పిన, "పిచ్చుకా — ఏనుగూ" కథ విని ఉల్లంకిపిట్ట, "సరే, నేను ఈ రోజునే నా మిత్రులనందరినీ సమావేశ పరుస్తాను. తరవాత అందరమూ కలిసి సముద్రాన్ని ఎండగట్టేస్తాం," అన్నది.

అది పక్షులన్నిటినీ పిలిచి, సముద్రం తమ గుడ్లకు చేసిన అన్యాయం గురించి

అట్ట చివరి బొమ్మ

చెప్పింది. పక్షులన్నీ తమ ముక్కులలోకి సముద్రజలాన్ని తీసుకుని, సముద్రంలో నీరు లేకుండా చెయ్యటానికి ప్రయత్నించాయి. కాని అందువల్ల ఫలితం ఏమీ లేకపోగా, అవి సముద్రాన్ని తమ రెక్కలతో కొట్టాయి. అందువల్ల కూడా ఫలితం లేకపోయేసరికి, అవి మట్టి బెడ్డలను తెచ్చి వేసి, సముద్రాన్ని పూడ్చయత్నించాయి.

అప్పటికీ ఫలితం లేకపోవటం చూసి, ఒక వివేకం గల పక్షి, 'చూడండి! మనంతట మనం సముద్రాన్ని కాళ్ళ బేరానికి తీసుకురాలేం. మర్రిచెట్టు కింద ఒక ముసలిబాతు ఉన్నది. అది మనకు తగిన సలహా ఇస్తుంది. అది ఒకప్పుడు తన సలహాతో ఒక బాతులమందను బోయవాడి ఉచ్చుల నుంచి విడిపించింది. అందుచేత మనం దాని సలహా అడుగుదాం,'' అన్నది.

''ఏమిటా కథ?'' అని ఇతర పక్షులు అడిగాయి. వివేకం గల పక్షి ఇలా చెప్పింది:

ముసలిబాతు కథ

ఒక అరణ్యంలో ఒక మహావృక్షం ఉండేది. దానికి లెక్కలేనన్ని శాఖలు ఉండేవి. ఆ చెట్టు మొదట్లో ఒక లత మొలిచి పెరగనారంభించింది.

ఒక ముసలిబాతు అడబాతులతో, ''ఈ లత చెట్టు పైకి ఎగబాకితే, దాని సహాయంతో శత్రువులు చెట్టు పైకి ఎక్క



గలుగుతారు. అందుచేత మనం ఇప్పుడే ఈ లతను తుంచేద్దాం,'' అన్నది.

ఆడబాతులు నవ్వి, ''ఈ లత మనని ఏం చెయ్యగలదు?'' అన్నాయి.

లత చెట్టు పైకి ఎగబాకింది. ఒకనాడు ఒక బోయవాడు ఆ లత సహాయంతో చెట్టు మీదికి ఎక్కి, బాతులన్నీ ఆహారం కోసం వెళ్ళి ఉన్న సమయంలో ఉచ్చులు పన్నాడు. తిరిగి వస్తూనే బాతులన్నీ ఉచ్చులలో చిక్కుకు పోయాయి. అవి తప్పించుకునేటందుకు చేసిన ప్రయత్నాలు వ్యర్థమయాయి.

''నా మాట వినక ఈ దుస్థితి తెచ్చుకున్నారు,'' అన్నది ముసలిబాతు.

''అది నిజమే. ఇప్పుడు ఈ ఆపద తప్పే ఉపాయం చెప్పు,'' అన్నాయి మిగిలిన బాతులు.

''ఇప్పుడు మనమంతా కదలకుండా పడిపోయి, చచ్చినట్టు నటింతాం. తరవాత బోయవాడు వచ్చి, మనమంతా చచ్చామనుకుని, ఒకొక్కరినే ఉచ్చు నుంచి తీసి కింద పడేస్తాడు. చిట్టచివరి పక్షి కింద పడినదాకా కదలకుండా ఉండి తరవాత అందరమూ ఒక్క పెట్టున ఎగిరి పోదాం,'' అన్నది ముసలిబాతు.


మర్నాడు ఉదయం బోయవాడు వచ్చి, పక్షులన్నీ చచ్చాయనుకుని, ఉచ్చులు విప్పి, నిశ్చింతగా ఒక్కొక్క బాతునే కింద పడెయ్యసాగాడు. అన్నిటినీ పడేసి వాడు చెట్టు దిగి రాబోతూండగా, అన్ని బాతులూ ఒక్కసారిగా లేచి ఎగిరి పోవటం చూసి వాడికి అమిత ఆశ్చర్యం కలిగింది.

ఈ కథ విన్న మీదట పక్షులన్నీ వెళ్ళి, ముసలిబాతును కలుసుకుని, సముద్రం పొంగి ఉల్లంకిపిట్ట పెట్టిన గుడ్లను కాజేసిన విషయమంతా చెప్పాయి.

''మనమంతా కలిసి, మనకు రాజూ, మహావిష్ణువుకు వాహనమూ అయిన గరుత్మంతుడి దర్శనం చేసుకుందాం. అతను జాలిగుండె గలవాడు,'' అన్నది ముసలిబాతు.



CHANDAMAMA (Telugu) FEBRUARY 1975 R d. No. M. 48




మిత్రభేదం



# మిత్రభేదం

## 21

పక్షులన్నీ పాలోమని గరుత్మంతుడి వద్దకు వెళ్ళి, లబోమని ఏడుస్తూ, ఉల్లంకిపిట్ట పెట్టిన గుడ్లను సముద్రం అన్యాయంగా హరించిన మాటచెప్పి, న్యాయం కలిగించవలసిందిగా వేడుకున్నాయి.

"ఉల్లంకిపిట్ట గుడ్లను విడిచిపెట్టి ఎందుకు వెళ్ళిపోవలిసి వచ్చింది?" అని గరుడుడు అడిగాడు.

"మహాప్రభూ, మేం మా పొట్టలు నింపుకునేటందుకు ఎక్కడికెక్కడికో పోవాలి. ఉల్లంకి పిట్టలు తిండి కోసం వెళ్ళి ఉన్న సమయంలో సముద్రం ఈ దురాగతం చేసింది. ఈ ప్రపంచంలో అన్ని మోసాలకూ, కష్టాలకూ తిండే కారణమని సింహమూ, పొటేలూ కథను బట్టి తెలుస్తూనే ఉన్నది గద?" అన్నది ఆడబాతు.

"ఏమిటా కథ?" అని గరుత్మంతుడు అడిగాడు.

ముసలిబాతు ఆ కథను ఇలా చెప్పింది:

### సింహమూ, పొటేలూ కథ

ఒక అరణ్యంలో ఒక పొటేలు మందకు దూరమై, ఒంటరిగా జీవిస్తూ ఉండేది. దట్టంగా పెరిగిన దాని రోమాలూ, భయంకరమైన కొమ్ములూ, దాని అరుపూ చూసి, అది అడవిలో స్వేచ్ఛగా తిరిగేటప్పుడు ఇతర మృగాలు హడలిపోతూ ఉండేవి.

ఒకనాడు ఒక సింహం అనుకోకుండా దాన్ని చూడటం తటస్థించే సరికి, దాని పెద్ద శరీరమూ, రోమాలూ, కొమ్ములూ చూసి బెదిరి, "అమ్మో, ఇది నిశ్శంకగా అరణ్యంలో సంచరిస్తున్నదంటే, నా కన్న ఎన్నోరెట్లు బలం కలదై ఉండాలి," అనుకున్నది.

అట్ట చివరి బొమ్మ

అయితే, ఒకనాడు ఆకలి తీర్చుకోవటానికి ఆ పొటేలు గడ్డి మేస్తూ సింహం కంటపడింది.

"ఓస్, ఇది గడ్డితినే జంతువేనా! ఇది నా అంత బలం గలది కావటానికి వీల్లేదు. ఇది నాకు ఆహారం కాదగినది," అనుకుని, సింహం ఆ పొటేలును చంపి తినేసింది.

ముసలి బాతు ఈ కథ పూర్తి చేస్తూండగా, విష్ణువు వద్ద నుంచి గరుత్మంతుడికి త్వరగా రమ్మని పిలుపు వచ్చింది. విష్ణువు గరుత్మంతుడి మీద ఎక్కి ఎక్కడికో వెళ్ళాలట.

గరుత్మంతుడు విష్ణువు దగ్గిరికి వెళ్ళి, "స్వామీ, ఇప్పుడు ఎలా రాను? నా జాతికి చెందిన ఈ ఉల్లంకిపిట్ట గుడ్లు సముద్రం అపహరించింది గదా, వాటిని నేను ఉల్లంకి పిట్టకు తిరిగి ఇప్పించటం నా ధర్మం కదా! సముద్రం ఇలాటి దుర్మార్గాలు చేస్తూ ఉంటే, నేను ఏలినవారికి వాహనాన్ని అన్న ఘనత ఏమున్నదీ?" అన్నాడు.

వెంటనే విష్ణువు తన వింటికి బాణం సంధించి, సముద్రంతో, "ఉల్లంకి పిట్ట గుడ్లను తక్షణం ఇచ్చెయ్యి, లేకపోతే ఈ బాణంతో నిన్ను ఎండగట్టి, ఇసుక పర్రగా చేసేస్తాను," అన్నాడు.



ఈ మాటకు సముద్రం భయంతో కంపించిపోతూ, గుడ్లను తెచ్చి ఉల్లంకి పిట్టల జంటకు సమర్పించుకున్నది.

దమనకం సంజీవకానికి ఈ కథ చెప్పి, "నీకు అలాటి మిత్రులెవరున్నారు? అందుచేత నువు సింహంతో తలపడే ఆలోచన మాను," అన్నది.

"మిత్రమా, పింగళకం నన్ను చంపదలచినదీ, లేనిదీ నాకు ఎలా తెలుస్తుంది?" అని సంజీవకం దమనకాన్ని అడిగింది.

"అది తేలికగానే తెలుసుకోవచ్చు. సింహం తన సింహాసనమైన రాతి మీద కూర్చుని, నువు దగ్గిరికి వెళ్ళినప్పుడు,

నవ్వుతూ, ప్రశాంతంగా ఉంటే నీకు ప్రమాదం లేదన్న మాట. కాని, తోక మెలిదిప్పుతూ, పంజాలు బిగబట్టి నువు దూరాన కనిపించగానే నీ కేసి తీక్షణంగా చూస్తూంటే, నిన్ను చంపబోతున్నట్టు ఖాయం చేసుకోవచ్చు,'' అన్నది దమనకం.

తరవాత దమనకం వెళ్ళి కరటకాన్ని కలుసుకున్నది.

''ఏం చేసుకు వచ్చావు?'' అని కరటకం అడిగింది.

''ఇద్దరిమధ్యా చిచ్చుపెట్టి వచ్చాను,'' అన్నది దమనకం.

''నిజంగానా?'' అన్నది కరటకం.

''నా ప్రయత్నాలు ఎలా ఫలించేదీ నువు త్వరలోనే చూస్తావు. ఎద్దుకూ, సింహానికీ మధ్య ఉండే స్నేహబంధాన్ని తెంచి పారేశాను,'' అన్నది దమనకం.

''అందులో ఆశ్చర్యమేమున్నదీ? అదే పనిగా నీరు ప్రవహిస్తూంటే రాళ్ళు కూడా అరిగి పోతాయి. నువు విడవకుండా కుత్ర చేస్తే వాళ్ళస్నేహం చెడిపోవచ్చు. కాని ఇంత పెద్ద పన్నాగం పన్ని, ఇందువల్ల నీ కేం ఒరుగుతుందనుకుంటున్నావు?'' అని కరటకం అడిగింది.

''అదేం ప్రశ్న! నేను ప్రధాన మంత్రినై, ఎంతో లాభం పొందబోతున్నాను. గ్రంథాలు పడచదివి కూడా, ఆ చదువువల్ల డబ్బూ, అధికారమూ సంపాదించుకో లేనివాడి చదువు వ్యర్థమని పెద్దలు చెబుతారు,'' అన్నది దమనకం.

''కాని, స్వార్థం కూడా హీనమైనదే గద! ఈ తుచ్ఛమైన శరీరం కోసం ఏది బడితే అది చెయ్యరాదు. అదీగాక, నీ మోసం బయటపడి, వంచకుడి కథలో లాగ, నీ ప్రాణానికే అపాయం కలగవచ్చు,'' అన్నది కరటకం.

''ఏమిటా కథ?'' అని దమనకం అడిగింది.

కరటకం వంచకుడి కథ ఇలా చెప్పనారంభించింది:




Vapa



# మిత్రభేదం

## 22

### వంచకుడి కథ

కోసలదేశానికి రాజధాని అయిన అయోధ్యానగరంలో సురథుడు అనే మేటి రాజు ఉండేవాడు. ఆయన కింద వందల కొద్దీ సామంత రాజ్యాలు ఉండేవి.

ఒకసారి అటవీశాఖా పాలకుడు అతి వేగంగా రాజధానికి చేరుకుని, రాజుతో ఇలా అన్నాడు:

"మహారాజా, వింధ్యకుడు అనే విద్రోహి నాయకత్వాన ఆటవికజాతులన్నీ తిరుగుబాటు చేశాయి. వాళ్ళ తిరుగుబాటును అణచటం నా వల్ల కాలేదు గనక తమరే ఆ పనికి పూనుకోవాలి."

అప్పుడు రాజు, తిరుగుబాటును అణచివేసి, తిరుగుబాటు దార్లను శిక్షించటానికి తన మంత్రిని, బలభద్రుడనే ప్రజ్ఞాశాలిని, పంపాడు.

బలభద్రుడు బయలుదేరి వెళ్ళిపోయిన అనంతరం, గ్రీష్మకాలం చివరలో అయోధ్యకు ఒక దిగంబర సన్యాసి వచ్చాడు. అతను అడిగిన వారందరికీ భవిష్యత్తు చెప్పి, జాతకాలు వేసి, గుప్తంగా ఉంచిన పేర్లు తెలుసుకుని కొద్ది రోజులలో నగరవాసులందరి మన్ననలూ పొందాడు.

ఈ సన్యాసిని గురించి చాలా విని, రాజు కుతూహలం కొద్దీ అతన్ని రాజభవనానికి ఆహ్వానించి, "అయ్యా, మీరు మనసులో మాట చెప్పగలరట. నిజమేనా?" అని అడిగాడు.

"నేను ఎన్నిచోట్ల ఏమేమి చేశానో వాకబు చేస్తే మీకే తెలుస్తుంది," అంటూ సన్యాసి, తాను చేసిన ఘనకార్యాలన్నీ చెప్పి, రాజుకు విస్మయం కలిగించాడు.

రాజు ఆ సన్యాసికి దేవిడీ ఆవరణలోనే ఒక మఠం ఉండటానికి ఇచ్చి, అతన్ని రోజూ పిలిపించుకుంటూ ఉండేవాడు.

ఒకరోజు సాయంకాలం సన్యాసి రాజభవనానికి వచ్చి, "రాజా, నీ కొక శుభవార్త చెబుతాను. దేవతలందరూ నన్ను మరీ మరీ బలవంత పెట్టగా, నేను ఇవాళ ఉదయం నా భౌతికదేహాన్ని మఠంలో విడిచిపెట్టి, సూక్ష్మశరీరంతో స్వర్గానికి వెళ్ళాను. దేవతలు మీ క్షేమసమాచారాలు అడగమని నాతో అన్నారు," అన్నాడు.

ఈ మాట విని రాజుకు అంతులేని ఆశ్చర్యం కలిగి, "మహాత్మా, మీరు స్వర్గానికి ఎలా వెళ్ళారు?" అన్నాడు.

"మహారాజా, అది నాకు ఖేలా మాత్రం కాదా? నేను రోజూ స్వర్గానికి వెళుతూనే ఉంటాను," అన్నాడు సన్యాసి.

రాజు అమాయకత్వం కొద్దీ అయితేనేం, సన్యాసికి గల అనేక శక్తులను ప్రత్యక్షంగా చూసి ఉండటం చేత అయితేనేం, సన్యాసి చేసిన ఘనకార్యాలను గురించి విని ఉండటం చేతనైతేనేం, ఈ మాటలు నమ్మాడు. ఆయన రాచకార్యాలు మానుకుని, తన రాణి గురించి కూడా లక్ష్యం లేకుండాపోయి, అస్తమానమూ ఆ సన్యాసిని పెట్టుకుని. స్వర్గలోక వార్తలు వివరంగా అడిగి తెలుసుకోసాగాడు.



ఇంతలో, ఆటవిక జాతుల తిరుగుబాటును అణచి, బలభద్రుడు అయోధ్యకు తిరిగి వచ్చాడు. అతను రాజధానిలో అడుగుపెడుతూనే, రాజుగారు సన్యాసి వాడి చేతి కీలుబొమ్మ అయిపోయాడనీ, దర్బారు చెయ్యటం లేదనీ, మంత్రులను కలుసుకోవటం లేదనీ విన్నాడు. అతను రాజభవనం ప్రవేశించి దర్బారు నిర్జనంగా ఉండటమూ, మంత్రులుండే చోట ఎవరూ లేకపోవటమూ చూశాడు. ఒక గదిలో రాజూ, సన్యాసీ ఏకాంతంగా కూర్చుని అతనికి కనిపించారు. సన్యాసి రాజుకు ఏదో రహస్యంగా చెబుతున్నాడు; రాజు వికసించిన ముఖంతో సన్యాసి

మాటలను (గోలుతున్నాడు. ఆయన బల భద్రుడి రాకను గమనించలేదు.

తొలి చూపులోనే మంత్రికి పరిస్థితి అర్థమైపోయింది. అతను మహారాజు ముందు సాష్టాంగపడి, "మహారాజా, జయం! జయం!" అన్నాడు.

అతను వెళ్ళిన పని ఏమయినది కూడా అడగకుండానే రాజు, "మీకు ఈ మహాత్ముడు తెలుసునా?" అని సన్యాసిని చూపుతూ అన్నాడు.

"ఎందరో మహాపురుషులుగా తమ శిష్యులను తయారు చేసిన ఈ మహ నీయుణ్ణి గురించి తెలియకేం? వీరు తరుచుగా స్వర్గానికి కూడా పోయి వస్తూం టారని విన్నాను. నిజమేనా?" అన్నాడు బలభద్రుడు.

"అందుకు సందేహమా?" అన్నాడు రాజు. తనను గురించి మంత్రి ఇంత గొప్పగా చెప్పినందుకు ఉప్పొంగిపోయి సన్యాసి, మంత్రికి మరింతగా తనపై గురి ఏర్పడేటట్టు చెయ్యాలని, "కుతూ హలం ఉన్నట్టయితే మంత్రిగారు ఆ సంగతి స్వయంగా చూడవచ్చు." అంటూ తన మఠంలోకి పోయి, తలుపు గడియ పెట్టుకున్నాడు. కొన్ని నిమిషాలు గడిచినాక మంత్రి రాజుతో, "వారు స్వర్గం నుంచి ఎప్పుడు తిరిగి వస్తారు?" అన్నాడు.

"అంత తొందర దేనికి? వారు భౌతిక దేహాన్ని మఠంలో వదిలి, సూక్ష్మదేహంతో స్వర్గానికి వేంచేశారు," అన్నాడు రాజు.

"అదే నిజమైతే, కట్టెలూ, నిప్పూ తెప్పించండి. నేను మఠాన్ని తగలబెట్టే స్తాను," అన్నాడు మంత్రి.

"దేనికి?" అన్నాడు రాజు ఆశ్చర్యంతో.

"దేనికని అడుగుతున్నారా, మహా రాజా? ఈ కట్టెలాటి శరీరం కాలిపోయిన మీదట, వారు సూక్ష్మ శరీరంతోటే తమ వద్దకు వస్తూ ఉంటారు. అందువల్ల ప్రపంచమంతటా తమ కీర్తి వ్యాపిస్తుంది. ఈ సందర్భంలో మీకు నాగకుమారుడి కథ చెబుతాను," అంటూ మంత్రి ఇలా చెప్పనారంభించాడు.



CHANDAMAMA (Telugu) APRIL 1975 Regd. No. M. 4854





# మిత్రభేదం

## 23

నాగకుమారుడి కథ

రాజగృహం అనే నగరంలో దేవశర్మ అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. బిడ్డలు లేరని ఆయన భార్య, ఇతరుల పిల్లలను చూసి నప్పుడల్లా, గుండెలు పగిలేటట్టు ఏడ్చేది. బ్రాహ్మణుడికి భార్య అంటే చాలా ప్రేమ. ఒకనాడు ఆయన ఆమెతో, "ప్రేయసీ, నువ్వింక ఏడవటం మాను. నేను పుత్ర కామేష్టి చేస్తాను. అప్పుడు ఎవరో దేవుడు ప్రత్యక్షమై, శ్రవణానందంగా, 'ఓయీ, బ్రాహ్మణా! సౌందర్యంలో అందరినీ మించగలవాడూ, దీర్ఘాయువూ, ఎడతెగని అదృష్టం గలవాడూ అయిన కొడుకు నీకు కలుగుతాడు!' అంటాడు," అన్నాడు.

ఈ మాట విని బ్రాహ్మణుడి భార్య పరమానంద భరితురాలై, "తథాస్తు!" అన్నది.

బ్రాహ్మణుడు యథావిధిగా పుత్ర కామేష్టి చేశాడు. ఆయన భార్య గర్భవతి అయింది. ఆమె ప్రసవించి, కొడుకును కనటానికి మారుగా ఒక పామునుకన్నది. ఆ పామును చూడగానే, పురుడు పోసిన అమ్మలక్కలు, "ఛీ, ఛీ! అవతల పారెయ్యండి," అన్నారు.

కాని ఆ ఇల్లాలు కడుపు తీపి కొద్దీ అంతపని చెయ్యక, ఆ పామును ఆప్యాయంగా దగ్గిరికి తీసుకుని, శ్రద్ధగా నీళ్లు పోసి, ఒక శుద్ధమైన కొత్త కుండలో ఉంచి రోజూ దానికి పాలూ, వెన్నా పెట్టుతూ వచ్చింది. పుష్టికరమైన ఈ ఆహారంతో పాము విపరీతంగా పెరిగింది.

కొద్ది సంవత్సరాలు గడిచాక, పొరుగింటివారి అబ్బాయికి పెళ్ళి జరిగింది. ఇది చూసి బ్రాహ్మణుడితో ఆయన

అట్ట చివరి బొమ్మ

భార్య, "మీకు నా చింత ఏమీ లేనేలేదు; మనవాడి పెళ్ళిమాటైనా ఆలోచించారు కారు," అని కళ్ళు ఒత్తుకున్నది.

దానికి బ్రాహ్మణుడు, "ప్రేయసీ, పాముకు ఎవరు పిల్లనిస్తారు? పాతాళానికి పోయి, నాగకన్యను ఇయ్యమని వాసుకుని ప్రార్థించాలిసిందే గాని!" అన్నాడు.

ఈ మాటకు భార్య హృదయ విదారకంగా ఏడ్చేసరికి, ఆ బ్రాహ్మణుడు భార్య పట్లగల ప్రేమ కొద్దీ, తమ నాగకుమారుడికి వధువును వెతుకుతూ ప్రయాణమయాడు.



చాలా నెలల అనంతరం ఆయన చాలా దూరాన ఉన్న కుట్కుటం అనే నగరం చేరుకుని, అక్కడ ఉండే తన మిత్రుడూ, బంధువూ అయిన ఒక సంపన్నుడి ఇంటికి వెళ్ళాడు. ఆయన స్నానం చేసి, భోజనం చేసి, ఆ రాత్రి, అక్కడే నిద్రపోయాడు. మర్నాడు ఉదయం ఆయన తిరిగి ప్రయాణమవుతూండగా, ఆయన మిత్రుడు, "ఇక్కడికి ఏం పని మీద వచ్చావు? ఎక్కడికి బయలుదేరుతున్నావు?" అని అడిగాడు.

"నా కొడుక్కు వధువు కోసం చూస్తూ వచ్చాను," అన్నాడు బ్రాహ్మణుడు.

"అలా అయితే నా అందాల కూతుర్ని చేసుకో. నువూ, నేనూ, ఒకే స్థితి గల వాళ్లం. ఒకే కులం వాళ్లం. ఎరిగిన వాళ్ళం," అన్నాడు మిత్రుడు.

బ్రాహ్మణుడు ఇందుకు సంతోషంగా ఒప్పుకుని, వధువునూ, ఆమె తాలూకు దాసదాసీలనూ వెంట తీసుకుని, రాజగృహానికి తిరిగి వచ్చాడు.

పెళ్ళికూతురి అసాధారణ అందచందాలు చూసి, ఆమెను పాముకిచ్చి పెళ్ళి చేస్తున్నారని విని జనం తండోపతండాలుగా పోగయారు. ఆ పిల్లను చూడగానే వాళ్లకు జాలి కలిగింది. వాళ్లు ఆమె పరివారంతో, "ధర్మం ప్రకారం నడుచుకునే సజ్జనులమని చెప్పుకునే వాళ్ళు ఎక్కడన్నా రత్నంలాంటి

ఈ పిల్లను వెధవ పాముకు ఇచ్చి పెళ్ళి చెయ్యటం కద్దా?'' అన్నారు.

దాసదాసీలు ఈ దారుణ వార్తను వెంటనే వధువుకు చెప్పారు.

చుట్టూ మూగిన జనం ఆ పిల్లను గురించి బాధపడ్డారు. వారిలో పెద్దలు, ''ఈ పిల్లను బలాత్కారంగా విడిపించి, తన ఇంట కూడా స్వేచ్ఛగా తిరగలేని ఆ దిక్కుమాలిన పాముకు భార్య కాకుండా చూడండి,'' అని అరిచారు.

అంతా విని ఆ పిల్ల, ''ఇంక చాలించండి! రాజులు తాము జారీ చేసిన అజ్ఞలను ఉపసంహరించుకోరనీ, మంచి వాళ్లు తాము చేసిన వాగ్దానాలను వెనక్కు తీసుకోరనీ, కన్యను దానం చెయ్యటమనేది ఒక్కసారే జరుగుతుందనీ పెద్దలు చెబుతారు. దైవనిర్ణయం జరిగి తీరుతుంది. పుష్పకం చావును దేవతలే నివారించలేకపోయారు,'' అన్నది.

''ఏమిటా పుష్పకం కథ?'' అని చుటూ మూగిన వాళ్ళు అడిగారు.

ఆ వధువు వారికి ఆ కథ ఇలా చెప్పింది:

### పుష్పకం కథ

ఇంద్రుడి వద్ద అనేక శాస్త్రాలలో ప్రావీణ్యం గల ఒక చిలుక ఉండేది. దాని పేరు పుష్పకం. ఒకసారి అది ఇంద్రుడి చేతిలో కూర్చుని కబుర్లాడుతూ, యముణ్ణి చూసి పారిపోయింది. ఎందుకలా చేశావని దేవతలు పుష్పకాన్ని అడిగారు. ''అన్ని ప్రాణులకూ హాని కలిగించే వాణ్ణి చూసి పారిపోక ఏం చెయ్యను?'' అన్నది పుష్పకం.


అప్పుడు దేవతలు యముడితో, ''పుష్పకాన్ని చంపకు,'' అన్నారు.

''నేను కాలుడి బంటును. నా చేతిలో ఏమీలేదు. మీరు వెళ్ళి కాలుణ్ణి అడగండి,'' అన్నాడు యముడు.


వాళ్ళు కాలుణ్ణి అడిగితే, మృత్యువును అడగమన్నాడు. దేవతలు మృత్యువును అడిగారు. కాని మృత్యువును చూడగానే పుష్పకం ప్రాణాలు వదిలింది.



CHANDAMAMA (Telugu) May 1975 Regd. No. M. 4854



మిత్రభేదం



# శిథిలాలయం

## 24

వధువు ఈ కథ చెప్పి, "అందుచేత విధిని ఎవరూ తప్పించలేరు. నేను ఈ పామును పెళ్ళాడకపోతే నా తండ్రికి నూరు మంది కన్యలను చంపిన పాపం చుట్టుకుంటుంది," అన్నది.

ఆమె పామును వైభవంగా పెళ్లాడి, అత్తగారి ఇంటనే వుంటూ భర్తసేవ శ్రద్ధగా చెయ్యసాగింది.

ఒకరాత్రి ఆ పాము తాను ఉండే తట్టలో నుంచి వచ్చి, దివ్యసుందరమైన మానవరూపంలో తన భార్య పక్క మీద కూర్చున్నాడు. ఇది చూసి, ఆమె నిర్ఘాంత పోయి, అతను ఎవరో పరపురుషుడు అనుకుని, తలుపులు తెరిచి బయటికి పారిపోబోయింది.

"ప్రేయసీ, వెళ్లకు. నేను నీ భర్తను," అన్నాడు అతను.

ఆమెకు నమ్మకం కలగటం కోసం అతను తట్టలో నిర్జీవంగా పడి ఉన్న పాము శరీరంలో ప్రవేశించి కదలాడి, మనిషి రూపంలో ఇవతలికి వచ్చాడు.

తన భర్త మనిషి అయినందుకు ఆమె ఎంతో సంతోషించి, అతని నెత్తిన కిరీటమూ, శరీరం మీద ఆభరణాలూ చూస్తూ, అతనికి నమస్కారం చేసింది.

వాళ్ళు పడుకుని నిద్రపోయినాక, తన అల్లుడు మనిషైనన్న సంగతి కని పెట్టిన దేవశర్మ తట్ట నుంచి పాముశరీరాన్ని తీసుకుపోయి తగలబెట్టేశాడు.

కథ పూర్తి చేసి బలభద్రుడు, "మనం మరంతో బాటు ఈ మహాత్ముడి శరీరాన్ని తగలబెట్టేశామంటే ఆయన ఎల్లప్పుడూ దేవశరీరంలోనే ఉండిపోతారు, మహారాజా!" అన్నాడు.

అట్ట చివరి బొమ్మ



రాజు అనుమతించాడు. బలభద్రుడు మఠాన్ని తగల బెట్టించాడు. కపటసన్యాసి అందులో కాలిపోయాడు.

ఇలా చెప్పి కరటకం, "కనక ప్రమాద కరమైన నీ కుట్ర కట్టిపెట్టు," అన్నది.

దానికి దమనకం, "అది అర్థం లేని మాట! నువు చెప్పే కోటి సిద్ధాంతాలు కూడా నా ఆచరణ విలవ చెయ్యవు. అంత దాకా దేనికి రా, అబ్బీ? ఈ ఎద్దు శరీరం మీదనే మనం ఎన్నో నెలలపాటు బతకవచ్చు. దాని కళేబరం ఇప్పుడే నాకళ్ల ముందు స్పష్టంగా మెదులుతున్నది. కాని, యుక్తిగల నక్కలాగా, ఎత్తు పారిన దాకా ఈ విషయం రహస్యంగా ఉంచు," అన్నది.

"ఏమిటా కథ?" అని కరటకం అడిగింది.

దమనకం ఇలా చెప్పింది:

### యుక్తిగల నక్క

ఒక అరణ్యంలో వజ్రదంష్ట్రం అనే సింహం ఉండేది. దానికి ముగ్గురు మంత్రులుండేవాళ్ళు—చమరకం అనే నక్కా, ఒక తోడేలూ, ఒక ఒంటే.

ఒకనాడు సింహం ఒక మగ ఏనుగుతో ఘోరంగా పోరాడి తీవ్రంగా గాయపడింది. అటు తరవాత అది తన గుహలో బాధ తోనూ, అకలితోనూ అలమటిస్తూ పడి ఉంది. వేటాడలేక పోయింది. ఆ స్థితిలో అది తన మంత్రులను పిలిచి, "అకలితో చచ్చిపోతున్నాను. ఏ జంతువునైనా వేటాడి తీసుకురండి," అన్నది.

అయితే ఎంత గాలించినా వాటికి ఏ జంతువూ చిక్కలేదు.

అప్పుడు చమరకం అనే నక్క తనలో, "ఈ ఒంటెను చంపినట్టయితే మేమం దరమూ కొద్ది రోజులపాటు కడుపు నిండా తినవచ్చు. అయితే అది మిత్రుడూ, మంత్రీ, కావటం చేత సింహం దాన్ని చంపటానికి ఒప్పుకోదు. అందుచేత, ఒంటె చావటానికి ఒప్పుకునేటట్టు నేనే ఒక యుక్తి పన్నుతాను," అనుకున్నది.

అది ఒంటెతో, "మిత్రమా, మన యజమాని తిండి లేక చచ్చిపోతున్నాడు. యజమాని చస్తే మన చావూ తప్పదు. అందుచేత, నీకూ, మన యజమానికీ కూడా లాభించే విధంగా ఒక సూచన చేస్తాను," అన్నది.

"తప్పకుండా చెప్పు. నువు చెప్పినట్టు చేస్తాను. యజమానికి సహాయపడటం పుణ్యం కూడానూ," అన్నది ఒంటె.

"బాబూ, నువు నీ దేహాన్ని నూటికి నూరు వడ్డీ మీద మన యజమానికి ఇచ్చెయ్యి. చచ్చిపోయిన అనంతరం నీకు రెట్టింపు జవసత్వాలు గల జన్మ లభిస్తుంది," అన్నది నక్క.


"మృత్యుదేవత ఈ ఏర్పాటుకు ఒప్పుకుంటే నాకేమీ అభ్యంతరం లేదు," అన్నది ఒంటె.

నక్క సింహం వద్దకు వెళ్ళి, ఎంత వెతికినా తమకు జంతువేదీ దొరకలేదని చెప్పింది. సింహం కుంగిపోయింది. అప్పుడు నక్క ఇలా అన్నది:

"అయితే ఒక మంచి కబురు కూడా చెబుతాను. మన మిత్రుడు ఒంటె తన శరీరాన్ని మీకు ఇయ్యటానికి సిద్ధంగా ఉన్నది. అయితే, అతగాడి శరీరాన్ని నూరు శాతం వడ్డీతో సహా తిరిగి ఇస్తానని మృత్యుదేవత సాక్షిగా హామీ ఇయ్యాలి."

ఇందుకు సింహం ఒప్పుకుని, ఒంటె ఔదార్యానికి ధన్యవాదాలు తెలుపుకున్నది. తరవాత అది మృత్యుదేవతను సాక్ష్యం ఉండమని, కోరిన ప్రకారం వాగ్దానంచేసి, ఒంటెను చంపింది. నక్కా, తోడేలూ ఒంటె శరీరాన్ని చీల్చి, తినటానికి వీలుగా అమర్చాయి. అయితే నక్క ఉద్దేశం ఆ ఒంటె కళేబరమంతా తనకే దక్కాలని. అందుకు అదొక యుక్తి పన్నింది.

సింహం శరీరం నిండా రక్తపు మరకలుండటం చూసి నక్క, "మీరు నదికి వెళ్ళి చక్కగా స్నానం చేసి రండి. అంత దాకా నేను ఒంటె కళేబరాన్ని చూస్తూ ఉంటాను," అన్నది.



CHA… …MA (Telug… …1975 Regd. No. M. 485…




మిత్రభేదం



# మిత్రభేదం

## 25

సింహం నదిలో స్నానం చెయ్యటానికి వెళ్ళింది. అది వెళ్ళగానే నక్క తోడేలుతో. "మిత్రమా. మన దొర తిరిగి వచ్చే లోపున నువు కావలిస్తే కొద్దిగా ఎంగిలి పడు. చాలా ఆకలి మీద ఉన్నట్టున్నావు. సింహానికి నేను సర్ది చెబుతాను." అన్నది.

వెంటనే తోడేలు ఒంటె గుండెను తిన్నది. సింహం తిరిగివచ్చి, ఒంటె గుండె లేకపోవటం చూసి. భయంకరంగా గర్జిస్తూ. "నా కన్న ముందుగా ఒంటెను తిన్నది ఎవరు? వాణ్ణి చంపిగాని భోజనం చెయ్యను." అన్నది.

"సర్ది చెబుతానన్నావుగా? చెప్పు!" అన్నట్టుగా తోడేలు నక్క కేసి చూసింది.

కాని నక్క నవ్వుతూ, "తోడేలన్నా, నన్ను చూస్తావేం? నువేగా గుండె తినే సిందీ?" అన్నది.

తారెత్తిపోయి తోడేలు, ప్రాణం రక్షించుకునేటందుకు పరుగు లంకించుకున్నది. సింహం దాన్ని చాలాదూరం తరిమి, బాగా అలసిపోయి, "ఈ కాస్త తప్పుకు తోడేలును చంపేదేమిటి?" అనుకుంటూ తిరిగిరాసాగింది.

సింహం తిరిగి వచ్చేటప్పుడు దానికి గంటల చప్పుడు గట్టిగా వినిపించింది. దానికి కారణమేమిటంటే ఒక ఒంటెల బిడారు ఆ దారిగా పోతున్నది. ఒంటెల మెడల్లో ఉన్న గంటలు మోగుతున్నాయి.

"ఆ చప్పుడేమిటి?" అని సింహం నక్కను అడిగింది.

"పారిపొండి, మహారాజా. మీకు పెద్ద ప్రమాదం రానున్నది!" అన్నది నక్క.

"ఎవరి నుంచి ఆ ప్రమాదం?" అని సింహం అడిగింది.

అట్ట చివరి బొమ్మ



"ఒంటెను చంపే ముందు మీరు ఒంటెకు నూరు శాతం వడ్డీ కూడా ఇస్తామని మృత్యుదేవతకు మాట ఇచ్చారు గదా. అసలూ, వడ్డీ, వసూలు చేసుకునేటందుకు మృత్యుదేవత వస్తున్నది." అన్నది నక్క.

ఈ మాట వింటూనే సింహం పలాయనం చిత్తగించింది. తరవాత నక్క ఒంటె శరీరాన్ని చాలా రోజుల పాటు నిరభ్యంతరంగానూ, నిస్సంకోచంగానూ తిన్నది.

*　　*　　*

దమనకం వెళ్ళినాక సంజీవకం ఇలా ఆలోచించింది:

"నేనిప్పుడేం చెయ్యాలి? ఎక్కడికైనా పారిపోదునా? లాభం లేదు. ఇది మహారణ్యం. నేను ఏ పులివాతనే పడక తప్పదు. సింహమా, శత్రువై కూర్చున్నది. అందుచేత నాకు ఒకటే మార్గం - సింహం వద్దకు వెళ్ళి, ప్రాణ భిక్ష వేడటం!"

ఇలా అనుకుని సంజీవకం పింగళకం వద్దకు వెళ్ళింది. దమనకం ముందుగా చెప్పినట్టే సింహం తోక నిగిడించి ఉన్నది; పంజాలు బిగబట్టి ఉన్నాయి; కళ్ళు తీక్ష్ణంగా ఉన్నాయి. ఈ లక్షణాలను దూరం నుంచే గమనించి, సంజీవకం కుమ్మటానికి సిద్ధంగా ఉన్నట్టుగా కొమ్ములు ముందుకు పెట్టింది.

పింగళకం కూడా, దమనకం ముందే చెప్పిన లక్షణాలను సంజీవకంలో గమనించి, దాని పైన దూకి తన వాడి గోళ్ళతో సంజీవకాన్ని చీల్చేసింది. దెబ్బ తిని కూడా సంజీవకం పింగళకాన్ని డొక్కలో కొమ్ముతో పొడిచి, కొంచెం వెనక్కు తగ్గి, మళ్ళీ పొడవటానికి సిద్ధమయింది.

ఉభయులూ అలా ఒకరినొకరు చంపుకునేటందుకుగాను యుద్ధసన్నద్ధులై ఉండడం చూసి, కరటకం దమనకంతో, "మూర్ఖుడా, మిత్రుల మధ్య శత్రుత్వం రేపి, నువ్వు మహా పాపం చేశావు.

శాంతియుతంగా ఉన్న అరణ్యంలో అశాంతి తెచ్చి పెట్టావు. నువు ఏకంగా దండోపాయం అవలంబించి, మన ఏలికకు ప్రాణాపాయస్థితి కలిగించావు. ఆయన ఇతరులను సంప్రతించే అవకాశం కూడా ఇయ్యకుండా మంత్రాలోచన అంతా నువే చేశావు. నీ వంటి మూఢుడి మంత్రాలోచనలు విన్నందుకు మన యజమానిని చూసి నేను జాలిపడుతున్నాను. మన యజమాని తప్పు కూడా లేక పోలేదు. మూఢులైన రాజులు నీలాటి ఇచ్చకాలరాయుళ్ళ మాటలు విని నాశనం కొని తెచ్చుకుంటారు. నీలాటి వాడికి హితవు చెప్పటం కూడా వృథా. వెనకటికి కోతికి చెప్పిన హితువులాగే ఉంటుంది!" అన్నది.

"ఏమిటా కథ?" అని దమనకం అడిగింది. కరటకం ఇలా చెప్పింది:

### నిరర్థకమైన హితవు


ఒక అరణ్యంలో కోతుల మంద ఉండేది. చలికాలం వచ్చి, కోతులన్నీ వణికి పోతున్నాయి. అంతలో వాటికొక మిణుగురు పురుగు కనబడింది. దాన్ని చూసి నిప్పురవ్వ అనుకుని, దాని సహాయంతో మంట చేద్దామని, దాన్ని పట్టుకుని, దాని మీద ఎండుటాకులు కప్పి, మంటకు వెచ్చబడదామని పోగు దగ్గిరచేరాయి.

వాటిలో చలి బాధ మరీ ఎక్కువగా ఉన్న ఒక కోతి, మంట త్వరగా కావటానికి మిణుగురు పురుగు మీద ఊద సాగింది. సమీపంలోగల ఒక చెట్టు మీద ఉన్న సూచీముఖి అనే ఒక పక్షి ఇదంతా చూసి, "మిత్రమా, ఎందుకు వృథాగా ప్రయాస పడతావు? అది నిప్పు కాదు, మిణుగురు పురుగు," అని చెప్పింది.

కోతి వినిపించుకోకుండా, అదే పనిగా ఊదుతూ పోయింది.

సూచీముఖి మళ్ళీ మళ్ళీ కోతిని ఉద్బోధించింది. కోతికి చిరాకు వచ్చి, సూచీముఖిని నోరు మూసుకోమన్నది. బుద్ధి మాలిన సూచీముఖి అదేపనిగా కోతికి హితవు చెప్పసాగింది.




Vapa



# మిత్రభేదం

## 26

బుద్ధిమంతుడైన వాడు తన మాట అంటే లక్ష్యం లేనివాడికీ, జూదరికీ, తాగుబోతుకూ, చిక్కులలో ఉన్న మూఢుడికీ, ఓటమిచెందిన వాడికీ, ఆశాభంగం చెందిన వాడికీ హితం చెప్పటం తనకే అపాయమని తెలుసుకుంటాడు. చేవ ఎక్కిన కర్ర విరగనైనా విరుగుతుందిగాని వంగదు గదా! అడిగినవాడికే హితం చెప్పాలి గాని, విశ్వాసం లేనివాడికి చెప్పరాదు.

ఒక వనంలో ఒక పిచ్చుకల జంట ఒక చెట్టు కొమ్మ మీద చక్కని గూడు కట్టుకుని ఉంటూండేదిట. ఒక శిశిరంలో చలితో బాటు వాన కురుస్తున్నదిట. అప్పుడొక కోతి వానకు తడిసి, చలికి వణుకుతూ వచ్చి అదే చెట్టు కింద నిలబడిందిట. దాని శరీరం నిలువునా గజగజలాడుతున్నది. దాని దంతాలు టక టకలాడుతున్నాయి.

ఆ సమయంలో గూట్లో ఆడపిచ్చుక మాత్రమే ఉన్నది. అది కోతికి కలిగిన దుస్థితి చూసి, ''ఏమోయ్, నీకు మనిషికున్నట్టే మొహమూ, కాళ్ళూ, చేతులూ ఉన్నాయి గదా. మనుషులు కట్టుకున్నట్టే ఒక ఇల్లు కట్టుకోలేకపోయావా? ఎందుకలా చెట్టు కింద నిలబడి, బుద్ధిలేకుండా చలికీ, వానకూ వణికిపోతున్నావు?'' అని అడిగింది.

కోతి మండిపడి, ''నా కోసం నేనైతే ఇల్లు కట్టుకోలేని మాట నిజమే కాని, ఇలాటి దుర్మార్గురాలి కొంప పీకటం నా చేతిలో పనేగదా,'' అనుకుని, పిచ్చుక గూడులాగి, తుంచి ముక్కలు ముక్కలు చేసేసింది.

అట్ట చివరి బొమ్మ

ఆడపిచ్చుక ఎగిరిపోయి ప్రాణాలు దక్కించుకున్నది.

అలాగే సూచీముఖి పిలవని పేరంటంగా కోతికి హితవు చెప్పబోయేసరికి కోతికి ఆగ్రహం వచ్చి, సూచీముఖిని పట్టుకుని రాయికేసి కొట్టి చంపేసింది.

కరటకం దమనకానికి ఈ కథ చెప్పి, "మూఢుడికి వివేకం చెప్పటం నిష్ప్రయోజనం. అలాటి వాడిలో వివేకం జాడీలో దాచి మూత పెట్టిన దీపం లాటిది. నువు పుట్టడమే అలా పుట్టావు. నువు వెనకటి దుష్టబుద్ధి లాటి వాడివి," అన్నది.

"ఏమిటా కథ?" అని దమనకం అడిగింది. కరటకం దుష్టబుద్ధి కథ ఇలా చెప్పింది:

దుష్టబుద్ధి కథ

ఒక పట్టణంలో దుష్టబుద్ధీ, ధర్మబుద్ధీ అని ఇద్దరు వైశ్యయువకులు ఉండేవారు. ఇద్దరూ మంచి స్నేహితులు. ధర్మబుద్ధి చాలా మంచివాడూ, నిజాయితీపరుడూను. కాని దుష్టబుద్ధి అనేక రకాల దుష్ప్రవర్తనగలవాడని ధర్మబుద్ధికి తెలియదు.

అంతులేని తన వ్యసనాలు తీరటానికి పుష్కలంగా డబ్బు సంపాదించగోరి, దుష్టబుద్ధి ధర్మబుద్ధిని వర్తకం కోసం దూర దేశాలకు పోదామని పిలిచాడు.



"కొత్త కొత్త దేశాలు చూసి, మంచి లాభాలు సంపాదించటానికి ఇది మంచి అవకాశం. వయసులోనే ప్రపంచం చూడకపోతే ముసలితనంలో జ్ఞాపకం చేసుకునేటందుకు ఏమీ ఉండదు. ప్రపంచంలో ఎన్ని భాషలున్నాయో, ఎన్ని రకాల వస్త్రధారణలూ, ఆచారాలూ ఉన్నాయో తెలుసుకోని జన్మ ఏం జన్మ? దేశాంతరాలు చూస్తేనేగాని జ్ఞానమూ, సంపదా, కళా పెంపొందవు. పోదాం పద!" అన్నాడు దుష్టబుద్ధి.

ధర్మబుద్ధి సరే నన్నాడు.

ఇద్దరూ మంచి ముహూర్తాన బయలుదేరి, క్షేమంగా ఒక తెలియని దేశం

చేరారు. అక్కడ వాళ్లు పర్యటన చేస్తూండగా, ధర్మబుద్ధికి వెయ్యి బంగారు నాణాలుగల పాత్ర నిక్షేపం దొరికింది.

అతను దుష్టబుద్ధితో, "మన అదృష్టం బాగున్నది. మనం ఇంటికి తిరిగి పోదాం పద. ధనం కోసమో, విద్య కోసమో, కళ కోసమో దేశాంతరం వెళ్లిన వాడికి అది లభించగానే స్వదేశం మీద గాలి మళ్లటం సహజం," అన్నాడు.

అందుకు దుష్టబుద్ధి వెంటనే ఒప్పుకున్నాడు. ఇద్దరూ స్వదేశానికి తిరిగి వచ్చారు.

వాళ్లు తమ ఊరు చేరవస్తూండగా ధర్మబుద్ధి దుష్టబుద్ధితో, "మిత్రమా, దొరికిన దానిలో నీ సగం నువు తీసుకో. త్వరలోనే మనం మనవాళ్లను చేరుకుని పండగ చేసుకోబోతున్నాం," అన్నాడు.

దురాశ మనసులో పెట్టుకున్న దుష్టబుద్ధి, "మిత్రమా, ఇంత డబ్బు ఒక్కసారిగా మన బంధువులకూ, స్నేహితులకూ చూపడం అంత మంచిది కాదు. వాళ్లు దాన్ని కోరుతారు. అదీగాక, వివేకి అయినవాడు, తనకు కొద్ది సంపదే ఉన్నప్పటికీ, దాన్ని ప్రదర్శించడం అనుచితం. డబ్బు పాపిష్ఠిది. అది తపస్వులను సైతం చలింపజేస్తుంది. అది అలా ఉంచి, ఈ బంగారం మన ఉమ్మడి సొత్తుగా ఉన్నంత కాలమూ మన స్నేహబంధం మరింత దృఢంగా ఉంటుంది. అరిదుచేత ఇప్పుడు మనం చెరొక నూరు నాణాలూ తీసుకుని, మిగిలిన ఎనిమిది వందలూ పాత్రతో సహా అరణ్యప్రదేశంలో రహస్యంగా పాతిపెడదాం. అలా చేయటం వల్ల, ఈ పెన్నిధి మనకు అచ్చి వచ్చేదీ, లేనిదీ కూడా తెలిసిపోతుంది. మనకు అవసరం కలిగినప్పుడల్లా వచ్చి ధనం కొంచెం కొంచెంగా తీసుకుపోతూ ఉండవచ్చు," అన్నాడు.

ధర్మబుద్ధికి అనుమానం కలగలేదు. ఇద్దరూ అరణ్యంలో ఒక నిర్జన ప్రాంతానికి వెళ్లి, అక్కడ నిధిని పాతిపెట్టి, తమ ఇళ్లకు తిరిగి వచ్చేశారు.



## ఫోటో వ్యాఖ్యల పోటీ :: బహుమానం రు. 20 లు





★ వ్యాఖ్యలు అగష్టు 20వ తేదీ లోగా చేరాలి. వ్యాఖ్యలు పోష్టుకార్డు పైన మాత్రమే రాయాలి.
★ వ్యాఖ్యలు ఒక్క మాటలో గాని, చిన్న వాక్యంలో గాని వుండాలి. రెండు వ్యాఖ్యలకూ సంబంధం వుండాలి. గెలుపొందిన వ్యాఖ్యలు అక్టోబర్ నెల సంచికలో ప్రకటించబడును.

# చందమామ

ఈ సంచికలో కథలు - వింతలు - విశేషాలు


| | | | | | |
|---|---|---|---|---|---|
| మిత్రభేదం – 26 | ... | 2 | బ్రారె మేసిన రుమాల | ... | 31 |
| విచిత్రకవలలు–14 | ... | 5 | పగటిదొంగలు | ... | 36 |
| ఉత్తమదానం | ... | 13 | జ్ఞానోదయం | ... | 40 |
| కనువిప్పు | ... | 17 | కరువులో ధరలు | .... | 43 |
| పిశాచాల పెళ్ళివిందు | .... | 21 | వీరహనుమాన్ - 11 | ... | 45 |
| కన్యాపూర్ సమస్య | .... | 26 | అమరవాణి | ... | 53 |


రెండవ అట్ట:
పొద్దుతిరుగుడు పువ్వులు

మూడవ అట్ట:
లిలీ పువ్వులు

Printed by B. V. REDDI at The Prasad Process Private Ltd., and Published by B. VISWANATHA REDDI for Chandamama Publications, 2 & 3, Arcot Road, Madras-600026. Controlling Editor: 'CHAKRAPANI'



# మిత్రభేదం

## 27

దుష్టబుద్ధి తన నూరుబంగారు కాసులనూ త్వరలోనే ఖర్చు చేసుకుని, డబ్బుకోసం తహతహలాడుతూ ధర్మబుద్ధి వద్దకు వెళ్ళి, అతన్ని వెంట బెట్టుకుని డబ్బుదాచిన చోటికి వెళ్ళాడు. ఇద్దరూ మళ్ళీ చెరొక నూరు కాసులూ తీసుకున్నారు. కాని సంవత్సరం తిరిగే లోపల దుష్టబుద్ధి ఆ డబ్బంతా, తన దుర్వ్యసనాలకు ఎడాపెడా ఖర్చుచేసేశాడు.

దుష్టబుద్ధి ఉద్దేశం ఇలా ఒకటి రెండు సార్లు ఆ డబ్బును ధర్మబుద్ధితో పాటు తీసుకుని, అతనికి నమ్మకం కలగనిచ్చి, అంతా తానే కాజేయాలని. ఇప్పుడు దాచినచోట ఇంకా అరువందల కాసులు మిగిలి ఉన్నాయి. అదంతా తానే సంగ్రహించాలనే ఉద్దేశంతో అతను అర్ధరాత్రి వేళ డబ్బుదాచిన చోటికి వెళ్ళి, పాత్ర నుంచి అరువందల బంగారు కాసులూ తీసుకుని, పాత్రకు మళ్ళీ మూతి కట్టి, దాన్ని ఎప్పటిలాగే పాతిపెట్టి, ఇంటికి వచ్చేశాడు.

ఒకనెల గడవనిచ్చి అతను ధర్మబుద్ధి వద్దకు వెళ్ళి, ''మిత్రమా, మిగిలిన డబ్బుకూడా పంచేసుకుందామా? కాస్త డబ్బు అవసరంలో వున్నాను,'' అన్నాడు. ధర్మబుద్ధి సరే నన్నాడు.

ఇద్దరూ డబ్బుదాచిన చోటికి వెళ్ళారు. పాత్రను తవ్వి తీసిచూస్తే అందులో ఏమీలేదు. దుష్టబుద్ధి ఆ పాత్రతో తన తల బాదుకుని, ''అయ్యో, ధర్మబుద్ధీ! డబ్బంతా కాజేశావా? నా వంతు నాకిస్తే ఇచ్చావు, లేకపోతే ఇప్పుడేపోయి న్యాయస్థానంలో నీ మీద వ్యాజ్యం తెస్తాను,'' అన్నాడు.

అట్ట చివరి బొమ్మ

"ఛీ, బుద్ధిహీనుడా! నేను అలా దొంగతనానికి పాల్పడే నీచుణ్ణికాను." అన్నాడు ధర్మబుద్ధి.

ఇద్దరూ పోట్లాడుకుని, న్యాయస్థానానికి వెళ్ళి ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేసుకున్నారు.

ఇద్దరి పక్షానా సాక్షులెవరూ లేని కారణంచేత న్యాయాధికార్లు వెంటనే తీర్పు చెప్పలేక, ఇద్దరినీ అయిదు రోజుల పాటు నిర్బంధంలో ఉంచారు.

ఆరవనాడు న్యాయాధికార్లు ఇద్దరినీ అగ్నిపరీక్షకు గురిచేస్తామన్నారు. దుష్టబుద్ధి ఇందుకు ఆక్షేపణచెబుతూ, "ఇది ధర్మంకాదు. పత్రాలూ, సాక్షులూ లేని పరిస్థితిలోనే అగ్నిపరీక్ష విధించాలని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. ఈ సందర్భంలో మేము ధనం దాచినచోట వృక్షదేవత సాక్ష్యం ఇయ్యగలదు. మాలో ఎవరు దోషి అయినదీ ఆ వృక్షదేవత చెబుతుంది. ఆ సాక్ష్యం విని తమరు తీర్పు ఇయ్యవచ్చు." అన్నాడు.

న్యాయాధికార్లు ఇందుకు సమ్మతించి, మర్నాడు వాళ్ళను వెంటబెట్టుకుని చెట్టు వద్దకు వెళ్ళి, వృక్షదేవత సాక్ష్యం వినటానికి నిర్ణయించి, ఇద్దరినీ తగిన హామీ మీద వదిలిపెట్టారు.

దుష్టబుద్ధి తిన్నగా ఇంటికి వెళ్ళి, తన తండ్రితో, "నాన్నా, సొమ్ము నేనే తీశాను. నువు ఒక్క మాట అనగలిగితే అది మనకే ఉంటుంది. ఇవాళ రాత్రి



నిన్ను చెట్టు దగ్గిరికి తీసుకుపోతాను. నువు చెట్టుతొర్రలో దాక్కొని, రేపు న్యాయాధికారులు వచ్చి, డబ్బు ఎవరు తీశారని అడిగినప్పుడు ధర్మబుద్ధే తీశాడని చెప్పాలి,'' అన్నాడు.

దానికి అతని తండ్రి, ''ఒరే బాబూ, ఇలాటి దుష్టపథకాలవల్ల ఇద్దరమూ నాశనమవుతాం. వివేకంగలవాడు ఏ పథకం వేసినా అందులోని లోపాలు ఎలాంటివో జాగ్రత్తగా ఆలోచించాలి. లేకపోతే కొక్కిరాయి గతి అవుతుంది?'' అన్నాడు.

''కొక్కిరాయికి ఏమయింది?'' అన్నాడు దుష్టబుద్ధి.

తండ్రి కొక్కిరాయి కథ ఇలాచెప్పాడు:

ఒక అరణ్యంలో ఒక మర్రిచెట్టు తొర్రలో కొక్కిరాయి దంపతులు ఉండేవి. దాని దిగువన బొరియలో ఒక నాగుపాము ఉండేది. ఈ పాము చెట్టుతొర్రలోకి ఎక్కి, రెక్కలురాని ఒక కొక్కిరాయి పిల్లను మింగేసి వెళ్ళిపోయింది.


అదిచూసిన కొక్కిరాయి చెరువుగట్టున కూర్చుని ఏడుస్తూండగా, ఒక పీత చూసి, ''ఎందుకు, మామా, ఏడుస్తున్నావు?'' అని అడిగింది.

''పాపిష్ఠిపాము మా చెట్టు కింది బొరియలో ఉంటున్నది. అది ఇవాళ నా పిల్లను ఒకదాన్ని తిన్నది. రేపు మిగిలిన పిల్లల గతి అంతే అవుతుంది. ఏడవక ఏం చెయ్యను?'' అన్నది కొక్కిరాయి.

తన శత్రువైన కొక్కిరాయిని నాశనం చెయ్యాలన్న ఉద్దేశంతో పీత, ''చూడు, మామా. ముంగిస ఉండే బొరియ నుంచి పాము బొరియ దాకా చేపముక్కలు వెయ్యి. ముంగిస వాటిని తింటూవచ్చి, పామును చంపుతుంది,'' అని ఉపాయం చెప్పింది.

అందులో కీడు ఆలోచించక, బుద్ధిలేని కొక్కిరాయి అలాగే చేసింది. ముంగిస వచ్చి పామునైతే చంపింది, కాని చెట్టు తొర్రలో ఉన్న మిగిలిన కొక్కిరాయి పిల్లలను కూడా చంపి వెళ్ళిపోయింది.





మిత్రభేదం



# మిత్రభేదం

## 28

దుష్టబుద్ధికి అతని తండ్రి కొక్కరాయి కథ చెప్పి, ''వివేకం గలవాడు ఏదన్నా పథకం ఆలోచించి నప్పుడు అందులో ఉండే దోషాలు గ్రహింపు చేసుకోవాలి. నీ పథకంలో నాకు అనేక లొసుగులు కనిపిస్తున్నాయి,'' అన్నాడు.

దానికి దుష్టబుద్ధి తన తండ్రితో, ''లేదు, లేదు. ఇది మంచి పథకమే. ఏ పథకంలోనైనా ఏదో లోపం ఉండక పోదు. నువు నేను చెప్పినట్టు చెయ్యక పోయావో వృక్షదేవత సాక్ష్యం పలకదు. అబద్ధమాడానని న్యాయాధిపతులు నా తల కొస్తా తీసేస్తారు. అందుచేత, నాన్నా, నువు నా ఆలోచనకు సమ్మతించాలి. దానితో మనిద్దరమూ క్షేమంగా బయటపడి, హాయిగా జీవిస్తాం,'' అన్నాడు.

ఎలాగైతే నేం, దుష్టబుద్ధి తన తండ్రిని ఒప్పించి, చెట్టుతొర్రలో ఎవరికీ కనపడటానికి వీలులేకుండా ఆయనను దాచాడు.

మర్నాడు ఉదయం దుష్టబుద్ధి స్నానం చేసి, అడవిలో చెట్టు దగ్గిరికి వెళ్ళాడు. అక్కడికి న్యాయాధికారులూ, ధర్మబుద్ధీ చేరారు. అందరూ వింటూండగా దుష్టబుద్ధి గొంతెత్తి, ''మనుష్యులు చేసేదంతా సూర్య చంద్రులకూ, నక్షత్రాలకూ, పంచభూతాలకూ, అంతరాత్మకూ, మృత్యువుకూ, రాత్రి పగళ్ళకూ, ఉభయ సంధ్యలకూ, వృక్షదేవతలకూ తెలుసును. కనక, ఓ వృక్షదేవతా, మా ఇద్దరిలో దొంగ ఎవరో చెప్పు!'' అన్నాడు.

అతని తండ్రి చెట్టు తొర్రలో నుంచి, ''బంగారం అపహరించిన వాడు ధర్మబుద్ధి,'' అని పలికాడు.

అట్ట చివరి బొమ్మ

ఈ మాట విని ధర్మబుద్ధి, "వృక్ష దేవత సాక్ష్యం పలకటమేమిటీ? ఎక్కడా లేని సంగతే! పైగా ఆ పలికేది నిజంగా దేవత అయి ఉండదు. దేవతలు నిజం తప్ప పలకరు. ఇందులో ఏదో మోసం ఉన్నది. బుద్ధిమంతుడికి మోసం తెలిసి తీరుతుంది. చెట్టు తొర్రలో దుష్టబుద్ధి ఎవరినో దాచి ఉంటాడు. ఈ దొంగ దేవతకు సరి అయిన విధంగా బుద్ధి చెబుతాను. నేను చాలా జాగ్రత్తగా మసలాలి. ఎందుకంటే న్యాయాధి కారులు మూఢులు. నేను దోషినని వారికి నమ్మకం కుదిరింది," అనుకున్నాడు.

అతను న్యాయాధికారులతో, "అయ్యలారా, ఈ వృక్షదేవత నిజం తెలుసుకోవటమూ, దానిని చెప్పటమూ నిజంగా అద్భుతమైన సంగతి. నా పేరు ధర్మబుద్ధేనసుకోండి. నాకు నిజంగా డబ్బు అవసరం లేకపోయినా, క్షణికమైన దౌర్బల్యం కారణంగా నేనిక్కడికి ఒంటరిగా వచ్చి, బంగారం తీసుకున్నాను. నేను డబ్బు తీసుకోబోతూ ఉండగా ఒక భయంకరమైన పాము ప్రత్యక్షమయింది. అప్పుడు నాకు ఏమనిపించిందంటే: శకునం బాగాలేదు; పోయిన డబ్బు తిరిగి దొరకవచ్చుగాని, పోయిన ప్రాణం తిరిగి రాదు గద! పాము వెళ్ళిపోయాక మరో సారి వచ్చి డబ్బు తీసుకుపోదామను కున్నాను. అలా అనుకుని బంగారాన్ని చెట్టు తొర్రలో దాచాను. దానికి రక్షగా



పాముకూడా తొర్రలో జొరబడింది. నేను మీకు బంగారం అప్పగించుతాను. ఎలా నైనా ఆ పామును చంపి బంగారం పైకి తీస్తాను. కొంచెం పక్కకు తొలిగారంటే పాముకు ఊదరపెడతాను,'' అన్నాడు.

న్యాయాధికారులు అందుకు సమ్మతించారు. ధర్మబుద్ధి చెట్టుతొర్రలో ఎండు పుల్లలూ, ఎండు ఆకులూ కుక్కి, వాటికి నిప్పు పెట్టాడు.

దుష్టబుద్ధి పాలిపోయిన ముఖంతో, తల వంచుకుని నిలబడి, చెట్టు తొర్రలో ఉన్న తన తండ్రికి ఏం మూడుతుందో, నిజం బయటపడితే తన గతి ఏమవుతుందో అని బెంగపడసాగాడు.

త్వరలోనే మంటలూ, పొగా తొర్రలోకి ఎక్కాయి. కొద్ది సేపటి కల్లా దుష్టబుద్ధి తండ్రి, ఒళ్ళు సగం కాలి, కళ్ళు రెండూ పోయి, ఆర్తనాదాలు చేస్తూ బయటికి దొర్లాడు.


న్యాయాధికారులు ఆయనను, ''ఏమిటిది?'' అని అడిగారు.

''నా కొడుకు దుష్టబుద్ధి చేసిన దుస్తంత్రం,'' అంటూ ఆయన జరిగినదంతా చెప్పి, ప్రాణాలు వదిలాడు.

న్యాయాధికారులు దుష్టబుద్ధిని అచెట్టు కొమ్మకే ఉరితీసి, ధర్మబుద్ధిని ప్రశంసించారు.

కరటకం దమనకానికి దుష్టబుద్ధి కథ చెప్పి, ''మూర్ఖుడా, అనాలోచనగా చేసిన ఈ పనివల్ల నీకు నువే హాని తెచ్చుకోవటమేగాక, నాతో సహా మన కుటుంబానికంతకూ ప్రమాదం తెచ్చావు. మూర్ఖుల లక్షణమే అది. నదులు ఉప్పుసముద్రం పాలవుతాయి. పోట్లాడుకునే స్త్రీలు కుటుంబాన్ని చీల్చుతారు. అలాగే నీ స్వభావాన్నిబట్టి నువు పింగళకానికీ, సంజీవకానికీ మధ్య స్పర్ధతెచ్చిపెట్టావు. నువు ఎంత మూర్ఖుడివంటే ఎలుకలు ఇనుముతిన్నకథను కూడా నమ్మవచ్చు,'' అన్నది.

''ఏమిటా కథ?'' అని దమనకం అడిగింది. కరటకం ఇలా చెప్పింది:



CHANDAMAMA (Telugu) OCTOBER 1975 Regd. No. M. 4854




మిత్రభేదం



# మిత్రభేదం

## 29

### ఇనుము తిన్న ఎలుకలు

ఒకానొక దేశంలో నటుకుడు అనే వర్తకుడు ఉండేవాడు. అతను తన సర్వస్వమూ పోగొట్టుకుని, "కష్టార్జితంతో వైభవంగా బతికిన చోట ఎవడు గాని పేదగా జీవించరాదు. డబ్బు మంచి నీరులాగా ఖర్చుపెట్టి సమస్త భోగాలూ అనుభవించిన చోట పేదగా, యాచిస్తూ బతికేవాడు చులకనగా చూడబడతాడు," అనుకుని, ఎక్కడికైనా వెళ్ళి, డబ్బు సంపాదించుకుని రావటానికి నిశ్చయించాడు.

అతని ఇంట పాతకాలపు త్రాసు, పది మణుగుల బరువుగలది ఉన్నది. తన వ్యాపారం ఉచ్చులో ఉన్న కాలంలో పెద్ద పెద్ద సరుకులు తూచటానికి ఆయన దాన్ని వాడాడు. అతను ఆ త్రాసును తన మిత్రుడైన లక్ష్మణశెట్టి అనే వర్తకుడికి దాచమని ఇచ్చి, దేశాంతరాలకు వెళ్ళిపోయాడు.

అతను విదేశాలలో చాలా కాలం ఉండి, ధనం సంపాదించి తిరిగి వచ్చి, తన త్రాసు ఇయ్యమని లక్ష్మణశెట్టిని అడిగాడు.

"అయ్యో, నాటుకా! ఏం చెప్పమన్నావు? నీ త్రాసును ఎలుకలు తినేశాయి," అన్నాడు లక్ష్మణశెట్టి.

ఈ మాట వినగానే నాటుకుడికి మండిపోయింది. కాని అతను తన కోపాన్ని బయట పడనియ్యక, "మిత్రమా, ఎలుకలు తింటే అది నీ తప్పు ఎలా అవుతుంది? నే నిప్పుడు నదిలో స్నానం చెయ్యబోతున్నాను. నా బట్టలూ అవీ పట్టుకు రావటానికి నీ కొడుకు ధనదేవుణ్ణి పంపగలవా?" అని అడిగాడు.

అతని మాట తీసేస్తే, తన మీద పూర్వం ఉండిన మిత్రభావం పోతుం దనుకుని, లక్ష్మణశెట్టి తన కొడుకుతో, "నాయనా, మామ స్నానానికి నదికి పోతున్నాడు. అతని వెంట వెళ్ళిరా," అన్నాడు.

ధనదేవుడు నాటుకుడి వస్త్రాలు తీసుకుని సంతోషంగా నదికి వెళ్ళాడు. నాటుకుడు స్నానం చేసి, తిరిగి వచ్చే టప్పుడు ఒక కొండగుహలో ధనదేవుణ్ణి ఉంచి, గుహకు బరువైన రాయి అడ్డం పెట్టి, తన మిత్రుడి ఇంటికి వచ్చాడు.

లక్ష్మణశెట్టి తన కొడుకు గురించి అడిగాడు. "అయ్యో, లక్ష్మణా! నీ కొడుకు గట్టుమీద ఉండగా ఒక గద్ద వచ్చి తన్నుకుపోయింది," అన్నాడు నాటుకుడు.

"పచ్చి అబద్ధం! ఎదిగి వచ్చిన కుర్రవాణ్ణి గద్ద తన్నుకుపోవట మేమిటి?" అన్నాడు లక్ష్మణశెట్టి.

"లక్ష్మణా, అదే జరిగింది. దాన్ని గురించి వితర్కించి ఏం లాభం?" అన్నాడు నాటుకుడు.

ఇద్దరూ తీవ్రంగా ఘర్షణపడి, న్యాయస్థానానికి వెళ్ళారు. లక్ష్మణశెట్టి గొంతు చించుకుంటూ, "న్యాయమూర్తులారా, నాకు ఘోరమైన అన్యాయం జరిగింది. ఈ నాటుకుడు నా కొడుకును తీసుకుపోయి ఎక్కడో దాచాడు," అన్నాడు.



"నేను ఏం చేసేది? ఒడ్డున ఉండగా ఆ కుర్రవాణ్ణి గద్ద తన్నుకుపోయింది," అన్నాడు నాటుకుడు.

న్యాయాధికారులు, "నాటుకా, పదిహేనేళ్ళ వాణ్ణి గద్ద ఎలా తన్నుకుపోగలదు?" అన్నారు.

నాటుకుడు చిరునవ్వు నవ్వుతూ, "పదిమణుగుల బరువు గల నా త్రాసును ఎలుకలు తినెయ్యటం సాధ్యంకాగా, పదిహేనేళ్ళ కుర్రవాణ్ణి గద్ద తన్నుకుపోవటం ఎందుకు సాధ్యం కాదు?" అని అడిగాడు.

"ఏమిటి నువ్వు అనేది? వివరంగా చెప్పు." అన్నారు న్యాయాధికారులు.

నాటకుడు వారికి జరిగినదంతా చెప్పాడు. న్యాయాధికారులు విరగబడి నవ్వి, నాటకుడికి ప్రాణమూ, శెట్టికి కుర్రవాణ్ణీ ఇప్పించారు.

కరటకం దమనకానికి ఈ కథ చెప్పి ఇంకా ఇలా అన్నది:

"పింగళకం సంజీవకం పట్ల చూపిన ఆదరణ చూసి ఓర్వలేక నువ్వు ఇంతపని చేశావు. నీవంటి వాడి వెంట ఉండటం కూడా అపాయకరమే. ముని వద్దా, బోయవాడి వద్దా పెరిగిన పక్షుల కథలో ఎంతైనా సత్యం ఉన్నది."

"ఏమిటా కథ?" అని దమనకం అడిగింది. కరటకం ఇలా చెప్పింది:

పర్వత ప్రాంతంలో ఒక చిలుకకు రెండు పిల్లలుండేవి. ఒక నాడు తల్లి పక్షి మేతకుపోయి ఉండగా ఒక దొంగ పిల్లలను కాజేశాడు. ఒక పిల్ల దారిలో వాడి బుట్ట నుంచి కింద పడిపోయింది. దొంగ రెండో పిల్లను ఇంటికి తీసుకుపోయి పెంచుకుని, మాటలు నేర్పాడు.

దారిలో పడిపోయిన పిల్ల ఒక మునికి దొరికింది. ఆయన దాన్ని తన ఆశ్రమానికి తీసుకుపోయి, పెంచుకుని, మాటలు నేర్పాడు.

ఒక నాడు ఒక రాజు వేటాడుతుండగా ఆయన గుర్రం బెదిరి, దొంగ ఉండే ఇంటి ప్రాంతానికి తెచ్చింది. రాజును చూడగానే, దొంగవాడు పెంచిన చిలుక, "ఎవడో వచ్చాడు! పట్టు! కొట్టు! చంపు!" అని అరిచింది.

రాజు భయపడి తన గుర్రాన్ని దౌడు తీయించి త్వరలోనే ముని ఆశ్రమానికి వచ్చాడు. ముని పెంచిన చిలుక రాజును చూస్తూనే, "రాజా, స్వాగతం! విశ్రమించండి. నీరు తాగి, పళ్లు ఆరగించండి! అతిథికి నీరు పట్టుకురండి!" అన్నది.

రాజు రెండు చిలుకల లోనూ గల ఈ వ్యత్యాసానికి ఆశ్చర్యపడి, ఆ రెండూ ఒక తల్లి పిల్లలేనని, తేడా పెరిగిన వాతావరణంలో మాత్రమే నని తెలుసుకున్నాడు.





మిత్రభేదం



# మిత్రభేదం

## 30

కరటకం దమనకానికి చిలుకల కథ చెప్పి, "నువు ఈ పని అంతా నీ మిత్రుడైన సింహం కోసం చేశానని సమర్థించవచ్చు. కాని నన్ను ఒక్క విషయం చెప్పనియ్య: మూర్ఖుడైన మిత్రుడి కన్న వివేకంగల శత్రువు మేలు. ఇందుకు తార్కాణంగా ఒక దొంగ తన ప్రత్యర్థుల కోసం చచ్చాడు. ఒక కోతి తన మిత్రుడైన రాజును చంపింది," అన్నది.

"అది ఎలా జరిగింది?" అని దమనకం అడిగింది.

కరటకం ఆ కథ ఇలా చెప్పింది:

పూర్వం కౌశాంబీ రాజ్యంలో ఒక రాజకుమారుడు ఉండేవాడు. అతను అస్తమానమూ బ్రాహ్మణమంత్రి కొడుకుతోనూ, వైశ్యకోశాధికారి కొడుకుతోనూ తిరిగేవాడు. వాళ్ళు ఆప్తమిత్రులుగా ఉంటూ, వినోదాలతోనూ, క్రీడలతోనూ వాహ్యాళితోనూ, ప్రసంగాలతోనూ కాలక్షేపం చేసేవాళ్ళు.

ఈ సాంగత్యం వల్ల రాజకుమారుడికి విలువిద్యగాని, కత్తిసాముగాని, అశ్వగజారోహణలుగాని ఇతర క్షత్రియ విద్యగాని కొంచెమైనా అబ్బలేదు.

"రాచవిద్యలేవీ నేర్చావు కావు, ఎలా రాజరికం నెరుపుతావురా?" అని రాజు తన కొడుకును ఒక నాడు అడిగాడు.

ఈ మాట అనిపించుకున్నందుకు రాజకుమారుడు చాలా నొచ్చుకుని, తన మిత్రులతో ఈ మాట చెప్పాడు.

దానికి వాళ్లు, "మా తండ్రులు కూడా అస్తమానమూ మమ్మల్ని ఇలాగే తప్పుపట్టుతున్నారు. కులవిద్యలు నేర్చుకోకమేం ఎందునాకాకుండా పోతున్నామట.

ఇప్పుడు నీకు కూడా అలాటి అవమానమే జరగటం చూసి అందరికీ దుఃఖంగానే ఉన్నది,'' అన్నారు.

రాజకుమారుడు ఇలా అన్నాడు:

''అవమానం జరిగిన చోట నిలవ రాదు. మన ముగ్గురినీ పెద్దవాళ్ళు అవమానించారు. మనం ఎక్కడైనా వెళ్ళి పోయి, మన మీద వచ్చిన ఆరోపణలు అసత్యమని నిరూపించుదాం.''

ఇందుకు మిగిలిన ఇద్దరూ సరే నన్నారు. అయితే, ఎక్కడికి వెళ్ళాలన్న ప్రశ్న వచ్చింది. ముగ్గురూ చాలాసేపు వితర్కించిన మీదట కోశాధికారి కొడుకు ఇలా అన్నాడు:

''ధనం లేక మనం ఏదీ సాధించలేం. మనం రోహణ పర్వతం మీదికి వెళదాం, అదృష్టం ఉంటే అక్కడ మనకు ఎంతో విలువైన ఇంద్రనీల మణులు దొరకవచ్చు. వాటితో మన ఆశయాలన్నీ సిద్ధిస్తాయి.''

ఇందుకు మిగిలిన ఇద్దరూ ఒప్పుకున్నారు.

పుష్కలంగా ధనం తీసుకుని ముగ్గురూ రోహణపర్వతానికి ప్రయాణమయారు. అదృష్టం కలిసి వచ్చి, వాళ్ళు శ్రమపడి వెతికిన మీదట, ఒక్కొక్కరికీ ఒక్కొక్క వెలలేని ఇంద్రనీలమణి దొరికింది.



''అరణ్యమార్గం క్షేమకరం కాదు గదా. మనం ఈ రత్నాలతో ఎలా తిరిగి పోవటం?'' అని వాళ్ళు ఆలోచించారు.

''నేను మంత్రి కొడుకును గనక, ఇలాటి సమస్యలను పరిష్కరించటం నాకు తెలుసు. దీనికి ఉపాయం నేను ముందుగానే ఆలోచించాను. మనం మన రత్నాలను అన్నం ముద్దలలో పెట్టి మింగేద్దాం. అవి మన పొట్టలలో భద్రంగా ఉంటాయి. వాటిని ఏ దొంగలూ వెతికి తీసుకోలేరు. మనం ఎల్లుండికి రత్నపురం చేరుతాం. అక్కడ మనం ఆమదం తీసుకుని రత్నాలను వెలికి తెప్పించుదాం,'' అన్నాడు మంత్రికొడుకు.

మిగిలిన ఇద్దరికీ ఈ ఉపాయం నచ్చింది. ముగ్గురూ భోజనంతోబాటు తమ తమ ఇంద్రనీలాలను మింగేశారు.

సుబుద్ధి అనేవాడు ఈ ముగ్గురికీ కన పడకుండా ఒక పల్లపు ప్రదేశంలో ఉండి, మంత్రికొడుకు మాటలు విన్నాడు; ముగ్గురూ ఇంద్రనీలాలు మింగటం చూశాడు. వాడు కూడా ఇంద్రనీలాల కోసం ఆ కొండకు వచ్చినవాడే!

"ఈ ముగ్గురి అదృష్టమూ ఎలాటిదో గాని, వీళ్ళకు అద్భుతమైన మణులు దొరికాయి. నేను కూడా వీళ్ళతో చేరి ప్రయాణం చేసి, రాత్రిపూట వాళ్ళు అలసి గాఢనిద్రలో ఉన్నప్పుడు ముగ్గురి పొట్టలూ కోసి, మూడు మణులూ తీసుకుంటాను," అనుకున్నాడు సుబుద్ధి.

ఇలా అనుకుని వాడు ఒక అరమైలు దూరం ముందుకు నడిచి, అక్కడ ఆగాడు. త్వరలోనే ముగ్గురూ అటుగా వచ్చారు. అప్పుడు సుబుద్ధి వాళ్ళతో, "మిత్రులారా, ఈ భయంకరమైన అరణ్యాన్ని ఒంటరిగా దాటాలంటే భయంగా ఉన్నది. మాది రత్నపురం. నేను అక్కడికే పోతున్నాను. దయచేసి నన్ను మీ వెంట రానిస్తారా?" అన్నాడు.

మరొకడు తోడు ఉంటే మరింత బాగుంటుందని వాళ్ళు సుబుద్ధిని తమ వెంట రానిచ్చారు.

ఆ మహారణ్యం మధ్యన, దారిని అనుకుని ఒక దొంగల పల్లె ఉన్నది. దొంగల నాయకుడి ఇల్లు దారిమీదికే ఉన్నది. వాడి వద్ద అనేక పక్షులున్నాయి. అందులో ఒక పక్షికి, దారే వెళ్ళేవాళ్ళను గురించి తెలుసుకునే అద్భుతశక్తి ఉండేది. నలుగురు బాటసార్లు దొంగలనాయకుడి ఇంటిముందు నుంచి వెళుతూండగా ఆ పక్షి గొంతు చించుకుని అరిచింది.

దాని భాష తెలిసిన దొంగలనాయకుడు తన నౌకర్లను పిలిచి, "ఆ వెళ్ళేవాళ్ళ దగ్గిర రత్నాలున్నాయని పక్షి చెబుతున్నది. వాళ్ళను పట్టుకోండి!" అన్నాడు.



CHANDAMAMA (Telugu) DECEMBER 1975 Regd. No. M. 48



మిత్రభేదం



# శిథిలాలయం

## 31

దొంగలనాయకుడు చెప్పినట్టే అతని అనుచరులు రాజు కొడుకునూ, మంత్రి కొడుకునూ, కోశాధికారి కొడుకునూ, వారి వెంటవస్తున్న సుబుద్ధినీ పట్టుకుని తీసుకు వచ్చారు.

దొంగలనాయకుడు వాళ్ళను సోదా చేస్తే అతనికి ఏమీ దొరకలేదు. అందు చేత అతను తనకు నచ్చిన పైపంచ ఒకటి తీసుకుని, నలుగురినీ వదిలి పెట్టాడు.

వాళ్ళు వెళ్ళిపోతూంటే పక్షి మళ్ళీ అరిచింది. నాయకుడు వాళ్ళను మళ్ళీ తెప్పించి, మరింత శ్రద్ధగా సోదా చేశాడు. కాని అతనికి ఏమీ దొరకలేదు. అతను వాళ్ళను మళ్ళీ వదిలేశాడు. వాళ్ళు పోతూంటే ఈ సారి పక్షి మరింత గట్టిగా అరిచింది.

నాయకుడు వాళ్ళను మళ్ళీ తెప్పించి, "మీ వద్ద మణులున్నాయని పక్షి చెబుతున్నది. అవి ఎక్కడ?" అని అడిగాడు.

"మా దగ్గిర మణులుంటే నువు సోదా చేసినప్పుడు దొరకవా?" అన్నారు వాళ్లు.

"పక్షి పదేపదే చెబుతున్నది గనక మీ వద్ద మణులు ఉండి తీరాలి. అవి మీ వంటి మీద లేవుగనక, మీరు వాటిని మింగి వుంటారు. ఇప్పుడు చీకటిపడుతున్నది. రేపు ఉదయమే మీ పొట్టలు చీల్చి మణులు ఉన్నాయో, లేదో చూస్తాను," అంటూ దొంగలనాయకుడు వారిని ఒక కొట్టులో బంధింపజేశాడు.

ఆ రాత్రి చాలాసేపు మేలుకుని సుబుద్ధి ఇలా ఆలోచించాడు:

"రేపు ఉదయం ఈ దొంగ మిగిలిన ముగ్గురి పొట్టలూ చీల్చి, అందులో

అట్ట చివరి బొమ్మ

మణులున్న సంగతి గ్రహించినమీదట, నా పొట్టలో కూడా ఒక మణి ఉంటుం దన్న ఆశతో నన్ను కూడా చీల్చుతాడు. ఎలాగూ నా చావు తప్పదు. నేను ఏం చెయ్యాలి? బుద్ధిమంతులు తమ చావు తప్పదని తెలిసినప్పుడు ఎవరికైనా మేలు చేసి ఉత్తమ లోకాలు సంపాదించు కుంటారని చెబుతారు. అందుచేత రేపు ఉదయం దొంగలనాయకుణ్ణి మొదట నా పొట్టనేచీల్చనిస్తే, మిగిలిన ముగ్గురూ బతికిపోతారు. నా పొట్టలో మణి దొరకక పోయే సరికి దొంగలనాయకుడికి పక్షి జోస్యంలో నమ్మకం పోతుంది. వాడు విరక్తితో మిగిలిన ముగ్గురినీ విడిచి పుచ్చు తాడు. వాళ్ల ధన ప్రాణాలు దక్కించి నందుకు నాకీర్తి ఇహంలోనూ, పరంలోనూ కూడా వ్యాపిస్తుంది. నా పాపాలన్నీ పరి హారంఅయిపోతాయి. రానున్న చావును బుద్ధిమంతుడు ఎదుర్కొనటానికి ఇంత కన్న మేలైన మార్గం లేదు.''

ఇలా అనుకుని సుబుద్ధి మిగిలిన వాళ్ళకు నిజం చెప్పేసి, తన ఎత్తు వివరించాడు. వాళ్ళు కృతజ్ఞతతో అతన్ని కౌగలించుకుని, తమ కృతజ్ఞత మళ్ళీ, మళ్ళీ తెలుపుకున్నారు.

తెల్లవారగానే దొంగల నాయకుడు ఆ నలుగురినీ తన వద్దకు రప్పించి, పొట్టలు చీల్చే సన్నాహం చేశాడు.

అప్పుడు సుబుద్ధి చేతులు జోడించి, దొంగల నాయకుడితో, ''నా కళ్ల ముందు



నా సోదరుల పొట్టలు చీలటం నేను భరించలేను. నా యందు అనుగ్రహం ఉంచి, ముందు నా పొట్ట చీల్చు.'' అన్నాడు.

దొంగల నాయకుడు అతన్ని కనికరించి, ముందుగా అతని పొట్టనే చీల్చాడు. కాని ఎంత వెతికినా అందులో మణి లేదు.

అది చూసి దొంగల నాయకుడు పశ్చాత్తాపంతో కుమిలిపోతూ, ''అయ్యో, పక్షిని నమ్మి, ధనాశతో ఎంత పాపిష్ఠిపని చేశాను! మిగిలిన వాళ్ళ పొట్టలలో కూడా రత్నాలు ఉండవు. వారిని హింసించటం వృథా!'' అనుకుని వారిని విడిచిపుచ్చాడు.

ఆ ముగ్గురూ క్షేమంగా అరణ్యం దాటి రత్నపురం చేరి, ఒక సత్రంలో బసచేసి, ఆముదం తాగి తమ మణులను తిరిగి పొందారు. కోశాధికారి కొడుకు వాటిని ఆ నగరంలోని వర్తకులకు అంతులేని ధనానికి అమ్మి, ఆ డబ్బంతా రాజు కొడుక్కు ఇచ్చాడు.

ఆ సమయంలో రత్నపురాన్ని ఏలుతున్నవాడు ఒక రాజద్రోహి. వాడు రాజవంశాన్ని నిర్మూలించి, రాజ్యం కాజేసి, ప్రజా కంటకుడుగా పాలిస్తున్నాడు. అందుచేత రత్నపుర రాజ్యాన్ని జయించాలని రాజుకొడుకుకు ఆలోచన కలిగింది. అతను మంత్రి కుమారుణ్ణి తన మంత్రిగానూ, కోశాధికారి కొడుకును తన కోశాధికారిగానూ నియమించాడు.

వారు ముగ్గురూ పొరుగు రాజ్యానికి వెళ్ళి, డబ్బు మంచినీరు లాగా ఖర్చు చేసి, చతురంగ బలాలను సమకూర్చుకున్నారు. ఈ సైన్యంతో వారు రత్నపురం మీదికి దండెత్తి వచ్చారు. రత్నపుర రాజ్యం వారి వశమయింది. రాజకుమారుడికి వైభవంగా రాజ్యాభిషేకం జరిగింది. అతను పొరుగు రాజుకూతురిని పెళ్ళి కూడా చేసుకున్నాడు. తరవాత అతను రాజకార్యాలను తన మిత్రులిద్దరి మీదా వదిలి, తన కొత్త భార్యతో సుఖసౌఖ్యాలలో తేలిపోసాగాడు.



CHANDAMAMA (Telugu) JANUARY 1976 Regd. No. M. 4854



68

మిత్రభేదం



# మిత్రభేదం

## 32

రాజభవనంలో ఒక పెంపుడు కోతి ఉండేది. రాజు దానిని చూసి ముచ్చట పడి తన అంగరక్షకుడుగా నియమించాడు. ఆ కోతి దర్పంగా అతని కత్తి పట్టుకుని నడుస్తూంటే అందరూ విరగబడి నవ్వేవారు. రాజోచితమైన భోజనాలతో ఆ కోతి చక్కగా తయారయింది. రాజోద్యోగులందరికీ అది అంటే చాలా ఇష్టం. రాజుకు ఆ కోతి మీత అమితమైన ఆప్యాయతా, విశ్వాసమూ ఏర్పడి. దానికి ఒక సొంత ఖడ్గం ఏర్పాటు చేశాడు. అది అస్తమానమూ దాన్ని పట్టుకుని తిరుగుతూండేది.

రాజభవనం సరసన ఒక అందమైన తోట ఉండేది. అందులో రకరకాల పూలూ, పళ్ళూ ఉండేవి. ఒక శీతాకాలపు వెన్నెలరాత్రి పూలమొక్కల మధ్య వాహ్యాళి చేద్దామని, రాజూ, రాణీ ఆ తోటలో ప్రవేశించారు. పరివారమంతా తోట ద్వారం వద్ద ఆగిపోయింది, కాని కోతి మాత్రం వారి వెంట ఉన్నది. చాలా సేపు వెన్నెలలో పూల సౌందర్యం చూసి ఆనందించి, రాజదంపతులు ఒక పొదరింట ప్రవేశించారు.

రాజు కోతితో, ''నేను నిద్ర పోతాను. నిద్రపోయేటప్పుడు నాకు ఏమీ హాని రాకుండా చూస్తూ ఉండు.'' అని నిద్ర పోయాడు. తరవాత కొంతసేపటికి రాణి కూడా నిద్రపోయింది. కోతి మాత్రం కత్తి భుజాన పెట్టుకుని నిలబడింది.

కొంతసేపటికి, పువ్వుల మధ్య తిరుగుతున్న తుమ్మెద ఒకటి, రాజు శరీరం నుంచి వస్తున్న సువాసనల చేత ఆకర్షించబడివచ్చి, రాజు తలమీద వాలింది.

అట్ట చివరి బొమ్మ



ఇదిచూసి కోతి మండిపడి, ''ఏమిటీ? నేనిక్కడ ఉండగానే ఈ క్షుద్ర కీటకం రాజు తలమీద వాలటానికి సాహసిస్తుందా?'' అనుకుని, ఎడమచేత్తో దాన్ని తోలేసింది. కాని అది మళ్ళీ ఎగిరివచ్చి రాజు తలమీద వాలింది. కోతి దాన్ని ఎన్నిసార్లు తోలినా అది మళ్ళీ వచ్చి రాజు తల మీదనే వాలుతున్నది.

కోతి కోపం పట్టలేక, ''ఉండు, నీ పని చెబుతా,'' అంటూ తన చేతిన ఉన్న బరువైన ఖడ్గం ఎత్తి బలంగా తుమ్మెదను కొట్టింది. ఆ దెబ్బకు రాజు తల రెండుగా చీలింది. రాజు పెద్ద చావుకేకపెట్టి, ఆ క్షణంలోనే మరణించాడు.

ఆ కేకకు రాణి లేచి, కోతితో, ''పాపీ, నీ మీద ఎంతో విశ్వాసం ఉంచిన రాజును ఇలా చేశావేం?'' అని అడిగితే, కోతి జరిగినదంతా చెప్పింది.

మంత్రి కొడుకు అక్కడికివచ్చి, జరిగినది తెలుసుకుని, ''మూఢుడైన మిత్రుడికన్న వివేకి అయిన శత్రువుమేలు. రాజును చంపుదామనుకున్న శత్రువు వివేకి కావటం చేత రాజు ప్రాణాలు కాపాడాడు. ఆ రాజే బుద్ధిలేని మిత్రుడైన కోతిచేత చచ్చిపోయాడు,'' అన్నాడు.

కరటకం దమనకానికి ఈ కథ చెప్పి, ''మన సింహానికి నీ వంటి మూఢుడైన అప్తుడి కన్న వివేకం గల శత్రువు ఉంటే బాగుండేది. గుర్తుంచుకో, ఎప్పటికైనా తప్పు తప్పే, ఒప్పు ఒప్పే. ఎంత దాహం వేసినప్పటికీ మనుషులు మురికి గుంట నీరు తాగరు. కాని నీలాటి రాజకీయ వేత్తల అభిప్రాయాలు అస్తవ్యస్తంగా ఉంటాయి. మిణుగురుపురుగు అగ్ని అనిపిస్తుంది; ఆకాశం చదునుగా తోస్తుంది; అబద్ధం నిజంగానూ, నిజం అబద్ధంగానూ కనిపిస్తుంది. ఎందుకూ? స్వార్థదృష్టి తప్ప మరేదీలేకపోవటం చేత. నీ వంటి ఒక్క స్వార్థబుద్ధి ఒక్కడి మాటలు వినేకన్న, అనుభవం గల హితైషులను పదిమందిని సంప్రతించటం

మన పాలకులు నేర్చుకోవడం మంచిదని నిన్ను చూసి గ్రహించాలి,'' అన్నది.

దమనకానికి ఈ మాటలు ఏమాత్రమూ తలకెక్కలేదు. అది కపటంగా నవ్వి, తన అన్నను విడిచి వెళ్ళిపోయింది.

ఈలోపల పింగళకమూ, సంజీవకమూ తిరిగి పోరాటం మొదలు పెట్టాయి. పింగళకం తీవ్రంగా గాయపడినప్పటికీ చిట్టచివరకు సంజీవకాన్ని చంపేసింది.

రక్తం ఓడుతూ పడిఉన్న తన పాత మిత్రుడి శవాన్ని చూస్తూ ఉంటే పింగళకానికి జాలి పుట్టుకొచ్చింది.

''అహా! ఎంతపని చేశాను! అతనే నేనూ, నేనే అతనూగా ఉంటిమే! అతన్ని చంపి, నేను కూడా సగం చచ్చాను,'' అనుకున్నది పింగళకం.

దమనకం పింగళకం వద్దకు వచ్చి, ''మహారాజా, ఎందుకు విచారంగా ఉన్నారు? తండ్రి అయేది, తమ్ముడయేది, కొడుకు అయేది, మిత్రుడయేది, రాజు శత్రువును విధిగా చంపాలి. దుర్బలుడైన రాజునూ, నిగ్రహం చాలని న్యాయాధిపతినీ, నీతి లేని భార్యనూ, కపట మిత్రుణ్ణీ, పొగరుబోతు సేవకుణ్ణీ శీఘ్రంగా తొలగించాలి. సాధారణ వ్యక్తులు పాటించే నీతి సూత్రాలు రాజులకు వర్తించవు. ఇతరులలో దోషమనిపించుకునేది రాజులో సాధారణంగా గుణం అనిపించుకుంటుంది. రాజు సమయోచితంగా, విశ్వాసంగానూ, విశ్వాసరహితంగానూ ఉండాలి; క్రూరుడుగానూ, దయామయుడుగానూ ఉండాలి; దాతగానూ, లోభిగానూ ఉండాలి; ధనాన్ని మంచినీరు లాగానూ, మందు లాగానూ వాడాలి. మీ సింహాసనానికి గాలం వేసిన ఈ సంజీవకాన్ని చంపటం చాలా మంచిపని,'' అన్నది.

ఈ మాటలతో పింగళకానికి మనోవేదన తగ్గింది. అది దమనకాన్ని తన మంత్రిగా పెట్టుకుని, అరణ్యరాజ్యాన్ని పాలించసాగింది.

—(మిత్రభేదం సమాప్తం)






మిత్రభేదం



## 33

దక్షిణదేశంలో మహిళారూప్య నగరం సమీపంలో ఉండిన మహారణ్యంలో ఒక విశాలమైన వటవృక్షం ఉండేది. దాని మీద ఉండిన అసంఖ్యాకమైన పళ్ళను వేలాది పక్షులు తినేవి. దాని నీడ కింద ఎంత మంది బాటసారులైనా విశ్రమించ టానికి చోటు ఉండేది. దాని ఊడలు ఎంతో మేరదిగాయి. దాని ఆకుల మధ్య ఎన్నో రకాల పక్షులు గూళ్ళు కట్టు కున్నాయి. దాని కొమ్మల మీద అనేక కోతుల సమూహాలు నివసించేవి. దాని పూల తేనెలను అంతులేని తేనెటీగలు పట్టుకుపోయేవి.

ఆ మహావృక్షం మీద లఘుపతనకం అనే కాకి నివసిస్తూ ఉండేది. ఒకనాడు అది ఆహారం కోసం మహిళారూప్య నగరం కేసి పోతూ ఒక బోయవాణ్ణి చూసింది. వాడు నల్లగానూ, క్రూరం గానూ ఉన్నాడు. వాడి చేతిలో వల ఉన్నది. వాణ్ణి చూసి కాకి, ''ఈ దుర్మా ర్గుడు నే నుండే వటవృక్షం వైపే పోతు న్నాడు. అక్కడ వాడు తప్పక పక్షుల్ని పట్టుతాడు. పాపం, వాటిగతి ఏమి కానున్నదీ తెలియదు. ఏమైనా నేను వాటిని కాపాడాలి,'' అనుకున్నది.

ఇలా అనుకుని ఆ కాకి వెనక్కు తిరిగి వెళ్ళి, పక్షులన్నిటితోనూ ఇలా చెప్పింది:

''వలా, బియ్యపుగింజలూ తీసుకుని ఒక బోయవాడు ఇటుగా వస్తున్నాడు. మీరు ఆ దుర్మార్గుణ్ణిగాని, వాడు వేసే బియ్యాన్నిగాని నమ్మకండి. వాడు వల వేసి, బియ్యం చల్లుతాడు. ఆ బియ్యాన్ని మీ రందరూ విషం కింద భావించి, వర్జించండి.''

అట్ట చివరి బొమ్మ



బోయవాడు వటవృక్షం వద్దకు వచ్చి, వల పరిచి, బియ్యంగింజలు చల్లాడు. తరవాత వాడు కొంతదూరం వెళ్ళి, ఒక చోట దాగి, వల వేసి చూడసాగాడు. కాకి ముందుగానే హెచ్చరించి ఉండటంచేత, పక్షులన్నీ రహస్యంగా దాక్కున్నాయి.

కాని కొద్ది సేపటికల్లా చిత్రగ్రీవ మనే పావురాల రాజు, తన వెయ్యిమంది అనుచరులతో సహా, ఆహారం వెతుకుతూ అటుగా వచ్చింది. దూరాన ఉండగానే వాటికి బియ్యపుగింజలు కనపడ్డాయి. అవి వాటి కేసి ఎగురుతూ వచ్చాయి. కాకి వాటికి ప్రమాదం గురించి హెచ్చరిక చేసింది. కాని లాభం లేకపోయింది. జిహ్వా చాపల్యంతో పావురాలన్నీ బియ్యపు గింజల పైన వాలి, వలలో చిక్కుకు పోయాయి. అజ్ఞానంలో ఉంటూ, జిహ్వా చాపల్యానికి గురి అయే ప్రాణులు, చేపల లాగా ఆకస్మిక మరణానికి గురికావటం తప్పదు గదా! అంతమాత్రాన పావురాలను తప్పు పట్టనవసరం లేదు. మానవ జాతికి దురాశ సహజమేగద! లేకపోతే, రావణుడి వంటి దైవభక్తుడు ఇతరుడి భార్యను అపహరించటం పాపమని ఎందుకు గ్రహించకపోవాలి? దైవస్వరూపుడైన రాముడికి బంగారులేడి అసంభవమనీ, అది మాయ అనీ ఎందుకు తెలియకపోవాలి? ధర్మపరుడైన యుధిష్ఠిరుడు పాచికలాడి ఆకస్మికంగా తన సర్వస్వమూ ఎందుకు పోగొట్టుకోవాలి? తన మనస్సును ఏదైతే ఆకర్షిస్తుందో దాని వెనక దాగి ఉండే ప్రమాదాన్ని మనిషి గుర్తించలేక పోతాడనుకోవాలి. లేదా, అపాయం కలగటం తప్పనిసరి అయిన క్షణంలో విధినిర్ణయం వల్ల మేధావంతులకు కూడా బుద్ధి పెడతల పట్టుతుందని అనుకోవాలి.

పావురాలు తన వలలో చిక్కుకు పోయాయని బోయవాడికి తెలిసింది.

బోయవాడు పన్నిన ఉచ్చులలో తన అనుచరులందరూ చిక్కుకు పోయిన

సంగతి గ్రహించి, చిత్రగ్రీవం వాటితో ఇలా అన్నది:

"విచారించి కుంగిపోకండి. ఆపదలో మనసును చిక్కబట్టుకున్న వాడు ఆ ఆపదను గడవగలుగుతాడు. బోయ వాడు వచ్చేలోపున, మన మందరమూ ఒకేసారి గాలిలోకి ఎగిరి, వలతో సహా ఆ దుర్మార్గుడికి కనబడకుండా వెళ్ళి పోదాం. అలా అయితేనే మనం బతికి పోతాం. అలాకాక మనం నిరాశ చెంది, కుంగిపోయి, తలా ఒక దిక్కుకూ ఎగిరి నట్టయితే మన అందరికీ, రెండు తలల పక్షి కథలో లాగ ప్రమాదం తప్పదు."

రెండు తలల పక్షి కథ

[ఒకప్పుడు రెండు తలల పక్షి ఒకటి ఉండేది. ఆ తలలు విరుద్ధదిక్కులుగా ఉండేవి. ఒకనాడు దాని ఒక నోటికి అమృతం అందింది. రెండో నోరు తనకు కూడా అమృతంలో భాగం ఇయ్యమన్నది. దానికి మొదటి నోరు ఒప్పుకోలేదు. అందుకని రెండో నోరు విషం కోసం వెతికి తిన్నది. ఆ విషం పక్షినీ, దాని రెండు తలలనూ కూడా చంపేసింది.]

పావురాల రాజైన చిత్రగ్రీవం ఈ విధంగా హెచ్చరించిన మీదట పక్షులన్నీ ఒక్కసారిగా, వలతో సహా, ఎగిరాయి.

బోయవాడు వాటి వెంబడి నేల మీద పరిగెత్తుతూ, "ఆ పక్షులు త్వరలోనే తమలో తాము కీచులాడుకోక మానవు. అప్పుడు అవి తప్పక నా వలతోసహా కింద పడతాయి," అనుకున్నాడు.

లఘుపతనకం (కాకి) ఆహారం కోసం వెతకటం కూడా మాని, వల వెనకగా తాను కూడా ఎగురుతూ వెళ్ళింది.

త్వరలోనే పావురాలు వలతో సహా బోయవాడికి కనబడనంత దూరం వెళ్ళి పోయాయి. వాడు నిరాశచేసుకుని, "రాసి పెట్టిలేనిది జరగదు. రాసిపెట్టి ఉన్నది ప్రయత్నం అవసరం లేకుండా దానంతట అదే జరుగుతుంది. నా కుటుంబానికి జీవనాధారంగా ఉండిన వల కూడా పోయింది," అనుకుని వెనక్కు మళ్ళాడు.



CHANDAMAMA (Telugu) MARCH 1976 Regd. No. M. 4854




మిత్రసంప్రాప్తి



## 34

బోయవాడు వెళ్ళిపోగానే చిత్రగ్రీవం తన అనుచరులతో, ''పాపిష్ఠి బోయవాడు వదిలిపోయాడు. ఇక మనం నిశ్చింతగా మహిళారూప్యానికి పోదాం. ఆ నగరానికి ఉత్తర ప్రాంతంలో నాకు స్నేహితుడైన హిరణ్యకం అనే ఎలుక ఉన్నది. అది మన ఉచ్చులన్నీ కొరికేసి మనకు స్వేచ్ఛ ఇస్తుంది. ఆపదలో స్నేహితులు తోడ్పడ వలసిందే గాని ఇతరులు 'అయ్యోపాపం!' అని కూడా అనరు,'' అన్నది.

చిత్రగ్రీవం దారితీయగా పావురాలన్నీ హిరణ్యకం అనే ఎలుక ఉండే బిలం వద్దకు ఎగిరి వెళ్ళాయి. పావురాలరాజు బిలద్వారం వద్ద నిలిచి, ఎలుగెత్తి పిలుస్తూ, ''మిత్రమా, హిరణ్యకా! త్వర గారా. నాకు గొప్ప ఆపద సంభవించింది,'' అన్నది.

ఈ కేక విని, హిరణ్యకం బిలం లోపలనే ఉండి, ''ఎవరు నువ్వు? ఇక్కడికెందుకు వచ్చావు? నీకు వచ్చిన ఆపద ఏమిటి? అంతా విశదంగా చెప్పు,'' అన్నది. చిత్రగ్రీవం ఇలా అన్నది :

''నేను పావురాల రాజును, చిత్రగ్రీవాన్ని! నీ మిత్రుణ్ణి! త్వరగా రా. నాకు నీ సహాయం వెంటనే కావాలి.''

ఈ మాట విని హిరణ్యకం మిత్రుణ్ణి చూసే ఆనందంతో బయటికి వచ్చి, తన మిత్రుడూ, అతని అనుచరులూ ఉచ్చులలో చిక్కుకుని ఉండటం చూసి దుఃఖిస్తూ, ''ఏమిటిది?'' అని అడిగింది.

దానికి చిత్రగ్రీవం ఇలా అన్నది :

''ఎందుకు అడుగుతావు? గ్రహించలేవా? పూర్వజన్మలో చేసుకున్న దుష్కృతం కొద్దీ విధి రకరకాల పనులు

చేయిస్తుంది. జిహ్వాచాపల్యం కారణంగా ఈ విపత్తు తెచ్చుకున్నాం.''

హిరణ్యకం ఇలా అన్నది:

''పక్షి నూరుమైళ్ళ దూరాన ఉన్న ఆహారాన్ని చూడగలదుగాని కళ్ళఎదటనే ఉన్న వలను చూడలేదు. అయినా విధి బలీయమనే నిర్ణయానికి నేను వచ్చాను. ఏమంటావా? మహా బలవంతులైన సూర్యుడూ, చంద్రుడూ రాహువుకు చిక్కుతున్నారు కారా? మదించిన ఏనుగులూ, క్రూర విష సర్పాలూ, గాలిలో ఎగిరే పక్షులూ మనిషికి దొరికిపోవటం లేదా? ఎక్కడ జీవించినా ప్రాణులను మృత్యువు పట్టుకుపోతూనే ఉన్నది.''

ఇలా అని హిరణ్యకం పక్షుల బంధాలను కొరకనారంభించింది.

అప్పుడు చిత్రగ్రీవం హిరణ్యకంతో, ''మిత్రమా, ముందు నా ఉచ్చులు కొరకకు. నా అనుచరులను విడిపించి, తరవాత నన్ను విడిపించు,'' అన్నది.

''అది అర్థంలేనిమాట. యజమాని తరవాతనే అనుచరులు,'' అన్నది హిరణ్యకం.

"మిత్రమా, అలా అనకు. వీళ్ళు, పాపం, నా పైన ఆధారపడి ఉన్న అభాగ్యులు; తమ తమ వాళ్ళను వదిలి, నా వెంట వచ్చినవాళ్ళు. నేను వాళ్ళపట్ల



ఈ మాత్రం శ్రద్ధచూపవద్దా? రాజు ఎంత పేదవాడైనా తన సేవకులపట్ల శ్రద్ధచూపేవాడైతే, వాళ్ళు అతన్ని విడవరు. అది అలా ఉంచి, ఇన్ని బంధాలు కొరకటంలో నీ పళ్ళు విరిగిపోవచ్చు. లేదా, ఆ బోయవాడు నా అనుచరులు విముక్తి పొందే లోపుగా తిరిగి రావచ్చు. అప్పుడు నాకు నరకం సంప్రాప్తమవుతుంది. తన అనుచరులు కష్టాలలో ఉండగా తాను సుఖాలు అనుభవించిన నాయకుడు చచ్చి నరకానికి పోతాడు,'' అన్నది చిత్రగ్రీవం.

దానికి హిరణ్యకం ఇలా అన్నది:

"మిత్రమా, రాజుల విధులు నాకూ తెలుసు. నేను నిన్ను పరీక్షించటానికే

అలా అన్నాను. నువు పరీక్షలో నెగ్గావు. ఇంకా అనేకవేల పావురాలకు నువు రాజు కాదగుదువు. తన కింది వాళ్ళపై దయా దాక్షిణ్యాలు గల రాజు మూడు లోకాలనూ పాలించగలడు. నేను నీ అనుచరులను బంధవిముక్తులను చేస్తాను.''

ఇలా అని హిరణ్యకం పావురాలన్నిటినీ బంధ విముక్తుల్నిచేసి, చిత్రగ్రీవంతో, ''మిత్రమా, ఇక మీరు స్వేచ్ఛగా మీ చోటికి వెళ్ళిపొండి. మరొక సారి ప్రమాదం సంభవించినప్పుడు నా వద్దకు రావటానికి సంకోచించ వద్దు,'' అని చెప్పి, తన బిలంలోకి వెళ్ళిపోయింది.

చిత్రగ్రీవం తన అనుచరులతో సహా తిరిగి వెళ్ళింది.

ఇదంతా కళ్ళారా చూసిన లఘుపతనకం అనే కాకి తనలో, ''ఆహా, ఈ హిరణ్యకం ఎంత మంచిది! ఎంత వివేకం గలది! నేను మాత్రం విధిని ఒంటరిగా జయించగలనా? నేను కూడా ఈ ఎలుకతో స్నేహం చేసుకుంటాను. అనంతమైన సముద్రం కూడా తన మిత్రుడైన చంద్రుడి సహాయంవల్ల గదా పైకి లేస్తుంది!'' అనుకున్నది.

అది హిరణ్యకం ఉండే బిలం వద్దకు వెళ్ళి, చిత్రగ్రీవం గొంతుతో, ''ఏయ్, హిరణ్యకా! ఏమోయ్!'' అని పిలిచింది.


ఈ కేక వినగానే, తాను చిత్రగ్రీవం బంధాలు కొరకటం మరిచిపోయానేమో నని అనుమానం తగిలి, హిరణ్యకం తన బిలం నుంచే, "ఎవరది?'' అని అడిగింది.

''నేను లఘుపతనకం అనే కాకిని,'' అన్నది కాకి.


ఈ మాట వినగానే హిరణ్యకం తన బిలంలోకి మరింత దూరం వెళ్ళి, ''ఇక్కడి నుంచి వెంటనే వెళ్ళిపో!'' అన్నది.

దానికి కాకి, ''నన్నెందుకు పొమ్మంటున్నావు? నేను అతిముఖ్యమైన పని మీద వచ్చాను,'' అన్నది.

''నీకూ, నాకూ పొత్తు క్షేమకరం కాదు,'' అన్నది హిరణ్యకం.



CHANDAMAMA (Telugu) APRIL 1976 Regd. No. M. 4854




మిత్రసంప్రాప్తి



# మిత్రసంప్రాప్తి

## 35

"నీకూ, నాకూ పొత్తు కుదరదు." అని హిరణ్యకం అనేసరికి లఘుపతనకం (కాకి) ఇలా అన్నది:

"నువు చిత్రగ్రీవాన్నీ, అతని అనుచరులనూ బంధవిముక్తులను చెయ్యటం చూసి నేను పరమానందం చెందాను. అందుకని నేను నీ స్నేహం కోరుతున్నాను."

"నువు తినే దానివి, నేను ఆహారాన్ని. మన ఇద్దరికీ సఖ్యం ఎలా సాధ్యం అవుతుంది? మైత్రికీ, వియ్యానికీ జన్మలూ, సంపదలూ సమంగా ఉండాలి; అంతే గాని ఒకరు ధనికులూ, ఒకరు పేదవారూ, ఒకరు బలులూ, ఒకరు దుర్బలులూ అయితే అవి సాధ్యపడవు. అందుచేత నువు తక్షణం వెళ్ళిపో." అన్నది హిరణ్యకం (ఎలుక).

"నువు బయటికి రాకపోతే నేను నీ కలుగు ద్వారం దగ్గిరే ప్రాయోపవేశం చేసి, ప్రాణాలు విడుస్తాను." అన్నది లఘుపతనకం.

"నువు ఎంత అసమంజసంగా మాట్లాడుతున్నావు! నా సహజశత్రువుతో నేను ఎలా స్నేహం చెయ్యగలను? ఎలా కాళ్ళూ వేళ్ళూ పడినా, ఎంత సమభావాలు కల వాడైనా శత్రువుతో చెలిమి చేయరాదని పెద్దలు చెప్పరా? సలసల కాగే నీరు సైతం నిప్పును ఆర్పుతుంది గద!" అన్నదీ హిరణ్యకం.

"నువు చెప్పేది మాత్రం ఏం సమంజసంగా ఉన్నదీ? నా మొహం చూడకుండానే నేను నీ సహజ శత్రువునని ఎలా అంటున్నావు?" అని లఘుపతనకం అడిగింది.

అట్ట చివరి బొమ్మ

"శత్రువులు రెండు రకాలుంటాయి. కొందరు జాతి శత్రువులు. మరికొందరు ఏవో కారణాంతరాలవల్ల శత్రువులవుతారు. నువు నాకు జాతి శత్రువువు. జీవిత వ్యాపకంలో ఏదో కారణంవల్ల ఏర్పడిన శత్రుత్వాన్ని తెలివిగా పరిష్కరించవచ్చు. జాతి వైషమ్యం మాత్రం ఎవరో ఒకరు చస్తేగాని అంతం కాదు," అన్నది హిరణ్యకం.

"ఈ రెండు రకాల శత్రువుల మధ్యా తేడా తెలుసుకోవటం ఎలాగో దయఉంచి చెప్పు," అని కాకి అడిగింది.

దానికి ఎలుక ఇలా చెప్పింది:

"సంపర్కం వల్ల ఏర్పడే శత్రుత్వానికి ఏదో ఒక ప్రత్యేకమైన కారణం ఉంటుంది; ఆ కారణాన్ని తొలగిస్తే ఆ శత్రుత్వం కూడా పోతుంది. ముంగిసా, పామూ; శాకాహారమృగాలూ, మాంసాహారమృగాలూ; నీరూ, నిప్పూ; ధనికులూ, దరిద్రులూ; సింహమూ, ఏనుగూ; వేటగాడూ, లేడీ; వేదాలు తెలిసిన బ్రాహ్మడూ, నాస్తికుడూ; వివేకీ, మూఢుడూ; శీలవతులూ, నీతిమాలిన స్త్రీలూ; దేవతలూ, రాకసులూ-వీళ్లమధ్య సహజశత్రుత్వం ఉంటుంది. వీటిలో ఏ ఒక వర్గమూ ఇంకొక వర్గాన్ని పూర్తిగా నిర్మూలించ లేదు. కాని వాళ్ళ మధ్య



సంఘర్షణ సాగుతూనే ఉన్నది; ఒకరిని తుడిచిపెట్టలేక పోయామే అన్న బాధ మరొకరికి ఉంటూనే ఉన్నది. ఇలాటి శత్రుత్వానికి విరుగుడులేదు."

"అలాటి శత్రుత్వం అనర్థమైనది. వివేకి అయినవాడు కొత్త మిత్రులను సంపాదించాలి గాని, పాత శత్రుత్వాలను పెంచుకోరాదు, కనుక నాతో స్నేహం చెయ్యి," అన్నది కాకి.

దానికి ఎలుక ఇలా అన్నది:

"నువు మంచిదానివే కావచ్చు. నాకు అపకారం చేసే ఉద్దేశం నీకు లేక పోవచ్చు. అయినా మన స్నేహం వల్ల మేలుజరగదు. చివరకు ప్రకృతిస్వభావం

జయిస్తుంది: నేను చాలా మంచిదాన్ని కాబట్టి, ఎవరి శత్రుత్వమూ నాకు కీడు కలిగించ దనవచ్చు. కాని పాణిని అనే వ్యాకరణ వేత్తను ఒక సింహం చంపింది. జైమిని అనే తత్వవేత్తను ఒక ఏనుగు చంపింది. పింగళుడు అనే వేదపండితుణ్ణి ఒక మొసలి చీల్చేసింది."

కాకి ఇలా అన్నది:

"నువు చెప్పినది నిజమే. కాని నేను చెప్పేది కూడా విను. స్నేహభావ మన్నది మనుషుల మధ్య పరస్పర సహకారం ద్వారా ఏర్పడుతుంది; మంచివాళ్ళ మధ్య ప్రథమ సందర్శనంలోనే కలుగుతుంది. నీకు ఎలాటి అపకారమూ చెయ్యనని ప్రమాణం కూడా చేస్తున్నాను."

"నాకు నీ ప్రమాణాల పైన విశ్వాసం లేదు. శత్రువు చేసే ప్రమాణాలను విశ్వసించరాదు. తమను విశ్వసించని శత్రువును దేవతలు కూడా చంపలేరు. ఇంద్రుడు దితి గర్భాన్ని ఛిద్రంచేశాడు. ఎందుచేతనంటే దితి అతన్ని విశ్వసించింది. అందుచేత శత్రువును నమ్మరాదు. ఎంతటి మహా బలులు కూడా విశ్వాసం ఉంచిన కారణంగా దుర్బలుల చేత నాశం పొందుతారు," అన్నది ఎలుక.

ఈ మాటలు విని కాకి కొంత సేపు ఏమీ అనలేకపోయింది: "ఈ ఎలుకకు ఎంత నీతి తెలుసు! దీని స్నేహం చెయ్యాలనే కోరిక నాలో ఇంకా పెరుగుతున్నది గాని తరగటం లేదు," అని అది అనుకున్నది.

చివరకు అది, "ఓ, హిరణ్యకా. ఏడడుగులు కలిసి నడిస్తేనే మిత్రులవుతారంటారుగదా. ఈ దీర్ఘసంభాషణవల్ల, నువు అనుకోకుండానే, నాకు మిత్రుడవయావు. ఇలా మనం రోజూ మంచి, చెడ్డలు మాట్లాడుకోవచ్చు గద!" అన్నది.

కాకి తెలివీ, దాని మాటల్లో నిజమూ ఎలుక గ్రహించి, "అలాగే చెయ్యవచ్చు. కాని నువు నా కలుగులోకి ఎన్నడూ ప్రవేశించరాదు," అన్నది. అందుకు కాకి ఒప్పుకున్నది.






మిత్రసంప్రాప్తి



## 36

అది మొదలు కాకి, ఎలుకా రోజూ కలుసుకుని, చర్చలతో మహా సంతోషంగా కాలం గడుపుతూ వచ్చాయి. అవి పరస్పరం సహకరించేవి కూడా. యజ్ఞాలు చేసిన చోట మిగిలిపోయిన మాంసమూ, అన్నం మెతుకులూ తెచ్చి కాకి ఎలుకకు ఇచ్చేది. అలాగే ఎలుక, తాను రాత్రివేళ సేకరించిన బియ్యమూ, ఇతర తిను బండారాలూ కాకికి పెట్టేది. ఇలాటి ఇచ్చి పుచ్చుకోవటాలతో రెంటి మధ్యా మైత్రి దృఢమయింది. ఇచ్చి పుచ్చు కోవటాలు లేని స్నేహమంటూ ఉంటదు గదా! దేవతలు సైతం మొక్కులు చెల్లిస్తేనేగాని కోరికలు తీర్చరు. ఇవ్వటం ఉన్నంత కాలమే మమకారం ఉంటుంది. తల్లి దగ్గిర పాలురావటం నిలిచిపోగానే దూడ తల్లిని వదిలేస్తుంది. అలా కాకుండా, ఇవ్వటం ద్వారా శత్రువును మిత్రుడుగా చేసుకోవచ్చు. జంతుజాతిలో ఇచ్చేగుణం కడుపుతీపి కన్న హెచ్చయి నది. గేదె తన దూడ ఉండగానే, తన పాలను ఎలాటి దుర్మార్గుడికైనా ఇచ్చే స్తుంది. సహజశత్రువులై ఉండి కూడా, ఎలుకా, కాకీ దృఢస్నేహంలో బంధింప బడిపోయి, సరదాగా చర్చలు జరుపు కుంటూ వచ్చాయి.

అంతలో ఒకనాడు, కాకి ఎలుక వద్దకు వచ్చి, కన్నీరు పెట్టుకుంటూ, గద్గద స్వరంతో, "ఓ, హిరణ్యకా! మనకు త్వరలోనే ఎడబాటు రానున్నది. నేను ఈ దేశం విడిచి పోవలిసివచ్చింది." అన్నది.

"ఏం?" అని ఆశ్చర్యపోతూ హిరణ్యకం అడిగింది.

"దేశంలో భయంకరమైన నీటి కరువు ఏర్పడింది. ప్రజలు మాడిపోతున్నారు.

అట్ట చివరి బొమ్మ

యజ్ఞాలు నిలిచిపోయాయి. వాటి మూలానె నాకు మంచి ఆహారం దొరికేది. ప్రజలు ఆకలిబాధకు తట్టుకోలేక అడ్డమైన పక్షులన్నిటినీ పట్టుకుని తింటున్నారు. ఏ ఇంట చూసినా పట్టుబడిన దౌర్భాగ్యపు పక్షులే కనబడుతున్నాయి. వాటిని చూస్తే నా గుండె తరుక్కుపోతున్నది. నేను కూడా పట్టుబడి, ఎలాగో ప్రాణాలతో తప్పించుకున్నాను. అందుకే నేను వెంటనే దేశం విడిచి వెళ్ళ నిశ్చయించాను,'' అన్నది కాకి.



''ఎక్కడికి పోదామనుకుంటున్నావు?'' అని ఎలుక అడిగింది.

''దక్షిణ దేశంలో ఒక మహారణ్యం మధ్య ఒక పెద్ద సరస్సు ఉన్నది. అక్కడ నాకు నీ కన్న కూడా ఆత్మీయుడైన స్నేహితుడు మంథరకం అనే తాబేలు ఉన్నది. అది నాకు చేపమాంసం ఇస్తుంది. ఆ మాంసం తింటూ, దానితో గోష్ఠి జరుపుతూ సుఖంగా ఉంటాను. ఇక్కడే ఉండి, పక్షిజాతి బంధించబడటమూ, చావటమూ చూడలేను. ప్రయాణం దుర్ఘటం కాదా, అంత దూరప్రాంతానికి వెళ్ళటం వాంఛనీయమా అని నువ్వు అడగవచ్చు. కాని సమర్థులకు చేయరానిదీ, పట్టుదల ఉంటే సాధించరానిదీ, జ్ఞానవంతుడికి పరదేశమూ, సాధుగా మాట్లాడే వాడికి విజాతీయుడూ అంటూ ఉండదు గదా! దేశం కరువు వాతపడి, పంటలు మాడిపోతూ ఉన్నప్పుడు, తమ కుటుంబాలు నాశనం కావటమూ, దేశం దుర్భిక్షం పాలు కావటమూ చూడకుండా ముందుగా దాటిపోయే వాళ్ళు ధన్యులు,'' అన్నది కాకి.

''అలా అయితే, నేను కూడా వస్తాను. ఇక్కడే ఉండిపోవటం నాకూ క్షేమం కాదు,'' అన్నది ఎలుక.

''ఎందుచేత?'' అని కాకి అడిగింది

''అది పెద్ద కథలే. మనం సరస్సు చేరుకున్నాక చెబుతాను,'' అన్నది ఎలుక.

"నేను ఆకాశంలో ఎగిరే పక్షిని. నువ్వు నేలను అంటి పెట్టుకుని ఉండే ప్రాణివి. మనం కలిసి ఎలా ప్రయాణించగలం?" అని కాకి అడిగింది.

"నీవు నా ప్రాణాన్ని కాపాడదలుచుకుంటె, నన్ను నీ వీపు మీద ఎక్కించుకుని, సరస్సు వద్దకు ఎగిరి వెళ్ళు. అంతకన్న మార్గం లేదు." అన్నది ఎలుక.

"సంతోషంగా ఆ పని చేస్తాను. నా అదృష్టం! ఇద్దరు స్నేహితులతో నాకు సరస్సు వద్ద మరింత ఆనందంగా కాలక్షేపమవుతుంది." అన్నది కాకి.

హిరణ్యకం కాకి వీపు మీదికి ఎక్కింది. కాకి తొట్రుపడకుండా, అతి తేలికగా సరస్సు వద్దకు ఎగిరి వెళ్ళింది.

మంథరకం బహు జాగరూకతగల ప్రాణి. అది, ఎలుకను వీపు మీద ఎక్కించుకుని వస్తున్న కాకిని చూసి, "ఇదేదో వింత కాకి లాగున్నది. మనం తప్పుకుందాం," అనుకుని, నీటిలో మునిగింది.

కాకి ఎలుకను ఒక చెట్టు కింది కలుగు దగ్గిర దించి, చెట్టుకొమ్మ చివరన వాలి, "మంథరకా, త్వరగా రా. నేను నీ మిత్రుణ్ణి, లఘుపతనకాన్ని. ఆర్తితో వచ్చాను. అందుచేత, వచ్చి నన్ను కౌగలించుకో." అని గట్టిగా కేక పెట్టింది.

తాబేలు ఆనందబాష్పాలు రాల్చుతూ, వేగంగా కొట్టుకుంటున్న గుండెతో ఒడ్డుకు వచ్చి, "మిత్రమా, నీ కౌగిలి ఇయ్యి. మనం కలుసుకుని ఎంతో కాలం కావటం వల్లా, నువ్వు చాలా మారిపోయి ఉండటం వల్లా నిన్ను పోల్చలేకపోయాను. అందుకే నీటిలో దాక్కున్నాను." అన్నది.

కాకి చెట్టు మీది నుంచి కిందికి దిగి తాబేలును కౌగలించుకున్నది.

చాలా కాలానికి తిరిగి కలుసుకున్న మిత్రులు మధ్యకాలంలో కలిగిన తమ అనుభవాలను గురించి ముచ్చటించుకుంటూంటె, ఎలుక వచ్చి తాబేలుకు సాష్టాంగ నమస్కారం చేసి, కాకి సమీపంలో కూర్చున్నది.



CHANDAMAMA (Telugu) JUNE 1976 Regd. No. M. 4854




మిత్రసంప్రాప్తి



# మిత్రలాభం

## 37

అప్పుడు తాబేలు కాకితో, "ఈ ఎలుక ఎవరు? నీకు సహజ ఆహారమైన ఈ ఎలుక నీ కడుపులో ఉండటానికి మారుగా నీ వీపు మీద ఎందుకు ఉన్నది? దాన్ని నువ్వు ఎందుకు మోసుకువచ్చావు? ఇందుకు అసాధారణమైన కారణం ఏదో ఉండి ఉండాలి," అన్నది.

"ఈ ఎలుక పేరు హిరణ్యకం. నా ఆప్త మిత్రుడు. అతను ఏదో కష్టంలో ఉండి నీ కోసం వచ్చాడు. నేనడిగితే అదంతా పెద్దకథ లెమ్మన్నాడు. అందుచేత అదేమిటో నాకూ తెలియదు," అన్నది కాకి.

కాకి, తాబేలూ కోరగా హిరణ్యకం (ఎలుక) తన కథ ఇలా చెప్పసాగింది:

దక్షిణ దేశంలో మహిళారూప్యమనే నగరం ఉన్నది. అక్కడ ఒక గొప్ప శివాలయం ఉన్నది. దాని సమీపంలోనే ఒక మఠం ఉన్నది. అందులోని ఒక గదిలో చూడాకర్ణుడు అనే ఒక సన్యాసి ఉండేవాడు. అతను రోజూ భిక్షా పాత్ర తీసుకుని నగరంలో భిక్షం ఎత్తేవాడు. నగరంలో అనేకమంది ధనికులు ఉండటం చేత అతనికి చక్కెరతోనూ, బెల్లంతోనూ చేసిన మిఠాయి వస్తువులూ, దానిమ్మ, మామిడి లాటి మంచి మంచి పళ్ళూ దొరికేవి. అందులో కొద్ది భాగం మాత్రమే తాను తిని, హెచ్చు భాగం భిక్షాపాత్రలో భద్రపరిచి, దాన్ని గోడకు ఉండే కొయ్య చిలుకకు తగిలించేవాడు.

రాత్రి వేళ నేనూ, నా అనుచరులూ వెళ్ళి, ఎగిరి భిక్షాపాత్రలోకి దూకి, రుచి గల ఆ ఆహారాన్ని తినేసేవాళ్ళం.

ఇంతలో ఒకనాడు ఆ సన్యాసి మిత్రుడొకడు, బృహస్పతి అనేవాడు చూడ

అట్ట చివరి బొమ్మ

వచ్చాడు. ఆ మునివి శరీరమూ, పొట్టా విపరీతంగా లావుగా ఉండేవి.

సన్యాసి చూడాకర్ణుడు బృహస్పతితో, "మిత్రమా, ఇన్నాళ్ళూ ఎక్కడెక్కడ తిరిగావు? ఏమేమి చూశావు?" అన్నాడు.

"ఎంతో కాలం క్రితం కార్తీక పౌర్ణమి నాడు పుష్కర తీర్థంలో నువ్వూ, నేనూ స్నానం చేసిన సంగతి నీకు గుర్తు ఉంటుంది. ఆ జనసమ్మర్దంలో మనిద్దరమూ చీలిపోయి, ఒకరి నొకరం మరి కలుసుకోలేకపోయాం. అటు తరవాత నేను హరిద్వారమూ, ప్రయాగా, కాశీ మొదలైన తీర్థాలు సేవిస్తూ ఎన్నో వింతలు చూశాను." అంటూ ప్రారంభించి బృహస్పతి చెప్పుకుంటూ పోయేటప్పుడు నేను భిక్షాపాత్రలో ప్రవేశించి పదార్థాలు ఆరగిస్తుంటే, సన్యాసి నన్ను భయపెట్టటానికి తన కర్రతో భిక్షాపాత్ర మీద కొట్టసాగాడు.

ఇది చూసి బృహస్పతి విసుక్కుంటూ, "ఇదేమిటి, మిత్రమా? నన్ను చెప్పమని ఆ కర్రతో అలా చప్పుడు చేస్తావెందుకు? విసుగుపుట్టుతున్నదా?" అన్నాడు.

దానికి చూడాకర్ణుడు, "ఆగ్రహించకు, మిత్రమా! ఒక ఎలుక తన అనుచరులతో సహా వచ్చి, భిక్షాపాత్రలోకి దూకి, నేను దాచిన ఆహారమంతా తినేస్తున్నది." అన్నాడు.



"అక్కడ ఒక్క ఎలుకే ఉన్నదా? లేక చాలా ఉన్నాయా?" అని బృహస్పతి అడిగాడు.

"ఇతర ఎలుకలున్నాయిగాని, వాటిని నేను అంతగా పట్టించుకోను. ఇది వాటికి నాయకుడు. దానికి నేనంటే ఏమీ లక్ష్యం లేదు." అన్నాడు చూడాకర్ణుడు.

"దాని ధైర్యానికి బలమైన కారణం ఉండే ఉంటుంది. వెనకటికి బ్రాహ్మణి నువ్వుపప్పుకు ముడినువ్వులు మారకం తీసుకున్నదంటే దానికి కారణం ఉండనే ఉన్నది గదా!" అన్నాడు బృహస్పతి.

"ఏమిటా కథ?" అని చూడాకర్ణుడు అడిగాడు. బృహస్పతి ఇలా కథ చెప్పాడు:

నువ్వుపప్పుకు మురినువ్వులు

ఒక వానాకాలం నేను ఒక పట్టణంలో ఒక బ్రాహ్మణుణ్ణి అతని ఇంట వానలు వెళ్ళిపోయినదాకా ఉండనియ్యమన్నాను. బ్రాహ్మణుడు సరేనన్నాడు. ఒకనాడు ఆయన తన భార్యతో, "రేపు దక్షిణాయన పుణ్యకాలం వస్తుంది. సంక్రమణానికి బ్రాహ్మణులను పిలిచి భోజనం పెడదాం," అన్నాడు.

ఆమె, "మనకే తినటానికి లేకపోతే బ్రాహ్మణుల కేం పెడదాం?" అన్నది.

"అలా అనకు, పెద్దవాళ్ళు కూడా ఉన్నంతలో అర్థులకు పెట్టాలి. పొదుపుగా ఉండటం తప్పులేదు గాని దురాశ పనికి రాదు. దురాశతోనే గదా నక్క ప్రాణాలు తీసుకున్నది?" అన్నాడు భర్త.

"ఏమిటా కథ?" అని భార్య అడిగింది. భర్త ఇలా చెప్పాడు:

దురాశగల నక్క

ఒకనాటి ఉదయం ఒక వేటగాడు అరణ్యంలో ఒక అడవిపందిని బాణంతో కొట్టాడు. అది ఆ దెబ్బకు వెంటనే చావక వేటగాడి మీదికి వచ్చి, వాణ్ణి పడదోసి, వాడి పొట్ట చీల్చి చంపేసింది. కాని కొద్ది క్షణాలకు అది కూడా, రక్తం కోల్పోయి, వేటగాడి పక్కనే చచ్చిపడింది.

ఇది జరిగిన కొద్ది సేపటికి ఒక నక్క అటుగా వచ్చి, "ఆహా, ఏమి నా అదృష్టం! ఈ శవాలను సాధ్యమైనంత హెచ్చు కాలం తింటాను. ఈ పూటకు ఈ విల్లుకు కట్టిన అల్లెతాడూ, కట్టుతాళ్ళూ (తోలువి) తింటే కడుపునిండుతుంది," అనుకున్నది.

అది మెల్లిగా నేల మీది నుంచి విల్లును ఎత్తి, ఒక చివర ఉన్న కట్టుతాళ్ళు కొరుకుతూ, "ఉట్టుతియ్యంగా దొరికిన సొత్తు నైనా మందులాగా పొదుపుగా వాడాలి గాని, దుబారా చెయ్యరాదు," అనుకున్నది.

కాని అది కట్టుతాడు కొరికేసిన మరుక్షణం విల్లు తన్ని, దాని అంగుడులో నుంచి, తలలోకి దిగబడి ఆ నక్క కూడా అక్కడే చచ్చింది.





**38**

నక్క కథ విని బ్రాహ్మణుడి భార్య, ''సరే! ఇంట్లో వేయించిన నువ్వు లున్నాయి. తెల్లవారుఝామునే అడవికి వెళ్ళి, కట్టెలూ, దర్భలూ తీసుకు రండి. అన్నం వండి, నువ్వులతో ముగ్గురు బ్రాహ్మణులకు భోజనం పెడతాను.'' అని భర్తతో అన్నది.

మర్నాడు తెల్లవారుఝామున బ్రాహ్మణుడు అడవికి వెళ్ళాడు. అతని భార్య నువ్వులు దంచి, పొట్టు చెరిగి, పాయసం చేదామని ఎండబెట్టింది. ఆమె వంటింట్లో పని చూసుకోవటానికి వెళ్ళిన సమయంలో ఒక కుక్క వచ్చి, ఆ నువ్వులను అశుద్ధి చేసింది.

ఇది చూసి బ్రాహ్మడి భార్య, ''ఇవాళ బ్రాహ్మణులకు ఏం పెడతాను? ఒకటే దారి కనబడుతుంది. ఈ పొట్టు తీసిన నువ్వులను ముడినువ్వులకు మారకం వెయ్యాలి. ఆ తరవాత వంట చెయ్యాలి.'' అనుకున్నది.

ఆమె పొట్టు తీసిన నువ్వుపప్పు తీసుకుని పొరుగింటికి వెళ్ళి, ''ఇది తీసుకుని సరికి సరి ముడినువ్వులు ఇస్తారా?'' అని ఆ ఇంటావిడను అడిగింది.

లాభసాటి బేరం గదా అని ఆ ఇంటావిడ సంతోషంగా ఒప్పుకుని, బ్రాహ్మడి భార్యకు ముడినువ్వు లిచ్చింది. బ్రాహ్మడి భార్య వెళ్ళిపోయాక ఇంటావిడ తన కొడుకు కామందకితో తాను చేసిన లాభసాటి బేరం గురించి చెప్పి, ''ఏమంటావు?'' అన్నది.

కామందకి ఆమెతో, ''ఈ మారకం బేరం చూస్తే అనుమానం కలుగుతున్నది. ఏదో కారణం లేకుండా ఎవరూ అలాటి

నష్టపు బేరం చెయ్యరు. ఎవరా మనిషి?" అని అడిగాడు.

ఫలాని బ్రాహ్మడి భార్య అని తల్లి చెప్పింది.

"అబ్బే, ఆమె చాలా గడుసుదీ, జిత్తులమారీనూ. అమ్మా, ఆ నువ్వుపప్పు అవతల పారెయ్యి. అది పనికివచ్చేదైతే ఆమె నీకు యిచ్చేదికాదు." అన్నాడు కామందకి.

అది నిజమని గ్రహించి, అతని తల్లి అలాగే చేసింది.

ఈ కథ చెప్పి బృహస్పతి చూడా కర్ణుని వద్ద ఒక పార అడిగి పుచ్చుకుని నా కలుగు తవ్వ నారంభించాడు (అని ఎలుక చెప్పుకు పోయింది.)

నాకు చెడ్డ భయం వేసింది. ఎందుకంటే నేను నా కలుగులో చాలా బంగారమూ, ఆహారమూ దాచుకున్నాను. అవి పోతాయని భయపడ్డాను గాని, వాళ్ళకి అడ్డు తగలలేను, తగిలితే నా ప్రాణాలకే ముప్పు.

వాళ్ళిద్దరూ నేను దాచినదంతా కాజేసి, బంగారాన్ని చెరిసగం పంచుకుని, పరమానందంతో కూర్చున్నారు. నా ఇల్లు పోయింది; సొత్తు పోయింది. మరొక చోటు చూసుకుందామని, అక్కడి నుంచి నా అనుచరులతో బయలుదేరాను.



నా అనుచరులు ఆకలి మీద ఉన్నారు. చూడాకర్ణుడి పాత్ర నుంచి ఆహారం తస్కరించటానికి సాహసించవచ్చునని వాళ్ళు అభిప్రాయపడ్డారు. సరే, వెనక్కు వెళ్ళాం. మా అలికిడి విని చూడాకర్ణుడు భిక్షాపాత్రను కర్రతో కొట్టాడు.

"కర్రను ఆడిస్తున్నా వెందుకు?" అని బృహస్పతి అడిగాడు.

"ఆ దిక్కుమాలిన ఎలుక మళ్ళీ వచ్చింది," అన్నాడు చూడాకర్ణుడు.

"ఎందుకు భయపడతావు? దాని ఇల్లూ, సొత్తూ పోయాక, అది చచ్చినదాని కింద జమే. అదేమీ చేయలేదు," అన్నాడు బృహస్పతి.

ఈ మాట విని మండిపోయి, నేను భిక్షాపాత్ర కేసి చూశాను; కాని పొట్టిలో ఎత్తులేని కారణంచేత దాన్ని అందుకోలేక, తపీమని కిందపడ్డాను. బృహస్పతి వెదురు కర్రతో నన్ను చచ్చే దెబ్బ కొట్టాడు. విధిని నమ్మినవాడి కథలో లాగ ఆ దెబ్బను ఎలాగో తప్పించుకున్నాను.

"ఏమిటా కథ?" అని మంథరకం అడిగింది.

హిరణ్యకం ఇలా చెప్పింది:

విధిలో విశ్వాసం

ఉజ్జయిని మహా పట్టణంలో సాగరదత్తుడు అనే వర్తకుడు ఉండేవాడు. ఒకరోజు అతని కుమారుడు నూరు రూపాయలిచ్చి ఒక పుస్తకం కొనుక్కొని వచ్చాడు.

ఆ పుస్తకాన్ని చూసి సాగరదత్తుడు, "ఈ పుస్తకం ఎంత పెట్టి కొన్నావు?" అని కొడుకును అడిగాడు.

"నూరు రూపాయలు," అన్నాడు కొడుకు.

"మూర్ఖుడా, శ్లోకంలో ఒక్క పాదం మాత్రమే ఉన్న పుస్తకాన్ని నూరు రూపాయలిచ్చి కొన్నావా? ఇంత మంద మతివి నువ్వేమి డబ్బు సంపాదిస్తావు? నా ఇంటి నుంచి తక్షణం వెళ్ళిపో," అని సాగరదత్తుడు తన కొడుకును వెళ్ళగొట్టాడు.

తన తండ్రి ఇలా చేసినందుకు ఎంతో నొచ్చుకుని కొడుకు చాలా దూరం ప్రయాణం చేసి కౌశాంబీ నగరం చేరి, అక్కడ నివసించసాగాడు. కొద్ది రోజులు గడిచాయి. అక్కడి వాళ్ళు అతన్ని, "ఎక్కడి నుంచి వచ్చావు? ఏం పని మీద వచ్చావు? నీ పేరేమిటి?" అని అడగసాగారు.

ఆ ప్రశ్నకు అతను, "విధి నిర్ణయం అనివార్యం," అని మాత్రం జవాబు చెబుతూ వచ్చాడు.

అందుచేత కౌశాంబీలో అందరూ అతన్ని "విధి నిర్ణయం" అని పిలవసాగారు.





## 39

ఒకనాడు, అపురూప సౌందర్యవతి అయిన కౌశాంబీ రాజకుమార్తె చంద్రమతి, తన ఇష్టసఖి వెంట నగరం చూడబోయింది. ఆమె నగరపర్యటన చేస్తూ, ముఖ్యోద్యానంలో, మన్మథాకారుడూ, శక్తిమంతుడూ అయిన కాశీరాజకుమారుణ్ణి చూసింది. అతను ఆమె తండ్రిని చూడ వచ్చి ఉన్నాడు.

రాజకుమారి ప్రథమ సందర్శనంలోనే ఆ యువకుణ్ణి మోహించి, తన సఖితో, "ప్రియా, ఎలాగైనా ఈ రాత్రి నను ఇతన్ని కలుసుకునే ఏర్పాటు చెయ్యి. చూస్తూనే ఇతనికి నా హృదయాన్ని అర్పించాను. శాస్త్ర సమ్మతమైన గాంధర్వవిధిలో నేను ఇతనికి భార్యను కావాలి." అన్నది.

అప్పుడు ఆమె ఇష్టసఖి రాజకుమారుడి వద్దకు వెళ్ళి, "రాజకుమార్తె చంద్రమతి పంపగా వచ్చాను. నిన్ను చూస్తూనే ఆమె మోహపాశాలలో తగులుకుని, విరహబాధ చెందుతున్నదట. ఈ రాత్రి నువు వచ్చి, ఆమెను కలియకపోతే ఆమె ప్రాణాలు నిలవవట!" అని చెప్పింది.

"ఈ రాత్రి నేను వచ్చి, ఆమె మందిరం ప్రవేశించేదెలా?" అని రాజకుమారుడు అడిగాడు.

దానికి ఇష్టసఖి, "ఆమె గది గవాక్షం నుంచి బలమైన తాడు వేళ్ళాడగట్టుతాము. నువు దాని సహాయంతో ఎక్కి రావచ్చు," అన్నది.

అలాటి ఏర్పాటు జరిగితే తప్పక వస్తానన్నాడు రాజకుమారుడు.

రాజకుమార్తె వద్దకు ఇష్టసఖి తిరిగి వచ్చి, తాను చేసిన ఏర్పాటు గురించి చెప్పింది.

అట్ట చివరి బొమ్మ

రాజకుమారుడు తన బసకు తిరిగి వెళ్ళి, రాజకుమార్తె వృత్తాంతం గురించి దీర్ఘంగా యోచించాడు. అతను ఇలా అనుకున్నాడు:

"ఇది నేను చేయదగిన పని కాదు. నేను ఆమె తండ్రికి అతిథిని. గురుపుత్రితోనూ, స్నేహితుడి భార్యతోనూ, కూతురితోనూ, పూజారి భార్యతోనూ పోవటం బ్రహ్మహత్యతో సమానం. తన కీర్తికి అభ్యుదయానికి కళంకం తెచ్చే పనిని ఎవరూ చేయరాదు. నేను చేయబోయేపని నా కీర్తికి కళంకం తేవటమేగాక, నాకు హానికూడా కలిగించవచ్చు. నా మిత్రుడి కుమార్తెను పొందటం వల్ల నాకు పాపం చుట్టుకుంటుంది. రాజకుమార్తె క్షణికమైన మోహావేశాన్నుంచి త్వరలో నే బయటపడకపోదు."

ఇలా అనుకుని రాజకుమారుడు రాజకుమార్తె కోసం వెళ్ళలేదు.

ఆ రాత్రి దైవాధీనం నగరంలో తిరుగుతూ, రాజభవనం గోడకు తాడు వేళ్ళాడుతూ ఉండటం చూసి, దాన్ని పట్టుకుని పైకి ఎక్కి, రాజకుమార్తె మందిరం ప్రవేశించాడు. కటిక చీకటిలో, తన ప్రియుడి కోసం ఆత్రంగా ఎదురు చూస్తున్న రాజకుమార్తె దైవాధీనాన్ని చూసి రాజకుమారుడే అనుకున్నది. ఆమె



అతన్ని గాఢంగా ఆలింగనం చేసుకుని, "నిన్ను చూసిన క్షణంలోనే నా హృదయం దోచుకున్నావు. నా మనసులో నైనా నేను నీకు తప్ప మరొకరికి భార్యను కాలేను. ఎందుకని అలా మౌనంగా ఉన్నావు?" అని అడిగింది.

"దైవనిర్ణయం జరిగి తీరుతుంది," అన్నాడు దైవాధీనం.

ఈ మాట వినగానే రాజకుమార్తె తాను ఆలింగనం చేసుకుని, వివాహప్రమాణం చేసినది దైవాధీనానికి అనీ, రాజకుమారుడికి కాదనీ గ్రహించి, నిశ్చేష్టురాలయింది. తిరిగి చైతన్యం రాగానే ఆమె అతన్ని తాడు వెంబడి కిందికి పంపేసి, ఇలాటి

ప్రమాదాలు మరి కలగకుండా, తాడును పైకి లాగేసుకున్నది.

రాజభవనం నుంచి ఉద్వాసన చెప్పించుకున్న దైవాధీనం ఒక పాడుపడిన దేవాలయానికి వెళ్ళి, అక్కడ నిద్రపోయాడు. ఆ గుడిలో ఒక వెలయాలిని కలుసుకునేటందుకు ఏర్పాటు చేసుకుని ఉండిన రక్షకభటుడు అక్కడికి వచ్చి, దైవాధీనాన్ని, "ఎవరు నువ్వు?" అని అడిగాడు.

"దైవనిర్ణయం జరిగి తీరుతుంది," అన్నాడు దైవాధీనం. దీన్నిబట్టి ఆ వ్యక్తి ఎవరో భటుడికి తెలిసింది. అతను దైవాధీనంతో, "ఈ పాడుపడిన దేవాలయంలో ఎందుకు పడుకుంటావు. హాయిగా నా ఇంటికి వెళ్ళి, నా పక్కలో పడుకో. నేను రాత్రి గస్తీ తిరుగుతున్నాను గనక నాకేమీ ఇబ్బంది కలగదు," అని భటుడు దైవాధీనానికి తన ఇంటికి దారి చెప్పాడు.

భటుడి ఇంటికి వచ్చిన దైవాధీనం పొరపాటున భటుడి కుమార్తె గది ప్రవేశించి, ఆమె శయ్యను సమీపించాడు.

ఆమె పేరు వినయవతి. ఆమె చాలా చక్కనిది. ఆమె ఈడేరి చాలా కాలమయినప్పటికీ ఆమెకింకా వివాహం కాలేదు. ఎందుచేతనంటే, ఆమె ప్రేమించి పెళ్ళాడగోరిన యువకుడు పేదవాడు కావటం చేత ఆమె తండ్రి ఆ పెళ్ళికి ఒప్పుకోలేదు.

తన తండ్రి ఇంటలేని సమయంలో ఆమె తన ప్రియుణ్ణి తన యింటికి రప్పించి, గాంధర్వవిధిని అతన్ని పెళ్ళాడి, తమ వివాహానికి తండ్రిని ఒప్పించదామనుకున్నది. ఈ పథకం ప్రకారం ఆ యువకుడు ఆమె కోసం వస్తూ, దూరాన భటుడూ, దైవాధీనం మాట్లాడుకుంటూ ఉండటం చూశాడు. అతను చూస్తూండగానే దైవాధీనం భటుడి ఇంటి కేసి వెళ్ళటం కూడా జరిగింది. తమ పథకం భటుడికి తెలిసిపోయిందనీ, తనను పట్టుకునేటందుకు భటుడు ఎవరినో ఇంటికి పంపాడనీ భయపడి, వినయవతి ప్రియుడు చప్పున వెనుదిరిగి తన ఇంటికి తిరిగి పోయాడు.





## 40

వినయవతి కటిక చీకటిలో దైవాధీనాన్ని పోల్చుకోలేక. అతనితో గాంధర్వ వివాహం జరిపింది.

వివాహవిధి ముగిసినాక ఆమె ప్రేమగా అతన్ని. "ప్రియా, ఈ శుభవేళ మౌనంగా ఉన్నావెందుకు?" అని అడిగింది.

"దైవనిర్ణయం దాటరానిది," అన్నాడు. దైవాధీనం.

ఈ మాట విని ఆమె నిర్ఘాంతపోయి, "తొందరపాటుతో ప్రవర్తించిన ఫలితం ఇలాగే ఉంటుంది," అనుకుని, ఏడుస్తూ, అతన్ని వెళ్ళగొట్టింది.

భటుడి ఇంటి నుంచి వెళ్ళగొట్టబడిన దైవాధీనం వీధుల వెంట నడుస్తూ ఒక పెద్ద ఊరేగింపును చూసి, దానిలో చేరి నడవ సాగాడు. ఆ ఊరేగింపు ఏమిటంటే, మరొక నగరానికి చెందిన వరకీర్తి అనే గొప్పవర్తకుడు ఏనుగు మీద ఎక్కి, పెళ్ళి చేసుకునేటందుకు వధువు ఇంటికి ఊరేగింపుగా వెళుతున్నాడు.

ముహూర్తంవేళ సమీపించింది. వివాహ మంటపంలో పెళ్ళికూతురు పీటల మీద కూర్చుని ఉన్నది. ఆమె అప్సరసలాటి అందగత్తె. వరకీర్తి ఏనుగు మీది నుంచి దిగి, వివాహమంటపం లోకి అడుగు పెట్టుతూండగా, ఆ ఏనుగుకు మదోద్రేకం వచ్చి, మావటివాణ్ణి చంపి, వివాహ మంటపంలోకి పరిగెత్తింది. అదిచూసి భయపడి, పెళ్ళికూతురును పీటల మీద ఒంటరిగా వదిలేసి, పెళ్ళికొడుకుతో సహా అందరూ మంటపం నుంచి దూరంగా పారిపోయారు.

దైవాధీనం పెళ్ళికూతురి కళ్ళలో బెదురు చూసి, ఆమెను సమీపించి, ఆమె



చేతిని తన చేతిలోకి తీసుకుని, "భయ పడకు, నేనున్నాను." అన్నాడు.

ఆమె భయంతో అతన్ని గట్టిగా కౌగ లించుకున్నది. ఆ క్షణంలోనే ఆమె అతన్ని ప్రేమించింది.

అతని మొండిధైర్యం చూసి ఏనుగు బిత్తరపోయింది. అతను గట్టిగా అరిచి, ఏనుగును కల్యాణ మంటపం నుంచి బయటికి పంపేశాడు.

వరకీర్తి తనవారితో సహా కల్యాణ మంటపానికి తిరిగివచ్చి చూసేసరికి, తనను పెళ్ళాడవలసిన కన్య చేయి మరొకడి చేతిలో ఉన్నది.

అతను కోపంగా వధువు తండ్రిని, "నా కిస్తానన్న పిల్లను మరొకరికి ఎందు కిచ్చారు?" అని అడిగాడు.

"నేనూ మీ అందరిలాగే భయపడి పారిపోయాను. అందుచేత ఇదంతా నాకూ తెలీదు." అన్నాడు కన్యాదాత.

తరవాత ఆయన తన కుమార్తె కేసి తిరిగి, "అమ్మా, నీ ప్రవర్తన ఆక్షేపణీయంగా ఉన్నది. మరొకరిని పెళ్ళాడ వలసిన దానివి. ఇతని చేతిలో చెయ్యిపెట్టి ఉండటానికి కారణం చెప్పు." అన్నాడు.

"ఇతను నా ప్రాణం కాపాడాడు. నా గుండెలో ప్రాణం ఉండగా మరొకరిని పెళ్ళాడను," అన్నదామె.

ఆమె ఇలా అనేసరికి వరకీర్తి పక్షం వారికీ, పిల్లపక్షం వారికీ మధ్య తెల్లవార్లూ పోట్లాట జరిగింది.

ఈ పోట్లాట గురించి నగరమంతా పాక్కింది. అందులో దైవాధీనానికి ప్రమేయం ఉందని తెలిసి, రాజకుమార్తె చంద్రమతీ, భటుడికూతురూ కుతూహలం కొద్దీ అక్కడికి వెళ్ళారు.

జగడం పెద్ద ఎత్తున సాగింది. వరకీర్తి చూడబోతే మరో దేశానికి చెందిన కోటీశ్వరుడు. అందుచేత విచారించటానికి రాజే స్వయంగా బయలుదేరి వచ్చాడు. "దీనికంతకూ మూలకారణమేమిటి?" అని ఆయన దైవాధీనాన్ని అడిగాడు.

అతను చంద్రమతిని, భటుడి కూతురునూ, వర్తకుడి కూతురునూ సాభిప్రాయంగా చూసి, "విధి నిర్ణయం జరిగి తీరుతుంది." అని, తనను బల పరచమన్నట్టు రాజకుమార్తె కేసి చూశాడు.

ఆమె తనకు జరిగినది తలుచుకుని, "దాన్ని ఈశ్వరుడు కూడా తప్పించలేడు." అన్నది.

తరవాత దైవాధీనం భటుడి కూతురు కేసి చూశాడు.

"అందుకే నేను జరిగినదానికి సంతాపించను, విచారించను." అన్నదామె.

వర్తకుడి కుమార్తె ఈ మాటల దృష్ట్యా తన అనుభవం గురించి ఆలోచించి, "నా కోసం నిర్ణయించబడినది నాకు కాకుండా పోవటం ఎన్నడూ జరుగదు." అన్నది.

ఈ నలుగురూ అన్నమాటలు విని రాజుతోబాటు అక్కడ ఉన్నవారందరూ తికమకపడ్డారు. రాజు దైవాధీనానికి, ముగ్గురు స్త్రీలకూ అభయం ఇచ్చి, నిజం దాచకుండా చెప్పమన్నాడు.

అందరూ తమ తమ కథలు చెప్పారు.

రాజు దైవాధీనంతో, "నువ్వు చూడగా విధికి ముద్దుబిడ్డలాగా కనబడుతున్నావు. దానికి తోడు నీకు ధైర్యమూ, సమయస్ఫూర్తీ కూడా ఉన్నాయి. నాకు కొడుకులు లేరు. అందుచేత నువ్వు నా కుమార్తెను పెళ్ళాడి, నా రాజ్యానికి వారసుడివి కా. పెళ్ళి కాగానే నీకు వెయ్యి గ్రామాలు రాసి ఇచ్చి, నిన్ను యువరాజుగా ప్రకటిస్తాను. ఉన్న పరిస్థితులలో నువ్వు భటుడి కూతుర్నీ, వర్తకుడి కూతుర్నీ కూడా పెళ్ళాడక తప్పదు. అందుకు నా అనుమతి ఇస్తున్నాను." అన్నాడు.

అదృష్టవంతుడైన ఆ యువకుడు ముగ్గురు వధువులనూ వైభవంగా పెళ్ళాడి, వారితో సుఖంగా జీవించాడు. అతని తండ్రి ఇతర బంధువులూ అతని సమర్థత గ్రహించి, అతనితో రాజీపడి, అతని వెంటే ఉంటూ వచ్చారు.





# మిత్రలాభం

## 41

హిరణ్యకం (ఎలుక) మంథరకానికి దైవాధీనం కథ చెప్పి, ఇంకా ఇలా చెప్పుకుపోయింది:

బృహస్పతి చూడాకర్ణుడితో, "చూశావా, మిత్రమా? దీని ఆస్తి ఎప్పుడైతే పోయిందో, దాని శక్తి అప్పుడే పోయింది. నిశ్చింతగా నిద్రపో," అన్నాడు.

ఈ మాట విని నేను నీరుగారిపోయాను. ఎందుకంటే ఆ మాట నిజం. ఇల్లూ, సంపదా పోయాక ఎవరికైనా శక్తి అంతా పోతుంది. వెనకటిలాగా ఆ ఇంట్లో నాకు మంచి ఆహారం దొరుకుతుందన్న ఆశ పోయింది. నా అనుచరులు అసంతృప్తి చెంది, "మనకు తిండి సంపాదించ లేదు సరేగదా, తన తిండి కూడా తాను సంపాదించుకోలేదు, దీణ్ణి ఆశ్రయించి ఏం లాభం?" అనుకున్నారు.

నేను ఆ ప్రదేశం విడిచిపెట్టి దూరదేశం పోదామని నిశ్చయించాను, ఎందుకంటే అక్కడ నాకు గౌరవమూ ఉండదు; అత్మ గౌరవమూ ఉండదు. అందుచేత నేను నా పాత నివాసం వదిలేసి, ఒక అరణ్యం చేరాను. అక్కడ వలలో చిక్కుకున్న చిత్రగ్రీవం తటస్థపడింది. నేను అతన్ని విడిపించటం సంగతి నువ్వు ముందే విన్నావు. ఆ తరవాత లఘుపతనకం నాతో స్నేహం చేసి, నన్ను ఇక్కడికి రమ్మన్నది. అతని వెంట నిన్ను చూడటానికి వచ్చాను.

మంథరకం ఈ కథ విని, "విచారించకు. సోమిలకుడనే సాలెవాడు విధిని ఎదిరించి పోరాడి, చివరకు జయించినట్టే నువ్వూ జయిస్తావు." అన్నది.

"ఏమిటా కథ?" అని లఘుపతనకం అడిగింది.



మంథరకం విధిని బలపరిచిన సాలెవాడి కథ ఇలా చెప్పింది:

### సాలెవాడి కథ

సోమిలకుడు నిపుణుడైన సాలెవాడు. అతను అనేక రంగుల మేలివస్త్రాలు నేయగలడు. అతను నేసిన బట్టలు రాజులు ధరించదగినవిగా ఉండేవి. రకరకాల వస్త్రాలు నేయటంలో ఎంతో నైపుణ్యం ఉండి కూడా అతను ఏనాడూ తన తిండికీ, బట్టకూ మించి సంపాదించలేదు. మామూలు నేతగాళ్ళు, ముతకబట్టలు నేసేవాళ్ళు కూడా తన కన్న ఎక్కువ సంపాదిస్తూ, డబ్బులో ఓలలాడటం చూసి అతను తన భార్యతో, "ప్రియా, ముతక బట్టలు తప్ప నేయలేని వాళ్ళు కూడా బోలెడంత డబ్బు సంపాదిస్తూ ఉండగా నేను ఎంతో నైపుణ్యం ఉండీ, శ్రమ చేసీ కూడా చాలీచాలని సంపాదనతో బాధపడుతున్నాను. నాకు ఇంత అన్యాయం చేస్తున్న ఈ ఊరితో నాకేమిటి? ఎక్కడికైనా పోతాను." అన్నాడు.

దానికి అతని భార్య, "ప్రియుడా, ఇక్కడ నీకు దొరకని ఐశ్వర్యం ఇంకెక్కడో దొరుకుతుందనుకోవటం భ్రమ. ఇక్కడే ఉండి, ఎంత వస్తే అంతే రాసిపెట్టి ఉన్నదనుకుని తృప్తిపడు," అన్నది.

"ప్రియురాలా, నువు చెప్పేది సరి కాదు. విధి కూడా మన చర్యల ద్వారా తప్ప పనిచెయ్యలేదు. ఒక్క చెయ్యి మోగనట్టే, ప్రయత్నంతో కూడి ఉండని చర్య సఫలం కాదు. తినాలని రాసిపెట్టి ఉన్నా కూడా, చెయ్యి సహాయపడితే తప్ప లభించిన ఆహారం నోట్లోకి పోదు. లక్ష్మీదేవి కృషి గల పురుషసింహుణ్ణే కటాక్షిస్తుంది. ప్రతిదీ విధికి అంటగట్టే వాళ్ళు పిరికివాళ్ళు. అందుచేత మనం విధిని విస్మరించి, శాయశక్తులా కృషి చేయాలి. నీకు సాధ్యమైన ప్రయత్నం చేసినా ఫలితం లేకపోతే అప్పుడు నిన్నెవరూ తప్పు పట్టరు. ఎందుకంటే నీ ప్రయత్న లోపం లేదు గనక! చేతలు

ప్రయత్నం వల్ల ఫలిస్తాయి గాని, గొంతెమ్మ కోరికల వల్ల కాదు. నిద్రపోయే సింహం నోట్లోకి మృగాలు ప్రవేశించవు. ప్రయత్నం లేకుండా ఏ కోరికా తీరదు. అందుచేత నేను ఎక్కడైనా పోతాను.'' అన్నాడు.

అతను వర్ధమానపురం వెళ్లాడు. అతను అక్కడ మూడేళ్ళపాటు కష్టపడి పనిచేసి, మూడువందల బంగారు కాసులు సంపాదించి స్వగ్రామానికి బయలుదేరాడు.

మధ్య దారిలో అతను ఒక మహారణ్యం దాటవలసి వచ్చింది. అరణ్యం దాటుతూండగా సూర్యుడు అస్తమించి, చీకట్లు కమ్మాయి. ఆ రాత్రి ముందుకు పోవటానికి భయపడి, సోమిలకుడు ఒక మర్రిచెట్టు ఎక్కి, విశాలమైన కొమ్మ మీద నిద్రపోయాడు.

ఆ నిద్రలో అతనికి ఒక కల వచ్చింది. అందులో ఇద్దరు వ్యక్తులు, రక్తనేత్రులు, కోపంగా వాదించుకుంటున్నారు.

అందులో ఒకడు రెండో వాడితో, ''ఓ కర్తా, సోమిలకుడికి కనీస భృతికి మించి ఇయ్యటం గురించి నేను అభ్యంతరం చెప్పాను. లోగడ నువ్వూ ఇచ్చావు కావు. కాని ఇప్పుడు అతనికి మూడు వందల కాసులు ఇచ్చావేమిటి?'' అన్నాడు.

రెండోవాడు మొదటి వాడితో, ''ఓ కర్మా, మనుషుల ప్రయత్నానికి తగిన విధంగా ఫలితం ఇయ్యటం నా ధర్మం. అతనికి అది రాసిపెట్టి ఉండకపోతే నువ్వు తీసేసుకో,'' అన్నాడు.

ఈ మాట వింటూనే సోమిలకుడు నిద్రలేచి తన సంచీ చూసుకుంటే, అది ఖాళీగా ఉన్నది. ''నా కష్టార్జితం ఇంత శీఘ్రంగా ఎలా మాయమయింది? నా శ్రమ అంతా వ్యర్థమై, చేతిలో చిల్లిగవ్వ లేకుండా నా భార్యనూ, మిత్రులనూ ఎలా చూడను?'' అని విచారించి అతను, అప్పటికప్పుడే బయలుదేరి వర్ధమానపురానికి తిరిగి వెళ్ళి, అమితమైన కృషితో ఒక్క ఏడాదిలోగా అయిదువందల బంగారు కాసులు సంపాదించాడు.





## 42

సోమిలకుడు తన ఊరికి బయలు దేరాడు. సూర్యాస్తమయం అయేసరికి ఆ పాత మర్రిచెట్టు అతనికి ఎదట కనిపించింది. తన దుస్థితి గురించి ఆలోచిస్తూ అతను మగతలో పడిపోయి, కలగన్నాడు.

ఆ కలలో అతనికి, ఆ ఇద్దరు మనుషులూ కనిపించారు. అందులో ఒకడు, "ఓ కర్తా, సోమిలకుడికి అయిదు వందల బంగారు కాసులు ఎందుకిచ్చావు?" అన్నాడు.

దానికి రెండోవాడు, "ఓ కర్మా, అతని కృషికి తగినఫలితం ఇయ్యటం నాధర్మం. కావాలంటే నువు తీసేసుకో," అన్నాడు.

ఈ మాటలు వింటూనే సోమిలకుడు తన సంచీ చూసుకుని, డబ్బు పోయినట్టు గ్రహించి, "ఈ చిల్లి గవ్వ చెయ్యని బతుకు దేనికి? ఈ మర్రిచెట్టుకే ఉరి వేసుకుంటాను," అనుకున్నాడు. ఆ చుట్టు పక్కల పెరిగే దర్భలను తెచ్చి, వాటితో తాడు పేని, దానికి ఉచ్చు అమర్చి, ఉచ్చు మెడకు తగిలించుకుని, దూకబోతూండగా ఆకాశంలో ఒక దివ్య స్వరూపుడు ప్రత్యక్షమై, "సోమిలకుడా, అఘాయిత్యం చెయ్యకు. నీ బంగారాన్ని తీసుకుపొమ్మన్న కర్తను నేనే! కర్మను ఎదిరించి నువు చేసిన కృషికి సంతోషించాను. ఏం వరం కావాలో కోరుకో," అన్నాడు.

సోమిలకుడు, "అలా అయితే నాకు అపారమైన సంపద ప్రసాదించు," అన్నాడు.

"మిత్రమా, నీకు తిండీ, బట్టా తప్ప ప్రాప్తం లేనప్పుడు అపారమైన సంపద ఎలా అనుభవిస్తావు?" అని కర్త అడిగాడు.

అట్ట చివరి బొమ్మ



"అయినా నాకు సంపద ప్రసాదించు," అన్నాడు సోమిలకుడు.

"సరే. నువ్వు వర్ధమాన పురానికి మళ్ళీ వెళ్ళు. అక్కడ ధనగుప్తుడూ, భుక్తధనుడూ అనే ఇద్దరు వర్తకులున్నారు. వారిలో ఎవరిలాగా ఉండగోరుతావో చెప్పు. నీ కోరిక తీరుస్తాను," అని ఆకాశంలోని దివ్యపురుషుడు అంతర్ధానమయాడు.

సోమిలకుడు వర్ధమానపురానికి తిరిగి వెళ్ళాడు. అతి కష్టం మీద అతనికి ధనగుప్తుడి ఇల్లు ఎక్కడ ఉన్నదీ తెలిసింది. ధనగుప్తుడు ఎవరో చాలా మందికి తెలియదు. ఎందు చేతనంటే అతను దానధర్మాల కిందగాని, వినోదాలకు గాని, అనవసర వస్తువులు కొనటానికి గాని చిల్లిగవ్వ ఖర్చు చేసినవాడు కాదు.

సోమిలకుడు వెళ్ళి అరుగు మీద కూర్చున్నాడు. అది భోజనాల వేళ. ధనగుప్తుడు లోపల లేడు. అతని భార్యా, పిల్లలూ వచ్చి సోమిలకుణ్ణి వెళ్ళగొట్టటానికి ప్రయత్నించారు. అయితే సోమిలకుడు కదలక, "నేను సంధ్యావేళ వచ్చిన అతిథిని. నాకు భోజనం పెట్టటం మీ విద్యుక్తధర్మం," అన్నాడు.

కొంత ఘర్షణ జరిగిన మీదట సోమిలకుడికి అమిత హీనమైన భోజనం లభించింది. అలసి ఉన్న సోమిలకుడికి త్వరలోనే నిద్ర పట్టింది. కలలో ఆ ఇద్దరు వ్యక్తులూ రహస్యంగా మాట్లాడుకున్నారు.

"ఓ కర్తా, పాపం ధనగుప్తుడికి ఈ భోజనం ఖర్చు ఎందుకు కలిగించావు? ఇది చాలా అనుచితం." అన్నాడు ఒకడు.

"ఓ కర్మా, అది నా తప్పు కాదు. ఈ అదనపు ఖర్చు సరిచేసే భారం నీది," అన్నాడు రెండోవాడు.

సోమిలకుడు నిద్రలేచి, కొద్ది క్షణాల కల్లా ధనగుప్తుడు ఇంటికి తిరిగి రావటం చూశాడు. ఎవరికో భోజనం పెట్టిన సంగతి వినగానే ధనగుప్తుడికి గుండె ఆవిసిపోయింది. అతనికి అపరిమితమైన ఆగ్రహం కలిగి, నిద్ర పట్టలేదు. తెల్లవారు

దయమున అతనికి భేదులు ప్రారంభమయాయి. ఇదంతా కళ్లారా చూసి సోమిలకుడు భుక్తధనుడి ఇంటిని వెతుక్కుంటూ బయలుదేరాడు. అతనికి శ్రమలేకుండా ఇల్లు దొరికింది. ఎందుకంటే, అందరూ అతని ఇల్లు ఎరుగుదురు.

భుక్తధనుడు సోమిలకుణ్ణి వాకిలి వద్ద చూస్తూనే ఆదరంగా పిలిచి, గౌరవించి, అతని చేత చక్కగా స్నానం చేయించి, కొత్త బట్టలిచ్చి, భోజనం పెట్టి, రాత్రి పడుకోవటానికి మంచి పక్క ఇచ్చాడు. మంచి సుఖనిద్రలో ఉన్న సోమిలకుడికి ఆ ఇద్దరు మనుషులూ రహస్యంగా మాట్లాడుకోవటం వినబడింది.

"ఓ కర్తా, సోమిలకుడి ఆతిథ్యం నిమిత్తం భుక్తధనుడి చేత చాలా డబ్బు ఖర్చు చేయించావు. రేపటి ఖర్చుకు అతని దగ్గిర చిల్లిగవ్వలేదు. పైపెచ్చు ఇతను ఖర్చు చేసిన డబ్బు మరొక వర్తకుడిది. రేపటి విషయం ఏం చెయ్యదలిచావు?" అని అడిగాడు ఒకడు.

"ఓ కర్మా, రేపు తెల్లవారుతూనే రాజు పంపిన మనిషి భుక్తధనుడికి అనేక బహుమానాలూ, బోలెడంత డబ్బూ తెచ్చి ఇస్తాడు." అన్నాడు రెండోవాడు.

ఇదంతా విన్న సోమిలకుడు తెల్లవారుతూనే రాజుగారి మనిషి బహుమానాలతో రావటం చూశాడు. "ఈ భుక్తధనుడి వద్ద నిధులు లేకపోయినా, ఇద్దరిలో ఇతనే చాలా మెరుగు. కోట్లున్నప్పటికీ ధనగుప్తుడు నీచుడు. తాను అనుభవించి, ఇతరులకు దానం చెయ్యగలిగినప్పుడే ధనం వల్ల ఉపయోగం." అనుకున్నాడతను.

అతను కర్తతో, "భగవాన్, నాకు భుక్తధనుడి సంపదలాటిది ఇయ్యి. ధనగుప్తుడి ఐశ్వర్యం నాకు అవసరం లేదు," అన్నాడు.

కర్త అతనికి తరగని సంపద ఇచ్చాడు. సోమిలకుడు తన ఇంటికి తిరిగివచ్చి, ధారాళంగా ఖర్చు చేస్తూ, తన భార్యతో సుఖంగా జీవించాడు.





## 43

కాకి, తాబేలూ, ఎలుకా–ఈ ముగ్గురు మిత్రులూ 'సరస్సు తీరాన సుఖంగా జీవిస్తూవచ్చారు.

ఒకనాడు ముగ్గురూ గోష్ఠి జరుపు తూండగా అక్కడికి చిత్రాంగ మనే దుప్పి, వేటగాళ్ళు తరుముకొస్తున్నట్టుగా పరిగెత్తు కుంటూ సరస్సులో వచ్చి పడింది. దాని వెనకగా వేటగాళ్ళు వస్తున్నారేమోనని భయపడి తాబేలు నీటిలోకి దూకింది. ఎలుక బిలంలోకి వెళ్ళింది; కాకి సమీ పంలో ఉన్న చెట్టు మీదికి ఎగిరింది.

కాని ఎంతసేపటికీ ఎవరూ వస్తున్న జాడ కాకికి కనిపించలేదు. దుప్పి ఆబగా నీళ్ళు తాగటం చూసి, అది తన మిత్రులైన తాబేలునూ, ఎలుకనూ పిలిచి, ''వేటగాళ్ళు ఎవరూ దుప్పిని తరమలేదు. అది అమితమైన దాహంకొద్దీ పరిగెత్తు కుంటూ వచ్చింది. మనం నిష్కారణంగా భయపడ్డాం.'' అన్నది.

దానికి మంథరకం (తాబేలు,) ''మిత్రమా, నువు పొరబడ్డావు. వేటగాళ్లు తరిమినట్టు దాని ముఖం చూస్తేనే తెలుస్తున్నది. అంత వేగంగా పరిగెత్తు కొస్తూ కూడా అది వెనక్కు తిరిగి మళ్లీ, మళ్ళీ చూసింది. దాని గుండె అమిత వేగంగా కొట్టుకున్నది. ప్రాణభయంకొద్దీ పారిపోయేవారిలోనే అలాటి లక్షణాలు కనిపిస్తాయి. అచ్చుగా దాహమే అయితే అంత శరవేగంతో రావలసిన పనిలేదు,'' అని, చిత్రాంగం కేసి తిరిగి, ''మిత్రమా, నేనన్నది నిజమేనా?'' అని అడిగింది.

దానికి చిత్రాంగం, ''మంథరకా, నా భయానికి కారణం సరిగా గ్రహిం చావు. అనేకమంది వేటగాళ్ళు నన్ను

అట్ట చివరి బొమ్మ

తరిమారు. వాళ్ళ బాణాలు వెంట్రుక వాసిలో తప్పిపోయాయి. ఆ దుర్మార్గులు నా మందనంతటినీ చంపేశారు. నేను మీ శరణుకోరుతున్నాను. నన్ను ఇక్కడ ఉండనిచ్చి, కాపాడండి,'' అన్నది.

''ఓ దుప్పీ, నువు ఇక్కడే ఉండి పోయి, మా కున్నదానిలో భాగం పంచు కోవటానికి ఎలాటి అభ్యంతరమూ లేదు. శత్రువుల నుంచి తప్పించుకోవాలంటే పిక్కబలమో, భుజబలమో ఉండాలి. వేటగాళ్ళు వచ్చి పడకముందే మనం త్వరగా దట్టమైన కారడవిలోకి పోదాం,'' అన్నది తాబేలు.

చెట్టు మీది నుంచి చూస్తున్న కాకి, ''వేటగాళ్ళు వాళ్ళ శిబిరానికి వెళ్ళి పోతున్నారు. ప్రస్తుతానికి భయంలేదు. మనం ఈ పెద్దచెట్టు చల్లనినీడన సుఖంగా కాలక్షేపం చెయ్యవచ్చు,'' అన్నది.

కాకితోనూ, తాబేలుతోనూ, ఎలుకతోనూ మైత్రి నెరపాలన్న కోరికను చిత్రాంగం (దుప్పి) వ్యక్తం చేసింది.

''మేం బొత్తిగా అల్పప్రాణులం కదా, మా మైత్రి నీకు ఎలా ఉపకరిస్తుంది? రక్షణ కోరేవారు బలవంతులైన మిత్రులను గదా కోరాలి?'' అని మంథరకం అడిగింది.

''మిత్రులు అత్యల్పులయినప్పటికీ గొప్పవారికి సైతం ఎంతో సహాయం చెయ్యవచ్చు. ఏనుగులను విడిపించిన ఎలుకల కథ అదేగదా!'' అన్నదీ దుప్పి.



ఆ కథ ఏమిటని మంథరకం అడగగా, చిత్రాంగం ఇలా చెప్పింది:

"ఏనుగులను విడిపించిన ఎలుకలు"

ఒక అరణ్యంలో ఒక శిథిలాలయం ఉండేది. దానిముందు ఒక గొప్ప కోనేరు ఉండేది. ఆలయ శిథిలాలలో లక్షల కొద్దీ ఎలుకలు సుఖంగా ఉంటున్నాయి.

ఒకసారి నీటి కరువు రాగా ఒక ఏనుగుల రాజు తన మందతో నీటిని వెతుక్కుంటూ శిథిల్యాలయం ముందు ఉన్న కోనేరుకు వచ్చింది. ఏనుగులు ఆలయ శిథిలాల మధ్యగా వస్తూ అనేక ఎలుకలను తొక్కేశాయి. ఎలుకలు సమావేశం జరిపి, తమకు ఏర్పడిన ప్రాణభయం గురించి చర్చించుకుని, ఏనుగుల రాజు వద్దకు రాయబారం పంపి, "మా పట్ల భూతదయ చూపండి. ఎంత క్షుద్ర ప్రాణులమైనా మా వల్ల మీకు ప్రయోజనం ఉండవచ్చు," అన్నాయి.


ఏనుగుల రాజు ఈ మాటకు నవ్వి కూడా ఎలుకల కోరికను మన్నించింది. ఏనుగులు శిథిలాల మధ్యగా నడవటం మానేసి, కోనేటి వద్దకు చుట్టు తిరిగి పోతూ వచ్చాయి.

అక్కడికి సమీపంలో ఉన్న ఒక రాజు ఏనుగుల ఆచూకీ తెలిసి, నీటిలో ఏనుగులను పట్టే ఏర్పాట్లు చేయించాడు. నీటిలో వేసిన ఉచ్చులు చూడక ఏనుగులు అనేకం చిక్కుపడిపోయాయి. ఏనుగుల రాజు ఎలుకల వాగ్దానం జ్ఞాపకం పెట్టుకుని, బంధంలో చిక్కుకోని ఆడఏనుగును ఎలుకల వద్దకు పంపింది. ఎలుకలు వచ్చి ఏనుగుల దీనస్థితి చూసి, వాడి అయిన తమ పళ్ళతో ఏనుగుల బంధాలను కొరికేసి, వాటికి విముక్తి కలిగించాయి.

ఏనుగుల రాజు తన అనుచరులతో, "స్నేహం చెయ్యండి, స్నేహం చెయ్యండి! ఎంత దుర్బలులైన మిత్రులు సైతం ఆపదలో ఆదుకోవచ్చు! ఈ సంగతి ఎలుకలు ప్రత్యక్షంగా నిరూపించాయి." అని చెప్పింది.



CHANDAMAMA (Telugu) JANUARY 1977 Regd. No. M. 4854



మిత్రసంప్రాప్తి



# మిత్రసంప్రాప్తి

## 44

సరస్సు తీరాన మిత్రులు నలుగురూ సుఖంగా కాలం వెళ్ళబుచ్చుతూండగా ఒకనాడు గోష్ఠిలో చిత్రాంగం (లేడి) హాజరు కాలేదు. మిగిలిన మిత్రులు ముగ్గురూ, ''ఏమైఉంటుంది? దాన్ని ఏ సింహం గాని చంపలేదు గద? అది ఏ వేటగాడి ఉచ్చులోనే చిక్కుకోలేదు గద? ఏ కార్చిచ్చు మధ్యనే చిక్కపోలేదు గద?'' అని విచారించారు.

చివరకు మంథరకం (తాబేలు) కాకితో, ''దాన్ని వెతుక్కుంటూ పోవటం నాకూ, ఎలుకకూ సాధ్యంకాదు. అందుచేత నువు అరణ్యం మీదుగా ఎగురుతూ వెళ్ళి, చిత్రాంగం బతికి ఉన్నదీ, లేనిదీ చూసిరా,'' అన్నది.

లఘుపతనకం (కాకి) అలాగే ఎగురుతూ వెళ్ళి, సరస్సుకు సమీపంలోనే, ఉచ్చులలో చిక్కి ఉన్న చిత్రాంగాన్ని చూసి, దుఃఖంతో, "మిత్రమా, ఏమిటిది?" అని అడిగింది.

మిత్రుడి దర్శనంతో లేడికి దుఃఖం ఆగలేదు. అది కాకితో, "నా కాలంతీరింది. ఈ ఆఖరుక్షణంలో మిత్రసందర్శనంకన్న కోరదగినది ఏముంటుంది? నేను ప్రసంగవశాన నీతో పరుషాలాడి ఉంటే నన్ను క్షమించు. అదేవిధంగా నా తప్పులను క్షమించమన్నానని హిరణ్యకం (ఎలుక) తోనూ, మంథరకం (తాబేలు) తోనూ చెప్పు,'' అన్నది.

దానికి కాకి, ''మిత్రమా, మా లాటి మిత్రులు ఉండగా నిరాశచెందుతావు దేనికి? నేను ఇప్పుడే వెళ్ళి హిరణ్యకాన్ని తెస్తాను. అది నీ ఉచ్చు తాళ్ళను కొరికి, నిన్ను విడిపిస్తుంది,'' అన్నది.

అట్ట చివరి బొమ్మ



కాకి లేడిని ఇలా ఊరడించి, తాబేలూ, ఎలుకా ఉన్నచోటికి వెళ్ళి, లేడికి సంభవించిన దుస్థితి తెలిపి, హిరణ్యకాన్ని తన వీపు మీద ఎక్కించుకుని, చప్పున లేడి ఉన్నచోటికి వచ్చింది.

తన మిత్రులను చూడగానే లేడి, ''బుద్ధిమంతుడైన వాడు ఆపదలో సహాయం పొందాలంటే మీ లాటి మిత్రులను సంపాదించాలి,'' అన్నది.

ఎలుక లేడిని, "మిత్రమా, ఇంత వివేకం గల నువు ఉచ్చుల్లో ఎలా పడ్డావు?'' అని అడిగింది.

''నేను ఉచ్చులలో పడటం ఇది మొదటిసారి కాదు. అదివరకు ఒకసారి ఇలాగే చిక్కుపడి, చివరకు తప్పించుకున్నాను,'' అన్నది లేడి.

ఆ కథ చెప్పమని ఎలుక అడిగితే, ''ఇది కథలు చెప్పుకునే సమయంకాదు. వేటగాడు ఏ క్షణాన అయినా రావచ్చు. నా బంధాలు కొరుకు,'' అని లేడి అన్నది.

ఎలుక నవ్వి, ''నేను చెంత ఉండగా నీకు వేటగాడి భయంలేదు. నేను అంతో ఇంతో శాస్త్రార్థాలు తెలిసినదాన్ని. నువూ నాకు తీసిపోవు. అందుచేత అడిగాను,'' అన్నది.

''విధి తోసుకు వచ్చినప్పుడు తెలివితేటలు ఎందుకూ పనికిరావు. ఎంతెంత లావు గ్రంథాలు రాయగలవాళ్ళు కూడా తమ నుదిటిరాతలో ఒక్క అక్షరం తుడపలేరు,'' అంటూ లేడి తన పాత అనుభవం ఇలా చెప్పింది:

చాలాకాలం క్రితం, నేను ఆరునెలల పిల్లగా ఉండగా, మంద కన్న ముందుకు దౌడుతీసేదాన్ని. పెద్ద లేళ్ళు పరిగెత్తటంతో బాటు, అవాంతరాలు అడ్డొస్తే వాటి మీదిగా దూకగలిగేవి.

ఒకరోజు నేను మంద వెంట వెళుతూండగా మా దారికి అడ్డంగా ఎవరో వేటగాడు పన్నిన ఉచ్చు కనిపించింది. పెద్ద లేళ్ళు దాని మీదుగా దూకి వెళ్ళాయి. అయితే నాకు దూకటం రాదు. అందుచేత నేను

పరిగెత్తుకుంటూ వెళ్ళి, ఉచ్చులో చిక్కు కున్నాను.

వేటగాడు చాలా సంతోషించి నా కాళ్లు బంధించాడు. నేను వేటగాడికి దొరికి పోవటం చూసి, మిగిలిన లేళ్ళు పారి పోయాయి.

అయితే వేటగాడు నన్ను చంపక, నేను అందంగా ఉన్నాననీ, నన్ను చంపే కన్న ఎవరికన్నా పెంచుకోవటానికి ఇస్తే ఎక్కువ గిట్టుబాటుగా ఉంటుందనీ అను కున్నాడు. వాడు నన్ను ఇంటికి తీసుకు పోయి, నన్ను శుభ్రంగా కడిగి, ఎంతో చక్కగా అలంకరించి, తీసుకుపోయి ఒక రాజుకు అమ్మాడు.

రాజు నన్ను చాలా బాగా చూశాడు. ఆడవాళ్ళు నన్ను తెగముద్దుచేసి, ఎంత గానో శ్రమపెట్టారు.

ఇంతలో వర్షాకాలం వచ్చింది. ఉరు ములూ, మెరుపులూ, వాన చూడగానే నా మనసు అరణ్యం కోసమూ, నా వాళ్ళ కోసమూ పీకింది. "నా వాళ్ల వెంట ఎప్పుడు పోతాను? అరణ్యంలో పడి ఎప్పుడు పరిగెత్తుతాను?'' అని ఏడ్చాను.


నా మాటలకు ఆశ్చర్యపడి, నాకు దయ్యం పట్టిందని, రాజు భూతవైద్యులను పిలిపించాడు. వాళ్ళు నన్ను కర్రలతో కొట్టుతుంటే ఒక సాధువు వాళ్ళను మందలించి, ''ఎందుకు దాన్ని అలా హింస పెట్టుతున్నారు? అది చెయ్య గూడని పని ఏం చేసింది?'' అని అడిగాడు.

నేను అన్నమాటలను వాళ్లు ఆయనకు చెప్పారు.

''ఈ అభాగ్యపు లేడి తన స్వాతంత్ర్యం కోసమూ, తన పాత విహారస్థలాల కోసమూ పరితపించటం కన్న స్వాభావికం ఏముంటుంది? దాన్ని విడిచిపుచ్చండి,'' అని సాధువు చెప్పాడు.

రాజు నాకు శుభ్రంగా స్నానంచేయించి, దెబ్బలవల్ల కలిగిన నా గాయాలకు మందులు పూయించి, నాకు స్వేచ్ఛ ఇప్పించాడు.






మిత్రసంప్రాప్తి



# మిత్రలాభం

## 45

లేడిని విడిపించుకురావటానికి వెళ్ళిన కాకీ, ఎలుకా ఎంతకూ తిరిగి రాకపోయే సరికి, తాబేలు ఆరాటపడి తానే నింపాదిగా పాకుతూ, తన మిత్రులున్న చోటికి బయలుదేరింది.

తాబేలు రావటం చూసి కాకి కంగారు పడింది. వేటగాడు వస్తే కాకి ఎగిరిపోగలదు, ఎలుక ఏ కలుగులోనో దూరిపోగలదు, లేడి పారిపోగలదు; కాని తాబేలు వాడి నుంచి ఎలా తప్పించుకుంటుంది ?

"నువ్వు ఎందుకు వచ్చావు ? వెంటనే, వేటగాడు ఇక్కడికి తిరిగి రాకముందే, త్వరగా వెనక్కు వెళ్ళిపో," అన్నది కాకి తాబేలుతో.

"నేనేం చెయ్యను ? లేడి ఆపదలో ఉండె; మీరిద్దరూ ఎంతకూ రాకపోతిరి. నేను నిలవలేక వచ్చేశాను." అన్నది తాబేలు.

వాళ్ళు ఇలా మాట్లాడుకుంటూ ఉండగానే వేటగాడు వస్తూ ఉండటం కాకి చూసి, గట్టిగా అరిచింది. ఎలుక చప్పున లేడి బంధాలు కొరికేసింది. లేడి మధ్య మధ్య వెనక్కు తిరిగిచూస్తూ, అతివేగంగా పారిపోయింది. కాకి చెట్టు మీదికి ఎగిరింది. ఎలుక సమీపంలో వున్న ఒక కలుగులో దూరింది.

లేడి తప్పించుకుపోయినందుకు బాధపడుతున్న వేటగాడు తాబేలును చూసి సంతోషించి, దాన్ని పట్టుకుని, దర్భగడ్డితో దాన్ని తన విల్లుకు కట్టి, ఇంటికి బయలుదేరాడు.

వేటగాడు తాబేలును పట్టుకుపోతూ ఉండటం చూసి ఎలుక ఎంతో విచారిం

చింది. ఒక ఆపద తొలగిందనుకుంటూండగా ఇంకొకటి వచ్చిపడింది. తనకు ఇలా కష్టాల పరంపర ఎందుకు వస్తున్నదీ దానికి అర్థం కాలేదు. ముందట తన ఆస్తి అంతా పోయింది. తరవాత స్థానభ్రష్టత్వమూ, మిత్రుల ఎడబాటూ కలిగాయి. జీవితమే అంత! తగిలిన చోటే తగులుతుంది!

ఇంతలో లేడి, కాకి తిరిగివచ్చి, జరిగినదానికి అవి కూడా ఎంతగానో దుఃఖించాయి.

ఎలుక వాటితో, "ఏడ్చి లాభం లేదు. మంథరకం కనుమూపుమేర దాటిపోయేలోగా దాన్ని కాపాడే మార్గం చూతాం," అన్నది.

"నాకో ఆలోచన తట్టింది. వేటగాడు తన ఇంటికి వెళ్ళే దారిలో ఒక చెరువు వున్నది. వాడు త్వరలో ఆ ప్రాంతాన్ని చేరుకుంటాడు. ఈలోగా లేడి అడ్డదారిన పరిగెత్తి అక్కడికి వెళ్లి, చచ్చిపోయినట్టు, కదలకుండా చెరువుగట్టు మీద పడుకోవాలి. నేను ఎలుకను నా వీపు మీద ఎక్కించుకుని అక్కడికిపోయి, గట్టుమీద దించి, లేడి తల మీద వాలి, దాని కన్ను పొడుచుకు తింటున్నట్టు నటిస్తాను. ఆ దృశ్యం చూసి వేటగాడు లేడి చచ్చిందని నమ్మి, తాబేలుతో సహా తన వింటిని గట్టు మీద పెట్టి లేడి కోసం వస్తాడు. అప్పుడు ఎలుక దర్భకట్లు కొరికి, తాబేలును విడిపిస్తుంది. తాబేలు చప్పున



చెరువులోకి వెళ్ళిపోతుంది. వేటగాడు దగ్గిరికి వస్తూండగానే నేను ఎగిరి చెట్టు మీదికి పోతాను. లేడి లేచి దౌడుతీసి పారిపోతుంది,'' అని కాకి అన్నది.

''అద్భుతం! ఈ ఎత్తుకు తిరుగులేదు. తాబేలును మనం కాపాడినట్టే అనుకో వచ్చు. అలాగే చేద్దాం.'' అన్నది లేడి ఉత్సాహంగా.

అది అర్ధబారిన చెరువుగట్టు చేరి, అక్కడ చచ్చినట్టు పడుకున్నది. కాకి ఎలుకను తన వీపుమీద మోసుకుపోయి, చెరువుగట్టున దించి, లేడి తల మీద వాలి, దాన్ని పొడుచుకు తింటున్నట్టు నటించింది.

కొద్దిసేపటికల్లా వేటగాడు అటుగా వచ్చాడు. లేడిని చూసి వాడు, అది అలిసి చచ్చిపడిపోయిందనుకున్నాడు. భద్రంగా కట్టి ఉన్న తాబేలు తప్పించుకు పోలేదు గనక, వాడు దాన్ని కిందపెట్టి, లేడి వేపు వెళ్ళాడు. అప్పుడు ఎలుక గబగబా వచ్చి దర్భకట్లు కొరికి, తాబేలును విడిపించింది. వెంటనే తాబేలు గట్టుమీది నుంచి చెరువు లోకి దూకింది.

వేటగాడు సమీపిస్తూండగా కాకి ఎగిరి పోయి పక్కనున్న చెట్టు మీద వాలింది. లేడి చెంగున లేచి అతివేగంగా అక్కడి నుంచి పారిపోయింది.

వేటగాడు హతాశుడై వెనక్కు వచ్చి, తాబేలు కూడా తప్పించుకు పోయినట్టు తెలుసుకున్నాడు.

''ఓ విధీ, ఈ పెద్ద లేడి నా ఉచ్చులో చిక్కితే దాన్ని తప్పించావు. తాబేలు నా చేతికి అందితే దాన్ని కూడా మళ్ళీ తప్పించుకునేటట్టు చేశావు. పెళ్ళాం, పిల్లల్ని వదిలి అడవిలో తిరిగే నేను వట్టి చేతులతో వెళ్ళి వాళ్ళ ముఖం ఎలా చూడను?'' అని విలపిస్తూ వేటగాడు ఇంటికి పోయాడు.

వాడు పోగానే మిత్రులు ఒకదాన్నొకటి ఆప్యాయంగా కౌగలించుకుని, వెంటనే బయలుదేరి తమ స్వస్థానానికి వెళ్ళి, సుఖంగా జీవించాయి.





# కాకోలూకీయం

## 46

విష్ణుశర్మ రాజకుమారులతో ఇలా అన్నాడు:

"శత్రువు మిత్రుడుగా నటించినప్పటికీ అతన్ని ఎన్నడూ నమ్మవద్దు. అలాటి కపటమిత్రుడి సహాయంతో కాకులు గుడ్లగూబల ఇల్లు కాల్చేశాయి."

"అదెలాగ?" అని రాజకుమారులు అడిగారు. విష్ణుశర్మ వారికి కాకోలూకీయం కథ చెప్పాడు.

* * *

దక్షిణదేశంలో ఒక పెద్ద అరణ్యంలో అసంఖ్యాకమైన శాఖలు కలిగి, అంతులేని ఊడలు దిగిన మహా వటవృక్షం ఉండేది. దాని మీద మేఘవర్ణం అనే కాకిరాజు తన కాకిబలగంతో నివసిస్తూండేది.

అక్కడికి ఒక కోసు దూరాన ఒక కొండచరియలోని గుహలో అరిమర్దనం అనే గుడ్లగూబరాజు తన అనుచరులతో నివసించేది. దానికి కాకిరాజుతోనూ, కాకులతోనూ బద్ధవైరం ఉండేది. గుడ్లగూబరాజూ, దాని అనుచరులూ ఎక్కడ కనిపిస్తే అక్కడ కాకులను చంపేస్తూండేవి. ఆ కారణంగా వటవృక్షం చుట్టూ ప్రతి రోజూ కొన్ని కాకులు చచ్చిపడి ఉండేవి.

ఒకనాడు కాకిరాజు తన మంత్రులనూ, సలహాదార్లనూ పిలిచి ఇలా అన్నది:

"పెద్దలారా, రాత్రివేళ మనం నిద్రలో ఉండి, చూడటానికైనా శక్తిలేని అసహాయస్థితిలో ఉన్నప్పుడు మన శత్రువులు మనకు చాలా నష్టం కలిగిస్తున్న సంగతి మీ రెరిగినదే. పట్టపగలు గుడ్లగూబలు చూడలేవన్న మాట నిజమే. కాని ఆ సమయంలో అవి తమ పర్వతగుహలో భద్రంగా ఉంటాయి. ఆ గుహను మనం

పట్టలేం సరేగదా, అది ఎక్కడ ఉన్నదీ కనిపెట్టనుకూడాలేం. శత్రువునూ, వ్యాధినీ పెరగనివ్వటం ప్రాణహాని అంటారు. కనక, మనం బతికి బాగుండాలంటే ఈ తీవ్రసమస్యను ఎదుర్కోవాలి. అపాయాన్ని ఎదుర్కోనటానికి ఆరు మార్గాలు: శత్రువుతో రాజీపడటమూ; శత్రువుతో యుద్ధంచెయ్యటమూ; మన స్థావరాన్ని మార్చటమూ; ఉన్న స్థావరాన్ని బలపరచటమూ; బలవంతులైన మిత్రులను సంపాదించటమూ; యుక్తి చేత గాని, వంచన చేత గాని కార్యసిద్ధి పొందటమూనూ. మనం ఏ పద్ధతి అవలంబించాలో నిర్ణయించటానికి రహస్యసమాలోచన ఏర్పాటుచేస్తున్నాను.''

ఇలా అని కాకిరాజు ఉజ్జీవీ, సంజీవీ, అనుజీవీ, ప్రజ్జీవీ, చిరంజీవీ అనే తన మంత్రులతోనూ, స్థిరజీవి అనే వృద్ధ సలహాదారుతోనూ రహస్యసమాలోచన జరిపింది.

అది ఒక్కొక్క మంత్రి అభిప్రాయాన్నీ అడిగింది.

''రాజా, శత్రువు బలాఢ్యుడు. మనకు అతడితో యుద్ధం సాధ్యంకాదు. మనకు బలం చేకూరేదాకా మనం శత్రువుకు తలవంచాలి. ప్రాణాపాయస్థితిలో బలవంతులతోనూ, దుర్మార్గులతోనూ సైతం శాంతి నెరపాలి. ప్రాణం ఉంటేనే ఆశ అనేది ఉండేది. యుద్ధం జూదంలాటిది. గత్యంతరం లేకపోతేనే యుద్ధానికి దిగాలి.



సాధ్యమైనంత అనుకూల నిబంధనలతో శాంతి చేసుకోవాలని నా ఉద్దేశం,'' అన్నది ఉజ్జీవి.


''నీతికి నిలవని క్రూర శత్రువుతో శాంతినెరపే సమస్య ఉండదు. ఒప్పందాలకు గుడ్లగూబలు కట్టుబడవు. మనను నాశనం చెయ్యటానికే ఒప్పందాలను అవి ఉపయోగించుకుంటాయి. యుద్ధమే నా మతం. మన పైకి ఒంటికాలి మీద వచ్చే శత్రువుతో యుద్ధం దాటవేయట మంటే ఆత్మనాశనం కోరితెచ్చుకోవటమే," అన్నది సంజీవి.

''శత్రువు పాపీ, బలవంతుడూ, ద్రోహీ. అందుచేత మనకు యుద్ధమూ వద్దు, శాంతీ వద్దు. స్థావరం మార్చుకుందాం. గుడ్లగూబలకు ఇంత సమీపంగా ఉండటం అపాయకరం. మనం ఈ స్థావరాన్ని విడిచి వెళ్ళటం పలాయనం అనుకునే పనిలేదు. మనం మళ్ళీతిరిగివస్తాం," అన్నదిఅనుజీవి.

''స్వస్థలాన్ని విడవటం నాకు సమ్మతం కాదు. అదే బలం. మొసలి నీటిలో ఉండి ఏనుగును జయించగలదు, కాని బయటికి వచ్చి కుక్కను ఎదిరించలేదు. మనం ఈ చోటు వదిలిపోతే తిరిగిరావటం కల్ల. మనకు ఐకమత్యం ఉంటే మనని ఎవరూ జయించలేరు,'' అన్నది ప్రజ్జీవి.

''మనకు కావలిసినది బలవంతుల మైత్రి. మిత్రుల అండకోరటం తప్పు కాదు. అన్నిటినీ నాశనం చేయగల నిప్పు కూడా గాలి సహాయం వద్దనదు. అయితే మనం మనస్థావరాన్ని అంటిపెట్టుకుంటేనే గాని ఇతరుల మైత్రి మనకు లభించదు. మన బలం చూసినమీదటనే ఇతరులు సహాయపడతారు. కార్చిచ్చుకు సహాయపడే గాలి, అల్పమైన మంటలను ఆర్పేస్తుంది గదా!'' అన్నది చిరంజీవి.

ఇలా మంత్రులు తమ తమ అభిప్రాయాలు చెప్పిన మీదట కాకిరాజు మేఘవర్ణం, స్థిరజీవితో, "మహాశయా, వృద్ధుడివి, ప్రాజ్ఞుడివి. మంత్రులు తమ అభిప్రాయాలు చెప్పారు. అవి విన్నమీదట నీ అభిప్రాయం ఏమిటో చెప్పు,'' అన్నది.





# కాకోలూకీయం

## 47

కాకిరాజు మేఘవర్ణం అయిదుగురు మంత్రుల అభిప్రాయాలను గురించి తన అభిప్రాయం అడిగిన మీదట వృద్ధజ్ఞాని అయిన స్థిరజీవి ఇలా అన్నది :

''నాయనా, ఇప్పుడు మనం విన్న అయిదు అభిప్రాయాలూ సుప్రసిద్ధ రాజనీతి గ్రంథాల నుంచి ఏకరువు పెట్టినవి. పరిస్థితులు మరోవిధంగా ఉంటే అవి మంచిసలహాలు కూడా కావచ్చు. కాని ఇప్పుడున్న పరిస్థితిలో శత్రువులు బలవంతులు కావటంచేత నయనీతి గాని, నయవంచన గాని అవసరం. మిగిలిన అయిదు ఉపాయాలద్వారా లభించని విజయం వీటిద్వారా, కలుగుతుంది. శత్రుస్థావరం మీద నిఘా ఉంచి, ఒక వ్యక్తిని బలికావటానికి ఒప్పించినట్టయితే, శత్రువును నాశనం చెయ్యగలం ''

''నాయనగారూ, కాకులకూ, గుడ్లగూబలకూ మధ్య ఈ గర్భశత్రుత్వం ఏర్పడటానికి కారణం ఏమిటి ?'' అని మేఘవర్ణం అడిగింది.

స్థిరజీవి ఆ కథ ఇలా చెప్పింది:

ఒకప్పుడు హంసలూ, కొంగలూ, కోయిలలూ, నెమళ్ళూ, పావురాలూ, గద్దలూ మొదలైన అడవిపక్షులు సమావేశమై ఇలా అనుకున్నాయి :

''గరుత్మంతుడు మనకు రాజు. అయినా అతని కాలమంతా నారాయణుడి సేవలోనే గడుస్తున్నది. అలాటి రాజువల్ల ఏం లాభం? మనని ఉచ్చులు వేసి పట్టుకున్నా, చంపుతున్నా కాపాడడు. ప్రజల భీతిని పారదోలి కాపాడని రాజు మృత్యువుతో సమానుడు. అందుచేత మనం మరొక పక్షులరాజును ఎన్నుకుందాం.''



అన్నిపక్షులలోకీ హుందాగా కనిపించిన గుడ్లగూబను పక్షులు తమ రాజుగా ఎన్నుకుందామనుకున్నాయి. గుడ్లగూబ పట్టాభిషేకానికి కావలిసిన సరంజామా అంతా సేకరించబడింది. పవిత్రనదుల జలాలన్నీ వచ్చాయి. సింహాసనం సిద్ధం చేసి దానిమీద పులిచర్మం కప్పారు. బ్రాహ్మణులకు ఇవ్వవలిసిన దక్షిణ పోగు చేశారు. పక్షులు స్తోత్రపాఠాలు పాడాయి. బ్రాహ్మణులు వేదపఠనం చేశారు. హారతి కర్పూరం వెలిగించి, చుట్టూ తిప్పారు. మంగళవాద్యాలు మోగాయి.

గుడ్లగూబా, దాని పెద్దభార్యా సింహాసనం మీద కూర్చున్నాయి. అభిషేకం జరగబోతూండగా కర్కశమైన కాకి అరుపు వినిపించింది. కాకి అప్పుడే వచ్చింది.

''ఈ పక్షులన్నీ ఇక్కడ చేరాయేమిటి? ఏమిటి పండగ?'' అనుకున్నది కాకి.

కాకిని చూసి మిగిలిన పక్షులు, ''పక్షులలో కాకి తెలివిగలది. మనుషులలో మంగలీ, నాలుగుకాళ్ళ జంతువులలో గుంటనక్కా, సన్యాసులలో శ్వేతాంబరులూ తెలివిగలవాళ్ళు. అందుచేత రాజును ఎన్నుకోవటం గురించి మనం కాకి అభిప్రాయం తెలుసుకోవాలి," అనుకున్నాయి.

ఈ లోపల కాకి పక్షులను చేరి, ''ఈ సమావేశం ఏమిటి? ఏదో ఉత్సవం జరుగుతున్నట్టున్నది,'' అని అడిగింది.

అవి ఇలా అన్నాయి:

''చూడు, ఇప్పుడు పక్షులకు రాజు లేడు. అందుచేత పక్షులన్నీ చేరి గుడ్లగూబను రాజుగా ఎన్నుకుని, ఈ రోజు పట్టాభిషేకం అనుకున్నాయి. నీ ఉద్దేశం ఏమిటి? సమయానికి వచ్చావు!''

కాకి నవ్వి, ''హంసా, నెమలీ, కోయిలా, చిలుకా లాటి గొప్ప గొప్ప పక్షులు, ఎంతో జ్ఞానం కలవి ఉండగా, ఈ భయంకరమైన పక్షిని, అందులోనూ పగలు చూపు అననిదాన్ని, ఎలా ఎన్నుకున్నారు? ఈ నిర్ణయం సరికాదు. నేను ఒప్పను,'' అని, ఇంకా ఇలా అన్నది:


"ఈ గుడ్లగూబకు ముక్కు వంకర. కళ్ళు మెల్ల. చూడటానికి ఉత్తప్పుడే భయంకరంగానూ, అసహ్యంగానూ ఉంటుంది. ఇక కోపం వస్తే ఎలా ఉంటుందో ఆలోచించండి. ఈ గుడ్లగూబను రాజుగా పెట్టుకుని మనం ఏం బాగుపడతాం? ఒకవేళ ఈ గుడ్లగూబలో అన్ని మంచి లక్షణాలూ ఉన్నాయే అనుకున్నా, మనకు గరుత్మంతుడు రాజుగా ఉండగా ఇంకో రాజుతో ఏం పని? ఒక రాజు ఉండగా ఇంకో రాజును ఎన్నడూ ఎన్నుకోరాదు. ఒక రాజు కిందనే రాజ్యం బాగుపడుతుంది. అనేకమంది రాజులు నాశనానికి దారి తీస్తారు. గరుత్మంతుడి పేరు వింటేనే మీ శత్రువులు పారిపోతారు. గొప్పవాడి పేరు చెబితేనే దుర్మార్గులు వణికిపోతారు. గొప్పవాళ్ళ పేరు ఉచ్చరిస్తేనే విజయం లభిస్తుంది. వెనకటికి కుందేళ్లు చందమామను తమ రాజుగా ప్రకటించి సుఖపడ్డాయి కావా?"

"ఏమిటా కథ?" అని పక్షులు కాకిని అడిగాయి. కాకి వాటికి "చంద్రసరస్సు" కథ ఇలా చెప్పింది:

ఒకానొక అరణ్యంలో చతుర్దంతం అనే గొప్ప ఏనుగుల రాజు ఉండేది. దాన్ని ఆశ్రయించుకుని అనేక ఏనుగులు ఉండేవి. చతుర్దంతం తన అనుచరులను చక్కగా కాపాడేది.

ఇలా ఉండగా పన్నెండేళ్ళ క్షామం వచ్చింది. గుంటలూ, చెరువులూ, సరస్సులూ అన్నీ ఎండిపోయాయి. అప్పుడు ఏనుగులు తమ రాజుతో, "స్వామీ, దాహానికి తట్టుకోలేక పిల్ల ఏనుగులు చచ్చిపోతున్నాయి. దయచేసి మా దాహం తీరేలాగా ఎక్కడైనా జలాశయం ఉంటే చూడు," అన్నాయి.

చతుర్దంతం వేగంగా పరిగెత్తగల ఏనుగులను అష్టదిక్కులకూ పంపి, నీరు ఎక్కడ ఉన్నదీ చూసి రమ్మన్నది. తూర్పుగా వెళ్ళిన ఏనుగులకు చంద్రసరస్సు కనబడింది.





# కాకోలూకీయం

## 48

చంద్రసరస్సులో పుష్కలంగా నీరున్నది. ఎడతెగక ప్రవహించే జల ఒకటి అందులో ఉన్నది. దాన్ని సమీపించే మార్గంలో అనేకమంది మునులు తపస్సు చేసుకుంటున్నారు. అక్కడ అసంఖ్యాకమైన హంసలూ, పావురాళ్లూ, బాతులూ, కొంగలూ ఉన్నాయి. దాని ఒడ్డున రకరకాల మహావృక్షాలుండి, వాటి కొమ్మలు నీటి మీదికి వంగి ఉన్నాయి. ఆ చెట్లకు పూతీగలు అల్లుకుని, సువాసనలు వెదజల్లుతున్నాయి. ఆ పూల కోసం వచ్చిన తుమ్మెదల దండు ఝుంకారం చేస్తున్నది. నీటిలో పెద్ద పెద్ద కెరటాలు లేచి, నురుగు తెప్పిస్తున్నాయి. సరస్సులో ఎర్ర తామరలూ, తెల్ల తామరలూ ప్రకాశిస్తున్నాయి. ఒడ్డున గల దట్టమైన పొదలు సూర్యుడి వేడిని అరికట్టి, ఆ ప్రదేశాన్ని చల్లగా ఉంచుతున్నాయి. ఏనుగులు తిరిగి వెళ్ళి, తమ నాయకుడైన చతుర్దంతానికి ఈ సరస్సు గురించి చెప్పాయి.

అప్పుడు చతుర్దంతమూ, ఇతర ఏనుగులూ చంద్రసరస్సు వద్దకు వచ్చి, అన్ని పక్కల నుంచీ అరిదులోకి చొరబడ్డాయి. అవి తమ దాహం తీర్చుకుని, చిత్తం వచ్చినట్టు నీటిలో చాలాసేపు ఓలలాడి, తమ అరణ్యానికి తిరిగి పోయాయి.

సరస్సు ఒడ్డున బొరియలలో అనేక వేల కుందేళ్లు నివసిస్తున్నాయి, ఏనుగులు నీటి కోసం వెర్రిగా పరిగెత్తి రావటంలో వాటి కాళ్ళకింద పడి అనేక వందల కుందేళ్ళు చచ్చాయి. అంతకన్న ఎక్కువ సంఖ్యలో గాయపడాయి.




ఏనుగులనన్నిటిని తిరిగి వెళ్ళిపోనిచ్చి, చావగా మిగిలిన కుందేళ్ళు సమావేశం జరిపి, ఇలా అనుకున్నాయి:

"ఏమిటి కర్తవ్యం? మనకు నాశం తప్పదు. ఏనుగులు ఈ సరస్సుకు రోజూ రాకమానవు. ఎందుకంటే ఈ సరస్సులో తప్ప చుట్టుపట్ల ఎక్కడా నీరులేదు. అందుచేత మనం సర్వనాశనం కాకుండా ఉండాలంటే, ఏనుగులు ఈ సరస్సుకు రాకుండా చెయ్యటానికి ఏదైనా మార్గం ఆలోచించాలి."

విజయ అనే ముసలి కుందేలు గాయపడిన కుందేళ్ళనూ, పిల్లలనూ, భార్యలనూ పోగొట్టుకున్న కుందేళ్ళనూ చూసి అమితమైన విచారం పొంది, "విచారించకండి, తమ్ముళ్ళూ. మనమే చిహ్నంగా గల చంద్రదేవుడి సహాయంతో నేను పథకం వేస్తాను," అన్నది.

ఈ మాట విని కుందేళ్ళరాజు సిలీముఖం ఇలా అన్నది:

"విజయా, నువు న్యాయసూత్రాలు తెలిసిన సమయజ్ఞుడివి, వెళ్ళిరా! ఏం చేస్తావో అదంతా నీకే వదులుతున్నాను. నువు మాత్రం కార్యం సాధించుకురా!"

విజయ మర్నాడు సాయంత్రం కష్టసాధ్యమైన కార్యభారం మీద వేసుకుని బయలుదేరింది. దానికి దారిలో చతుర్దంతమూ, ఇతర ఏనుగులూ సరస్సుకు వస్తూ ఎదురుపడ్డాయి. ఏనుగులు నల్లమబ్బుల్లాగానూ, వాటి ఘీంకారాలు ఉరుముల్లాగానూ ఉన్నాయి. వాటినిచూసి విజయ, "వీటి మధ్యకు వెళ్ళటం ప్రమాదకరం. నేను నజ్జునజ్జు కావటానికి వాటి స్పర్శ చాలు," అనుకుని, ఒక ఎత్తయిన కొండరాయి మీదికి ఎక్కి, "ఏనుగులరాజా, క్షేమమా?" అని చతుర్దంతాన్ని అడిగింది.

విజయను చతుర్దంతం అతికష్టం మీద పొడగని, "ఎవరు నువు?" అని అడిగింది.

"నేను రాయబారిని," అన్నది విజయ.

"నిన్నెవరు పంపారు?" అని చతుర్దంతం అడిగింది.

'చంద్రదేవుడు,'' అన్నది విజయ తొణకకుండా.

'' ఎందుకు పంపాడు ? '' అని ఏనుగు అడిగింది.


" దూతను అవమానించరాదని తమకు తెలుసు. నేను నా ఏలిక చెప్పమన్న మాటలే చెబుతాను. చంద్రదేవుడు ఇలా చెప్పమన్నాడు : 'చంద్రసరస్సు నాదని ప్రపంచమంతా ఎరుగును. మీరు అక్రమంగా వచ్చి. దాని పవిత్రతను పాడు చేశారు. అంతేగాక శశాంకుడి నైన నాకు చిహ్నంగా ఉండే కుందేళ్లను చాలావాటిని సరస్సు ఒడ్డున తొక్కి చంపారు. ఇన్ని మాట లెందుకు? మీరు నా సరస్సు జోలికీ, నా కుందేళ్ళ జోలికీ రావటం మానకపోయారో మీకు ఘోరమైన విపత్తు కలుగుతుంది. నా దయ వల్ల, నేను ప్రసరించే వెన్నెలలో మీరు నా అరణ్యంలో స్వేచ్ఛగా మసలగలుగుతున్నారు. మీరు నా సరస్సు జోలికి మళ్ళీ వచ్చారంటే నా చల్లని కిరణాలను ఉపసంహరించి, మీకు వేడి పుట్టించి, నెత్తురుగడ్డలు లేచి భయంకరంగా చచ్చేటట్టు చేస్తాను'.''

ఈ సందేశం విని చతుర్దంతం చాలా భయపడి విజయతో, '' మిత్రమా, నేను చంద్రదేవుడికి చాలా అపచారం చేశాను. నన్ను ఆయన దగ్గిరికి తీసుకుపోతే క్షమాపణ చెప్పుకుంటాను,'' అన్నది.

విజయ చతుర్దంతాన్ని చంద్రసరస్సుకు తీసుకుపోయి, సరస్సులో ప్రతిబింబించిన చంద్రుణ్ణీ, నక్షత్రాలనూ చూపింది. ఏనుగు తన తొండంతో నీరు తీసుకుని మీద పోసుకున్నది. నీటి కదలిక వల్ల అందులో వెయ్యి చంద్రబింబాలు ఏర్పడ్డాయి.

ఏనుగు విజయను, చంద్రదేవుడికి తన మీద ఎందుకు కోపంవచ్చిందని అడిగింది; '' నువు నీటిని తాకినందున,'' అని విజయ చెప్పింది.

ఏనుగు హడలిపోయి, చంద్రబింబానికి సాష్టాంగపడి, '' ఇంక ఎన్నడూ ఇక్కడికి రాను,'' అని క్షమాపణ చెప్పుకుని, అక్కడినుంచి వెళ్ళిపోయింది.






## 49

కాకి అక్కడ సమావేశమైన పక్షులకు, ''చంద్రసరస్సు'' కథ చెప్పి, ''విన్నారు గదా, బలవంతుడైన నాయకుడు రక్షగా వున్నాడని తెలిస్తేనే, శత్రువులు ఎలా హడలెత్తి పారిపోతారో? తెలివితేటలూ, వివేకం గల యింతమంది మీరిక్కడ చేరి, వికారాకారం, నీచబుద్ధీ గల యీ గుడ్లగూబను రాజుగా ఎన్నుకోవటం వింతగా వుంది. నిజంగా శత్రువుల నుంచి మనకు ప్రమాదం సంభవిస్తే, యీ గుడ్లగూబ మనను రక్షించగలదని మీరు నమ్ముతున్నారా?'' అని అడిగింది.

''నువ్వు వచ్చేవరకూ అలాగే నమ్మాం. కాని, నువు చెప్పినది విన్న తరవాత మా అందరికీ గుడ్లగూబ శక్తి సామర్థ్యాల మీద శంక కలుగుతున్నది.'' అన్నవి పక్షులు.

''ఛీ, ఛీ! యింకా మీకు యీ లేకి జాతి గుడ్లగూబ అంటే అసహ్యం కలిగినట్టు లేదు. ఇలాంటిది మనకు రాజయితే, మన పక్షిజాతే సర్వనాశనం అయిపోయే ప్రమాదం వున్నది. ఇలాంటి తుచ్ఛుల దగ్గిర న్యాయం కోరి పోయిన కుందేలూ, కౌజుపిట్టా నా కళ్ళ ఎదటనే ఘోర మరణం పాలవటం నే నెరుగుదును,'' అన్నది కాకి.

''ఏమిటా కథ?'' అని పక్షులు కాకిని అడిగాయి.

కాకి వాటికి కుందేలూ, కౌజుపిట్టల కథ యిలా చెప్పింది:

కొంతకాలం క్రితం నేనొక నదీతీరంలోని చెట్టు మీద నివసిస్తూండేదాన్ని. ఆ చెట్టు కింది భాగంలో వున్న ఒక తొర్రలో ఒక కౌజుపిట్ట వుంటూండేది.



ఇద్దరం ఒకే చెట్టును ఆశ్రయించి వుండటం వల్ల, మా ఇద్దరి మధ్యా మంచి స్నేహం ఏర్పడింది. పగలల్లా అరణ్యంలో ఆహారం వెతుక్కొని, చీకటి పడేవేళ మా నివాసం అయిన చెట్టును చేరగానే, ఒకళ్లకొకళ్లం, ఆ నాటి అనుభవాలను గురించి చెప్పుకునేవాళ్లం.

ఇలా వుండగా ఒకనాడు ఉదయమే ఆహారం కోసం అరణ్యంలోకి పోయిన కౌజుపిట్ట, రాత్రి పొద్దుపోయినా తిరిగి రాలేదు. దానికి ఏదో ప్రమాదం జరిగి వుంటుందని నేను భయపడ్డాను. అరణ్యంలో మనలాంటి సన్నకారు జీవాలకు అన్నీ ప్రమాదాలే కద! కౌజుపిట్ట ఏ బోయ వాడి వలలోనే చిక్కిందేమో! ఏ నక్కో, తోడేలో హఠాత్తుగా మీదపడి ప్రాణాలు బలిగొన్నవేమో!

నా ప్రియమిత్రుడి కోసం కొన్ని రోజుల పాటు ఆ చుట్టుపక్కల అంతా గాలించాను. కాని ఎక్కడా జాడ కనిపించ లేదు. కొద్ది రోజుల తరవాత ఒక కుందేలు నేనుండే చెట్టు దగ్గిరకు వచ్చి, లోగడ కౌజుపిట్ట నివసించిన తొర్రలో ప్రవేశించింది. దాని పేరు శీఘ్రగుడు.

నా మిత్రుడి నివాసాన్ని ఆక్రమించిన యీ కుందేలును గట్టిగా కోప్పడి, అక్కడి నుంచి పంపేద్దామనుకున్నాను. కాని, కౌజుపిట్ట యింకా బతికి వుంటుందన్న ఆశ నాకు లేదు. అందువల్ల కుందేలు శీఘ్రగుణ్ణి ఏమీ అనకుండా వూరుకున్నాను.

ఈ లోకంలో ప్రాణులు తమ జీవిత గమనంలో ఎన్ని అద్భుతాలను చూడవలసి వస్తుంది! మరణించి వుంటుందని ఆశ వదులుకున్న కౌజుపిట్ట ఒకనాడు హఠాత్తుగా తిరిగి వచ్చింది. ఇప్పుడది లోగడకన్న చాలా దృఢంగా వున్నది; శరీరం మీద ఈకలు నిగనిగ మెరుస్తున్నాయి. ఇంతకాలంగా ఎక్కడో ఆహార సమృద్ధి వున్న చోట కడుపారా తింటూ కాలం గడిపి వుంటుంది.

కౌజుపిట్ట వస్తూనే తన తొర్రను ఆక్రమించిన కుందేలు శీఘ్రగుణ్ణి చూసి మండిపడి, ఘాటైన మాటలతో నానా తిట్లూ తిట్టి, ''ఏయ్, కుందేలూ! నేను ఇంట లేనప్పుడు వచ్చి, నా నివాసస్థానాన్ని ఆక్రమించటం ఒళ్ళు బుద్ధితక్కువ పని. మంచిగా చెబుతున్నాను, తక్షణం యిక్కణ్ణించి వెళ్ళిపో!'' అన్నది.

కౌజుపిట్ట మాటలకు కుందేలు పకపకా నవ్వి, ''నువ్వేదో మందమతిలా వున్నావు. పూర్వం ఎన్నడో కొన్నాళ్ళపాటు ఒక ఇంట వున్నంత మాత్రానే, ఆ ఇల్లు శాశ్వతంగా నీ సొంతం కాదు. ఈ అతి స్వల్ప విషయం కూడా తెలియదా?'' అన్నది.

కౌజుపిట్ట యీ సారి మరింతగా మండి పడుతూ, ''ఓయ్, బుద్ధిహీనుడా, నాకే ధర్మసూక్ష్మాలు బోధిస్తున్నావా? నాకూ అంతో యింతో ధర్మశాస్త్రజ్ఞానం లేక పోలేదు. ఇళ్ళూ, బావులూ, తోటలూ— ఇలాంటివాటి విషయమై తగువు వచ్చినప్పుడు, అవి ఎవరికి న్యాయంగా చెందాలో తేల్చి చెప్పేందుకు, ఇరుగు పొరుగున నివసించేవాళ్ల సాక్ష్యం ఒక్కటే ఆధారమని ధర్మశాస్త్రం తెలిసిన వాళ్ళు చెపుతారు. నువ్విప్పుడాక్రమించిన నా నివాసం గురించి, సాక్షులను పిలిచి, న్యాయం అడుగుదామా?'' అన్నది.

కుందేలు శీఘ్రగుడు ఈసడిస్తున్నట్టు ముఖంపెట్టి, చెవులాడించి, ''మనిద్దరికీ తెలిసిన ధర్మశాస్త్రజ్ఞానాల మధ్య ఏదో పెద్ద అంతరం వున్నట్టున్నది. ఒకసారి వదిలిపోయిన నివాసస్థానం తిరిగి నాదే అని చెప్పే హక్కు ఎవరికీ లేదు. మనుషుల మాట నాకు బాగా తెలియదు గాని, మనబోటి అధమజాతి జీవుల హక్కు భుక్తాల గురించి, ధర్మశాస్త్రం తెలిసిన వారు ఏమి చెపుతారో నాకు బాగా తెలుసు. మనం నివసించే గృహంలో పిల్లలను కని, పెద్ద చేసేవరకే మనకా గృహం మీద హక్కు వుంటుంది. తరవాత దాన్ని ఎవరైనా ఆక్రమించుకోవచ్చు.'' అన్నది.





# కాకోలూకీయం

## 50

తన నివాసాన్ని గురించి కౌజుపిట్టకూ, కుందేలుకూ చాలాసేపు వాదులాట జరిగింది. చివరకు కౌజుపిట్ట విసిగి, "ధర్మం, న్యాయంలాంటి వాటి మీద నీకు అంత నమ్మకం వుంటే, అది తెలిసిన శాస్త్రజ్ఞుల దగ్గరకు పోయి మన తగవు తీర్చుకుందాం. వాళ్లు ఏలాంటి తీర్పు యిచ్చినా దానికి నేను కట్టుబడి వుంటాను, మరి నీ మాటేమిటి?" అన్నది.

"సర్వం తెలిసిన శాస్త్రజ్ఞుల తీర్పుకు తలవంచనివాడు మహాపాపి. నేనూ, వాళ్ల తీర్పుకు బద్ధుడనవుతాను," అన్నది కుందేలు.

ఆ వెంటనే కౌజుపిట్టా, కుందేలూ తమ తగవు తీర్చి, న్యాయం చెప్పేవాడి కోసం బయలుదేరినై. ఏం జరుగుతుందో చూద్దామన్న కుతూహలం కొద్దీ నేను వాళ్ళ వెనకే బయలుదేరాను. దారిలో కుందేలు శీఘ్రగుడు, కౌజుపిట్టతో, "మిత్రమా! మనం ఎవరి దగ్గరకు న్యాయం కోసం పోతున్నామో, చెప్పావుకాదే?" అన్నది.

ఆ ప్రశ్నకు కౌజుపిట్ట ఎంతో సంతోషంగా, "నదికి కొంచెం ఎగువున, ఇసుక తిన్నెలూ, పొదలూ వున్న ప్రాంతాన నివసించే దధికర్ణుడు అనే మార్జాలమౌని సంగతే నీకు తెలియదా? ఆయన ఒకప్పుడు అరణ్యంలో తన జాతి అడవి పిల్లులలాగే, ఘోర కృత్యాలు చేస్తూ జీవించాడు. తరవాత మనస్సు మారి, నదీ తీరంలో నివసిస్తూ, దైవ ప్రార్థనలో కాలం గడుపుతున్నాడు. ఆయన గొప్ప ధర్మశాస్త్రజ్ఞుడు," అన్నది.

త్వరలోనే అవి గమ్యస్థానం చేరాయి. అడవిపిల్లి తెగబలిసి ఉండటమూ, దాని



కోరలూ, చూపులూ మహా వాడిగా ఉండటమూ చూసి, కుందేలు లోలోపల బెదిరిపోయి, కౌజుపిట్టతో, "ఈ నీచమైన దుర్బుద్ధిని సలహా అడగటంలో అర్థం ఏముంటుంది? ఇలాటి కపట సన్యాసులు ప్రతి పుణ్యనదీ తీరానా ఉంటారు," అన్నది.

ఈ మాటలు విని దధికర్ణుడు, తాను తన ఉదరపోషణ నిమిత్తం సన్యాసి వేషం వేసినప్పటికీ, తన వద్దకు వచ్చిన ఫిర్యాదు లిద్దరినీ వంచించి, వాళ్ళకు తనలో నమ్మకం కుదిరేటట్టు చేయ నిశ్చయించింది. అందుకోసం అది కళ్ళు మూసుకుని, సూర్యుడి కేసి తిరిగి, కాలు నేలకు సగం ఆనించి, చెయ్యి పైకెత్తి ఇలా నీతులు పలికింది:

"సత్యాన్వేషకులారా, వినండి! ఈ జీవితం పరమ నిరర్థకమైనది. అది క్షణ భంగురం. ప్రియ సాంగత్యం వల్ల కలిగే సుఖం కలలోని దృశ్యాలవలె అవాస్తవమైనవి. భార్యా, పుత్రులూ, సంసారమూ ఇవి గారడీవాడి మాయాజాలం. అందుచేత పుణ్యకార్యాలు చెయ్యకుండా జీవించేవాడు శ్వాసించినప్పటికీ, వాడి శ్వాసకూ కమ్మరి కొలిమితిత్తి గాలికీ తేడా ఏమీ లేదంటారు. నీతిమాలిన జ్ఞానం, కుక్కతోకలాగ నిరుపయోగం—అది ఈగలను తోలటానికిగాని, మానం దాచటానికిగాని పనికిరాదు. చెట్టు అందం పూలూ, కాయలూ; పెరుగులోని సారం నెయ్యి; గానుగ చెక్కసారం నూనె; మనిషిలోని సారం ధర్మం. మీకు ధర్మం గురించి సూక్ష్మంగా చెప్పాను. ఇన్ని మాటలెందుకు? పరోపకారం పుణ్యం, పరపీడనం పాపం! మీరు ఈ ఒక్క మాటా గుర్తుంచుకుని, అలా ఆచరించండి, చాలు!"

ఈ ఉదాత్తమైన మాటలు విని కుందేలు కౌజుపిట్టతో, "నువ్వన్నది నిజం. ఈ పిల్లి నిజమైన సన్యాసి, మహా పుణ్యజీవి. పై ఆకారం చూసి నేను పొర

బట్టాను. ఆయన పలుకులు నాలో విశ్వాసం కలిగించాయి. మన తగాదా తీర్చమని ఆతన్ని కోరుదాం,'' అన్నది.

''సరే! అయితే జన్మతః ఇది అడవి పిల్లి గనకా, మనకిద్దరికీ జన్మ శత్రువు గనకా, అపాయం లేకుండా దూరంగా నిలబడి మాట్లాడదాం,'' అన్నది కౌజుపిట్ట.

తరవాత ఆ రెండూ దూరంగా నిలబడి ఇలా అన్నాయి :

'''ఓ మహాత్మా, సుశోభకా! మా ఇద్దరి మధ్య ఒక తగాదా వచ్చింది. ధర్మశాస్త్ర కోవిదులైన తమరు మా తగాదా ధర్మ సమ్మతంగా పరిష్కరించాలి. మాలో ఎవరి ఫిర్యాదు అక్రమమైతే వారిని తమరు భక్షించవచ్చు.''

''మిత్రులారా, నాతో అలాంటి మాటలు అనకండి. ప్రాణాలను చంపి తినటం నరక హేతువు కావటం చేత నేను ఆ అలవాటు ఏనాడో మానేశాను. మతంలో అహింస పరమధర్మం కావటం చేత, పేలూ, నల్లులూ, దోమలూ లాటి వాటిని కూడా చంపరాదంటారు. ఇతర ప్రాణులను తిని జీవించే ఘాతుక మృగాలను చంపేవాళ్ళు కూడా ఘోర నరకానికి పోతారట. అలాటప్పుడు నిరపాయమైన ప్రాణులను చంపేవారికి నరకం ఎలా తప్పుతుంది. యజ్ఞాలలో పశువులను బలి ఇచ్చేవారు కూడా వేదాలను సరిగా అర్థం చేసుకోని మూఢులే. చెట్లను నరకటమూ, జంతువులను చంపటమూ, రక్తపాతం కలిగించటమూ, వీటితో మనిషికి స్వర్గం లభించే మాటుంటే, ఏం చేసిన వాళ్ళు నరకానికి పోతారు? ఆ మాట ఈ మూఢులు ఆలోచించారా? అదంతా అలా ఉండనివ్వండి. నేను మీలో ఒకరిని తినాలన్నది అసంగతం. అలా ఎన్నటికీ చెయ్యను. నా ధర్మం నేను నెరవేర్చి, నా బుద్ధికి తోచిన విధంగా మీకు తీర్పు చెబుతాను. నాకు వయసు మళ్ళింది. అంతబాగా వినపడదు. మీరు దగ్గిరికి వచ్చి, మీ ఫిర్యాదేమిటో చెప్పండి.'' అన్నది దధికర్ణుడు.






## 50

ఆ పాపిష్ఠి పిల్లి మాటలు నమ్మి, మతి మాలిన కుందేలూ, కౌజుపిట్టా దాన్ని సమీపించాయి. అది ఒకేసారి రెంటి మీదా పడి, ఒకదాన్ని పంజాతో కొట్టి, రెండోదాన్ని తన వాడి కోరలతో పట్టి, రెంటినీ పొట్టన పెట్టుకున్నది.

కాకి ఈ కథ చెప్పి ఇంకా ఇలా అన్నది: ''పగలు కళ్ళు కనిపించని గుడ్లగూబను రాజుగా చేసుకుని, రాత్రి కళ్ళు కనిపించని మీరంతా అలాగే నాశనంఅయి పోతారు. అందుచేత బాగా ఆలోచించి మీ కర్తవ్యం నిర్ణయించుకోండి.''

ఈ మాటలు విని పక్షులు, ''కాకి చెప్పినమాట నిజం. మనం మరొకసారి సమావేశమై, మనకు ఎవరు రాజుగా ఉండాలో నిర్ణయించుకుందాం,'' అనుకుని, తమ స్థావరాలకు ఎగిరిపోయాయి.

దివాంధమైన గుడ్లగూబ మాత్రం తన భార్యతో సింహాసనం మీద కూర్చుని, అభిషేకస్నానంకోసం ఎదురుచూస్తున్నది. కొంతసేపు చూసి అది, ''ఎవరక్కడ? పట్టాభిషేకం ఇంకా పూర్తికాలేదేం?'' అన్నది.

దానికి గుడ్లగూబ భార్య, ''ప్రియా, నీ పట్టాభిషేకాన్ని కాకి పడగొట్టేసింది. పక్షులన్నీ తలా ఒక దారీ అయి వెళ్ళిపోయాయి. ఎందుచేతనో కాకి మాత్రం ఇంకా ఇక్కడే ఉన్నది. ఇకలే. నిన్ను ఇంటికి చేర్చుతాను,'' అన్నది.

ఈ మాట విని గుడ్లగూబ విచారంగా కాకితో, ''ఓ దుర్మార్గపు కాకీ, నేను నీకు ఏం ద్రోహం చేశానని నా పట్టాభిషేకానికి భగ్నం కలిగించావు? ఈనాటి నుంచీ నీ జాతికీ, నా జాతికీ మధ్య బద్ధవైరం



ఉండుగాక! నరికిన అరణ్యం మళ్లీ పెరుగుతుంది గాని పరుషవాక్యాలు చేసిన గాయం ఎన్నటికీ మానదు,'' అని తన భార్య వెంట తన నివాసానికి వెళ్ళిపోయింది.

అప్పుడు కాకి ఇలా అనుకున్నది:

''అయ్యో, ఇవాళ ఇలా మాట్లాడి అనవసరంగా శత్రుత్వం కొని తెచ్చుకున్నాను గదా! స్థల, కాల, పరిస్థితులు పాటించకుండా ఆడిన అనవసరపు మాటలు, అందులోనూ బాధ కలిగించి, మాట్లాడిన వారి నీచబుద్ధిని వ్యక్తంచేసేవి ఉత్తమాటలు కావు, ఘాటైన విషంతో సమానమంటారు. ఎంత బలం గల వాడైనా, వివేకి అయినవాడు బుద్ధిపూర్వకంగా శత్రువులను చేసుకోరాదు. తన వద్ద విరుగుడు ఉన్నది కదా అని వివేకి గరళం తాగుతాడా? తెలివిగలవాడు పదిమందిలో ఇతరులను అవమానించరాదు.''

ఇలా అనుకుంటూ కాకి తన నివాసానికి వెళ్లిపోయింది.

గుడ్లగూబ పట్టాభిషేకం తప్పిపోయిన కథ విని, కాకులకు రాజైన మేఘవర్ణం, ''అయ్యో, ఇది భయంకరమైన జాతి వైరమై కూర్చున్నదే! రాజనీతి చతురత గాని, వంచన గాని ప్రయోగించి, తెలివితేటలుగల ఈ గుడ్లగూబలను మంచి చేసుకోవటం సాధ్యమంటావా?'' అన్నది.

''ఎందుకు సాధ్యం కాదు? కొందరు దొంగవెధవలు మోసంచేసి, తెలివితేటలుగల బ్రాహ్మడి మేకను కాజేసిన కథ వినలేదా?'' అని స్థిరజీవి అడిగింది.

''ఏమిటా కథ?'' అని మేఘవర్ణం అడిగిన మీదట స్థిరజీవి, బ్రాహ్మణుడి మేక కథ ఇలా చెప్పింది:

మిత్రవర్మ అనే బ్రాహ్మడు నిత్యాగ్నిహోత్ర నియమం గలవాడు. మాఘమాసం వచ్చింది. ఈదురుగాలి వీస్తున్నది. ఆకాశమంతా మబ్బులు కమ్మి, తుంపర పడుతున్నది. అలాంటి

సమయంలో ఆ బ్రాహ్మడు యజ్ఞంచేసి బలి ఇయ్యటానికి మేకను యాచించ టానికి దూరగ్రామం వెళ్ళి, ఒక ధని కుడితో, ''అయ్యా, వచ్చే అమావాస్యనాడు నేను ఒక మేకను బలి ఇద్దామను కుంటున్నాను. దయచేసి ఒక మేకను ఇప్పించండి,'' అని అడిగాడు. ధనికుడు బ్రాహ్మడికి ఒక బలిసిన మేకను ఇచ్చాడు.


బ్రాహ్మడు ఆ మేకను వీధి వెంట తీసుకుపోదామని చూస్తే, అది అటూ ఇటూ పరిగెత్తి, తన స్వస్థలం విడిచి, కొత్తవాడి వెంట వెళ్ళటానికి నిరాకరిం చింది. అతి కష్టంమీద బ్రాహ్మడు మేకను పట్టుకుని, మళ్ళీ అది పారిపోకుండా దాన్ని తన భుజాలమీద వేసుకుని, తన ఊరికి బయలుదేరాడు.

ఆ మేక తప్పించుకు పోవటానికని తన్నుకుంటూ ఉండటం ముగ్గురు పేద దొంగవెధవల కంటపడింది. వాళ్ళు ఆకలితో బాధపడుతున్నారు. వాళ్ళలో వాళ్లు, ''మనం ఈ మేకను తినగలిగితే చలిబాధకు తట్టుకోగలుగుతాం. అందు కోసం మనం ఈ పిచ్చి బ్రాహ్మణ్ణి మోసంచేద్దాం,'' అనుకున్నారు. ఏం చెయ్యాలో నిర్ణయించుకున్న అనంతరం ముగ్గురూ విడిపోయారు.

బ్రాహ్మడు కొంతదూరం వెళ్ళాక ఒక దొంగవెధవ రైతువేషంలో బ్రాహ్మడికి ఎదురుపడి, ''అయ్యవారూ, ఆ గజ్జి కుక్కను భుజాల కెత్తుకుని మోస్తున్నా రేమిటి? ఎవరన్నా చూస్తే ఏమను కుంటారు? కుక్కా, కోడీ, చండాలుడూ అంటరానివని పెద్దలు చెబుతారుగదా! తమలాటి సద్బ్రాహ్మలు వాటిని తాక వచ్చునా?'' అన్నాడు.

బ్రాహ్మడికి కోపం వచ్చి, ''మేకను పట్టుకుని కుక్క అంటావు, నీ కేమన్నా కళ్ళు కనిపించటం లేదా?'' అన్నాడు.

''అయ్యా, కోపం దేనికి? అభ్యంతరం లేకపోతే ఆ కుక్కను అలాగే మోసుకు వెళ్లండి,'' అంటూ వాడు వెళ్లిపోయాడు.






## 52

బ్రాహ్మడు మరికొంత దూరం వెళ్ళాక రెండో దొంగవెధవ కూలివాడి వేషంలో ఎదురుపడి, "ఛీ, ఛీ! ఈ చచ్చిన దూడ నీకు ఇష్టం అయి ఉండుగాక, అంత మాత్రాన దాన్ని భుజాల కెత్తుకుంటారా? క్షుద్రజంతువులనూ, శవాలనూ ముట్టు కున్నందుకు ప్రాయశ్చిత్తంగా పంచగవ్యాలు తినటమో, చాంద్రాయణవ్రతం చెయ్యటమో అవసరమని పెద్దలు చెబుతారు గద!" అన్నాడు.

"నీ కళ్ళేమన్నా పోయాయా? బతికున్న మేకను పట్టుకుని చచ్చిన దూడ అంటావేం?" అని బ్రాహ్మడు మండిపడ్డాడు.

"స్వామీ, కోపగించకండి. ఉన్నమాట అనే అలవాటు నా కున్నది. మీ ఇష్టం వచ్చినట్టు చెయ్యండి," అన్నాడు వాడు.

బ్రాహ్మడు మరికొంత దూరం వెళ్ళాక మూడో దొంగవెధవ గొర్రెలకాపరి వేషంలో ఎదురువచ్చి, "బ్రాహ్మడా, గాడిదను భుజాలమీద మోయటం ఏమైనా బాగుందా? గాడిదను తెలియక ముట్టుకున్నా కూడా సచేలస్నానం చెయ్యవలసినదే గదా! ఎవరన్నా చూసేలోపల దాన్ని అవతల పారెయ్యి." అన్నాడు.

అప్పుడు బ్రాహ్మడు తనలో, "ఈ మేక ఏదో రాక్షసి అయి ఉంటుంది. నన్ను మోసం చేసి, నాశనం చెయ్యటానికి ఈ రూపు ధరించి ఉంటుంది. రాక్షసి కాకపోతే ఒకరికి కుక్కలాగా, మరొకరికి చచ్చిన దూడలాగా, ఇంకొకరికి గాడిదలాగా కనబడుతుందా?" అనుకుని, ఆ మేకను అక్కడె పారేసి, కాలినట్టువ కొద్దీ తన ఊరికి పరిగెత్తాడు.

పంచతంత్రం



తరవాత ముగ్గురు దొంగవెధవలూ దాన్ని వండుకుని, కడుపారా తిన్నారు.

స్థిరజీవి మోసపోయిన బ్రాహ్మణుడి కథ చెప్పి ఇంకా ఇలా అన్నది:

"కొత్తగా వచ్చిన సేవకుడి శ్రద్ధా, భోజనానికి వచ్చిన అతిథుల ప్రశంసలూ, యువతి కన్నీళ్ళూ, మోసగాడి వాక్చాతుర్యమూ చూసి మోసపోనివాడు ఎక్కడైనా ఉంటాడా? గుడ్లగూబలు తప్పు చేస్తున్నాయి. వ్యక్తి బలహీనమైనా సంఖ్యాబలం ఉన్నచోట శత్రుత్వం తెచ్చుకోరాదు. ఈ కాకులకు సంఖ్యాబలం ఉన్నది. అందుచేత హెచ్చరికగా ఉండాలి. ఒక మహాసర్పం కోటి చీమలతో వైరం తెచ్చుకుని, సర్వనాశనమయిపోయింది కాదా?"

"ఏమిటా కథ?" అని మేఘవర్ణం అడిగింది.

స్థిరజీవి చీమల చేత చచ్చిన పాము కథ ఇలా చెప్పింది:

ఒకప్పుడు మహాకాయం అనే పెద్ద కాల సర్పం ఉండేది. అది తన మహాకాయాన్ని, బలాన్ని చూసుకుని గర్వపడుతూ, చాలా అహంభావంతో ఉండేది. ఒకరోజు అది పుట్ట నుంచి పెద్ద రంధ్రం గుండా బయటికి రావటానికి బదులు, తన శక్తిని నమ్ముకుని చిన్న రంధ్రం గుండా రావటానికి ప్రయత్నించి, మట్టి చాలా గట్టిగా ఉండటంచేత శరీరమంతా గాయపరచుకున్నది. ఆ గాయాల నుంచి వచ్చే రక్తం వాసన తగిలి, ఉత్సాహంతో, వేలకొద్దీ కండచీమలు దాన్ని పట్టుకుని తినసాగాయి. పాము అనేక వందల చీమలను చంపింది. మరిన్ని వందల చీమలను గాయపరిచింది. కాని మిగిలిన వేలాది చీమలు దాన్ని పట్టుకుని తినేశాయి.

ఈ కథ చెప్పి, స్థిరజీవి మేఘవర్ణాన్ని ఎడంగా తీసుకుపోయి, "ఈ మాట నీలోనే ఉంచుకో. నేను చెప్పేదంతా శ్రద్ధగా విని అలా చెయ్యి. మనకు గొప్ప ఆపద

రానున్నది. తగిన చర్యలు తీసుకోక పోయామా, నిశ్చయంగా నాశనమై పోతాం. ఇచ్చకాలమాటలూ, బహూకృతులూ, కుట్రలూ, సంఘర్షణా అనే నాలుగు సాధనాలూ మనకు ఉపకరించవు. అందుచేత నా సూచన ఏమంటే: నన్ను బహిరంగ సభలో తీవ్రంగా దూషించి, నా శరీరం నిండా రక్తం పులిమి శత్రుగూఢచారులకు నమ్మకం కలిగించి, నన్ను మర్రిచెట్టు మొదలు దగ్గిరపారేసి, సపరివారంగా ఇక్కడినుంచి తేళ్ళకొండ వద్దకు వెళ్ళాలి. అది రెండు కోసులదూరంలో ఉన్నది. నేను వంచన ద్వారా శత్రువు విశ్వాసం సంపాదించి, వాళ్ళ స్థావరాలు తెలుసుకుని, పట్టపగలు అవి గుడ్డివి గనక, అన్నిటిని చంపి వచ్చేసే వరకూ మీరు అక్కడె ఉండండి,'' అన్నది.

అవి మంత్రాలయానికి తిరిగివచ్చాక స్థిరజీవి కాకిరాజుతో, ''నీకు శక్తి సామర్థ్యాలు లేవు. నీ వల్ల కాకులకు మేలు ఎలా జరుగుతుంది?'' అని ఆక్షేపణగా అన్నది.

కాకి మంత్రులు మండిపోయి, సేనాపతులను పురమాయించి, స్థిరజీవిని హతమార్చటానికి ఉపక్రమించారు. కాని మేఘవర్ణం, ''ఈ దుర్మార్గుణ్ణి నాకు వదలండి,'' అని చెప్పి, స్థిరజీవి మీద పడి, భయంకరంగా పొడుస్తున్నట్టు అభినయిస్తూ, దాని శరీరం నిండా రక్తం పులిమి, దాన్ని చెట్టు మొదట్లో పారేసింది. తరవాత అది సపరివారంగా తేళ్ళకొండకు వెళ్ళిపోయింది.

గుడ్లగూబలలో వేగుచెయ్యటంలో అందరినీ మించినది అరిమర్దనం భార్య. అది స్థిరజీవి పతనం అంతా కనిపెట్టి, సంగతంతా అరిమర్దనానికి చెప్పింది. స్థిరజీవి చెట్టుమీది నుంచి కిందపడగానే అది వెళ్ళిపోవడంచేత, మేఘవర్ణం సపరివారంగా చెట్టు విడిచి వెళ్ళిన సంగతి దానికి తెలియదు. వెళ్ళిపోతున్నారని మాత్రమే తెలుసు.





# కాకోలూకీయం

## 53

చీకటి పడే వేళకు అరిమర్దనం తన అనుచరులతో కాకులను వేటాడటానికి మర్రిచెట్టు వద్దకు వచ్చి, "రాజుకూ, కుల పెద్దకూ చెడిందిగనకనూ, వాళ్ళు వెళ్ళి పోయే ప్రయత్నంలో ఉన్నారుగనకనూ, మనకు పెద్ద ప్రతిఘటన ఉండబోదు," అన్నది.


గుడ్లగూబలు పెద్ద అట్టహాసంతో మర్రి చెట్టు మీద విరుచుకు పడ్డాయి. కాని ఆ చెట్టుపైన ఒక్క కాకి కూడా లేదు. వాటికి చెట్టుకింద గాయపడి, హీనస్వరం పడి ఉన్న స్థిరజీవి మాత్రమే కనిపించింది. గుడ్లగూబలు దాన్ని చంపబోతే, అది వాటితో, "నన్ను చంపకండి. నన్ను మీ రాజు దగ్గిరికి తీసుకుపొండి. నేను అతనికి చాలా విషయాలు చెప్పాలి," అన్నది.

గుడ్లగూబలు అరిమర్దనానికి ఈ మాట చెప్పాయి. అది స్థిరజీవి వద్దకు ఎగిరి వచ్చి, "అయ్యా, నువ్వు కాకుల పెద్దవు గదా, ఇలా గాయపడి, దుస్థితికి రావటానికి కారణం ఏమిటి?" అని అడిగింది.

స్థిరజీవి ఇలా అన్నది:

"రాజా, విను. నిన్న ఆ దుర్మార్గపు మేఘవర్ణం, తన కాకులను చాలా వాటిని నువ్వు చంపావని, మీ గుడ్లగూబల గుహ మీదికి దాడి తల పెట్టింది. బలవంతులతో విరోధం తగదు, సంధి చేసుకుని, కాకిజాతిని కాపాడుకోమన్నాను. అతను మండిపడి నా ఈకలు పీకి, నన్ను చీల్చి చెండాడి, నన్ను రాజద్రోహి అని, ఇక్కడ పడేసి, 'నీ మిత్రులైన గుడ్లగూబలతోనే ఉండు,' అని లేళ్ళకొండకు సపరివారంగా వెళ్ళిపోయారు."

పంచతంత్రం



దానికి అరిమర్దనం, "మూర్ఖుడు! వాడు చేరిన కొత్తచోటు నాకు బాగా తెలుసునని ఎరగడు. నిన్ను ఇలా చేసి నందుకు వాణ్ణీ, వాడి కాకిబలగాన్నీ చంపి ప్రతిక్రియ చేస్తాను," అన్నది.

"రాజా, నువే నాకు దిక్కు. నేను వాడికి విశ్వాసం చూపటం మాని, నీకు చూపుతాను. నన్ను ఆ దుర్మార్గుడి స్థావరానికి తీసుకుపోయి, కాకులను నిర్మూలించటానికి తోడ్పడతాను," అన్నది స్థిరజీవి.

అరిమర్దనం తన మంత్రులతో సంప్రతించింది. వాటి పేర్లు రక్తాక్ష, క్రూరాక్ష, దీప్తాక్ష, వక్రనాస, ప్రాకారకర్ణాలు. స్థిరజీవిని ఏం చెయ్యాలి. దాని సహాయం పొందాలా, వద్దా అన్న ప్రశ్నలు చర్చకు వచ్చాయి. "నీ అభిప్రాయం ఏమిటి?" అని అడిగితే రక్తాక్ష, "వెధవను చంపి పారెయ్యండి. గాయపడి దుర్బలంగా కూడా ఉన్నాడు. తేలికగా చంపవచ్చు. మళ్ళీ కోలుకుంటే ఎగిరి పారిపోయి మనకు సమస్య అయి కూర్చోవచ్చు. బ్రాహ్మడి కొడుకును చంపి, బ్రాహ్మడు స్వార్థంతో చేసిన రాజీబేరాన్ని తోసిపుచ్చిన పాములాగా, మీరు దీని సలహా, సహకారాలను నిరాకరించండి," అన్నది.

"ఏమిటా కథ?" అని అరిమర్దనం అడగగా రక్తాక్ష "బ్రాహ్మణుడు–పాము" కథ ఇలా చెప్పింది:

హరిదత్తుడు అనే బ్రాహ్మణుడు ఉండే వాడు. అతనికి ఒక పనికిమాలిన పొలం ఉండేది. అందులో పండే పంట అతనూ, భార్యా, కొడుకూ తినటానికే చాలేదికాదు. అతను ఒక రోజు తన చేనుకు కాపలా కాస్తూ ఒక చెట్టు నీడన చిన్నకునుకు తీశాడు. అతను మళ్ళీ కళ్ళు తెరిచి చూసేసరికి, పొలంలో ఉన్న పుట్టలో నుంచి ఒక భయంకరమైన నాగుపాము బయటికి వస్తూండటం కనబడింది. "ఓహో, ఇది నా పొలానికి అధిష్ఠాన దేవత అయి ఉండాలి. దీనిని ఆరాధించక

పోషించటం చేతనే నన్ను దరిద్రం వెంటాడుతున్నది," అనుకుని హరిదత్తుడు ఒక పిడతలో పాలు తీసుకుని వచ్చి, ఆ పాలను పుట్టకన్నం వద్ద ఉంచి, "నాగరాజా, దారిద్ర్యబాధ అనుభవిస్తున్న నన్ను అనుగ్రహించు," అని ప్రార్థించాడు.

పాము ఆ పాలను తృప్తిగా తాగింది. మర్నాడు హరిదత్తుడు అక్కడికి వెళ్ళి, పిడతలో బంగారు నాణెం ఉండటం చూసి, తాను పోసిన పాలకు అది ప్రతిఫలం కాబోలు ననుకున్నాడు.

అటుతరవాత అతను రోజూ పాముకు పుంతెడు పాలు ఇచ్చి, పూజించి, మర్నాడు ఒక బంగారు నాణెం పుచ్చుకుంటూ వచ్చాడు.

ఒకసారి అతను పొరుగూరు వెళ్ళవలసివచ్చి, పుట్ట వద్దకు పాలు తెచ్చి, పామును పూజించేపని తన కొడుక్కు అప్పగించాడు.


"పుట్టనిండా బంగారు కాసులు ఉండి ఉంటాయి. ఈ వెధవపాము ఒక్కొక్క కాసే ఇస్తున్నది," అనుకుని బ్రాహ్మడి కొడుకు, పాము పాలు తాగేటప్పుడు, దాన్ని చంపే ఉద్దేశంతో కర్రపెట్టి దాని నెత్తినకొట్టాడు. తరవాత పుట్ట తవ్వి బంగారం తీసుకోవాలని వాడి ఉద్దేశం.

అయితే పాము దెబ్బ తప్పించుకుని, దారుణమైన కోపంతో కుర్రాణ్ణి కాటేసి చంపింది. బ్రాహ్మడు తిరిగివచ్చి ఈ వార్త విని, కుర్రాడికి దహనక్రియలు జరిపి, మళ్ళీ పాము కోసం పాలు తీసుకుపోయి, "నాగరాజా, నీ తప్పేమీలేదు. నిన్ను చంపబోయి మా వాడే తన చావు తెచ్చుకున్నాడు," అన్నాడు.

దానికి పాము ఇలా అన్నది:

"బ్రాహ్మణా, నేను నీ కొడుకును చంపినప్పుడే మనిద్దరి మధ్యా ఉన్న బంధం తెగిపోయింది. ఈ జన్మలో మళ్ళీ నువ్వు నన్ను ప్రేమించలేవు. నీ కొడుకు శవం మన ఇద్దరి మధ్యా శాశ్వతమైన అడ్డంకి. అందుచేత నువ్వు నీ దారినపో. నేను కూడా ఈ పుట్ట విడిచిపోతున్నాను."






## 54

రక్తాక్షి పాము కథ చెప్పి, "మనం వీణ్ణి చంపి, ఈ మర్రిచెట్టు రాజ్యాన్ని సొంతం చేసుకుని, నిర్భయంగా జీవింతాం," అన్నది.

అరిమర్దనం క్రూరాక్షి అభిప్రాయం అడిగింది.

"నేను రక్తాక్షి సలహాతో ఏకీభవించను. మనను శరణుజొచ్చిన ఈ దిక్కుమాలిన కాకిని చంపటం నా మతం కాదు. శిబిచక్రవర్తి కథ వినలేదా? గువ్వల కథ వినలేదా?" అన్నది క్రూరాక్షి.

"ఏమిటా కథలు?" అని అరిమర్దనం అడిగితే క్రూరాక్షి ఇలా చెప్పింది:

"ఒకప్పుడు శిబిచక్రవర్తి అనేవాడు ఉండేవాడు. భారతదేశంలోని రాజులందరూ అతనికి సామంతులు. శిబి దయాస్వరూపుడు. మహాదాత. అతని దాతృత్వ ఖ్యాతి స్వర్గానికి కూడా వ్యాపించింది. ఇంద్రుడు ఇలా అనుకున్నాడు:

"శిబి లాటి దాత మరొకడు లేడు. ఇలా అంతులేని దానధర్మాలు చెయ్యటంలో అతని అభిప్రాయం ఏమై ఉంటుంది? కీర్తి కాంక్షతో ఇలా చేస్తున్నాడా, లేక అతనికి నిస్సహాయులపై నిజంగా జాలి ఉన్నదా?"

ఇంద్రుడు యముణ్ణి పిలిపించి, అతనితో కలిసి ఒక పథకం ఆలోచించాడు.

ఒకరోజు ఉదయం శిబి కాలకృత్యాలు తీర్చుకుని సభా భవనానికి వచ్చి కూర్చున్నాడు. ఇంద్రుడు ఒక పావురాయి రూపం ధరించి, రాజోద్యానం మీదుగా ఎగురుతూ సభా భవనంలోకి వచ్చాడు. యముడు డేగ రూపంలో ఆ పావురాన్ని తరుముకుంటూ వచ్చాడు.



ఆయాసంతో రొప్పుతూ, భయంతో వణుకుతూ, బెదురుకళ్ళతో పావురం శిబి పాదాల వద్ద పడింది. "రాజా, నేను నీ శరణుజొచ్చాను. నన్ను డేగ నుంచి కాపాడు," అన్నది పావురం.

అది ఇలా అంటూవుండగానే డేగ అక్కడికి చేరుకుని, "రాజా, పావురాన్ని వదులు. ఆకలిగా ఉన్న నాకు నా ఆహారాన్ని ఇచ్చెయ్యి," అన్నది.

"ప్రభూ, శరణన్నవాణ్ణి రక్షించటం ధర్మం," అన్నది పావురం.

"రాజా, ఏలాటి అభాగ్యుడుగాని, అర్థుడుగాని, ఏం కోరినా నువు ఇస్తావని చెప్పుకుంటారు. ఈ పావురం నాకు న్యాయమైన ఆహారం. నేను ఆకలితో చచ్చిపోతున్నాను," అన్నది డేగ.

"బుద్ధిమంతులు శరణాగతులను రక్షిస్తారు. నా పాకశాల నుంచి నీకు కావలసినంత మాంసం తెప్పించి ఇస్తాను. పావురాన్ని వదిలెయ్యి," అన్నాడు శిబి.

"ఒకరు చంపిన వాటిని మా డేగలు ముట్టవు. వెచ్చని రక్తం ఓడుతూ, సజీవంగా ఉండే మాంసాన్నే తింటాం. ఈ పావురం బదులు దాని ఎత్తు నీ మాంసం ఇవ్వు, ఆమోదిస్తాను," అన్నది డేగ.

"సరే, అలాగే నా మాంసం ఇస్తాను," అని శిబి, తన కోశాగారం నుంచి త్రాసు తమ్మని ఆజ్ఞాపించాడు.

ఈ మాట విని సభలోని రాజులూ, పౌరులూ గొల్లున గోలెత్తి, "ఈ డేగ తమరిని నిర్మూలించ వచ్చిన ఎవరో రాక్షసుడు," అన్నారు. శిబివారి మాటలు వినిపించుకో లేదు.

త్రాసు వచ్చింది. ఒక పళ్ళెంలో పావురాన్ని ఉంచి, శిబి తన తొడ నుంచి మాంసం కోసి రెండవ పళ్ళెంలో వేశాడు. కాని పావురం బరువే హెచ్చుగా ఉన్నది. శిబి తన శరీరం వివిధ భాగాల నుంచి ఎంత మాంసం కోసినా పావురం బరువుకు చాలలేదు. చివరకు శిబి తానే పళ్ళెంలో కూర్చున్నాడు.

ఈ అపూర్వ త్యాగానికి దేవదుందుభులు మోగాయి. ఆకాశం నుంచి పుష్ప వర్షం కురిసింది. అన్ని వైపుల నుంచీ అశరీరవాక్కులు, "బేష్! శబాష్!" అనటం వినిపించింది.

ఇంద్ర యములు తమ అసలు రూపాలలో శిబి ఎదట ప్రత్యక్షమై, "రాజా, మేలు మేలు! ప్రాణులపట్ల నీ గాఢప్రేమ గ్రహించాం. నువ్వు ఒకడివే సత్యం గ్రహించిన వాడివి. నీ శరీరం ఎప్పటిలాగే అవుతుంది," అని అదృశ్యమయారు.

ఆత్మార్పణ చేసుకున్న గువ్వ కథ


ఊచ్చులు పన్నటంలో నిపుణుడైన బోయ వాడొకడు అరణ్యంలో ఉండగా భయంకరమైన గాలి వాన వచ్చింది. వాడు నిలువునా తడిసిపోయి ఒక చెట్టు కింద తల దాచుకున్నాడు.


ఆ చెట్టు మీద ఒక గువ్వలజంట ఉంటున్నది. ఆడగువ్వ ఎటో వెళ్ళింది. మగగువ్వ తన భార్య కోసం ఆదుర్దాపడుతున్నది. ఇంతలో ఆడగువ్వ తిరిగి వచ్చి బోయవాడి దీనస్థితి చూసింది. వాడు గువ్వలను తన చలి బాధా, ఆకలి బాధా తీర్చమని వేడుకున్నాడు.

మగగువ్వ తమ గూటి నుంచి ఆకులూ, పుడకలూ తీసి పోగువేసి, ఆ కుప్పకు మంటపెట్టి, బోయవాణ్ణి చలి తీర్చుకో నిచ్చింది. బోయవాడు ఆకలితో చచ్చి పోతున్నానన్నాడు. తన అతిథికి ఇయ్య టానికి ఏమీలేక, మగగువ్వ ఆ మంటలో పడి కాలిపోతూ, తనను తినమని బోయ వాడికి చెప్పింది.

"నా మొగుడు లేక నేను ఎలా బతుకుతాను?" అంటూ ఆడగువ్వ కూడా మంటలో పడింది. ఆ గువ్వల జంటను ఒక బంగారు రథం స్వర్గానికి తీసుకు పోయింది.

ఇదంతా చూసిన బోయవాడు తన క్రూరజీవనానికి సిగ్గుపడి, గువ్వలను తినక, అరణ్యంలో పోతూ కార్చిచ్చును చూసి, అందులో పడి తానూ కాలి పోయాడు.






## 55

క్రూరాక్షుడు శిబిచక్రవర్తి కథ చెప్పిన మీదట అరిమర్దనం దీప్తాక్షుడి అభిప్రాయం అడిగింది.

"నన్నడిగితే, పరివర్తన చెందిన మన శత్రువు, కాకి సహాయం తీసుకోవటమే మంచిదంటాను. వెనకటికి ముసలివాడి పడుచుభార్య కథలో దొంగ వల్ల కూడా మేలే జరిగిందిగదా!" అన్నది దీప్తాక్షుడు.

"ఏమిటా కథ?" అని అరిమర్దనం అడగగా దీప్తాక్షుడు ఇలా చెప్పింది:

కామాతురుడనే వృద్ధవర్తకుడు ఉండేవాడు. అతనితో నలభైఏళ్ళు కాపురం చేసిన భార్య చనిపోగా, మర్నాడే అతను పదహారేళ్ళ బాలాకుమార్తెను పెళ్ళాడాడు. ఆ పిల్ల కోసం అతను ఆమె తల్లిదండ్రులకు చాలా డబ్బు ఇచ్చుకున్నాడు. కాని ఆ పిల్ల మనసు చెదిరిపోయి, వయసు మళ్ళిన భర్తను ప్రేమించలేక, అతని ఆలింగనాలకు లొంగలేదు.

ఒక రాత్రి భార్యా భర్త లిద్దరూ పడుకుని ఉన్నారు. ఎప్పటిలాగే ఆమె భర్తకు వీపు పెట్టి పడుకుని ఉన్నది. ఆ సమయంలో తెమాజెట్టిలాంటి దొంగ వారింట ప్రవేశించాడు. ఆమె వాణ్ణి చూసి హడలిపోయి, తన భర్తను గట్టిగా వాటేసుకున్నది. ఈ సంఘటన వర్తకుడిలో పులకింతలూ, ఆశ్చర్యమూ కలిగించింది.

"ఇన్నాళ్ళూ లేనిది, ఈ మనిషి ఉన్నట్టుండి నన్ను ఎందుకిలా గట్టిగా కౌగలించుకున్నది?" అనుకుంటూ అతను చుట్టూ చూడటంలో మూలల నిలబడిన దొంగ కనిపించాడు.

"నాయనా. నా స్పర్శ అంటే రోతపడే మనిషి, ఇవాళ నీ ధర్మమా అంటూ

నన్ను కౌగిలించుకున్నది. నీకేం కావాలో తీసుకుపో," అన్నాడు వర్తకుడు.

దొంగ మనసు కరిగింది. వాడు వర్తకుడితో, "అయ్యా, నేను నీ ఇంటి నుంచి పూచికపుల్ల కూడా తీసుకోను. నీకు మేలు చేసినందుకు నాకెంతో సంతోషంగా ఉన్నది. నిన్ను ఇలా ఈమె గాఢంగా కౌగలించుకోని రోజునే నేను మళ్ళీ వస్తాను," అన్నాడు.

ఈ కథ విని అరిమర్దనం వక్రనాసుడి అభిప్రాయం అడిగింది.

"రాజా, ఈ కాకిని చంపరాదు. శత్రువైనప్పటికీ, తన నాయకుడిపైన అసంతృప్తి చెందినవాడి సహాయం మనం తీసుకోవచ్చు. బ్రాహ్మడూ, దొంగా, రాక్షసి కథలో అదేగదా తేలేది?" అన్నది వక్రనాసుడు.

"ఏమిటా కథ?" అని అరిమర్దనం అడిగితే వక్రనాసుడు ఇలా చెప్పింది:

ఒక గ్రామంలో ఒక పేద బ్రాహ్మణుడుండేవాడు. అతను వారూ, వీరూ ఇచ్చిన దానితో జీవయాత్ర గడిపేవాడు. అతను ఎలాటి సుఖాలకూ నోచుకోలేదు. రోజూ క్షౌరం చేయించుకోవటానికిగాని, గోళ్ళు తీయించుకోవటానికిగాని అతని వద్ద డబ్బులుండేవి కావు. తిండి లేక అతను ఎండగట్టుకుపోయాడు.

ఒకనాడు ఒక ధనికుడు, తన తండ్రి చనిపోగా, ఆయనకు ఉత్తమ లోకాలు కలగగలందులకు, ఈ బ్రాహ్మడికి రెండు



లేగ దూడలను దానమిచ్చాడు. బ్రాహ్మడు వాటిని చక్కగా మేపి, బలపెట్టాడు. అవి మంచి ఆవులుగా తయారయాయి.

ఒక దొంగ ఆ ఆవుల మీద కన్నువేసి, వాటిని కాజేయ నిశ్చయించాడు. వాడు బ్రాహ్మడి ఇంటిని సమీపించబోతూ ఒక రాక్షసిని చూశాడు. ఆ రాక్షసి కోరలు భయంకరంగానూ, కళ్ళు పెద్దవిగానూ, చెక్కిళ్ళు లోతుగానూ ఉన్నాయి.

రాక్షసిని చూసి భయపడి దొంగ, ''అయ్యా, తమరెవరు?'' అని అడిగాడు.

''నేను రాక్షసిని. ఆ ఇంట్లో ఉన్న బ్రాహ్మణ్ణి తినటానికని వెళుతున్నాను. నువ్వెవరు?'' అని రాక్షసి అడిగింది.

తాను దొంగననీ, బ్రాహ్మడి ఆవులను దొంగిలించటానికి పోతున్నాననీ దొంగ రాక్షసికి చెప్పాడు.

తరవాత ఇద్దరూ కలిసి బ్రాహ్మడి ఇంటికి వెళ్ళి, ఒకచోట నక్కి, తమ పనులు చూసుకునే అవకాశం కోసం నిరీక్షించసాగారు.

బ్రాహ్మడు పడుకుని నిద్రపోగానే రాక్షసి అతన్ని తినే ఉద్దేశంతో లేచింది.

అది చూసి దొంగ రాక్షసితో. ''నువ్వు బ్రాహ్మణ్ణి తిని కోలాహలం ప్రారంభం కాకముందే నన్ను గోవులను తీసుకు పోని!'' అన్నాడు.

''నన్ను ముందు బ్రాహ్మణ్ణి తిననీ. నువ్వు ఆవులను దొంగిలించేటప్పుడు అల్లరి జరిగి, నా పని కాస్తా పాడవు తుంది,'' అన్నది రాక్షసి.

ఇద్దరూ ఈ విధంగా వాదించుకుంటూ, గొంతులెత్తి, నేను ముందంటే నేను ముందని ఘర్షణపడసాగారు. ఈ గొడవకు బ్రాహ్మడు లేచాడు.

''బ్రాహ్మడా. ఈ రాక్షసి నిన్ను తింటుందట!'' అన్నాడు దొంగ.

''బ్రాహ్మడా. ఈ దొంగ నీ గోవులు కాజేస్తాడట!'' అన్నది రాక్షసి.

బ్రాహ్మడు మంత్రం చదివేసరికి రాక్షసి పారిపోయింది. అతను కేకలు పెట్టేసరికి దొంగ పారిపోయాడు.






## 56

తరవాత అరిమర్దనం ప్రాకారకర్ణం అభిప్రాయం ఏమిటని అడిగింది.

"ప్రభూ, ఈ కాకిని చంపరాదు. దీన్ని కాపాడినట్టయితే, ఇది మనకు ఆప్త మిత్రుడై, సలహాదారుగా పని చేయవచ్చు. నీ మిత్రుణ్ణి ఎప్పటికైనా శత్రువుకాగల వాణ్ణిలాగా చూడటమూ, శత్రువును ఎప్పటికైనా మిత్రుడుకాగల వాడుగా చూడటమూ రాజనీతి. అదేగదా 'రాజకుమారుడి పొట్టలో పాము' కథ నుంచి మనం నేర్చుకునేది?" అన్నది ప్రాకారకర్ణం.

"ఏమిటా కథ?" అని అరిమర్దనం అడగగా, ప్రాకారకర్ణం ఇలా చెప్పింది:

ఒకానొక రాజ్యాన్ని దేవశక్తి అనే రాజు పాలించేవాడు. అతని ఏకపుత్రుడు యువరాజు. కాని అతని పొట్టలో ఒక పాము చేరటం చేత, అతను రోజురోజుకూ కృశించసాగాడు. దేవశక్తి ఖిన్నుడై, ప్రతి దేవాలయానికీ వెళ్ళి, తన కొడుకు పొట్టలో నుంచి పామును తొలగించమని అక్కడి దేవతలకు మొక్కుకున్నాడు. తన మంత్రుల సలహా ననుసరించి అతను తన కొడుక్కు పొరుగుదేశపు రాజకుమార్తెను పెళ్ళికూడా చేశాడు.

ఈ రాజకుమార్తె తెలివైనది. ఒకనాడు ఆమె బయటికి వెళ్ళి, తిరిగి వస్తూ, తన భర్త ఒక పుట్ట మీద తల పెట్టుకుని నిద్ర పోతూండటం చూసింది. రాజకుమారుడి పొట్టలో ఉండే పాము అతని నోటి నుంచి తొంగి చూస్తున్నది. ఆ సమయంలో పుట్టలోని పాము కూడా తల బయట పెట్టింది.

పుట్టలో ఉండే పాము రాజకుమారుడి పొట్టలో ఉండే పాముతో, "ఓసీ, ఆ అంద



మైన రాజకుమారుడి పొట్టలో చేరావా?'' అన్నది. రాజకుమారుడి పొట్టలో పాము దీనికి జవాబుగా, ''ఓసీ, నువు నీ పుట్టలో లంకెబిందెలు దాచుకోలేదా?'' అన్నది.

''బుద్ధి తక్కువదానా! నల్ల అవాలూ, మిరపకాయలూ, వామూ కషాయం పట్టి తాగితే నీ పని గోవిందా!'' అన్నది పుట్టలో పాము.

''ఉడుకు నీళ్ళు పుట్టలో పోస్తే నీ పని మాత్రం గోవిందా కాదా?'' అన్నది పొట్టలో పాము.

రాజకుమార్తె ఈ సంభాషణ విని, పుట్టలో పాము చెప్పిన ప్రకారం కషాయం కాచి, తన భర్త చేత తాగించింది. పొట్టలో పాము చచ్చి, బయటపడింది. తరవాత ఆమె పుట్టలో ఉడుకు నీళ్లు పోసి, పామును చంపి, లంకెబిందెలను తవ్వి తీయించింది.

అరిమర్దనం తన అయిదుగురు మంత్రుల అభిప్రాయమూ విన్నమీదట అధిక సంఖ్యాకుల సలహాను స్వీకరించింది. తన సలహాను అరిమర్దనం తోసి పుచ్చినందుకు రక్తాక్షి, ''సోదరులారా, మీరు మీ సలహాతో రాజుకు మరణ దండన విధించినంత పని చేశారు. మీ మూలాన రాజు, వెనకటికి కథలో వడ్రంగి లాగ మోసపోయాడు,'' అన్నది.

''ఏమిటా కథ?'' అని అరిమర్దనమూ, ఇతర మంత్రులూ అడిగిన మీదట రక్తాక్షి ఇలా చెప్పింది:

ఒక వడ్రంగి ఉండేవాడు. అతని భార్య జారిణి. ఆ సంగతి ఊరంతా తెలుసు. తన భార్య పేరు నలుగురి నోటా నానటం చూసి, వడ్రంగి నిజం తెలుసుకోవాలనుకున్నాడు.

అతను తన భార్యతో, ''నేను రేపు దూర ప్రయాణం మీద పోతున్నాను. కొన్ని రోజుల దాకా రాను,'' అన్నాడు. ఈ మాట విని అతని భార్య పరమానందం చెంది, అతని కోసం రకరకాల పిండి వంటలూ, మిఠాయీ చేసింది.

మర్నాడు ఉదయం మొగుడు బయలు దేరగానే అతని భార్య చక్కగా ముస్తాబై, తన ప్రియుడు కాగోరుతున్న దేవదత్తు డనే వాడి ఇంటికి వెళ్ళి, "నా పిశాచం మొగుడు ప్రయాణమై వెళ్లాడు. కొన్ని రోజుల దాకా రాడు. ఇవాళ రాత్రికి మా యింటికి వచ్చావంటే మనం యథేచ్ఛగా వుండవచ్చు," అన్నది.


వడ్రంగి పగలంతా సమీపంలో ఉన్న అరణ్యంలో గడిపి, చీకటిపడేవేళ దొడ్డి దారిన భార్య కంటపడకుండా లోపల ప్రవేశించి, మంచం కింద దాక్కున్నాడు.

తరవాత కొద్దిసేపటికి దేవదత్తుడు వచ్చి, ఆ మంచం మీద పరిచిన పక్క మీద కూర్చున్నాడు. తరవాత వడ్రంగి భార్య కూడా వచ్చి మంచం మీద కూర్చున్నది. అలా కూర్చునేటప్పుడు ఆమె కుడికాలు, మంచం కింద దాగిన వడ్రంగికి తగిలింది. తనను పరీక్షించ టానికి తన భర్త మంచం కింద దాక్కున్నాడని తెలుసుకుని, ఆమె దేవదత్తుడితో, "అయ్యా, నేను మహా పతివ్రతను!" అన్నది.

"అలా అయితే నన్ను ఎందుకు రమ్మన్నావు?" అని దేవదత్తుడు ఆమెను అడిగాడు.

"నేను కాళికాదేవిని రోజూ పూజిస్తాను. ఇవాళ దేవి నాతో, నా భర్త ఆరునెలలకు పోతాడనీ, నేను నా భర్త ప్రాణాలు దక్కించుకుని, వైధవ్యం రాకుండా చూసుకోవాలంటే నా పాతివ్రత్యాన్ని త్యాగం చెయ్యాలనీ అన్నది. నాకు పాతివ్రత్యం కన్న పతే ఎక్కువ. అందు చేత అమూల్యమైన నా పాతివ్రత్యాన్ని నీకు ధారపోయ దలచి, నిన్ను రమ్మ న్నాను," అన్నది ఆ కులట.

ఈ మాటలతో మోసపోయిన వడ్రంగి, "లోకులెటువంటి మూఢులు! నా భార్య వంటి మహాపతివ్రతకే రంకులు కట్టారే!" అనుకుని, తన భార్యను శంకించినందుకు ఆమెకు క్షమాపణ చెప్పుకున్నాడు.





# కాకోలూకీయం

## 57

రక్తాక్షి వడ్రంగి కథ చెప్పి, "మిత్రులారా, ఈ కాకి మాటలు విని మోసపోవద్దు. ఈ కాకి ఎప్పటికీ మన శత్రువే నని మీవంటి బుద్ధిమంతులు గ్రహించగలరు," అన్నది.

కాని మిగిలినవి అతడి సలహా పాటించక, స్థిరజీవిని ఒక డోలీలో తమ పర్వత దుర్గానికి మోసుకుపోయాయి.

స్థిరజీవి రాజుతో, "ఓ రాజా, నా పట్ల ఇంత దయ ఎందుకు చూపుతున్నారు? ఒకప్పుడు నేను మీకు శత్రువు అయి ఉండి నందుకు సిగ్గుపడుతున్నాను. దయచేసి అగ్ని తెప్పించారంటే, నా జీవితం నిరర్థకమై పోయినందుకు దాన్ని అంతం చేసుకుంటాను," అన్నది.

రాజుకూ, అతని నలుగురు మంత్రులకూ ఈ మాటలు నచ్చాయి. "అయ్యా, తమరు అగ్నికి ఆహుతి కావలసిన పని ఏమిటి?" అని అవి అడిగాయి.

"అలా చేస్తే తిరిగి గుడ్లగూబగా పుట్టి, మరెన్నటికీ కాకి జన్మ ఎత్తను," అన్నది కాకి స్థిరజీవి.

కాకి ధోరణి నచ్చని రక్తాక్షి, "నువు గుడ్లగూబగా పుట్టినా కాకుల పక్షమే ఉంటావు, వెనకటికి ఎలుకకన్య చివరకు ఎలుకే అయినట్టుగా!" అన్నది.

"ఏమిటా కథ?" అని స్థిరజీవి అడగగా, రక్తాక్షి ఇలా చెప్పింది:

హిమాలయశిలల నుంచి దూకుతూ, నురుగులు కక్కుతూ గంగానది ప్రవహించేచోట ఒక ఆశ్రమం ఉండేది. ఆ ఆశ్రమంలో అనేక మంది ఋషులు తపస్సు చేసుకునేవారు. యాజ్ఞవల్క్యుడనే ఋషి ఆశ్రమానికి పెద్ద. ఒకనాడు



అయన నదిలో స్నానం చేసి తిరిగి పోబోతూండగా ఒక గద్ద ఒక ఆడ ఎలుక పిల్లను ఆయన మీద పడవేసింది. దయగల ఆ ఋషి ఆ ఎలుక పిల్లను తన తపశ్శక్తితో మనిషిపిల్లగా మార్చి, ఆశ్రమానికి తీసుకుపోయి గొడ్రాలయిన తన భార్యతో, ''ఓసీ, ఈ పిల్ల నీ గర్భ వాసాననే పుట్టినట్టుగా, శ్రద్ధగా పెంచు,'' అని చెప్పాడు.

ఆమె అదేవిధంగా ఆ పిల్లను ఎంతో శ్రద్ధగానూ, ప్రేమగానూ పెంచి పెద్ద చేసింది. పిల్లకు పన్నెండేళ్లు నిండాయి. యాజ్ఞవల్క్యుడితో అతని భార్య, ''స్వామీ, ఎందుకు తాత్సారం చేసున్నారు? మీ కుమార్తెకు యుక్తవయసు వచ్చింది. పెళ్ళి చెయ్యాలి,'' అన్నది.

''అవును. ఆ మాట నిజమే. శాస్త్ర ప్రకారం దానికి వివాహ యోగ్యమైన వయసు వచ్చింది. సంగీతం పాడుతుంది. వంట చేస్తుంది. బాగా చదువుకున్నది. అందుచేత అమ్మాయి సరేనన్న పక్షంలో సూర్యుణ్ణి ఆహ్వానించి, అతనికి పిల్ల నిస్తాను,'' అన్నాడు యాజ్ఞవల్క్యుడు.

''తప్పేం? అలాగే చెయ్యండి,'' అన్నది భార్య.

ఋషి సూర్యుడికి కబురు పంపాడు. సూర్యుడు వచ్చి, ''మహాత్మా, ఎందుకు నన్ను రమ్మన్నారు?'' అని అడిగాడు.

ఋషి సూర్యుడితో, ''ఇది నా కుమార్తె. దయచేసి దాన్ని వివాహమాడు,'' అని, కుమార్తె కేసి తిరిగి, ''అమ్మా, ముల్లోకాలనూ ప్రకాశవంతం చేసే ఈ దేవుణ్ణి పెళ్ళాడటం గురించి నీ అభిప్రాయం ఏమిటి?'' అని అడిగాడు.

''ఈయన మరీ వేడిగా ఉన్నాడు. ఇంతకన్న గొప్ప సంబంధం ఉంటే చూడు,'' అన్నది కూతురు.

ఋషి సూర్యుణ్ణి, ''నీ కన్న గొప్పవాడెవరు?'' అని అడిగాడు.

''నా కన్న మబ్బు గొప్పది. అది నన్ను పూర్తిగా కప్పివేసి, నా జాడ ఎవరికీ

కనపడకుండా చేయగలదు,'' అన్నాడు సూర్యుడు.

ఋషి మబ్బును పిలిపించి, తన కుమార్తెను, ''అమ్మా, నిన్ను ఈ శక్తిమంతుడికిచ్చి పెళ్లిచేయనా?'' అన్నాడు.

''ఇతను నల్లగానూ, తేమగానూ ఉన్నాడు. ఇతనికన్న గొప్పవాడెవరో ఇతన్ని అడిగి తెలుసుకుని, నన్ను అతనికిచ్చి పెళ్లి చెయ్యి,'' అన్నది కూతురు.

''నీకన్న గొప్పవాళ్లెవరన్నా ఉన్నారా?'' అని ఋషి మబ్బును అడిగాడు.

''ఉన్నారు. గాలి నాకన్న గొప్పవాడు. గాలి నన్ను అటూ, ఇటూ నెట్టగలదు,'' అన్నది మబ్బు.

ఋషి గాలికి కబురుపెట్టి, ''అమ్మా, నిన్ను ఇతనికిచ్చి పెళ్లిచేయనా?'' అన్నాడు.

''నాన్నా, ఇతను చంచలుడూ, ఆధారపడదగనివాడూ. ఇంతకన్న శక్తిమంతుణ్ణి చూడు,'' అన్నది కూతురు.

''నీ కన్న గొప్పవాడు ఎవడన్నా ఉన్నాడా?'' అని ఋషి గాలిని అడిగాడు.

''పర్వతం నాకన్న చాలా బలమైనది. దాన్ని కదిలించటం నాకు సాధ్యం కాలేదు,'' అన్నది గాలి.

అందుచేత ఋషి పర్వతాన్ని పిలిపించి, ''అమ్మా, నిన్ను ఇతనికిచ్చి పెళ్లి చెయ్యనా?'' అని కూతుర్ని అడిగాడు.

''నాన్నా, ఇతని అంతస్సు పాషాణం. నా అందానికి ఇతను చలించడు. నన్ను మరెవరికైనా ఇయ్యి,'' అన్నది కూతురు.

''నీ కన్న శక్తిమంతుడు ఎవరు?'' అని ఋషి పర్వతాన్ని అడిగాడు.

''నాలో బొరియలు పెట్టే ఎలుక నాకన్న బలమైనది,'' అన్నది పర్వతం.

ఋషి ఎలుకను పిలిపించి, ''అమ్మా, ఇతన్నిచేసుకుంటావా?'' అని అడిగాడు.

ఆమెలో సజాతి అభిమానం పెల్లుబికింది. ఆమె సిగ్గుపడుతూ, ''నాన్నా, నన్ను ఎలుకగా మార్చి, ఇతనికిచ్చి పెళ్లి చెయ్యి,'' అన్నది.

ఋషి ఆమెను ఎలుకగా మార్చి, వివాహం చేశాడు.






## 58

రాజుకూ, నలుగురు మంత్రులకూ స్థిరజీవి మీద గురి కుదిరింది. అందుచేత అవి రక్తాక్షి వద్దనటం పాటించకుండా, స్థిరజీవిని తమ గుహకు తీసుకుపోయాయి.

దారిలో స్థిరజీవి, "రక్తాక్షి ఒక్కడే నా రహస్యం గ్రహించినవాడు. మిగిలిన వాళ్ళకు రోజులు బాగాలేక, అవి రక్తాక్షి సలహాను తోసిపుచ్చాయి," అనుకున్నది.

వాళ్లు కొండగుహ చేరుకున్న తరవాత అరిమర్దనం, "స్థిరజీవి మన మేలు కోరినవాడు. అతనికి కోటలో కోరిన ప్రదేశం ఇయ్యండి," అన్నది.

ఈ మాట విని స్థిరజీవి సంతోషించినప్పటికీ, తనలో ఇలా అనుకున్నది:

"నేనేమో వీళ్ళ వినాశనానికి పథకం వేస్తున్నవాణ్ణి. కోట మధ్య ఉంటే నన్ను అందరూ గమనిస్తారు. ముఖ్యంగా రక్తాక్షి, అతడి అనుచరులూ నన్ను వెయ్యి కళ్ళతో కనిపెట్టుతూ ఉంటారు. అంతకన్న కోట ద్వారంవద్ద ఉన్నట్టయితే, తొందర పనుల మీద కోటలోపలికీ, బయటికీ వెళ్ళేవారు నన్ను శ్రద్ధగా గమనించరు. నా పథకం పారుతుంది."

ఇలా అనుకుని అది అరిమర్దనంతో, "మహారాజా, మీది దొడ్డబుద్ధి. నాకు మీ కోటద్వారం లోపల చోటు యివ్వండి. నేను రోజూ వచ్చి తమ దర్శనం చేసుకుని, నా విధి నిర్వర్తిస్తాను," అన్నది.

అరిమర్దనం స్థిరజీవి నమ్రత చూసి ఎంతో సంతోషించి, దాని కోరికకు సమ్మతించింది. స్థిరజీవి తిరిగి పుంజుకోగలందులకు దానికి ప్రత్యేకమైన ఆహారం ఏర్పాటయింది. అది త్వరలోనే నెమలి బలానికి సమమైన బలం సంపాదించింది.

తన సలహా నిరాకరించబడటమూ, స్థిరజీవిని అందలం ఎక్కించటమూ చూసి రక్తాక్షి రాజుతో, "ప్రభూ, బంగారు రెట్ట వేసే పక్షిని విడిపించిన రాజూ, అతడి మంత్రులూలాగే మీరు చాలా అవివేకంగా ప్రవర్తించుతున్నారు." అన్నది.

"ఏమిటా కథ?" అన్నాడు రాజు. రక్తాక్షి ఆ కథ ఇలా చెప్పింది:

ఒకప్పుడు ఒక కొండ చరియలో ఒక పక్షి నివసించేది. అది బంగారు రెట్టలు వేసేది. ఒక వేటగాడు ఈ వింత చూసి చాలా ఆశ్చర్యపోయాడు. వాడు దాన్ని ఉచ్చువేసి పట్టుకుని, అది తన వద్దనే ఉన్నట్టయితే రాజుకు తెలిసి తనకు శిక్ష పడుతుందని భయపడి, దాన్ని రాజు వద్దకు తీసుకుపోయి, "మహారాజా, దీని రెట్ట మేలిమి బంగారం. నేను దీన్ని తమకు కానుకగా తెచ్చాను," అన్నాడు.

రాజు మంత్రులతో, "ఏమాశ్చర్యం! ఇదేమిటో చూతామా?" అన్నాడు.

"మహారాజా, పక్షి ఏమిటి, బంగారు రెట్ట వెయ్యటమేమిటి? ఎక్కడైనా కద్దా? ఇంత పచ్చి అబద్ధం చెప్పే ఈ పామరుడి మాటలు తమరు ఎలా నమ్మారు?" అన్నారు మంత్రులు. రాజు తన మంత్రుల మాటలు విని ఆ పక్షిని విడిచిపెట్టాడు.

అరిమర్దనమూ, అతడి మంత్రులూ ఈ కథ విని కూడా తమ అభిప్రాయం మార్చుకోక, స్థిరజీవి పట్ల మరింత ఆదరం చూపుతూ వచ్చాయి.



అప్పుడు రక్తాక్షి తన అనుచరులతో రహస్యంగా, "ఈ రాజ్యం నాశనం కాబోతున్నది. అవసానకాలం దగ్గిర పడింది. రాజునూ, మంత్రులనూ కాపాడటం సాధ్యంకాదు. వాళ్ళకు హితవు మాటలు రుచించలేదు. వ్యవధి ఉండగానే ఈ కోటను విడిచిపోదాం. శత్రువు నిజమైన మిత్రుడు కావటం ఎక్కడైనా ఉంటుందా? వెనకటికి ఒక గుహ మాట్లాడిందట!" అన్నది.

"ఏమిటా కథ?" అని అనుచరులు అడిగిన మీదట రక్తాక్షి ఇలా చెప్పింది:

ఒక మహారణ్యంలో ఖరనఖరం అనే సింహం ఉండేది. ఒకనాడు అది రోజల్లా తిరిగినా, తినటానికి ఏ జంతువూ దొరకలేదు.

సూర్యుడు అస్తమించుతూ ఉండగా దానికి ఒక పెద్ద కొండగుహ కనిపించింది.

"రాత్రికి తప్పక ఏదో ఒక మృగం ఇందులోకి వస్తుంది. అప్పుడు దాన్ని చంపి తింటాను," అనుకుని సింహం ఆ గుహలోకి వెళ్ళి పడుకున్నది.

ఆ గుహలో ఒక నక్క ఉంటున్నది. కొంతసేపటికి ఆ నక్క వచ్చి, "ఓ గుహా! ఓ గుహా!" అని పిలిచింది.

కొంచెంసేపు ఆగి నక్క మళ్ళీ పిలిచింది. జవాబు లేదు.

నక్క గుహను మూడోసారి పిలిచి, "నేను రాత్రి రాగానే నా పిలుపుకు సమాధానం ఇచ్చేటట్టు ఒప్పందం చేసుకున్నావు. మరిచావా? నువు ఆ మాట నిలబెట్టుకోకపోతే, అదే షరతు మీద ఇంకో గుహ చూసుకుంటాను," అన్నది.

ఈ మాట విన్న సింహం తనలో, "ఈ గుహ పిలిస్తే పలుకుతుంది లాగున్నది. నేను పలకకపోతే నక్క వెళ్ళిపోతుంది. నేను తిండికి మాడాలి!" అనుకుని, "ఓయ్!" అని జవాబిచ్చింది. దాని భయంకర గర్జన గుహలో మరింత భయంకరంగా మార్మోగింది.

నక్క నవ్వుకొని, "అదా సంగతి? గుహ మాట్లాడగా ఎన్నడూ వినలేదు!" అంటూ అతివేగంగా పారిపోయింది.








మాట్లాడిన గుహ కథ చెప్పి, రక్తాక్షి తన అనుచరులతో మరొక కొండకు వెళ్లిపోయి, దానికి తగిన రక్షణలు కల్పించుకున్నది.

రక్తాక్షి వెళ్ళిపోవటం చూసి స్థిరజీవి పరమానందం చెందిది, "అది వెళ్లిపోవటం నాకెంతో మేలు. అతను దూరదృష్టి గల మంత్రి. మిగిలిన వాళ్ళంతా చవటలు. నా పథకాన్ని పాడుచేయగలవాడు అతనే గాని మిగిలిన వాళ్ళు కారు. అప్పుడు నేను నిశ్చయంగా ఈ దుర్గాన్ని, రాజునూ, మంత్రులనూ తుదముట్టించగలను. దూరదృష్టిగల మంత్రులను దూరం చేసుకుని, మూఢుల సలహాలు వినే రాజు పతనం అయి తీరుతాడు," అనుకున్నది.

కాలక్రమాన గుహను తగలబెట్టి, అందులో ఉన్న గుడ్లగూబలనన్నిటినీ నిర్మూలించే ఉద్దేశంతో స్థిరజీవి అడవి నుంచి ఎండుపుల్లలు తెచ్చి, దుర్గం లోపల ఉండే తన గూటిలో పెట్టింది. అది చేసే ఈ పనిని రాజుగాని, మూఢులైన మంత్రులుగాని, అనుచరులుగాని గమనించనేలేదు. స్థిరజీవి స్నేహబుద్ధిలో వాటికి అపారమైన విశ్వాసం.

కోటను మొత్తంగా తగలబెట్టటానికి చాలినన్ని పుల్లలను పేర్చిన అనంతరం, ఒక ఉదయం, గుడ్లగూబలు నిద్రపోయే సమయంలో స్థిరజీవి ఎగిరి వెళ్ళి, మేఘవర్ణంతో, "మహారాజా, శత్రువు కోటను కాల్చి పారెయ్యటానికి అంతా సిద్ధం చేశాను. మీరూ, మీ అనుచరులూ తలా ఒక మండే కొరివి తీసుకుని వచ్చి, నా గూటి మీద వెయ్యండి. దాని నిండా ఎండుపుల్లలున్నాయి. మీ శత్రువులంతా



మంటలలో చిక్కుకుపోయి నాశనమవుతారు,'' అన్నది.

ఈ మాట విని మేఘవర్ణం సంతోషించి, ''బాబూ, నీ కథ అంతా చెప్పు. మనం కలుసుకుని చాలా కాలమయింది.'' అన్నది.

''ఇప్పుడు కాదు, నాయనా. ఇది చేతలకు సమయంగాని, మాటలకు సమయం కాదు. శత్రుగూఢచారులు నేనిక్కడికి రావటం కనిపెట్టి, నా పథకం భగ్నం చేసి, గుడ్లగూబలు తప్పించుకు పోయేటట్టు చేయవచ్చు. ఆచరించదగిన తరుణాన్ని దాటిపోనిస్తే అది తిరిగి లభించకనేపోవచ్చు. నీ శత్రువులంతా వచ్చి. నువు విజయుడవై తిరిగి వచ్చిన అనంతరం తాపీగా కథ యావత్తూ చెబుతాను.'' అన్నది స్థిరజీవి.

మేఘవర్ణమూ, అతని అనుచరులూ తలా ఒక మండేపుల్లా ముక్కుల కరచుకుని, గుడ్లగూబల గుహకు ఎగురుతూ వెళ్ళి, ఎండుపుల్లలు గుట్టవేసి ఉన్న స్థిరజీవి గూటిమీద వేశాయి. పెద్ద పెద్ద మంటలు లేచి, గుడ్లగూబలన్నీ నరక యాతన అనుభవించుతూ, ఆ మంటలలో కాలి మృతిచెందాయి.

తరవాత మేఘవర్ణం విజయగర్వంతో సింహాసనం అధిష్ఠించి, ''బాబూ, నీ అనుభవాలన్నీ ఇప్పుడు చెప్పు.'' అని స్థిరజీవిని అడిగింది.

స్థిరజీవి చెప్పింది.

''నువు రోజూ ఆ గుడ్లగూబ రాజు ముందు ఎలా ప్రణామం చెయ్యగలిగావో ఆశ్చర్యంగా ఉన్నది,'' అన్నది మేఘవర్ణం.

''కార్యం సానుకూలం కావటానికి అలాటి పనులు ఎన్నయినా చెయ్యవలసి ఉంటుంది. అర్జునుడిలాటి వాడు రవిక తొడిగాడు. భీముడు వంట చేశాడు. యుధిష్ఠిరుడు ఒక పేద బ్రాహ్మణుడయాడు. నకుల, సహదేవులు గోవులు కాచారు. ద్రౌపది పరిచారికగా పని చేసింది,'' అన్నది స్థిరజీవి.

"నువ్వు చేసినది అసిధారా వ్రతం," అన్నది మేఘవర్ణం.

"అందుకు సందేహమేమిటి? కాని శత్రువు వెళ్ళిపోయిన అనంతరం నా పని చాలా తేలిక అయింది. మిగిలిన వాళ్ళు మూర్ఖులు. అలాటి వాళ్ళను వంచించటం చాలా తేలిక. మూర్ఖుల్ని మెచ్చుకో; తిండిపోతులను మేపు; లోభులను బహూకరించు; దరిద్రులకు అప్పులియ్యి; విద్వాంసుడికి గ్రంథాలియ్యి; రాజుపట్ల విధేయుతగా ఉండు—నీ పని నెరవేరుతుంది. అయితే కొంతకాలంపాటు, మందవిసర్పం అనే పాము కప్పలను మోసినట్టుగా, ఆ మూర్ఖులకే అణగి మణిగి ఉండవలసి ఉంటుంది," అన్నది స్థిరజీవి.

"ఏమిటా కథ?" అని మేఘవర్ణం అడగగా, స్థిరజీవి ఇలా చెప్పింది:

మందవిసర్పం అనే పాము ముసలిదై పోయి, ఎలా బతకాలా అనే ఆలోచనలో పడి, ఒక కప్పలమడుగు వద్దకు వెళ్ళి, పుట్టెడు విచారంలో ఉన్నట్టు నటించింది.

ఒక కప్ప నీటి అంచుకు వచ్చి, "మామా, ఇవాళ వేటకు పోలేదేం?" అన్నది.

"బాబూ, నావంటి దౌర్భాగ్యుడికి తిండియావ ఎలా ఉంటుంది? నిన్న రాత్రి తిండికోసం బయలుదేరి ఒక కప్పను చూసి, దానిని పడిని పట్టబోయాను. అది ఎగిరి నీటిమడుగులో దూకింది. అక్కడ నీటి అంచున కొందరు బ్రాహ్మణులు మంత్రాలు చదువుతున్నారు. నేను ఒక బాలుడికాలు చూసి, దృష్టి సరిగా అనక, కప్ప అనుకుని కరిచాను. ఆ బాలుడు వెంటనే మరణించాడు. అతడి తండ్రి నన్ను శపించి, 'నీ జన్మ అంతా కప్పలను వీపు మీద మొయ్యి.' అన్నాడు. అందుచేత మిమ్మల్ని మొయ్యటానికి వచ్చాను," అన్నది పాము.

ఈ వార్త కప్పలకన్నిటికీ తెలిసింది. అవి సవారీ చేయటానికి వచ్చాయి. ముందు పడగ దగ్గిర కప్పరాజు జాలపాదమూ, తరవాత మంత్రులూ తక్కిన హోదాగలవాళ్ళూ వరసగా కూర్చున్నాయి.





## 60

మందవిసర్పం కప్పలను మోస్తూ రక రకాల విన్యాసాలు చేసింది. కప్పల రాజు, "గజారోహణమూ, బ్రహ్మరథమూ కూడా నాకు ఈ ఆనందాన్ని ఇయ్యవు," అన్నది.

మర్నాడు పాము కప్పలను మోస్తూ చాలా మందంగా నడవసాగింది. అది చూసి జాలపాదం, "ఇవాళ నువ్వు చురుకుగా కదలటం లేదు, ఎందుచేతా?" అని అడిగింది.

"ప్రభూ, తిండి లేని కారణంచేత నీరసంగా ఉంది. వీపు మీద బరువుతో నడవలేకుండా ఉన్నాను," అన్నది పాము.

"దానికేముంది? కులం తక్కువ కప్పలను తిను," అన్నది కప్పల రాజు.

మందవిసర్పం సంతోషంతో, "బ్రాహ్మణుడి శాపంకూడా ఇదే—మీలాటి గొప్ప కులం కప్పలు ఏవి తినమంటే అవి తినాలని," అన్నది.

అది మొదలు అది కప్పలను విడవకుండా తింటూ బలం పుంజుకున్నది.

కొంతకాలం అయినాక మరొక పెద్ద పాము అటుగా వచ్చి, మందవిసర్పం కప్పలను మోస్తూ ఉండటం చూసి ఆశ్చర్యపడి, "మిత్రమా, ఈ కప్పలు మనకు సహజమైన ఆహారం కద. నువ్వు వాటిని నీ వీపుమీద ఎక్కించుకుని తిరగటం ఏ మాత్రమూ భావ్యం కాదు," అన్నది.

"నాకు తెలుసులేవోయ్, నెయ్యి తాగి గుడ్డివాడయినట్టు నటించే బ్రాహ్మణుడి లాగా నేను కూడా సమయం కోసం వేచి ఉన్నాను," అన్నది మందవిసర్పం.

"ఏమిటా కథ?" అని రెండో పాము అడిగిన మీదట మందవిసర్పం ఇలా అన్నది:




పూర్వం యజ్ఞదత్తుడనే బ్రాహ్మణుడు ఉండేవాడు. అతడి భార్య రంకులాడి. ఆమె నేతితో చేసిన మిఠాయిలు తీసుకుని తన ప్రియుడి వద్దకు పోతూండేది.

ఒకరోజు అతను, "ఏమే, ఈ మిఠాయిలు ఎందుకు చేస్తున్నావు? రోజూ ఎక్కడికి పోతావు?" అన్నాడు.

"ఇక్కడికి దగ్గరలోనే దేవీఆలయం ఉన్నది. రోజంతా ఉపవాసం ఉండి, పరమాన్నమూ, మిఠాయీ దేవికి నైవేద్యం పెట్టటానికి పోతున్నాను," అన్నది భార్య.

ఆ రోజు తాను ఆలయానికి వెళ్ళినట్టయితే రోజూ అక్కడికే వెళ్ళుతున్నదని భర్త అనుకోగలందులకు ఆమె ఆలయానికి వెళ్ళి, గుడిలో ప్రవేశించక పూర్వం స్నానంచెయ్యటానికి కోనేటిలో దిగింది.

ఆమె భర్త మరొక దారిన ఆలయం చేరి, దేవివిగ్రహం వెనక దాక్కున్నాడు. త్వరలోనే అతని భార్య స్నానం ముగించి, నైవేద్యంతో సహా గుడిలోకి వచ్చి, దేవికి ధూపదీపార్చన చేసి, నమస్కరించి, "తల్లి, నా భర్త గుడ్డివాడయే మార్గం ఏమిటి?" అని ప్రార్థించింది.

విగ్రహం చాటున ఉన్న బ్రాహ్మణుడు మారుగొంతుతో, "రోజూ అతడికి నేతిమిఠాయి తినిపించావంటే త్వరలోనే అతని కళ్ళు పోతాయి," అన్నాడు.

బ్రాహ్మణుడి భార్య రోజూ తన భర్తకు నేతి మిఠాయి తినటానికి ఇచ్చింది.

కొద్దిరోజులు గడవనిచ్చి అతను, "నాకు కళ్ళు కనిపించటం లేదు," అన్నాడు.

"ఆహా! దేవి మహిమ!" అనుకున్నది భార్య. ఆమె ఈ వార్త తన ప్రియుడికి చెప్పి, అతన్ని తన ఇంటికి ఆహ్వానించింది.

గుడ్డివాడుగా నటిస్తున్న బ్రాహ్మణుడు వాడి రాక గ్రహించనట్టే ఉండి, అకస్మాత్తుగా వెనకనుంచి దుడ్డుకర్రతో వాడి తల పగలగొట్టి, చంపేశాడు. తరవాత అతను తన దుష్ట భార్య ముక్కు కోసేసి, ఆమెను ఇంట్లో నుంచి వెళ్ళగొట్టాడు.

మందవిసర్పం వెంటపాముకు ఈ కథ చెప్పి, "అయ్యా, నేను కూడా బ్రాహ్మణుడి లాగే వేచి ఉన్నాను," అన్నది.

కాలక్రమాన మందవిసర్పం జాలపాదంతోసహా అన్ని కప్పలనూ మింగేసింది.

ఇదంతా చెప్పి స్థిరజీవి, "మందవిసర్పం కప్పలను మాయమాటలతో నిర్మూలించి నట్టే, నేను కూడా గుడ్లగూబలను నిర్మూలించాను," అన్నది.

దానికి మేఘవర్ణుడు, "సమర్థుడు ఎన్ని అడ్డంకులు వచ్చినా తన లక్ష్యం సాధిస్తాడని ఇందుకే అంటారు. శక్తితో సాధించలేనిది లౌక్యంతో సాధ్యం కావటం చిత్రం కదా?" అన్నది.

"అది నిజమే. శక్తితో శరీరాన్ని మాత్రమే నాశనం చెయ్యవచ్చు, కాని లౌక్యంతో శత్రువు శరీరాన్నే గాక దుష్ప్రచారం ద్వారా పేరు ప్రతిష్ఠలను కూడా నాశనం చెయ్యవచ్చు. రాజా, ఇప్పుడు నువ్వు నిశ్చింతగా రాజ్యపాలన చెసుకో. కాని గుర్తుంచుకో, నువ్వు నీ ప్రజల కోసం ఎప్పుడూ పని చెయ్యాలి. శ్రమపడితే గాని, ఏ చెట్టునూ పడగొట్టలేం, ఏ పని సాధించలేం. దృఢ చిత్తులై ఉండు. పిరికివాళ్లు ఏమీ సాధించలేరు. చురుకుగా పనులు చెయ్యి. ఇవాళ చేసేది రేపటికి వాయిదా వెయ్యకు. ఎంత చిన్న శత్రువునుగాని, చిన్న ప్రమాదాన్నిగాని అలక్ష్యం చెయ్యకు. పాములు తిరిగే కొంపలో నిశ్చింతగా నిద్రించగలమా? వాటిని చంపాలి, లేదా పట్టి, బుట్టలలో పెట్టాలి. నీ ప్రజలను సంతోషపెట్టు. లేని పక్షంలో నీ పరిపాలన అజాగళస్తనం లాగా నిరుపయోగం అవుతుంది. కాలం సమస్తాన్నీ కబళించగలదు; రాజులూ, మంత్రులూ, సింహాసనాలూ, దర్బారులూ కాలగర్భంలో కలిసిపోయేవే. అందుచేత, జీవితం ఉండగానే ప్రజలపట్ల నీ ధర్మాన్ని నెరవేర్చు," అని స్థిరజీవి కాకి రాజుకు హితవు చెప్పింది.

మేఘవర్ణం స్థిరజీవి సలహాలు పాటిస్తూ ప్రశాంతంగా రాజ్యం చేసింది.






## 61

"చేతికి చిక్కినది మూఢత్వం వల్ల చెయ్యిజారిపోతుంది. మొసలికి లభించిన దాన్ని కోతి నష్టపోయేలాగ చేసింది." అన్నాడు విష్ణుశర్మ.

"మాకా కథ చెప్పండి." అన్నారు రాజకుమారులు. విష్ణుశర్మ ఇలా చెప్పాడు:

సముద్రతీరాన ఒక లోతైన సముద్రపు పాయ ఒడ్డున ఒక గొప్ప నేరేడుచెట్టు ఉండేది. దాని నిండా గుత్తులు గుత్తులుగా పళ్ళుండేవి. రక్తముఖం అనే కోతి ఆ చెట్టు మీద నివసించేది. దిగువన నీటిలో కరాళముఖం అనే మొసలి నివసించేది. ఒకరోజు మొసలి ఒడ్డుకు ఈదుకువచ్చి, నేరేడుచెట్టు కింద ఇసుకలో ఎండలో పడుకున్నది.

"నువ్వు నా అతిథివి. కనుక నేను నీకిచ్చే అమృతంలాటి నేరేడుపళ్ళు తిను. వైశ్వదేవయజ్ఞం పూర్తి అయిన తరుణంలో వచ్చిన అతిథికి భోజనం పెడితే, అతను మిత్రుడయేది, శత్రువయేది, విద్వాంసుడయేది, పామరుడయేది, మనకు స్వర్గప్రాప్తి కలిగిస్తాడు. వైశ్వదేవయజ్ఞం పూర్తికాగానే వచ్చినవాణ్ణి, 'నీది ఏ వేదశాఖ? ఏ కులం? ఏ విద్య నేర్చావు? నీ కుటుంబం ఏది?' అని అడగకుండా అతిథి సత్కారాలు చేసి, తృప్తిగా భోజనం పెట్టాలని మనువు చెప్పాడు. వైశ్వదేవయజ్ఞం ముగిసినప్పుడు ప్రయాణ ప్రయాసతో వచ్చిన అతిథిని సత్కరిస్తే ఉత్తమలోకాలు కలుగుతాయి. అతిథులను వెళ్ళగొట్టినా, వారు వెళ్ళిపోయేలాగ చేసినా దేవతలూ, పితృదేవతలూ విముఖులౌతారు." అని చెప్పి కోతి మొసలికి నేరేడుపళ్ళు ఇచ్చింది.

మొసలి నేరేడు పళ్ళు తిని, కోతితో చాలాసేపు ఇష్టాగోష్ఠి జరిపి, తన నివాసానికి వెళ్ళిపోయింది. అటు తరవాత కోతి, మొసలీ నేరేడుచెట్టు నీడలో కలుసుకుని, రోజూ దీర్ఘమైన శాస్త్ర చర్చలు చేసేవి.

ఒకనాడు మొసలి తినగా వోలెడన్ని నేరేడు పళ్లు మిగిలిపోయాయి. అది వాటిని తన నివాసానికి తీసుకుపోయి, తన భార్యకిచ్చింది.

"ప్రియా, అమృతం లాటి ఈ పళ్ళు ఎక్కడివి?" అని నేరేడుపళ్ళు తిని ఆనందిస్తూ మొసలి భార్య అడిగింది.

"ప్రియురాలా, నాకు రక్తముఖం అనే ఆప్తమిత్రం ఒక కోతి ఉన్నది. అది నా పైన గల ప్రీతికొద్దీ రోజూ ఈ పళ్లు ఇస్తుంది." అన్నది మొసలి.

"ఇలాటి అమృతం లాంటి పళ్ళు తినే ఆ కోతి గుండెకాయ ఎంత రుచిగా ఉంటుందో! నీకు నా పైన నిజంగా ప్రేమ ఉంటే, నువ్వు ఆ కోతి గుండెకాయను ఎలాగైనా సరే సంపాయించి, తీసుకురా. దాన్ని తిని నేను జరామరణాలు లేక, నిత్య యౌవనంతో ఉంటూ నీతో సమస్త సుఖాలూ అనుభవించగలను," అన్నది మొసలి భార్య.

"ప్రేయసీ, అలా అనకు. ఆ కోతి నా తమ్ముడిలాటిది. అదీగాక దాన్ని చంపటం నాకు సాధ్యం కూడా కాదు. అందుచేత నీ కోరిక మానుకో. సత్సంగం



ద్వారా ఏర్పడిన మైత్రి సర్వోత్తమమనీ, ఏకగర్భజాతం కూడా దాని తరవాతనేననీ, ఒకే రక్తం పంచుకున్న సోదరుల కన్న కూడా స్నేహితులు ఎక్కువనీ అంటారు," అన్నది మొసలి.

"నువ్వు ఇంతవరకు ఎన్నడూ నా కోరిక నిరాకరించి ఉండలేదు. అందుచేత నీకు ఈ పళ్లు ఇచ్చే కోతి ఆడదై ఉండాలి. నువ్వు దాన్ని ప్రేమిస్తూ ఉండాలి. కాబట్టే నువ్వు రోజంతా దానితో గడుపుతున్నావు. రాత్రివేళ నువ్వు నా పట్ల ఉదాసీనంగా ఉంటున్నావు. నాతో తియ్యగా మాట్లాడవు. నీ హృదయం మరొక స్త్రీ మీద లగ్నమైనట్టు దాన్నిబట్టే తెలుస్తున్నది గదా!" అన్నది మొసలి భార్య.

మొసలి తన భార్య పాదాలమీద పడి, ఆమె ఆగ్రహాన్ని పోగొట్టటానికిగాను దీనంగా మాట్లాడుతూ, "అందాల రాశీ, నీ ఆగ్రహాన్ని పోగొట్టటానికి నిన్ను మనస్ఫూర్తిగా ప్రేమించే నేను తప్ప ఇంకెవరున్నారు? నీ దాసుణ్ణి. ఆగ్రహించవద్దని నీ పాదాలు పట్టి వేడుకుంటున్నాను," అన్నది.

మొసలి భార్య కంటికీ మంటికీ ఏకధారగా ఏడుస్తూ, "ఆ స్త్రీ నీ మనసు దోచేసింది. దానితో కులికే నీ హృదయంలో నాకు స్థానం లేదు. దుర్మార్గుడా, ఈ సాష్టాంగ ప్రమాణాలు కూడా దేనికి? అది నీ ఉంపుడు కత్తె కాకపోతే, నేను చంపమంటే దాన్ని ఎందుకు చంపవు? ఆ ఆడకోతిని నువ్వు ప్రేమించావని దీన్నిబట్టి తెలియటం లేదా? ఎందుకిన్ని మాటలు? నువ్వు నాకు దాని గుండెకాయ తెచ్చి తినటానికి ఇయ్యకపోయావో నేను నిరాహారం ఉండి చచ్చిపోతాను," అన్నది.

తన భార్య తీర్మానం విని మొసలి తనలో, "వజ్రమనే బంకా, మూర్ఖుడూ, ఆడది, ఎండ్రకాయా, చేపా, తాగుబోతూ, నీలిమందూ పట్టుకుంటే వదలవని ప్రాజ్ఞులు చెప్పనే చెప్పారు. ఇప్పుడు నేనేం చెయ్యాలి? కోతిని చంపటం ఎలా?" అనుకున్నది.





# లబ్ధప్రణాశం

## 62

మొసలి కోతి వద్దకు వెళ్ళింది. అది ఆలస్యంగా రావటమేగాక, దిగాలుపడి ఉన్నట్టు కనబడటం చూసి కోతి, "మిత్రమా, నీ రాక ఆలస్యమయిందేం? నువు పుట్టెడు దిగులులో ఉన్నట్టు కనబడతావేం?" అని అడిగింది.

దానికి మొసలి, "మిత్రమా, నా భార్య చాలా కోపంగా ఇలా అన్నది: 'కృతఘ్నుడా, నీ ముఖం నాకు చూపటానికి సిగ్గులేదా? నువు రోజూ ఆ కోతి ఇచ్చిన పళ్లు స్వీకరించుతూ, ప్రత్యుపకారంగా ఏమీ చేశావు కావు. కనీసం అతన్ని మన ఇంటికి ఆహ్వానించావు కూడా కాదు. ఈ నీ కృతఘ్నతకు పరిహారం లేదు. కనక, నా మరిది అయిన కోతిని ఇవాళ మన ఇంటికి తీసుకురా, మనం చేయవలసినది చేద్దాం. అలా చేయకపోయావో నేను ఆత్మహత్య చేసుకుంటాను. మనం తిరిగి కలుసుకునేది ఆ లోకంలోనే!' అని నీ వదిన అయిన నా భార్య అన్నది. ఈ వాగ్వాదం మూలాన కొంచెం ఆలస్యమయింది. ఇప్పుడు నువు నా వెంట వచ్చెయ్యి. మీ వదినె ఇల్లంతా ముగ్గులు పెట్టి అలంకరించి, నీ కోసం తలవాకిట ఎదురు చూస్తూ ఉంటుంది," అన్నది.

"వదినెమాట సబబుగానే ఉన్నది. సాలెవాడు పోగులు లాగుకున్నట్టుగా బుద్ధిమంతుడు అస్తమానమూ ఒడుచుకోరాదు. ఇవ్వటమూ, పుచ్చుకోవటమూ, రహస్యాలు చెప్పటమూ, వినటమూ, తినటమూ, పెట్టటమూ అనే, ఆరూ ఆప్యాయత చూపే మార్గాలు. కాని నేనేమో వృక్షవాసిని, నువేమో జలవాసివి. నేను నీ ఇంట ఎలా ప్రవేశించ



గలను? అందుచేత నువు మా వదినెను ఇక్కడికి తెచ్చావంటే, నేను ఆమెకు పాదాభివందనం చేసి, ఆమె ఆశీస్సులు పొందుతాను,'' అన్నది కోతి.

దానికి మొసలి, ''మిత్రమా, ఈ నీటి అడుగున చక్కని ఇసుకదిబ్బ వద్ద మా ఇల్లు ఉన్నది. అందుచేత నా వీపు మీద ఎక్కి, నిర్భయంగా వచ్చెయ్యి.'' అన్నది.

కొత్త అనుభవంకోసం ఉవ్విళ్ళూరుతూ కోతి, ''అలా అయితే ఆలస్యం దేనికి? వెంటనే బయలుదేరు. ఇదుగో, నీ వీపు మీద ఎక్కాను,'' అంటూ మొసలి వీపు మీద కూర్చున్నది.

మొసలి ఒడ్డు నుంచి బయలుదేరింది. అది లోతు నీటిలోకి పోతూంటే కోతి భయపడి, ''మిత్రమా, అంత వేగంగా వెళ్ళకు. అలల తాకిడికి నా శరీరం తడిసి పోతున్నది,'' అన్నది.

''ఇక్కడ నీరు చాలాలోతు. కోతి ఎలాగూ తప్పించుకో లేదు. అది పూర్తిగా నా అధీనంలో ఉన్నది. అందుచేత దీన్ని నేను మా ఇంటికి ఎందుకు తీసుకు పోతున్నదీ చెప్పేస్తాను,'' అని తనలో అనుకుని మొసలి, ''మిత్రమా, నా భార్య కోరిక తీర్చి నిన్ను చంపటానికే నేను నిన్ను మాటలతో మోసపుచ్చి ఇక్కడికి తెచ్చాను. నీ చావు దగ్గరపడింది గనక నీ ఇష్ట దైవాన్ని ప్రార్థించుకో,'' అన్నది కోతితో.

దానికి కోతి, ''మిత్రమా, నేను నీకు గాని, ఆమెకుగాని ఏమి ద్రోహం చేశానని నన్ను చంపాలనుకున్నారు?'' అని అడిగింది.

''నువు అమృతంలాటి నేరేడుపళ్ళు తినటంచేత నీ గుండెలో అమృతంచేరిందిట. నీ గుండెను తింటే తనకు ముసలి తనమూ, చావూ రావని అనుకుని, నిన్ను తీసుకు వస్తానన్నదాకా నన్ను వేధించింది. అందుకే నేనునిన్ను తీసుకుపోతున్నాను,'' అన్నది మొసలి.

కోతికి గొప్ప ఆలోచన వచ్చింది. అది మొసలితో, "మిత్రమా, ఈ సంగతి ఒడ్డున ఉండగానే ఎందుకు చెప్పావు కావు? నేను ఎప్పుడూ నా గుండెను నేరేడు చెట్టు మధ్యలో రహస్యంగా దాచి ఉంచుతాను. రోజూ అన్నిసార్లు నేను చెట్టు ఎక్కుతూ, దిగుతూ ఉండటం దేని కనుకున్నావు? అది భద్రంగా ఉన్నదీ, లేనిదీ చూడటానికే. వదినె దాన్ని కోరితే అంతకన్నానా? కాని అసలుదైన గుండె లేకుండా నన్ను నువు ఆమెదగ్గిరికి తీసుకుపోయి ఏం లాభం?" అన్నది.

బుద్ధిమాలిన మొసలి ఆనందంతో, "అలా అయితే నేను నిన్ను చెట్టు వద్దకు తిరిగి తీసుకుపోతాను. నువు నాకు నీ గుండె ఇచ్చెయ్యి. అది లేకుండా నా భార్య పారణ చెయ్యదు," అని, వెనక్కు తిరిగి వచ్చి, కోతిని నేరేడు చెట్టు మొదట్లో చేర్చింది.

దారిలో, తన క్షేమంకోసం అనేకమంది దేవుళ్ళకు ఎన్నో మొక్కులు మొక్కిన కోతి, చెట్టును ఎన్నడూ ఎక్కనంత వేగంగా ఎక్కి, చాలా ఎత్తయిన కొమ్మను చేరి, పెద్ద నిట్టూర్పువిడిచి, "అమ్మయ్య, నా ప్రాణం దక్కింది. అనర్థులను ఎన్నడూ నమ్మరాదనీ, నమ్మదగిన వారిని కూడా మితిమించి నమ్మరాదనీ, అలాటి నమ్మకం ఆపదకు మూలమనీ ఊరికే అన్నారా? నేను మరోజన్మ ఎత్తినంత పని చేశాను," అనుకున్నది.

కోతి ఇలా అనుకుంటూ ఉంటే మొసలి, "మిత్రమా, నీ గుండె ఇచ్చేస్తే, నేను దాన్ని మీ వదినెకిచ్చి, ఆమె ఉపవాసం మాన్పిస్తాను," అన్నది.

కోతి వెటకారంగా నవ్వి, "పోరా, వెధవా! కృతఘ్నుడా! ఎవరికైనా రెండు గుండెకాయలుంటాయా? ఇక్కడ నుంచి తక్షణం వెళ్ళిపో. ఈ నేరేడుచెట్టు నీడన మళ్ళీ అడుగుపెట్టకు. ఒకసారి మిత్రద్రోహం చేసినవాడు మరొకసారి అలాటి పనికి ప్రయత్నించాడంటే తప్పక నశిస్తాడు," అన్నది.





# లబ్ధప్రణాశం

## 63

కోతి అన్నమాట విని మొసలికి నిరాశా, అవమానమూ కలిగాయి. అది తనలో, "నేను దాన్ని ఎందుకు తీసుకుపోతున్నానో చెప్పటం బుద్ధి తక్కువ అయింది. తిరిగి ఈ కోతి విశ్వాసం సంపాదించాలి," అనుకుని, పైకి, "మిత్రమా, నిన్ను పరీక్షించటానికి హాస్యమాడాను. లేకపోతే, గుండె ప్రాణి నుంచి వేరుగా ఉంటుందనుకోవటానికి నేనేమన్నా వెర్రికుట్టినా? నీ గుండెకాయతో నా భార్యకేం పని? తన భర్త ప్రాణమిత్రుణ్ణి ఆవిడ చంపాలని అనుకుంటుంది గనకనా? అందుచేత, మా ఇంటికి పోదాం, వచ్చెయ్యి. నీ కోసం మీ వదినె ఆత్రంగా ఎదురు చూస్తూ ఉంటుంది," అన్నది.

"పోరా, తుచ్ఛుడా! నేను నీ వెంట ఇంక రాకేం? వెనకటికి గంగాదత్తుడు అన్నాడట: 'ఆకలిగొన్నవాడు ఏ పాపానికైనా ఒడిగట్టుతాడు; బలహీనుడికి దయ అనేది ఉండదు; గంగాదత్తుడు బావి వద్దకు తిరిగి రానన్నాడని ప్రియదర్శనుడితో చెప్పు!' అన్నది కోతి.

"ఏమిటా కథ?" అని మొసలి అడిగితే, కోతి "గుడ్డిపగ" కథ ఈవిధంగా చెప్పింది:

ఒకానొక బావిలో గంగాదత్తుడు అనే కప్పరాజు ఉండేది. దాన్ని బంధువులు అవమానించిన కారణంగా అది చేదరాటు సహాయంతో బావి వెలపలికి వచ్చి, తన బంధువుల మీద పగసాధించేది ఎలాగా అని ఆలోచించింది.

ఇంతలో దానికి ప్రియదర్శనం అనే పాము తన కలుగులోకి దూరుతూ కనిపించింది:



"ఈ పామును బావిలోకి తీసుకుపోయి, నా బంధువర్గాన్ని సమూలంగా నాశనం చేసేస్తాను. శత్రువును వాడి శత్రువు సహాయంతో మట్టుబెట్టాలి. బలవంతుడి పైకి అంతకన్న బలవంతుణ్ణి పంపాలి. ముల్లుతోనే ముల్లును తీయాలి. అందువల్ల మనకు ఏ ఆపదా రాదు," అనుకున్నది గంగాదత్తుడు.

ఇలా అనుకుని అది పాము ఉండే కలుగు వద్దకు వెళ్ళి, "ప్రియదర్శనా, నీతో పనికలిగింది. ఒకసారి బయటికి రా," అని పిలిచింది.

ఆ పిలుపు విని పాము, "ఆ పిలిచేది పాము జాతిది కాదు. దానిది పాముల భాష కాదు. నాతో పాములు తప్ప స్నేహం చెయ్యవు. అవతలివాడి జాతి, గుణమూ, నివాసమూ, బలమూ తెలియకుండా స్నేహం చేయరాదు. ఆ పిలిచేది ఏ పాములు పట్టేవాడో, విషవైద్యుడో కావచ్చు, ఎవరు చూశారు? లేదూ, నన్ను కోసి తన శత్రువు ఆహారంలో కలిపి, ఆ శత్రువును చంపదలచినవాడు కూడా కావచ్చు" అనుకుని, "నువ్వెవరు?" అని అడిగింది.

"నేను కప్పలరాజును. నా పేరు గంగాదత్తుడు. నీ స్నేహం కోరి వచ్చాను," అన్నది కప్ప.

"ఇది నమ్మేమాటేనా? ఎండు గడ్డికీ, నిప్పుకూ స్నేహం ఏమిటి? తనను నమ్మకుండా చంపేవాడి వద్దకు కలలో కూడా ఎవరూ వెళ్ళరు. కనక నీ వ్యర్థప్రలాపాలు చాలించు," అన్నది పాము.

"నువ్వు అన్నది నిజమే. నువ్వు మాకు సహజవైరివే, కాని నా శత్రువులచేత ఓడి, అవమానం పొంది నీ వద్దకు వచ్చాను. ప్రాణహాని, ధనహాని సంప్రాప్తమైనప్పుడు ధనప్రాణాలను కాపాడుకొనటానికి గాను శత్రువును సైతం ఆశ్రయించాలని పెద్దలు చెబుతారు," అన్నది కప్ప.

"నీ శత్రువు లెవరు?" అని పాము అడిగింది. "నా బంధువులే," అన్నది కప్ప.



"వాళ్ళు ఎక్కడ ఉంటారు? బావిలోనా, చెరువులోనా, సరస్సులోనా?" అని పాము అడిగింది.

"ఇదుగో బావిలో ఉంటారు," అన్నది కప్ప.

"నాకు కాళ్ళులేవు, పొట్టమీద పాకుతాను. అందుచేత బావిలోకి దిగలేను. ఒకవేళ దిగినా, నీ బంధువులను చంపటానికి గాను నాకు ఉండతగిన చోటు లేదు. అందుచేత, నువ్వు వచ్చినదారే వెళ్ళిపో. హితమైనదే తినాలి, జీర్ణమయేదే తినాలి, క్షేమకరమైనదే తినాలి అని పెద్దలు చెబుతారు," అన్నది పాము.

"దానికేమీ విచారించే పనిలేదు. నా వెంట వచ్చెయ్యి. బావిలోకి సులువుగా ప్రవేశించే దారి చూపుతాను. అందులోనే ఉండి నువ్వు నా బంధువర్గం అంతటినీ చంపవచ్చు," అన్నది కప్పరాజు.

ఈ మాట విని పాము, "నాకు వయసు మళ్ళింది. ఎప్పుడైనా ఒక ఎలుకను పట్టుకోగలుగుతున్నాను. ఈ కులద్రోహి నాకు రోజులు సుఖంగా గడిచిపోయే మార్గం చెబుతున్నది. దీని వెంటవెళ్ళి కప్పలను తినేస్తాను. శక్తులుడిగి, అసహాయస్థితిలో ఉన్నవాడు సుఖమైన జరుగుబాటుకు మార్గం చూసుకోవాలని పెద్దలు చెబుతారు," అనుకుని, కప్పతో, "అలా అయితే, గంగాదత్తా, నువ్వు దారి తియ్యి. నేను నీ వెంట వస్తాను," అన్నది.

"ప్రియదర్శనా, బావిలో ప్రవేశించటానికి సులువైన మార్గమేగాక, అక్కడ నువ్వు ఉండటానికి తగినచోటు కూడా చూపుతాను. అయితే, నువ్వు నా కుటుంబం జోలికి, నా సేవకుల జోలికి రాకూడదు; నేను చూపే కప్పలను మాత్రమే తినాలి," అన్నది కప్పలరాజు.

"ఇప్పుడు నువ్వు నాకు మిత్రుడవు గనక, నువ్వు తినమన్న వాళ్ళనే తింటాను," అంటూ పాము తన కలుగులోనుంచి బయటికి వచ్చి, కప్పను కౌగలించుకుని, దాని వెంట బయలుదేరింది.

కప్ప పామును చేదతాడు వెంబడి బావిలోకి దించి, అది ఉండటానికి నీటి మట్టంలో ఒక తొర్రను చూపింది. తరవాత ఆ కప్ప తన బంధువులను చూపటమూ, పాము వాటిని తినటమూ జరుగుతూ వచ్చింది.

కప్పరాజు బంధువర్గమంతా అయి పోయినాక పాము, "గంగాదత్తా, నీ బంధువుల నందరినీ చంపి తినేశాను. నాకు వేరె ఆహారం చూపు," అన్నది.

"మిత్రమా, నా శత్రువులనందరినీ చంపేసి, నా పని పూర్తి చేశావు గనక తాడు మీదుగా ఎక్కి, ఇక్కడి నుంచి వెళ్ళిపో," అన్నది కప్ప.

"గంగాదత్తా, నీ మాటలు సబబుగా లేవు. నన్ను నా పాత కలుగులోకి ఎలా తిరిగిపొమ్మన్నావు. అందులో మరో పాము ఎప్పుడో చేరి ఉండాలి. కనక నేను ఇక్కడే ఉంటాను. నీ వాళ్ళనైనా సరే నాకు రోజు కొక కప్పను ఇయ్యి. లేదంటావా, అందరినీ మింగేస్తాను," అన్నది పాము.

ఈ మాట విని కప్ప విచారంతో, "ఈ పామును ఇక్కడికి తీసుకురావటం ఎంత బుద్ధి తక్కువ! అది అడిగినట్టు వెయ్యక పోయానో మమ్మల్నందరినీ మింగేసి, వంశనాశనం చేస్తుంది. ప్రబల శత్రువుతో మైత్రి ప్రాణాపాయం కలిగించే విషంతో సమానమని ఊరికే అన్నారా? కనక నా వాళ్ళనే రోజుకు ఒకర్ని దానికి ఇస్తాను. బలవంతుడికి పిటికెడు పిండి ఇచ్చి తృప్తిపరచని దుర్బలుడు మొత్తం పిండిని కోల్పోతాడు. మొత్తానికే ప్రమాదం ఎదురైనప్పుడు వివేకి అయినవాడు సగాన్ని త్యాగం చేస్తాడు; అంతా పోగొట్టుకునేకన్న సగమైనా దక్కుతుంది," అనుకుని కప్ప రోజుకొకర్ని తన వారిని పాము తినటానికి చూపుతూ వచ్చింది. పాము గంగాదత్తుడు చూపిన కప్పనేగాక, అది చూడకుండా మరికొన్ని కప్పలను కూడా తినేది. మురికి బట్టలు కట్టుకున్నవాడు ఎక్కడైనా చతికిల పడినట్టే, ఒకసారి నీతికి స్వస్తి చెప్పిన వాడు ఏ అనీతికైనా పాల్పడగలడు.






## 64

ఇలా అన్ని కప్పలనూ మింగుతూ పాము ఒకనాడు గంగాదత్తుడి కొడుకైన ప్రియదత్తుణ్ణి మింగింది. ఈ మాట విని గంగాదత్తుడు, ''అయ్యో! అయ్యో!'' అని ఆక్రందనం చేస్తుంటే, అతని భార్య, ''కఠిన చిత్తుడా, ఇప్పుడు ఏడ్చి ఏం లాభం? నీ జాతిని నాశనం చేసుకున్నావు. ఇప్పుడు నిన్ను రక్షించటానికి ఎవరున్నారు? మూఢుడా, ఇప్పటికైనా ఈ మహా నరకం నుంచి బయటపడే మార్గంగాని, ఈ క్రూరసర్పాన్ని చంపేందుకు ఏదైనా ఉపాయంగాని ఆలోచించు,'' అన్నది.

చిట్టచివరకు అన్ని కప్పలూ పోయి గంగాదత్తుడు మాత్రమే మిగిలింది. అప్పుడు పాము, ''గంగాదత్తా, నాకు ఆకలిగా ఉన్నది. కప్పలన్నీ అయిపోయాయి. నన్నిక్కడికి తెచ్చినందుకు, నాకు తినటానికి ఏమైనా చూపించు,'' అన్నది.

దానికి కప్ప, ''మిత్రమా, నేను బతికి ఉండగా నీ కేమి విచారం అవసరం లేదు. నన్ను మరొక చెరువుకుగాని, బావికిగాని పోనిచ్చే పక్షంలో మరికొన్ని కప్పలు ఇక్కడికి వచ్చేటట్టు చూస్తాను. నీకు కోలెడంత ఆహారం ఉంటుంది,'' అన్నది.

''నువు నాకు సోదరుడి వంటివాడివి. అందుచేత నేను నిన్ను తినరాదు. నువు చెప్పినట్టు చేశావంటే నాకు తండ్రిలాటివాడివి అవుతావు. కనక, నువు చెయ్య దలచినట్టే చెయ్యి,'' అన్నది పాము.

కప్ప చేదతాడు మీదుగా బయటపడి, మరొక బావి చేరుకుని, అక్కడి కప్పలతో



చేరిపోయింది. ప్రియదర్శనం కప్ప తిరిగి రావటం కోసం ఎదురు చూస్తూ కొంత కాలం గడిపి, అదే బావిలో మరొక కంతలో ఉంటున్న తొండతో, "మిత్రమా, నాకొక చిన్న సహాయం చేసి పెట్టగలవా? గంగాదత్తుడు ఎక్కడ ఉన్నదీ వెతికి, అతనితో, 'ఇతర కప్పలు రాకపోతే మానె. త్వరగా వచ్చెయ్యి. నువ్వు లేక బతకలేను. నేను నీకు ఎలాటి హానీ చెయ్యను. నేను ఈ మాట తప్పినట్టయితే, ఎంతో కాలంగా కష్టపడి సంపాదించుకున్న పుణ్యమంతా నీకు ధారాదత్తం అగుగాక!' అని నా మాటగా చెప్పగలవా?" అన్నది.

తొండ త్వరలోనే గంగాదత్తుణ్ణి కలుసుకుని, "నీ మిత్రుడు ప్రియదర్శనం నీకోసం ఆత్రంగా ఎదురు చూస్తున్నది. త్వరగా వెళ్ళు. అది నీ కేమీ హాని చెయ్యదనీ, చేస్తే తను సంపాదించిన పుణ్యమంతా నీకు సంక్రమిస్తుందని చెప్పమన్నది," అన్నది.

ఈ మాట విని కప్ప, "ఆకలిగొన్న వాడు ఎన్ని పాపాలైనా చేస్తాడు. దుర్బలుడికి దయాదాక్షిణ్యాలుండవు. మిత్రమా, నువ్వు వెళ్ళి గంగాదత్తుడు ఆ బావికి తిరిగి వచ్చేది లేదని ప్రియదర్శనానికి చెప్పు," అని చెప్పి, ఉత్సాహంగా కొత్త బావిలోని నీటిలోకి దూకింది.

కోతి మొసలికి ఈ కథ చెప్పి, "పాపిష్ఠివాడా, గంగాదత్తుడి లాగే నేను కూడా మళ్ళీ మృత్యువు నోటిలోకి రాను, ఇక వెళ్ళు" అన్నది.

"మిత్రమా, అలా అనకు. మా ఇంటికి వచ్చి, నాకు కృతఘ్నతా పాపం నుంచి విముక్తి కలిగించు; నా ఆతిథ్యం స్వీకరించు. లేకపోతే నిరశనం ద్వారా ఆత్మహత్య చేసుకుంటాను. ఆ పాపం నీకు చుట్టుకుంటుంది," అన్నది మొసలి.

"మూర్ఖుడా, ఒకసారి మృత్యుముఖం నుంచి బయటపడి మళ్ళీ అందులోకి ప్రవేశించటానికి నేనేమన్నా లంబకర్ణుడి

ననుకున్నావా? అది గనక సింహం యొక్క అపారమైన బల ధైర్యాలను చూసి, ఒకసారి ప్రాణం దక్కించుకుని కూడా, గుండే, చెవులూ లేని కారణం చేత మళ్ళీ మోసపోయి చావు నోటికి చిక్కింది!" అన్నది కోతి.

"మిత్రమా, ఎవరా లంబకర్ణుడు? అది చావు నుంచి తప్పించుకుని కూడా తిరిగి ఎలా చావును వరించింది? ఏమిటా కథ?" అని మొసలి అడగగా కోతి ఇలా చెప్పింది:

గుండే, చెవులూ లేని గాడిద కథ

ఒక దట్టమైన అరణ్యంలో కరాళకేసరం అనే సింహం ఉండేది. ధూసరకం అనే నక్క అస్తమానమూ దాన్ని అనుసరించి తిరిగేది. ఒకసారి సింహం ఒక అడవి ఏనుగుతో పోరాడి తీవ్రంగా గాయపడి, కదలలేని స్థితిలో ఉండిపోయింది.

సింహం వేటాడలేని కారణం చేత నక్కకు తిండి కరువై, నీరసించింది. రెండు రోజుల కటిక ఉపవాసం తరవాత అది సింహంతో, "మహారాజా, నేను అమితమైన ఆకలి బాధతో కాలు కదపలేకుండా ఉన్నాను. తమకు ఎలా సేవ చెయ్యను?" అన్నది.

"నువ్వు ఏదన్నా జంతువును మభ్యపెట్టి ఇక్కడికి తీసుకువచ్చినట్టయితే ఏదో విధంగా నేను దాన్ని నీ కోసం చంపుతాను," అని సింహం నక్కతో అన్నది.



తగిన జంతువు కోసం వెతుకుతూ నక్క దగ్గిరలో ఉన్న గ్రామానికి వెళ్ళి, ఊరి చెరువు గట్టున గడ్డి మొలకలు అతి ప్రయాసతో తింటున్న లంబకర్ణం అనే గాడిదను చూసి, దాన్ని ఇలా పలకరించింది:

''మామా, నమస్కారం. నిన్ను చూసి ఎంతో కాలమయింది. మరీ ఇంతగా చిక్కిపోయావేం?''

''ఏం చేసేది, అల్లుడూ? చాకలి నా చేత చచ్చే చాకిరి చేయిస్తాడు గాని, పిడికెడు గడ్డి అయినా పెట్టిన పాపాన పోడు. మట్టిగొట్టుకున్న ఈ గడ్డి పరకలు తింటే పుష్టి ఎలా వస్తుంది?'' అన్నది గాడిద.

''కాదా మరి! కాని, మామా, ఆ కనిపించే అడవి పక్కన నది ఒడ్డున చక్కని గడ్డి ఉన్నది గదా, నువు చూడలేదా? అక్కడికి వచ్చి, నాతో కులాసాగా కబుర్లు చెప్పుతూ హాయిగా మేయవచ్చు గదా!'' అన్నది నక్క.

''అల్లుడూ, నీ మాట నిజమేగాని, నా వంటి పెంపుడు జంతువులు అటుగా వస్తే అడవిలోని క్రూరమృగాలు చంపేస్తాయి గద. అది ఎంత మంచి చోటైతే మటుకు నాకేం లాభం?'' అన్నది గాడిద.

''అలా ఎన్నటికీ అనుకోవద్దు. ఆ ప్రాంతం నా రక్షణలో ఉన్నది. నా అనుమతి లేకుండా అక్కడికి ఒక్క పురుగు కూడా రావటానికి లేదు. అదీగాక, నీ యజమాని లాటి క్రూరులు పెట్టే బాధలు పడలేక మూడు ఆడగాడిదలు అక్కడ తలదాచుకున్నాయి. అక్కడి పుష్టికరమైన గడ్డి తిని, నిర్మలమైన నీరు తాగి గాడిద లని పోల్చటానికి లేనంతగా మారిపోయాయి. మంచి యౌవనంలో ఉన్న వాటికి ఇంకా పెళ్ళి కాలేదు. తమకు మంచి భర్తను గ్రామం నుంచి తెమ్మని అవి నన్ను ఎంతో కాలంగా అడుగుతున్నాయి. అందుకే నేను నిన్ను తీసుకుపోదామని ఇటుగా వచ్చాను,'' అన్నది నక్క.






## 65

నక్క మాటలు విని లంబకర్ణానికి తీవ్రమైన కోరిక పుట్టి, నక్క వెంట వెళ్ళటానికి తొందరపడింది. నక్క దాన్ని సింహం వద్దకు తీసుకుపోయింది. గాడిద చాలా నింపాదిగా వస్తూండటం చూసి, ఆత్రంలో ఉన్న మతిమాలిన సింహం దాన్ని చంపటానికి దాని మీదికి దూకింది. అయితే అది మరీ బలంగా దూకిన కారణంచేత గాడిదను దాటి దూరంగా పడింది. అసలే గాయపడి ఉన్నదేమో, దూకిన శ్రమతో అది కొద్దిసేపు కదలలేక పోయింది.

సింహం దూకిన దూకును ఎలా అర్థం చేసుకోవాలో గాడిదకు తెలియలేదు. తన పక్కనే పిడుగు పడినట్టుగా అయి, భయంతో మతిపోయి అది పారిపోయింది. పారిపోతూ వెనక్కు తిరిగి చూస్తే, దానికొక వింత జంతువు, భయంకరమైన వాలకంతో, క్రూరమైన కోరలతో, ఎర్రని కళ్ళతో కనిపించింది. గాడిద గ్రామానికి పారిపోయింది. దూకటంతో కళ్ళు బైర్లు కమ్మిన సింహం దాన్ని తరమలేక పోయింది.

నక్క సింహంతో, "ఏమిటిది? నీ ప్రతాపమూ, నేర్పరితనమూ ఎలాటివో ఇవాళ చూశాను," అన్నది.

"దూకటానికి పూర్తిగా సిద్ధంగాలేను. దానికి తోడు అకస్మికంగా కలిగిన సంతోషంలో మతిపోయింది. ఏం చేసేది? నేను నిజంగా సిద్ధంగా ఉంటే ఏనుగునైనా తప్పిపోనిస్తానా?" అన్నది సింహం.

"అలా అయితే ఇప్పటి నుంచీ సిద్ధంగా ఉండు. నేను దాన్ని మళ్ళీ తెస్తాను," అన్నది నక్క.



"మిత్రమా, అది మళ్ళీ రమ్మంటే వస్తుందా? ఇంకో జంతువును తీసుకురా," అన్నది సింహం.

"దాన్ని గురించి నీకు బెంగ దేనికి? అదంతా నేను చూసుకుంటాలే," అని నక్క గాడిద వెళ్ళిన దారినే పోయి, అది ఆ చెరువు ఒడ్డునే మేస్తుండటం చూసింది.

నక్కను చూసి గాడిద, "చూడు, అల్లుడూ! నువ్వయితే నన్ను ఆ చక్కని ప్రదేశానికి తీసుకు పోయావుగాని, నాకు వెంట్రుకవాసిలో చావు తప్పింది," అన్నది.

నక్క గట్టిగా నవ్వి, "మామా, నేను చెప్పిన ఆడగాడిదలలో అది ఒకటి. అది గుర్తుపట్టరాకుండా ఒళ్లు చేసింది. అది చక్కగా ముస్తాబై, భర్తకోసం ఎదురు చూస్తూ. మిగిలిన రెండు ఆడగాడిదల కన్న ముందుగా నిన్ను ఆలింగనం చేసుకుంటానని, చేతులు చాచి నీ మీద దూకి, నిన్ను దాటి అవతలపడింది. మితి మీరిన ఆనందంలో అది అలా చేస్తే, నువు పిరికితనం కొద్దీ పారిపోయావు. ఇదీ జరిగిన సంగతి. నీ ప్రవర్తనకు నువు సిగ్గుపడాలి. కనుక మళ్లీరా! అది నీ కోసం తిండీ, నీరూ మాని, లంబకర్ణం తన భర్త కాని పక్షంలో నీటిలోనో, నిప్పులోనో ప్రవేశిస్తుందట, లేదా, విషం పుచ్చుకుంటుందట. నిష్కారణంగా ఒక ఆడకూతురి ప్రాణం ఎందుకు తీస్తావు? మహాపాపం! మన్మథుడు కూడా నిన్ను క్షమించడు. అప్పుడు నీకు జత దొరకదు. ఆడదాన్ని తృణీకరించి, మన్మథుడికి ఆగ్రహం తెప్పించిన వాళ్ళు బైరాగి వాళ్ళయిపోయి, జుట్టు జడలు కట్టి, ఎర్రబట్టలు కట్టి, కపాలాలు పట్టుకు తిరుగుతారట," అన్నది.

నక్క చెప్పిన ఈ మాటలు నమ్మి, బుద్ధిలేని గాడిద దాని వెంట వచ్చింది. విధి తోస్తూంటే వివేకికి కూడా మతి పని చెయ్యదంటారు. గాడిద తగిన దూరంలోకి రాగానే సింహం దానిపైన దూకి, క్షణంలో చంపింది. తరవాత అది నక్కను

గాడిద శవానికి కాపలాపెట్టి, సమీపంలో ఉన్న నదిలో స్నానం చేసి రావటానికి వెళ్లింది.

మంచి ఆకలిమీద ఉన్న నక్క, గాడిద గుండెకాయా, చెవులూ తినాలన్న కోరిక ఎంత అణచుకున్నా అణగక, అది వాటిని కాస్తా తినేసింది. సింహం స్నానం చేసి తిరిగి వచ్చి, గాడిద చెవులూ, గుండెకాయా లేకపోవటం గమనించి, ఆగ్రహావేశంతో, "హీనుడా, ఇలాటి కూడనిపని ఎందుకు చేశావు? నువ్వు చెవులూ, గుండెకాయా తిని, నాకు నీ ఎంగిలి వదులుతావా?" అన్నది.

నక్క ఎంతో వినయంగా, "ప్రభూ, అలా అనకండి. నేను నిర్దోషిని. ఈ జంతువుకు చెవులూ, గుండెకాయా ఏనాడూ లేవు. లేకపోతే ఒకసారి తమరిని చూసి పారిపోయినది మళ్ళీ ఇక్కడికి వస్తుందా? దానికి చెవులు లేని కారణంచేతనే తమ గర్జనా, దూకిన చప్పుడూ వినిపించలేదు. గుండెలేని కారణం చేతనే తమ భయంకరాకారం దాన్ని భయపెట్టలేదు. గుండె లేని దానికి భయంతోకూడిన దడ ఉండదు. అది ఇక్కడికి రావటానికి, పారిపోవటానికి ప్రత్యేకమైన కారణం ఏమీలేదు. అందుచేతనే దాన్ని మరొకసారి తీసుకు రాగలిగాను," అన్నది.



సింహం దానిమాట నమ్మింది. నక్క కూడా దానితోబాటు గాడిదశవాన్ని తిన్నది.

కోతి మొసలికి గాడిదకథ చెప్పి, "మూర్ఖుడా, నువ్వు నన్ను మోసగించావన్నమాటగాని, యుధిష్ఠిరుడు అనే కుమ్మరి లాగా నోరు జారి నిజం చెప్పేశావు. తన మాయోపాయాల సందడి మధ్య నిజం చెప్పే మూర్ఖుడు యుధిష్ఠిరుడి లాగే కష్టాలపాలవుతాడు." అన్నది.

"ఏమిటా కథ?" అని మొసలి అడగగా, కోతి ఇలా చెప్పింది:

కుమ్మరి వీరుడి కథ

ఒకనాడు ఒక కుమ్మరివాడు అమితంగా తాగి, తన ఇంటిపెరట్లో పరిగెత్తుతూ

పడి పోయేసరికి, ఒక కుండపెంకు వాడి నుదుట్లో దిగబడి, గాయమై, రక్తం హెచ్చుగా కారింది. దానికి సరి అయిన చికిత్స జరగక, చీము పట్టి, మానటానికి చాలాకాలం పట్టింది. గాయం మానినాక కూడా దాని తాలూకు మచ్చ భయంకరంగా మిగిలిపోయింది.

తరవాత కొంత కాలానికి కుమ్మరి ఉండే ప్రాంతంలో కరువు వచ్చింది. అందుచేత కుమ్మరి తన దేశం విడిచి, దూరప్రాంతంలో ఒక రాజు వద్ద కొలువు చేయబోయాడు.

ఆ రాజు వాడి నుదుటి మీదగల భయంకరమైన మచ్చను చూసి, "వీడు గొప్ప వీరుడై ఉంటాడు. యుద్ధంలో వెనుకంజ వెయ్యకుండా వీరోచితంగా పోరాడుతూ శత్రువు చేతి కత్తి దెబ్బ తగిలిన గాయం తాలూకు మచ్చేగాని, వీడి ముఖం మీది మచ్చ మరొకటి కాదు. వీణ్ణి చూడగా పోరాటంలో వెన్నుచూపే వాడుగా లేడు. వీడు మన దగ్గర ఉండదగిన వాడే," అనుకుని, కుమ్మరి వాడికి తన సేనలో మంచిపదవి ఇచ్చి, వాడికి ఎన్నో బహుమానాలిచ్చి గౌరవించాడు.

రాజు వాడిపట్ల చూపిన ప్రత్యేకాభిమానం ఇతర రాజపుత్రయోధులకు నచ్చలేదు. వాళ్ళు కుమ్మరిని చూసి అసూయ పడ్డారుగాని, పైకి ఏమీ అనలేదు. ఎందుకంటే, రాజుగారికి ఆగ్రహం వస్తుందని ఒకటి, వాడు నిజంగా గొప్పరాజపుత్ర వీరుడేనన్న నమ్మకం మరొకటీనూ.

కుమ్మరిని తన కొలువులోకి తీసుకున్న కొద్దికాలానికి రాజుగారికి శత్రురాజుతో యుద్ధం వచ్చింది. ఏనుగులనూ, గుర్రాలనూ ఆయత్తంచేసి, యుద్ధరంగానికి పంపవలసిన యోధులను ఎన్నిక చేశారు. ఈ సందర్భంలో రాజు తన సైనిక వీరులను పర్యవేక్షణ చేస్తూ, కుమ్మరిని చూసి, "ఓ రజపుత్రయోధుడా, నీ పేరేమిటి? నీ కులం ఏది? నీ ముఖంమీద ఆ భయంకరమైనగాయం ఏ యుద్ధంలో తగిలింది?" అని అడిగాడు.





# లబ్ధప్రణాశం

## 66

రాజు అడిగిన దానికి కుమ్మరి, "మహా రాజా, నన్ను యుధిష్ఠిరుడు అంటారు. నేను కుమ్మరి కులానికి చెందిన వాణ్ణి. ఈ గాయం కత్తి దెబ్బవల్ల కలిగినది కాదు. ఒకసారి నేను తప్పతాగి, పదునైన, గట్టికుండ పెంకు మీద పడ్డాను. ఈ మచ్చ ఆ గాయం బాపతే," అన్నాడు.

"అయ్యో, ఎంత అవివేకిని! వీడి యోధుడి వాలకమూ, భయంకరమైన గాయంమచ్చా చూసి మోసపోయాను!" అనుకుని రాజు వాణ్ణి వెళ్ళగొట్టించాడు.

అప్పుడు కుమ్మరి, "మహారాజా, నన్ను వెళ్ళగొట్టకండి. యుద్ధంలో నా ధైర్యమూ, చాకచక్యమూ పరీక్షించండి," అన్నాడు.

"నువు ఎంత శక్తిమంతుడివైనప్పటికీ నిన్ను వెళ్ళగొట్టక తప్పదు. వెనకటికి కథలో అన్నట్టుగా, 'నువు ధైర్యంగల వాడివీ, అన్ని శాస్త్రాలూ పడచదివిన వాడివీ, అందగాడివీ అయినప్పటికీ, ఓ బిడ్డా, మీ వంశంలో పుట్టినవాడు ఏనుగును చంపలేడు.'" అన్నాడు రాజు.

"తమరు చెప్పే కథ ఏమిటి?" అని కుమ్మరి అడగగా రాజు, అతడికి ఇలా చెప్పాడు:

### సింహం పెంచిన నక్కకథ

ఒక అరణ్యంలో ఆడసింహమూ, మగసింహమూ ఉండేవి. ఆడసింహం అప్పుడే రెండు పిల్లలను ఈనింది. మగసింహం రోజూ ఏదో జంతువును వేటాడి తెచ్చి, ఆడసింహానికి ఆహారంగా ఇచ్చేది.

ఒక రోజు మగసింహం చీకటిపడిన దాకా అడవి అంతా తిరిగినప్పటికీ, ఒక్క



జంతువు కూడా దొరకలేదు. అది తన గుహకు తిరిగి వస్తూండగా దానికి ఒక నక్కపిల్ల దారిలో కనిపించింది. అది కూన కావటంచేత సింహం జాలిపడి, దాన్ని చంపక, నోట కరచుకునిపోయి, ఆడసింహానికి ఇచ్చింది.

"నాకు ఆకలిగా వుంది. తినటానికి ఏమన్నా తెచ్చావా, ప్రియా?" అని ఆడసింహం అడిగింది.

"ప్రియురాలా, నాకీ నక్కపిల్ల తప్ప ఇవాళ ఏమీ దొరకలేదు. ఇది కూడా మనలాగా గోళ్ళు కలిగిన మాంసాహారే. పైపెచ్చుకూన. అందుకని నేను దీన్ని చంపలేదు. ఆకలితో చచ్చిపోతున్నప్పుడు కూడా స్త్రీని, లింగధారిని, బ్రాహ్మణ్ణి, పిల్లలనూ, ముఖ్యంగా తనను ఆశ్రయించిన వారినీ చంపరాదంటారు. అయితే ఇప్పుడు నువు జబ్బుమనిషివి, ఆరోగ్యకారణాలచేత ఆహారం తీసుకోవలసిన దానివి కనక, దీన్ని చంపి తిను. రేపు ఇంత కంటె మంచి జంతువును తెస్తాను," అన్నది సింహం.

"ప్రియా, కూన అని నువే చంపనప్పుడు, ఆడదాన్ని, మాతృమూర్తినీ అయి ఉండి, నా పొట్టనింపుకోవటానికి దీన్ని ఎలా చంపను? అవసానదశలో కూడా నిషిద్ధమైన పని చేయరాదనీ, కర్తవ్యం మానరాదనీ ధర్మశాస్త్రాలు చెబుతాయి గద. అందుచేత నేను ఈ నక్కపిల్లను నా మూడో కొడుకుగా చూసుకుంటాను," అని ఆడసింహం నక్కపిల్లకు తన చనుబాలు ఇచ్చింది.

బలకరమైన సింహం పాలు తాగి నక్కపిల్ల పెరిగి చాలా పెద్దదిగానూ, బలం కలదిగానూ తయారయింది. సింహం పిల్లలూ, నక్కపిల్లా తమ మధ్య గల జాతిభేదం తెలుసుకోకుండా, మూడూ అన్నదమ్ములలాగా పెరిగి, కలిసి ఆడుకుంటూ వచ్చాయి.

ఒకరోజు అవి మూడూ అరణ్యంలో సంచరిస్తూ ఉండగా వాటికి ఒక అడవి


ఏనుగు తటస్థపడింది. దాన్ని చూస్తూనే సింహం పిల్లలు రోషంతో దాని మీదికి లఘించాయి. అప్పుడు నక్క వాటితో, "దాని జోలికి పోకండి. అది మీకు జాతి శత్రువు." అని చెప్పి, అతి వేగంగా సింహం ఉండే నివాసం కేసి పారిపోయింది.

సింహం పిల్లలు కూడా తమ అన్న వైఖరి మూలాన ఉత్సాహం చెడి, ఏనుగును వదిలేశాయి. శక్తివంతుడైన నాయకుడు తన ధైర్యంతో ఒక సేనను ఉత్తేజపరచగలడు; కాని వాడు పిరికివాడై, పారిపోతే, సేన అంతా ధైర్యం కోల్పోయి, క్షణాలమీద పలాయనం చేస్తుంది!

సింహం పిల్లలు రెండూ ఇంటికి వెళ్ళి, తమ తల్లిదండ్రులతో తమ అన్న పిరికితనమూ, అది ఏనుగును చూసి, భయంకొద్దీ పారిపోవటమూ నవ్వుతూ చెప్పాయి.

నక్క ఇందుకు మండిపడింది. దాని కళ్ళు ఎరుపెక్కాయి, పెదవులు వణికాయి. అది తన తమ్ముళ్ళ మీద దారుణమైన తిట్లు విసరింది.

దాని ప్రవర్తనకు సింహం పిల్లలలో ఆగ్రహం పెరగసాగింది. అది చూసి తల్లి సింహం, తాను పాలిచ్చి పెంచిన నక్కను కాపాడటం కోసం, "నాయనా, వాళ్ళను అలా అనరాదు. వాళ్ళు నీ తమ్ముళ్ళు గదా!" అన్నది.



ఈ మృదువైన మాటలకు నక్క నూరింతలు రెచ్చిపోయి, "వీళ్ళకు నేను ధైర్యంలోగాని, విజ్ఞానంలోగాని, రూపు రేఖలలోగాని, ఎందులో తక్కువని నన్ను వెటకారం చేస్తున్నారు? నేను నా ఆత్మ గౌరవం నిలుపుకునేటందుకు వీళ్ళని చంపితీరాలి," అన్నది.

ఆడసింహం నవ్వు ఆపుకుంటూ, "నాయనా, నువు ధైర్యం గలవాడివి కావచ్చు, చదువుకున్నవాడివి కావచ్చు, అందగాడివి కావచ్చు. కాని నీ వంశంలో పుట్టిన వారెవరూ ఏనుగును చంపలేరు. అందుచేత, నా మాట శ్రద్ధగా విను. నువు పుట్టుకచేత నక్కవు. నిన్ను చూసి జాలిపడి, నీకు నా పాలిచ్చి పెంచాను. నా పిల్లలు ఇంకా పసివాళ్లు కావటం చేత నువు నక్కవని ఇంకా గ్రహించ లేదు. అందుచేత వెంటనే వెళ్ళిపోయి, నక్కలతో చేరు. లేకపోతే, నా కూనల వల్ల నీకు ప్రాణాపాయం ఉన్నది," అన్నది.

ఈ మాట విని నక్క, ప్రాణభయంతో కంపించిపోతూ, పారిపోయి ఇతర నక్కల మధ్య చేరిపోయింది.

రాజు ఈ కథ చెప్పి, కుమ్మరితో, "నువు కుమ్మరివి మాత్రమేనని నా సైనికు లింకా తెలుసుకోకముందే వెళ్ళిపో. లేక పోతే, నిన్ను వాళ్ళు హాస్యం పట్టించి చంపుతారు," అన్నాడు.

కుమ్మరి వెంటనే బయలుదేరి వెళ్ళి పోయాడు.

కోతి ఈ కథ చెప్పి, "మూర్ఖుడా, నీ భార్య కోసం నువు మిత్రద్రోహం తలపెట్టి, ఆమె ప్రేమనూ, కృతజ్ఞతనూ సంపాదించుదామనుకున్నావు. కాని కథలో బ్రాహ్మణుడి భార్య, ఒక కుంటి వెధవ కోసం తనవారినందరినీ వదులుకుని, తన అర్ధాయుస్సు ధారపోసిన భర్తను చంపటానికి సిద్ధపడిన విధంగా ఆమె ప్రవర్తించి ఉండేది," అన్నది.

"ఏమిటా కథ?" అని మొసలి అడిగిన మీదట కోతి ఇలా చెప్పసాగింది:





# లబ్ధప్రణాశం

## 67

### కృతఘ్నురాలి కథ

ఒకానొక నగరంలో ఒక బ్రాహ్మణుడు తన భార్యతో ఉండేవాడు. అతనికి ఆమె మీద అంతులేని ప్రేమ. కాని ఆమె నిత్యమూ అతనివాళ్ళతో జగడం పెట్టుకుని, అతనికి జీవితం దుర్భరం చేసేది. అందుచేత అతను ఉన్న ఊరు విడిచి, దూర ప్రదేశానికి వెళ్ళి, బంధువులకు ఎడంగా సుఖంగా జీవింతామనుకున్నాడు.

వాళ్ళు పోతూండగా ఇసుక ఎడారి దాటవలసి వచ్చింది. ఎండ తీవ్రంగా ఉండటం చేత భార్యకు దప్పిక అయి, నీరు కావాలని ఆక్రోశించింది. నీటి కోసం అతను చాలాదూరం వెళ్ళి, నీటితో తిరిగి వచ్చేసరికి, వడదెబ్బకు భార్య చచ్చిపోయి ఉన్నది. భార్య అంటే అమితమైన ప్రేమ కలవాడు కావటం చేత అతను గట్టిగా ఏడుస్తూ, ఆమెను బతికించమని దేవుణ్ణి వేడుకున్నాడు.

''నీ మిగిలిన జీవితంలో సగం నీ భార్యకు ధారపోశావంటే ఆమె తిరిగి బతికి అంతకాలమూ జీవిస్తుంది,'' అని ఆకాశవాణి పలికింది.

బ్రాహ్మణుడు అందుకు సంతోషంగా ఒప్పుకుని, ''నా జీవితంలో సగం ఆమెకిస్తాను,'' అన్నాడు.

అతను ఈ మాట అనగానే ఆమె బతికి లేచి భర్త తెచ్చిన నీరుతాగి, తాము వెంట తెచ్చుకున్న ఆహారం భర్తతో కలిసి తిన్నది. తరవాత వాళ్ళు ప్రయాణం కొనసాగించారు.

కాలక్రమాన వాళ్ళు ఒక నగరం బయట పూలతోట చేరుకున్నారు. భర్త భార్యతో, ''నువు ఇక్కడే ఉండు. నేను



ఊళ్ళోకి వెళ్ళి, మన ఇద్దరికీ భోజనం తెస్తాను,'' అని వెళ్లిపోయాడు.

ఒక కుంటివాడు చక్కగా పాడుతూ, అటుగా వచ్చాడు. వాడి పాట విని ఆమె మోహపరవశురాలై, వాణ్ణి తన ప్రియుడు కమ్మనీ, లేకపోతే ఆత్మహత్య చేసుకుంటాననీ అన్నది.

''నేను కుంటివాణ్ణి. నీకు నాతో ఏమిటి?'' అని వాడు అన్నాడు.

''అయితే అయావు!'' అన్నదామె.

కుంటివాడు ఆమె ప్రేమికుడు కావటానికి ఒప్పుకున్నాడు.

బ్రాహ్మణుడు భోజనంతో తిరిగి వచ్చి, తనతోబాటు తినమని భార్యను పిలిచాడు.

''ఈ కుంటివాడికి కూడా కొంత ఆహారం పెట్టరాదా? ఇతనికి ఆకలిగా ఉన్నది.'' అన్నది భార్య.

బ్రాహ్మణుడు ఒప్పుకున్నాడు. ముగ్గురూ భోజనం చేసిన తరవాత బ్రాహ్మణుడి భార్య, ''మనకు పిల్లలు లేరు. నువు బయటికి వెళ్లితే నేను ఒంటరిగా ఉండవలసి వస్తున్నది. నాకు ఇంట్లోపని చేసిపెట్టటానికీ ఎవరూ ఉండరు. అందుచేత ఈ కుంటివాణ్ణి మన వెంట తీసుకుపోతేనేం?'' అని భర్తతో అన్నది.

దానికి బ్రాహ్మణుడు, ''ఈ కుంటివాడు నడవలేడు. వాణ్ణి ఎవరు మోస్తారు? నా ఒళ్ళు నాకే బరువుగా ఉన్నది. మరొకణ్ణి ఎక్కడ మోసేది?'' అన్నాడు.

''ఒక తట్ట తెస్తే, ఇతన్ని అందులో కూర్చోబెట్టి నేనే మోస్తాను,'' అన్నది భార్య.

మతిమాలిన ఆ బ్రాహ్మణుడు భార్య మీది ప్రేమకొద్దీ ఇలాటి అర్థంలేని ఏర్పాటుకు సమ్మతించి, ఒక తట్ట తెచ్చాడు; అందులో కుంటివాణ్ణి కూర్చోబెట్టి ఆమె మోసింది.

దారిలో వారికి ఒక లోతైన బావి తగిలింది. వాళ్లు దాని బొడ్డుమీద విశ్రాంతికి కూర్చున్నారు. కుంటివాడి సహాయంతో భార్య బ్రాహ్మణ్ణి అకస్మాత్తుగా బావిలోకి నెట్టేసింది. తరవాత ఆమె కుంటివాణ్ణి

తట్టలో కూర్చోబెట్టి నెత్తికెత్తుకుని బయలు దేరింది.

వాళ్ళిద్దరూ ఒక పెద్ద నగరం చేరారు. ఆ నగరాన్ని ఒక ధర్మాత్ముడు పాలిస్తున్నాడు. అక్కడి రక్షక భటులు ఆమె నెత్తిన తట్టనూ, అందులో ఉన్న కుంటి వాణ్ణీ చూసి వింతపడి, ఆమెను తమ రాజు వద్దకు తీసుకుపోయారు.

ఆమె రాజుతో, "మహారాజా, ఇతను నా భర్త. కుంటివాణ్ణి చేసి ఇతని బంధువులు ఇతన్ని నానా బాధలూ పెట్టి, చంపటానికి కూడా సిద్ధపడితే, ఒక రాత్రి ఎవరికీ తెలియకుండా నేను ఇతన్ని ఒక తట్టలో పెట్టుకుని ఈనగరానికి తెచ్చాను," అన్నది.


"నీ వంటి మహా ఇల్లాలిని నే నెన్నడూ చూడలేదు. నీకు రెండు గ్రామాలు ఈనాముగా ఇస్తున్నాను," అన్నాడు రాజు.

ఆమె ఎంతో సంతోషించి, అక్కడి నుంచి వెళ్ళిపోబోతూండగా ఆమె భర్త అక్కడికి వచ్చాడు. బావిలోపడి అతను పెట్టిన కేకలు విని, ఎవరో సన్యాసి అతన్ని రక్షించాడట.

తన భర్త వస్తూండటం చూసి బ్రాహ్మణుడి భార్య రాజుతో, "ఆ వచ్చేవాడు నా భర్తకు ప్రబలశత్రువు," అన్నది.

"అతణ్ణి చంపండి," అన్నాడు రాజు.

బ్రాహ్మణుడు రాజుతో, "మహారాజా, నన్ను చంపేముందు ఈ స్త్రీని నా బాకీ వడ్డీతోసహ తీర్చమనండి," అన్నాడు.



''అతను నీకేమిచ్చాడు ?'' అని రాజు ఆమెను అడిగాడు.

''నాకేమీ ఇయ్యలేదు,'' అన్నదామె.

''నువు ఎడారిలో చచ్చిపోయినప్పుడు నీకు నా ఆయుర్దాయంలో సగం ధారపోసి, నిన్ను బతికించుకున్నాను కానా ?'' అని బ్రాహ్మణుడు తన భార్యతో అని, రాజు కేసి తిరిగి, ''ఈమె కోసం బంధువుల నందరినీ వదులుకున్నాను, నా ఆయుర్దాయం సగం ఇచ్చాను. అందుకు బదులుగా ఈమె నా పట్ల కృతఘ్నురాలై, ఈ కుంటివాణ్ణి ప్రియుడుగా సంపాదించి, తమచేత నన్ను అన్యాయంగా చంపించాలని చూస్తున్నది,'' అన్నాడు.

రాజు కఠినంగా ప్రశ్నించిన మీదట ఆమె నిజం ఒప్పుకున్నది. అప్పుడు రాజు బలాత్కారంగా ఆమెచేత బ్రాహ్మణుడికి అతని ఆయుర్దాయం తిరిగి ఇప్పిస్తూ, ''నేను నా భర్తవద్ద అరువు పుచ్చుకున్న ఆయువును అతనికి తిరిగి ఇస్తున్నాను,'' అనిపించాడు.


ఆ మాట అంటూనే ఆమె చచ్చి పడిపోయింది.

కోతి మొసలికి కృతఘ్నురాలి కథ చెప్పి, ఇంకా ఇలా అన్నది: ''మూర్ఖుడా, అతిగా వాగే చిలకలను పంజరాలలో బంధిస్తారు, కాని మితభాషులైన కొక్కరాయిలు స్వేచ్ఛగా తిరుగుతాయి. ఇక నువు వెళ్లు. లేకపోతే నిన్ను బలవంతాన గెంటవలసి వస్తుంది.''

దానికి మొసలి, ''నా హాస్యాన్ని అపార్థం చేసుకున్నావు. నేను విశ్వాసపాత్రుణ్ణనీ, ఎన్నడూ నీకు ద్రోహం తలపెట్టననీ నమ్మి చెబుతున్నాను,'' అన్నది.

''ఓరీ, భార్యా విధేయుడా, నీలాటి వాళ్ళు భార్యలను కాదనలేక తమ క్షేమాన్నీ, ఐశ్వర్యాన్నీ, స్నేహితులనూ కూడా త్యాగం చేసేస్తారు. నందుడూ, వరరుచీ లాటి వాళ్లే భార్యలకు దాసులైతే నువు ఒక లెక్కా ?'' అన్నది కోతి.

మొసలి ఆ కథ వినగోరితే కోతి చెప్పింది.





# లబ్ధప్రణాశం

## 68

ప్రణయకలహాల కథ

నందుడు గొప్ప సామ్రాజ్యాన్ని ఏలిన చక్రవర్తి. ఎంతలేసి రాజులూ అతనికి పాదాక్రాంతులైనారు. అతని ఖ్యాతి శరత్కాలపు వెన్నెలలాగా నిష్కలంక మైనది. అతని మంత్రి వరరుచి సకల శాస్త్ర పారంగతుడైన మహా మేధావి.

ఒక రోజు సాయంకాలం వరరుచికి అతని భార్యతో ప్రణయ కలహం వచ్చింది. అతనికి భార్య అంటే తగని ప్రేమ. అందుచేత అతను వీలయినంత త్వరలో ఆమెతో రాజీపడాలనుకుని, ఎన్నోవిధాల ఆమెను బతిమాలి చూశాడు. కాని అందువల్ల ఫలితం లేకపోయేసరికి అతను ఎంతో దీనంగా, "ప్రియా, నేను ఏం చేస్తే నీ కోపం పోతుందో చెప్పు, అల్లాగే చేస్తాను," అని భార్యతో అన్నాడు.

చాలాసేపు బతిమాలించుకుని చివరకు ఆమె, "నీ తల గుండు చేయించుకుని, నా పాదాల మీద పడినట్టయితే నేను ఎప్పటిలాగా ప్రేమగా ఉంటాను," అన్నది.

వరరుచి ఆమె కోరినట్టే చేసి, ఆమె కోపాన్ని పోగొట్టాడు.

ఆ సాయంకాలమే నందుడికీ, అతని భార్యకూ మధ్య ప్రణయ కలహం సంభవించింది. ఆమె కోపం పోగొట టానికి నందుడు ఎన్ని ప్రయత్నాలు చేసినా లాభం లేకపోయింది.

"ప్రియా, నువు లేకుండా ఒక గంట కూడా జీవించలేను. నీ కాళ్ళు పట్టు కుంటాను, కనికరించు," అని వేడు కున్నాడు నందుడు.

"కళ్ళెం నోట పెట్టుకుని, నన్ను వీపు మీద ఎక్కించుకుని, గుర్రంలాగా



సకిలిస్తూ, సవారీ చేయనిస్తే నేను తృప్తి పడతాను,'' అన్నది నందుడి భార్య.

నందుడు అలాగే చేశాడు.

మర్నాడు వరరుచి నందుడి దర్బారుకు వచ్చినప్పుడు, అతని గుండుకు కారణం ముందుగానే చారుల ద్వారా విని ఉన్న నందుడు, అతన్ని అవహేళన చేసే ఉద్దేశంతో, ''ఓ, వరరుచీ! మంచి రోజు కూడా చూడకుండా అలా తల గొరిగించుకున్నావేమిటి?'' అని అడిగాడు.

నందుడు చేసిన పని తెలుసుకుని ఉన్న వరరుచి, ''స్వామీ, మన పనులు సాధించుకోవాలంటే మనం అనేక పనులు చెయ్యవలసి ఉంటుందని తమరెరగరా? ఏదీ చెయ్యకపోతే ఏమీ జరగదు. అంతే గదా?'' అన్నాడు.

నందుడు జవాబు చెప్పలేదు.

కోతి మొసలికి ఈ కథ చెప్పి, ''మూర్ఖుడా, వాళ్ళు చేసిన పనులు భార్యలను తృప్తిపరిచినా ఇతరులకు హాని కలిగించలేదు. కాని, నువు మటుకు నీ మిత్రుణ్ణి చంపటానికి సిద్ధపడ్డావు. పైన నోరు జారి వాగావు. ఓండ్రపెట్టటం వల్ల చచ్చిన గాడిద కథ వినలేదా?'' అన్నది.

ఆ కథ ఏమిటని మొసలి అడిగిన మీదట కోతి ఇలా చెప్పింది:

పులితోలు కప్పుకున్న గాడిద కథ

ఒక గ్రామంలో ఒక చాకలి ఉండేవాడు. వాడికొక గాడిద ఉండేది. అది తిండిలేక నీరసించిపోయింది.

ఒకనాడు చాకలి అరణ్యంలో తిరుగుతూ, ఒక చచ్చిన పులిని చూసి ఇలా అనుకున్నాడు: ''నా గాడిదమీద ఈ పులితోలు కప్పి, రాత్రివేళ పొలాలమీద వదిలిపెట్టితే, రైతులు దాన్ని చూసి పులే అనుకుని పారిపోతారు. అప్పుడు అది పంటచేలమీద పడి తిని, బాగా బలిసి, నా బట్టల మూటలు మొయ్యగలుగుతుంది.''

వాడు పులితోలు ఒలిచి, దాన్ని తన గాడిదమీద కప్పి, తన పథకం అమలు



చేశాడు. రైతులు గాడిదను చూసి పులే అనుకుని, దాన్ని తమ పొలాల నుంచి తరిమి వెయ్యటానికి భయపడ్డారు. గాడిద తెల్లవార్లూ కడుపారా మేసి, తెల్లవారేవేళ ఇంటికి తిరిగి వచ్చేది. ఇలా అది తెగతిని, వాకిలి పట్టనంత లావెక్కిపోయింది.

ఒక రాత్రి అది మేస్తూండగా, దూరాన మేసే ఆడగాడిద ఓండ్రపెట్టటం విని, తిక్కరేగి తానుకూడా ఓండ్రపెట్ట సాగింది. అది విని రైతులు, అది పులితోలు కప్పిన గాడిద మాత్రమేనని తెలుసుకుని, దాన్ని పట్టుకుని చావగొట్టేశారు.

కోతి గాడిద కథ ముగిస్తూండగా ఒక నీటి జంతువు వచ్చి మొసలితో, "ఓయీ, కరాళముఖా! తిండి లేకుండా నీ కోసం ఆత్రంగా ఎదురుచూస్తూ ఉండిన నీ భార్య, నువు మామూలుకన్న ఎక్కువ ఆలస్యం చెయ్యటం చూసి నిరాశతోనూ, అసూయతోనూ ఆత్మహత్య చేసుకున్నది," అని చెప్పింది.

ఈ మాట విని మొసలి, "అయ్యో, ఎంత దౌర్భాగ్యుణ్ణి! నా కెంత ఆపదవచ్చి పడింది! నా ఇల్లు ఇక ఇల్లు కాదు. మంచివాడికి భార్యే ఇల్లు. భార్య లేని ఇల్లు బంజరుతో సమానం. భార్య ఉంటే చెట్టుమాను మొదలైనా ఎంతో ఆనంద దాయకంగా ఉంటుంది. భార్యలేని రాజభవనం కూడా ఎడారితో సమానం," అనుకుని, కోతితో, "మిత్రమా, నేను నీకు తలపెట్టిన ద్రోహాన్ని క్షమించు. నేను వెళ్ళి, నా భార్య చితి మీద ప్రాణాలు వదులుతాను. శలవు!" అన్నది.

దానికి కోతి, "నువు నీ భార్యకు దాసుడివనీ, ఆమె నిన్ను తన బొటన వేలికింద తొక్కిపట్టిందనీ నాకు మొదటి నుంచీ తెలుసు. ఇప్పుడు నువు ఆ సంగతి మరింత బాగా నిరూపించుకున్నావు. మూఢుడా, సంతోషించక ఏడుస్తున్నావా? అలాటి భార్యలు పోతే పండగ చేసుకోవాలి. అలాటి స్త్రీతో శాంతి అనేది ఉండదు. అలాంటివాళ్లను దండించిగాని, బహూక

రించిగాని, మెచ్చుకునిగాని దారికి తీసుకు రాలేం. అటువంటి దానికోసం ఆత్మహత్య చేసుకుంటావా? వద్దు!'' అన్నది.

''మిత్రమా, నువ్వన్నది చాలావరకు నిజమే. కాని నేను ఏం చెయ్యాలి? నా భార్యను పోగొట్టుకున్నాను, ఇల్లు పాడుబడింది. నీ స్నేహం పోగొట్టుకున్నాను. వెనకటికి రైతు భార్యలాగా ఉభయభ్రష్టుణ్ణి అయాను,'' అన్నది మొసలి.

''ఏమిటా కథ?'' అని కోతి అడిగితే మొసలి ఇలా చెప్పింది:

రైతు భార్య కథ

పూర్వం ఒక రైతు దూరంగా ఉన్న వ్యవసాయ క్షేత్రంలో తన అందమైన భార్యతో కాపరం చేస్తూండేవాడు. వాళ్లకు పిల్లలు లేరు. రైతు వయసు మళ్లినవాడు. భార్య పడుచుది కావటంచేత యువకుడైన ప్రియుడి కోసం చూడసాగింది.

ఆమె మీద కన్ను వేసి ఉన్న ఒక దుష్టుడు ఆమె అంతరంగం గ్రహించి, ఒకనాడు ఆమెను కలుసుకుని, ''అందాలరాశీ, నిన్ను చూసిన క్షణంలోనే ప్రేమించాను. ఇటీవలనే నా భార్య పోయింది. నేను, నా అనే వాళ్ళెవరూ లేని ఒంటరిగాణ్ణి. నన్ను నీ ప్రేమతో సుఖపెట్టు,'' అన్నాడు.

ఆమె సంతోషించి, ''నీకు అలాటి ఉద్దేశం ఉంటే నాకేమీ అభ్యంతరం లేదు. మనం ఇక్కడినుంచి పారిపోదాం. నా భర్త పెట్టెలో బోలెడు డబ్బు దాచాడు. అదంతా తెస్తాను. దానితో మనం సుఖంగా జీవించవచ్చు,'' అన్నది.

''మంచిది. నీ భర్త నిద్రపోయాక, ఈ రాత్రే నా దగ్గిరికి వచ్చెయ్యి.'' అన్నాడు దుష్టుడు.

ఆమె అందుకు ఒప్పుకున్నది.

ఆ రాత్రి తన భర్త నిద్రపోయేటప్పుడు ఆమె డబ్బంతా తీసుకుని, సంకేతస్థానం చేరుకున్నది. దుష్టుడు చాలా సంతోషించి, ఆమె వెంట నృత్యం చేస్తూ బయలుదేరాడు.





# లబ్ధప్రణాశం

## 69

రైతుభార్యా, దుష్టుడూ పోతూండగా, వారికి ఒక నది అడ్డు వచ్చింది. అక్కడ పడవ ఉన్నదిగాని, పడవవాడు లేడు.

దుష్టుడు ఆమెతో, "ప్రియా, నేను ముందు నీ డబ్బూ, ఖరీదైన చీరలూ అవతలి ఒడ్డున పెట్టి, తిరిగివచ్చి నిన్ను తీసుకు పోతాను," అన్నాడు.

వాడు అవతలి ఒడ్డుకు చేరి, అటు నుంచి అటే వెళ్లిపోయాడు. ఇంతలో ఆమె ఒక దృశ్యం చూసింది.

ఒక ఆడనక్క నోట మాంసం కరచుకుని వస్తున్నది. అంతలో ఒక పెద్ద చేప ఎగిరి, ప్రమాదవశాన నది ఒడ్డున పడింది. నక్క మాంసం ముక్కను ఒక చోట ఉంచి, చేప కేసి రాసాగింది. నక్కను చూసి చేప, విశ్వప్రయత్నం చేసి తిరిగి నీటిలోకి దూకి, తప్పించుకు పోయింది. నక్క తన మాంసం ముక్కకేసి బయలుదేరింది. అంతలోనే ఒక గద్ద రివ్వుమంటూ వచ్చి, ఆ మాంసం ముక్కను తన్నుకుపోయింది.

మొసలి ఈ కథ ముగించే సమయానికి ఇంకొక జలచరం వచ్చి దానితో, "నీ ఇంటిని మరొక మొసలి ఆక్రమించుకున్నది," అని చెప్పింది.

ఈ మాట విని మొసలి, "విధి నా పట్ల చాలా అన్యాయంగా ప్రవర్తిస్తున్నది. మిత్రుణ్ణి పోగొట్టుకున్నాను, భార్య పోయింది, నా ఇల్లు శత్రువు వశమయింది. ఈ కోతిని సలహా అడుగుతాను," అనుకుని, కోతికి తన సమస్య చెప్పింది.

"నాకు ద్రోహం తలపెట్టిన నువు నా సహాయం పొందటానికి అర్హుడివి కావు," అన్నది కోతి.



దానికి మొసలి, ''నీకు అపకారం చేసిన వాడికి ఉపకారం చెయ్యటమే పుణ్యం. అయ్యో! నేనేం చేతును? పెళ్ళాం పోయింది. ఇల్లు పోయింది,'' అంటూ ఏడ్చింది.

''మూర్ఖుడా, ఇది ఏడుస్తూ కూచునే సమయం కాదు, ఉద్యమించాలి. ధైర్యం వహించి, నీ శత్రువుతో పోరాడు. శత్రువును జయించటానికి సాష్టాంగపడాలి; బలవంతుడైతే, మరొకణ్ణి వాడి మీదికి రెచ్చగొట్టాలి! నీచుడైతే లంచం పెట్టాలి; సమఉజ్జీ అయితే పోరాటానికి దిగాలి. నీకు నక్కకథ చెబుతాను,'' అంటూ కోతి ఇలా చెప్పింది:

నక్క—నలుగురు శత్రువులు

ఒక అరణ్యంలో మహాచమరక మనే నక్క ఉండేది. ఒకసారి అది అరణ్యంలో తిరుగుతూ, సహజంగా మరణించిన ఒక ఏనుగును చూసింది. నక్క ఏనుగు కళేబరం చుట్టూ ప్రదక్షిణం చేసింది. కాని ఎక్కడా చర్మం చిట్లినట్టు కనిపించ లేదు. మందమైన ఏనుగు చర్మాన్ని చీల్చేశక్తి నక్కకులేదు. నక్క ఏమి చెయ్యటానికీ పాలుబోక చూస్తూండగా దానికి ఒక సింహం అటు కేసి వస్తూ కనిపించింది.

నక్క సింహానికి సాష్టాంగ నమస్కారం చేసి, ''స్వామీ, తమ కోసమే ఈ ఏనుగుకు కాపలా కాస్తున్నాను,'' అన్నది.

''ఇతరులు చంపిన జంతువును నేను ముట్టను. కనక దీన్ని నువు నా బహుమానంగా పుచ్చుకో,'' అన్నది సింహం.

ఈ మాటకు నక్క సంతోషించి, ''దొడ్డ ప్రభువులు తమ సేవకులను అలాగే చూస్తారు,'' అన్నది.

సింహం ఈ మాటలకు పొంగిపోతూ తన దారిన వెళ్ళిపోయింది. తరవాత ఒక పెద్దపులి అటుగా వచ్చింది. దాన్ని చూసి నక్క ఇలా అనుకున్నది: ''ఒక క్రూరాత్ముడికి ఒంగి దణ్ణాలు పెట్టి తప్పించుకున్నాను. ఈ పెద్దపులిని ఎలా

వదిలించుకోవటం? దీనికీ, సింహానికీ రంధి కల్పించాలి.''

ఇలా అనుకుని అది పులిని సమీపించి రహస్యంగా, ''మామా, ఈ ఏనుగును సింహం చంపింది. అది నన్ను దీనికి కాపుపెట్టి, స్నానం చేసి రాబోయింది. పోతూ పోతూ అది నాతో, 'ఇటుగా పెద్ద పులిగాని వస్తే నువు వచ్చి, రహస్యంగా నాకామాట చెప్పు. నాకు పెద్దపులులంటే తగని మంట,' అన్నది,'' అని చెప్పింది.

ఈ మాట విని పెద్దపులి బెదిరిపోయి, నక్కతో, ''అల్లుడూ, నాప్రాణం కాపాడు,'' అంటూ అమిత వేగంగా పారిపోయింది.

అది వెళ్ళిందో లేదో చిరుతపులి ఒకటి అటుగా వచ్చింది. దాన్ని చూసి నక్క, ''ఈ చిరుతపులి కోరలు చాలా వాడి. దీనిచేత ఈ ఏనుగు చర్మం చీల్పిస్తాను,'' అనుకుని, చిరుతపులితో, ''ఓహో, అల్లుడూ! నా ఆతిథ్యం స్వీకరించి, కడుపునిండా తిను. ఈ ఏనుగును సింహం చంపింది. ఈ కళేబరానికి నన్ను కాపలా పెట్టి వెళ్ళిన సింహం తిరిగి వచ్చేలోపుగా నువు కడుపునిండా తిని, పారిపో,'' అన్నది.

చిరుతపులి,ఏనుగుమాంసం కోసం దాని చర్మం చీల్చింది. ఏనుగు చర్మం చీలిన మరుక్షణం నక్క, ''పారిపో, అల్లుడూ! పారిపో! సింహం వస్తున్నది!'' అని



అరిచింది. చిరుతపులి కాలి సత్తువకొద్దీ పరిగెత్తి పోయింది.

నక్క ఏనుగుమాంసం తినటం ఆరంభించిందో లేదో, ఆ మాంసం తినటానికి మరొక నక్క అతివేగంగా వచ్చి పడింది.

మొదటి నక్క దాని పైన కలియబడి, దాన్ని చీల్చి చంపేసి, తాపీగా ఏనుగు మాంసం తిన్నది.

కోతి మొసలికి ఈ కథ చెప్పి, ''శత్రువు ఆక్రమించాడనో, ఆపద సంభవించిందనో, తిండికి కరువు వచ్చిందనో, మరొకందుకో ఎన్నడూ స్వస్థలం విడిచిపెట్టకు. దేశం విడిచిపోయిన కుక్క కథ గుర్తుంచుకో,'' అన్నది.

"ఏమిటా కథ?" అని మొసలి అడిగితే, కోతి ఇలా చెప్పింది:

దేశం విడిచిన కుక్క కథ

ఒక పట్టణంలో చిత్రాంగం అనే కుక్క సుఖంగా నివశించేది. కొన్నిఏళ్ళ అనంతరం, ఆ పట్టణంలో కరువు వచ్చింది, శత్రుభయం కూడా ఏర్పడింది. కుక్కకు తిండి దొరకలేదు. అందుచేత అది సుఖంగా బతకటానికిగాను మరొక పట్టణం పోయింది.

ఒక గొప్ప ఇంటి తాలూకు వంటింటి వాకిలి తెరిచి ఉండటం దానికి కనిపించింది. అది లోపలికి వెళ్ళి చూస్తే, అనేక వంటకాలు తినటానికి సిద్ధంగా కనిపించాయి. అది కడుపునిండా తిని, ఎవరూ చూడకముందే వెళ్ళిపోయింది.

కాని అది బయటికి రాగానే ఊళ్ళో కుక్కలు కొత్త కుక్కను చూసి, మీదపడి కరిచి, హంగామాచేశాయి. చచ్చేటట్టు గాయాలై, కుక్క ఇలా అనుకున్నది: "కరువు వచ్చినా, కాటకం వచ్చినా ఉన్నచోటే ఉండటం మేలు. తినటానికి ఉన్నా, లేకపోయినా బంధువుల ఆదరం ఉంటుంది. పరాయిచోట ఇతర కుక్కల ద్వేషం తప్ప ఇంకేమీ ఉండదు."

కుక్క తన స్వస్థలానికి తిరిగివచ్చింది.

"దేశాంతరం పోయావుగదా, అక్కడ ఎలా ఉన్నది?" అని సాటికుక్కలు అడిగాయి.

"అక్కడ ఎన్నిరకాల తిండి అయినా ఉన్నది. ఎంతో బాగున్నది కూడా. కాని ఆ విదేశీ కుక్కలలో స్నేహభావం లేదు. ఆత్మాభిమానంగల ఈ ఊరికుక్క అక్కడ ఉండటానికి వెళ్ళదు," అన్నది కుక్క.

కోతి ఈ కథ చెప్పి మొసలితో, "నువు నీ ఇంటికి తిరిగి వెళ్లి, నీ శత్రువుతో దీక్షగా పోట్లాడి చంపి, సుఖంగా ఉండు," అన్నది.

మొసలి దృఢ చిత్తంతో నీటిలోకి దూకి తన శత్రువుతో భయంకరంగా పోట్లాడి, దాన్ని చంపి శాంతి సౌఖ్యాలతో జీవితం సాగించింది.





## 70

"ఎవరుగాని ముందూ వెనకా ఆలోచించకుండా తొందరపడి ఏదో చేసి, తరవాత తాపీగా పశ్చాత్తాపపడరాదు 'మంగలీ-మునులూ' కథ నుంచి అందరూ గుణపాఠం నేర్చుకోవచ్చు," అన్నాడు విష్ణుశర్మ.

"ఆ కథ ఏమిటి?" అని రాజకుమారులు అడగగా, విష్ణుశర్మ ఇలా చెప్పాడు:

పాటలీపుత్రం అనే నగరంలో మణిభద్రుడు అనే గొప్ప వర్తకుడు ఉండేవాడు. అతను దానధర్మాల కిందా, మత కార్యకలాపాల కిందా, ఇంటిఖర్చు కిందా లక్షలకు లక్షలు ఖర్చుపెట్టేవాడు. కళింగపట్టణం, కాయల్, కొర్కై లాటి రేవులలో అతని వర్తకం భారీగా జరిగేది. అతని నౌకలు బంగాళా సముద్రం దాటి వెళ్ళేవి.

ఒకసారి అతని నౌకలన్నీ బంగాళా సముద్రంలో ఉండగా ఆ సముద్రంలో తీవ్రమైన ఉప్పెన వచ్చి, ఒక్క నౌక దక్కకుండా అన్నీ మునిగిపోయాయి. మణిభద్రుడు పూర్తిగా చితికిపోయాడు. కోటీశ్వరుడు కాస్తా బికారి అయాడు. అప్పటిదాకా అతని కటాక్షం కోసం పాకులాడిన ధనికులు అతని కేసి చూడటం మానేశారు, అతన్ని కులవిందులకు ఆహ్వానించటం మానేశారు. పైపెచ్చు అతనూ, అతని భార్యా అంతులేని అవమానాలకు గురి కావలసి వచ్చింది. ఉదారమైన అతని మనస్సు విచారంతో నిండిపోయింది. అతనూ, అతని భార్యా ఒకప్పుడు సమస్త సౌఖ్యాలలోనూ ఓలలాడినవారేమో, వారికి దారిద్ర్యం మరింత దుర్భరంగా తోచింది. అతను స్వయంగా



కష్టాలు సహించగలిగినా, తన భార్య దారిద్ర్య బాధలకు గురి అవుతూంటే సహించలేకపోయాడు. ఆమె అమిత ఖరీదైన చీనాంబరాలు ధరించేది, రోజూ అంతులేని దానాలు చేసేది. అన్ని ఋతువులలోనూ ఆమెకు తట్టలకొద్దీ పూలు లభ్యంగా ఉండేవి. ఇప్పుడు ఇవేవీ లభ్యమయే మార్గంలేక ఆమె నిర్బంధంలో పెట్టిన ఏనుగులాగా బాధ పడసాగింది. తన భర్తను ఉత్సాహపరచటానికిగాను ఆమె తన బాధలు ఇతరులకు తెలియకుండా కప్పిపుచ్చటానికి చేసే వ్యర్థప్రయత్నాలు మరింత జాలి పుట్టించేవిగా ఉండేవి.

ఒక రాత్రి తన భార్య ఏదో ఇంటిపనిలో నిమగ్నురాలై ఉండగా, మణిభద్రుడు కటికమంచం మీద పడుకుని ఇలా ఆలోచించాడు:

"దారిద్ర్యం హేయమైనది. సజ్జనత్వంగాని, సౌశీల్యంగాని, సహనంగాని, సాధుత్వంగాని, కులీనతగాని ధరిద్రుడిలో రాణించవు. మానమూ, దర్పమూ, విజ్ఞానమూ, అందమూ, వివేకమూ దారిద్ర్యంతో తుడిచిపెట్టుకుపోతాయి. ఏరోజుకారోజు ఎలా గడుస్తుందా అన్న ఆవేదనలో ఎంత తెలివిగలవాడి తెలివి అయినా సరే గడ్డకట్టుకుపోతుంది. ఒక ధనికుడి సామీప్యంలో వెయ్యమంది దరిద్రులుండవచ్చు, కాని ధనికుడు తెలిసినట్టుగా లోకానికి ఆ దరిద్రులు తెలియరు. ప్రపంచానికి ధనం తప్ప మరేదీ పట్టదు. దరిద్రుడు చేస్తే నేరమయేది ధనికుడు చేస్తే కాదు. నాకీ జన్మవల్ల ప్రయోజనమేమిటి? నేను రేపు దూరంగా అరణ్యంలోకి వెళ్లి, ఉరిపోసుకుని ఆత్మహత్య చేసుకుంటాను. నా శవాన్ని చూసి వేదన పడే అవసరం నా ప్రియ భార్యకు ఉండదు. నేను ధన సంపాదనకు ఏ దేశాంతరమో పోయాననుకుంటుంది. ఆ విధంగా ఆమెకు వైధవ్యం తాలూకు అగచాట్లు కూడా తప్పుతాయి. ఆమె తన

పుట్టింటికి వెళ్ళి, సుఖంగా జీవించవచ్చు; కాని నేను ఉండగా ఆమె ఆ పని చెయ్యదు. నేను లేకపోతే ఆమె వెళ్ళక తప్పదు.''

ఇలా అనుకుని మణిభద్రుడు నిద్ర పోయాడు. ఆ రాత్రి అతనికొక వింత కల వచ్చింది. కలలో ఒక దిగంబర జైనుడు కనిపించి, ''మణిభద్రా, ఆత్మహత్యా ప్రయత్నం మాను. గత జన్మలో చేసిన కర్మలు ఒక్కొక్కసారి ఫలించనట్టు కనిపించినా తప్పక ఫలిస్తాయి. క్రిందటి జన్మలో ఒక దిగంబర జైనముని పేదల కియ్యటానికి నిన్ను అర్థించగా నువు అతనికి లక్ష బంగారు మాడ లిచ్చావు. నేనే ఆ మునిని. నీ వద్ద తీసుకున్న ఆ బంగారం మూలంగా నేను కాపీనం పొంది, దాన్ని ఎవరికీ ఇయ్యక, పూర్వం లాగా దైవాన్నీ, ధర్మాన్నీ తలవక, బంగా రాన్నే చూసి మురిసిపోసాగాను. మనసు దేనిమీద లగ్నమైతే అది అయిపోతా రంటారు. అది అక్షరాలా నిజమై, నేను పైకి మునిలాగా కనిపిస్తున్నా, బంగారు మనిషి నయాను. నాకిప్పుడు బుద్ధి వచ్చింది. బంగారం మీద కొంచెం కూడా కాంక్ష లేదు. అయినా ఈ బంగారు మనిషి నన్ను వదలడు. వాడు చావాలి. నీ బంగారం నీకు తిరిగి చెందాలి. కనక



నేను రేపు ఉదయం ఇదే రూపంలో మీ ఇంటికి వస్తాను. నన్ను నువు సులభంగా గుర్తించగలవు. ఎందుకంటే నా చేతిలో భిక్షాపాత్ర ఉండదు. 'భిక్షాం దేహి!' అని అనను. నువు ఏ మాత్రమూ సంకోచించకుండా నా నెత్తిన కర్రతో కొట్టు. ఆ దెబ్బతో నేను రెండు మణుగులు బరువుగల బంగారు విగ్రహంగా మారిపో తాను. నువు నా కిచ్చిన బంగారం అంతే బరువు. ఆ బంగారంతో నువూ, నీ భార్యా వెనకటిలాగే సుఖంగా జీవించవచ్చు. కాకపోతే మధ్య వచ్చిన దారిద్ర్యంతో నువు మనుషులను గురించీ, లోకం గురించీ నిజం తెలుసుకుని, వివేకం పెంచు

కున్నావు. ఇక నేనేమో మామూలు జైనముని అయిపోయి, దేవలోకం చేరి, నిర్విఘ్నంగా తపస్సు చేసుకుంటాను," అని చెప్పి, అదృశ్యమైపోయాడు.

మణిభద్రుడు చప్పున నిద్రలేచి, ఈ వింత కల గురించి ఇలా అనుకున్నాడు:


''ఈ కల నిజమవుతుందో, లేదో తెలియదు. నేను నిద్రపోయే ముందు ధనం గురించే ఆలోచించాను గనక, బహుశా ఇది అర్థంలేని కలే అవుతుంది. జబ్బు పడినవాడూ, శోకతప్తుడూ, విచార గ్రస్తుడూ, ప్రేమికుడూ, తాగి మైకంలో ఉన్నవాడూ కనే కల ఎన్నడూ నిజం కాదంటారు. అయినా ఏం జరుగుతుందో చూతాం."

మణిభద్రుడు తెల్లవారకముందే లేచి, స్నానం చేసి, పూజ ముగించి, ఇంటి ముందు అరుగు మీద కూర్చున్నాడు. అతనికి సమీపంలోనే మంచి చేవగల కర్రతో చేసిన దుడ్డుకర్ర ఒకటి సిద్ధంగా ఉన్నది.

ఈ సమయంలో మంగలి ఒకడు వచ్చి, మణిభద్రుడి భార్య కాలి గోళ్ళు తీశాడు. ఆ పని పూర్తి అయే క్షణంలో ఒక జైనముని భిక్షాపాత్ర లేకుండా వచ్చి, భిక్ష అడగకుండా, మణిభద్రుడికేసి నవ్వుతూ చూస్తూ నిలబడ్డాడు.

మణిభద్రుడు అతన్ని చూసి, తనకు కలలో కనిపించినవాడేనని తెలుసుకుని, చప్పున దుడ్డుకర్ర తీసుకుని జైనుడి నెత్తిన బలంగా ఒక్కటి పెట్టాడు. జైనముని విరుచుకు పడిపోయి, బంగారు విగ్రహంగా మారిపోయాడు. ఇది చూసి మణిభద్రుడి భార్యా, మంగలీ కూడా నిర్ఘాంతపోయారు.

మణిభద్రుడు ఆనంద బాష్పాలు రాల్చుతూ, తన భార్య సహాయంతో ఆ బంగారు విగ్రహాన్ని లోపలికి చేర్చి, ఆ విగ్రహం నుంచి చిన్న వేలు నరికి మంగలికి ఇచ్చి, ''ఒరే, బాబూ! దీనితో వినోదం జరుపుకో. కాని ఈ సంగతి మాత్రం ఎవరికీ చెప్పకు,'' అన్నాడు.






## 71

మంగలి తాను చూసినది ఎవరికీ చెప్పనని మణిభద్రుడికి ప్రమాణం చేసి, వెళ్లిపోయాడు. వెళ్ళుతూ దారిలో వాడు ఇలా అనుకున్నాడు :

"దిగంబర జైనుడి నెత్తి మీద చేవ కర్రతో కొట్టితే బంగారు విగ్రహంగా మారుతాడన్నది కళ్ళారా చూశాను. ఈ సంగతి ముందే తెలియక ఎంత బుద్ధి తక్కువవాణ్ణి అయాను! నేను రోజూ ఆరు గంటలపాటు రకరకాల మనుషులకు క్షౌరం చేసి సంపాదించే ఆరేడు వెండి నాణాలు నా సంసారం గడపటానికి చాలవుగదా, ఇంతమంది దిగంబర జైనులు తిరుగుతున్నారు, నాకీ సంగతి మాట మాత్రం తెలిస్తే, మణిభద్రుడి లాగా పదినిమిషాలలో లక్ష బంగారు నాణాలు సంపాదించుకుని ఉందునే! డబ్బు చెయ్యటంలో వైశ్యుడికి మంగలి సాటి రాడంటే అందులో అబద్ధం ఏమున్నదీ? ఉన్నట్టుండి మనుషులు లక్షాధికారులు ఎట్లా అవుతారా అని ఆశ్చర్యపడి, అదంతా వారి తెలివితేటలూ, వ్యాపార దక్షతా కాబోలు ననుకునేవాణ్ణి! కావలసిందల్లా మంచి దుడ్డుకర్రా, దిగంబర జైనుడూ, బలమైన దెబ్బా! తమ కులం మటుకే బాగుపడాలని వైశ్యులు ఈ రహస్యం ఎవరికీ చెప్పరు. కాని నాకు తెలిసిపోయింది! రేపు ఊళ్లో ఉన్న దిగంబర జైనుల నందరినీ మా ఇంటికి ఆహ్వానించి, వాళ్ళ బుర్రలు బద్దలుకొట్టి, అంతులేని బంగారం సంపాదించుకుంటాను. అదంతా ఒకవేళ నేను దుబారాగా ఖర్చు చేస్తే – దేశంలో దిగంబర జైనులకు కొదవా?"



ఇలా అనుకుని మంగలి బోలెడన్ని దుడ్డుకర్రలు తెచ్చి, తన ఇంటి చావడిలో బోషాణంలో దాచి ఉంచి, ఆ రోజల్లా ముళ్ళమీద ఉన్నట్టుగా గడిపి, మర్నాడు తెల్లవారగానే, నగరంలో ఒక మూల ఉన్న జైనమందిరానికి వెళ్ళి, మహావీరుడి విగ్రహానికి ప్రదక్షిణం చేసి, మూడుసార్లు సాష్టాంగపడి, "జైనులకు జయం! బ్రహ్మచర్యానికి జయం! జినుడు మమ్మల్ని రక్షించాలి! జినుడి భార్య యశోధర రక్షించాలి!" అని గట్టిగా అరిచాడు.

తరవాత వాడు జైనభిక్షువుల పెద్దను సమీపించి, సాష్టాంగ నమస్కారంచేసి, "స్వామీ, తమరు తమ అనుచరులనందరినీ వెంటబెట్టుకుని మా ఇంటికి విందుకు ఇవాళ దయచెయ్యాలి!" అని ఆహ్వానించాడు.

దానికి పెద్ద భిక్షువు, "శ్రావకా! మమ్మల్ని విందుకు ఎందుకు ఆహ్వానిస్తున్నావు? తిండిపోతులైన బ్రాహ్మణుల మనుకున్నావా? మేం ఆహ్వానాలను పాటించం. ఆకలి అయినప్పుడు ఏ గృహస్థు ఇంటికో వెళ్ళి, వాళ్లు పెట్టినది ప్రాణం నిలుపుకునేటంత మాత్రమే తింటాం," అన్నాడు.

"మీ నియమం నాకు బోధపడింది. కాని నా అభ్యర్థన ఒకటి ఆలకించండి. మా ఇంట బోలెడన్ని వస్త్రాలు పడి ఉన్నాయి. డబ్బు మూలుగుతున్నది. అవి గ్రంథాలు తయారుచెయ్యటానికీ, దానధర్మాలు చెయ్యటానికీ మీకు ఉపయోగపడవచ్చు. మీ ఇష్టం! మీరు వద్దంటే ఇతర భిక్షువుల వద్దకు పోతాను," అన్నాడు మంగలి.

ఇది విని మంధిరంలో ఉన్న ఆరుగురు భిక్షువులూ ఏకకంఠంగా, "మేం వస్తాం. నువు ఇచ్చేవి వ్యక్తి బహుమానాలు కావు గనక తీసుకోవటానికి మాకు అభ్యంతరం లేదు. నువు మరెవరివద్దకూ వెళ్ళనవసరంలేదు," అన్నారు.

చిత్రమేమంటే, బ్రహ్మచారీ, ఒంటరిగాడూ, ఇల్లు విడిచినవాడూ, సర్వం త్యజించి భిక్షాపాత్ర ధరించినవాడూ, దిగంబరత్వం అవలంబించినవాడూ అయినప్పటికీ తృష్ణ నుంచి తప్పించుకోలేడు. ఇంతకన్న చిత్రంగా వాడు తన దురాశను తెలివిగా సమర్థించుకుంటాడు. ముసలివాడై, జుట్టు నెరిసి, పళ్ళూడి, కళ్ళు మసకలు కమ్మి, చెవులు సరిగా వినని స్థితిలో ఒక్క దురాశ మాత్రమే పెరుగుతూంటుంది.

మంగలి జైన భిక్షువులను తన ఇంటి చావడిలోకి తీసుకుపోయి, తలుపులన్నీ బిగించి, బోషాణం తెరిచి, బట్టలూ, డబ్బూ బదులు మంచి దుడ్డుకర్ర పైకి తీసి, భిక్షువుల తలల మీద బలంకొద్దీ కొట్టసాగాడు. ఒక్కడు కూడా మణిభద్రుడి భిక్షువులాగా నవ్వుతూ దెబ్బలు తినక, ఒక్క దెబ్బకు చచ్చిపడి పోక పోయేసరికి మంగలికి ఆశ్చర్యమూ, కోపమూ వచ్చింది.

పై పెచ్చు ఆ జైనసన్యాసులు అరుస్తూ, దెబ్బలు తప్పించుకోవటానికి ప్రయత్నిస్తూ ఎలుకల్లాగా చావడి అంతా తిరగసాగారు. తలుపులన్నీ బిగించి ఉండటం చేత వాళ్ళకు తప్పించుకు పారిపోయే మార్గం కనబడలేదు.



చివరకు ఇద్దరు భిక్షువులు మంగలి దెబ్బలకు పడిపోయారు. వారు చచ్చారని తెలిసి, బంగారం అవుతారేమోనని మంగలి ఆశపడ్డాడు. కాని వాళ్లు రక్తం ఓడే శవాలుగానే ఉండిపోయారు.

మిగిలిన నలుగురు భిక్షువులూ మంగలి కాళ్ళమీద పడి, "మమ్మల్ని కాపాడు! మేం నీకు ఏం చేశాం? దోచుకునేటందుకు మా వద్ద ఏమీలేదే! ఇప్పటికే ఇద్దరి ప్రాణాలు తీశావు. మిగిలిన వాళ్ళనైనా ప్రాణాలతో వదులు," అని ఆక్రోశించారు.

మంగలి ఆవేశంతో అరుస్తూ, "మీలో ఒక్కడూ బంగారం కావటంలేదు.

మీ వెధవ వేషాలుమాని. మర్యాదగా చచ్చి బంగారు విగ్రహాలుకండి,'' అంటూ వారిని మరింత ఆవేశంతో ఎడాపెడా బాధసాగాడు.

భిక్షువులు పెట్టే భయంకరమైన కేకలు విని, అటుగా వెళ్ళే రక్షకభటులు, తలుపులు బద్దలు కొట్టి, చావడిలో ప్రవేశించి, నలుగురు భిక్షువులనూ కాపాడారు. రెండు శవాలూ, నలుగురు భిక్షువులూ, మంగలీ, న్యాయాధిపతి ముందు ఉంచబడ్డారు.

న్యాయాధిపతి అంతా విని, ''ఇంత ఘోరం ఎందుకు చేశావు?'' అని మంగలిని అడిగాడు.

''నిన్న మణిభద్రుడు చేసినపనే గదా నేను చేశాను? నాది తప్పు ఎలా అయింది?'' అన్నాడు మంగలి.


''ఏమిటి నువ్వనేది?'' అని న్యాయాధిపతి అడిగాడు.

''మణిభద్రుడు నిన్న ఒక దిగంబర జైనుణ్ణి నెత్తిమీద దుడ్డుకర్రతో కొట్టగా వాడు బంగారు విగ్రహంగా మారటం నేను చూశాను,'' అంటూ మంగలి అంతా చెప్పాడు.

న్యాయాధిపతి భటులను పంపి, మణిభద్రుణ్ణి పిలిపించి, ''నిన్న నువు ఒక దిగంబర జైనుణ్ణి చంపావా?'' అని అడిగాడు.

మణిభద్రుడు తన కథ అంతా చెప్పాడు. అదివిన్నమీదట న్యాయాధిపతి, ''ఈ మూఢుణ్ణి తీసుకుపోయి ఈటెలతో పొడిచి చంపండి,'' అని ఉత్తరు విచ్చి, మంగలిని భటులు పట్టుకుపోయినాక, ''అనాలోచితంగా, విషయం సరిగా అర్థం చేసుకోకుండా పనులు చేసినవాడి గతి ఇంతే. సరిగా ఆలోచించకుండా వెనకటికి ఒక బ్రాహ్మణుడు విశ్వాసంగల ముంగిసను చేజేతులా చంపుకున్నాడు కాదా?'' అన్నాడు.

''ఏమిటా కథ?'' అని మణిభద్రుడు అడిగిన మీదట, న్యాయాధిపతి ఇలా చెప్పాడు:





# అసమీక్షకారిత్వం

## 72

విశ్వాసంగల ముంగిస

దేవశర్మ అనే పేద బ్రాహ్మడికి లేకలేక, చాలా కాలానికి ఒక మగబిడ్డ కలిగాడు. ఆ బిడ్డను చూసుకుని తల్లిదండ్రులు పరమానంద భరితులయ్యారు. చందనం పూసుకున్న కన్న కూడా పుత్రస్పర్శ చల్లగా ఉంటుందిగద. కొడుకుకోసం సోదరులనూ, తండ్రినీ, సంరక్షకుణ్ణీ కూడా తృణీకరిస్తారు.

పిల్లలు లేని కాలంలో ఆ ఇంట ఒక ముంగిస పెరిగింది. అది స్వేచ్ఛగా ఇల్లంతా తిరిగేది. అదివరకు దాన్ని తమ బిడ్డలాగా చూసుకున్న బ్రాహ్మణ దంపతులు, ఇప్పుడు అది తమ శిశువుకు ఏం కీడు చేసి పోతుందోనని భయపడసాగారు. తమ బిడ్డను గురించి వారికి గల మితి మీరిన ఆందోళనే ఈ భయానికి కారణం.

ప్రసవించిన పదో రోజున బ్రాహ్మడి భార్య పురిటిస్నానం చెయ్యటానికని నదికి వెళ్ళింది. పోబోతూ ఆమె తన భర్తతో, "నేను స్నానానికి వెళుతున్నాను. బిడ్డను కాస్త జాగ్రత్తగా చూస్తూ ఉండండి," అని హెచ్చరించింది.

ఆమె వెళ్ళిన కొద్దిసేపటికి రాణిగారి పరిచారిక వచ్చి బ్రాహ్మడితో, "రాణిగారు స్వయంపాకమూ, దక్షిణా ఇస్తారట. వచ్చి తీసుకో." అని చెప్పింది.

రాణిగారిచ్చే దాని మీది ఆశకొద్దీ బ్రాహ్మడు తన బిడ్డనూ, ఇంటినీ ముంగిస రక్షణలో ఉంచి, వెంటనే బయలుదేరి వెళ్ళాడు.

అతను వెళ్ళిన కొంతసేపటికి, గోడలోని కలుగులోనుంచి ఒక పాము పరిగెత్తుకుంటూ బిడ్డ కేసి వచ్చింది. సహజ



వైరంకొద్దీ ముంగిస దానితో కలియబడి హోరాహోరి పోరాడి, చంపి ముక్కలు ముక్కలు చేసింది.

ఇంతలో దానికి బ్రాహ్మడు తిరిగివస్తూ కనిపించాడు. తాను సాధించిన విజయానికి పొంగిపోతూ, రక్తసిక్తమైన నోటితో, ముంగిస బ్రాహ్మడికి ఎదురు వెళ్ళింది. బ్రాహ్మడు దాని నోట రక్తం చూసి, అది తన బిడ్డను చంపిందనుకుని, మరో ఆలోచన చెయ్యకుండా, తన చేతికర్రతో ముంగిసను బలంగా కొట్టి చంపాడు.

కాని అతను ఇంట్లోకి పోగానే నిద్రపోతున్న శిశువూ, ముక్కలుగా తెగిఉన్న పామూ కనిపించాయి.

"అయ్యో, ఎంత పాడు పని చేశాను! పాపిష్ఠివాణ్ణి, నా బిడ్డను రక్షించిన ముంగిసను చేతులారా చంపుకున్నాను." అని బ్రాహ్మడు దుఃఖాన్ని ఆపుకోలేక నేల మీద పొర్లిగింతలూ పెట్టుతూ, తలా రొమ్మూ బాదుకోసాగాడు.

అప్పుడతని భార్య తిరిగి వచ్చి, "ఏమిటది? ఎందుకు శోకాలు పెడుతున్నావు?" అని అడిగింది.

బ్రాహ్మడు ఆమెకు జరిగినదంతా చెప్పాడు. అంతా విని ఆమె, "దురాశకొద్దీ, బిడ్డను చూస్తూండమని నేను చెప్పిన మాట పాటించావు కావు. అందుకు ఫలితమేమంటే, మన బిడ్డను కాపాడిన అమాయిక ప్రాణి నిష్కారణంగా చచ్చింది. ఆశ ఉండవచ్చుగాని, దురాశ దుఃఖం చేటని మన పెద్దలు ఊరికే చెప్పారా? దురాశగలవాడి నెత్తిన చక్రం ఎక్కి తిరగలేదా?" అన్నది.

"ఏమిటా కథ?" అని బ్రాహ్మడు అడిగితే అతని భార్య ఇలా చెప్పింది:

### ఆశాపాతకుడు

అల్పలోభీ, మితలోభీ, అతిలోభీ, అత్యంతలోభీ అని నలుగురు బ్రాహ్మణ యువకులు, గాఢ స్నేహితులు ఉండేవాళ్ళు. అందరూ దారిద్ర్యబాధ అనుభవిస్తున్నవాళ్ళే. ఒకనాడు వాళ్లు నలుగురూ

కలిసి ఉన్న సమయంలో అత్యంత లోభి మిగిలినవాళ్ళతో ఇలా అన్నాడు:

"మిత్రులారా, దారిద్ర్యాన్ని మించిన అవమానం లేదు. బంధువుల మధ్య దరిద్రుడుగా జీవించేకన్న క్రూరమృగాలు తిరిగే అరణ్యాలలో, ముళ్ళ కంపల మధ్య నివసిస్తూ, గడ్డిలో పడుకోవటం మేలు. తనను ఎంతో విశ్వాసంతో సేవించుకునే పేదవాణ్ణి యజమాని కూడా తిరస్కారంతో చూస్తాడు; ఇతరత్రా ఎంతో సజ్జనులైన బంధువులు సైతం పేదవాడిపట్ల నిర్దయగా ప్రవర్తిస్తారు. వారిలో ఉండే సద్గుణాలు రాణించవు. వారిని సొంత కొడుకులే విసర్జించుతారు, భార్యలు లక్ష్య పెట్టరు, స్నేహితులు కన్నెత్తి చూడరు. ఈ ప్రపంచంలో ధైర్యమూ, అందమూ, వాక్చాతుర్యమూ, చమత్కారమూ, విజ్ఞానమూ, యుద్ధవిద్యాకౌశలమూ లాటివి ఎన్ని ఉన్నా, కొంత అయినా సంపద లేనిదే మనిషికి కీర్తి ప్రతిష్ఠలు రావు. డబ్బు ఉండాలేగాని, ఇలాటి గుణాలతో లోకాన్ని జయించవచ్చు. అది లేకపోతే అంతా వృథా. అందుచేత మనం దేశ సంచారం చేసి ధనార్జన చేతాం."

ఇందుకు మిగిలినవాళ్ళు సరేనన్నారు. త్వరలోనే నలుగురూ స్వస్థలం విడిచి పెట్టి, ధనంకోసం బయలుదేరారు. పూట



గడవనివాడు బంధుమిత్రులనూ, తల్లినీ, జన్మభూమినీ విసర్జించి దేశాంతరాలకు పోక ఏం చేస్తాడు?

వాళ్లు కొద్ది రోజులకు అవంతీదేశాన్ని చేరుకున్నారు, సిప్రీనదిలో స్నానంచేసి, నది ఒడ్డున గల ఆలయంలో మహాకాలుణ్ణి (శివుణ్ణి) సేవించారు. వారు ఆలయం నుంచి బయటికి వచ్చేటప్పుడు, భైరవానందు డనే సుప్రసిద్ధ తాంత్రికసన్యాసి కలిశాడు. వాళ్ళు ఆయనకు ప్రణామం చేసి, ఆయన వెంట, సమీపంలోనే ఉన్న ఆయన మఠానికి వెళ్లారు.

"మీరెవరు? ఎక్కడినుంచి వస్తున్నారు? ఎక్కడికి పోదలుచుకున్నారు?

మీ ఆశయం ఏమిటి?'' అని ఆయన వారిని అడిగాడు.

''మేం ధనాన్ని వెతుకుతూ తిరుగుతున్నాం. ఈ అన్వేషణలో చావనైనా చస్తాంగాని, అన్వేషణ మానం. మంత్ర శక్తితో నిక్షిప్తమై ఉన్న నిధులను తెలుసుకుని, ధనికులు కావచ్చునట. అలాటి మంత్రవేత్తను పట్టుకోవాలని మా ఆశయం. సాహసం కలిగి, ఎందుకైనా సిద్ధపడిన వాడికి అసాధ్యమనిపించేవి కూడా సాధ్యమవుతాయి. ఒకడు ఆకాశంనుంచి అధః పతనం చెందుతాడు; మరొకడు నరకంలో నుంచి పైకివచ్చి, నాలుగు సముద్రాలనూ ఏలుతాడు. పతనానికీ, ఉన్నతికీ కారణం విధి కానేకాదు, కృషి లోపమూ, కృషి బలమూ నూ. మానవ ప్రయత్నం యాదృచ్ఛికంగా ఫలించటమే అదృష్టం. సాహసులు అధికారాన్ని లక్ష్యపెట్టరు, తమ ప్రాణాలను అంతకన్న లక్ష్యపెట్టరు. వారి దుస్సాహసం మహా ఉదాత్తమైనది. ఈ ప్రపంచంలో అమితంగా శ్రమించకుండా ఏ సుఖమూ లభ్యంకాదు. నారాయణుడు లక్ష్మిని పొందటానికి చేతులు బొబ్బలెక్కేలాగా సముద్రాన్ని మథించాడు. శ్రమించనివాడి సంపద తరిగిపోనారంభిస్తుంది. శౌర్యంలేని రాజు ఇతరుల రాజ్యాన్ని గెలవలేడు సరికదా, తన రాజ్యాన్నే నిలుపుకోలేడు. నిధి నేల మాళిగలలో, నాగుపాముల రక్షణలో ఉండనీ; పిశాచాలను సంతృప్తిపరచటం వల్లగాని, ప్రేతభూములలో శవాల మాంసాన్ని భూతాలకు అమ్మటం ద్వారా కాని లభ్యంకానీ; నిధి ఉన్న చోటు ఆరిపోయే మంత్రపు వత్తుల ద్వారా సూచించబడనీ! మేం అన్నిటికీ సిద్ధమే. నిన్ను చూడగా అతీత శక్తులు గలవాడుగా కనబడుతున్నావు. నువు మాకు సహాయం చెయ్యగలవు. తప్పక చేసి తీరాలి. అద్భుతకార్యాలూ, గొప్ప పనులూ గొప్ప వాడి వల్లనే కావాలి. బడబాగ్నిని సముద్రుడే భరించగలడు,'' అన్నారు నలుగురు మిత్రులు.






# 73

మిత్రులు నలుగురూ చెప్పిన దానికి సంతోషించి భైరవానందుడు వారు నలుగురికీ నాలుగు మంత్రపు వత్తులు తయారు చేసి ఇస్తూ, ''హిమాలయాలకు వెళ్లండి. ఆ ప్రాంతంలో ఎక్కడ వత్తి పూర్తిగా కాలిపోయి, పడిపోతుందో అక్కడ తప్పక నిధి ఉంటుంది. దాన్ని తవ్వి తీసుకోండి. ప్రకృతినియమాలు ఉల్లంఘించ వద్దు. మీ దారిద్ర్యం తీరేపాటి ధనం దొరకగానే ఇళ్ళకు తిరిగి పొండి,'' అన్నాడు.

ఆ నలుగురు ఆయనకు ధన్యవాదాలు చెప్పి, హిమాలయ ప్రాంతానికి బయలు దేరి వెళ్ళారు. వాళ్లు హిమాలయపు తొలి మెట్లు దాటుతూండగా అల్పలోభి చేతిలోని వత్తి మండి, రాలిపోయింది. వాడు అక్కడ తవ్వేసరికి రాగినాణాల నిక్షేపం దొరికింది.

వాడు సంతోషించి, ''మనం మోయగలిగినన్ని నాణాలు తీసుకుని ఇంటికి పోదాం,'' అన్నాడు.

''ఓరి పిచ్చివాడా! ఈ పనికిమాలిన రాగి మన దారిద్ర్యాన్ని ఏంతీర్చుతుంది? ముందుకు పోదాం పద,'' అన్నారు మిగిలిన ముగ్గురూ.

''మీరు వెళ్ళండి. నేను రాను. నాకు ఈ రాగి డబ్బు చాలు,'' అంటూ అల్పలోభి మూడు వేల రాగి డబ్బులు మూట గట్టుకుని, ఇంటికి తిరిగిపోయాడు.

మర్నాడు మితలోభి వత్తి మండి, నేల మీద పడిపోయింది. వాడు అక్కడ తవ్వేసరికి వెండి నాణాల నిక్షేపం కనిపించింది.

వాడు పరమానందంతో, ''మనం మొయ్యగలిగినంత డబ్బు తీసుకుని ఇంటికి పోదాం పదండి,'' అన్నాడు.



దానికి మిగిలిన ఇద్దరూ, "మొదట రాగి డబ్బు దొరికింది. ఇప్పుడు వెండి దొరికింది. ఈసారి బంగారం దొరుకుతుంది కనక ముందుకు పోదాం," అన్నారు.

"నాకీ వెండి చాలు. ఇక నేను ముందుకు రాను," అని మితలోభి అయిదు వేల వెండి నాణాలు తీసుకుని, ఇంటికి తిరిగి వెళ్లిపోయాడు.

మిగిలిన ఇద్దరూ ముందుకు సాగారు. మర్నాడు అతి లోభి వద్ద ఉన్న వత్తి మండి, కింద రాలిపోయింది. అక్కడ తవ్వగా బంగారు కాసుల నిధి కనబడింది.

"మనం వీటిని మోయగలిగిన మట్టుకు తీసుకుని, ఇంటికి తిరిగి పోదాం," అన్నాడు అతిలోభి పరమ సంతోషంతో.

దానికి అత్యంత లోభి, "ఓరి మూఢుడా! మొదట రాగి, తరవాత వెండి, ఇప్పుడు బంగారం! ఈసారి దొరికే నిధిలో వజ్ర వైడూర్యాది నవరత్నాలూ ఉంటాయి. వాటిలో ఒక్కటి చాలు, జీవితాంతం దారిద్ర్యం లేకుండా బతకటానికి! అలాటప్పుడు మొయ్యగలిగినన్ని రత్నాలు తీసుకున్నామో, రాజ్యాలకు రాజ్యాలే కొనెయ్యవచ్చు. నువు మొయ్యగల బంగారమంతా కలిపి ఒక్క వజ్రం విలువ చెయ్యదు. ఈ ముష్టి బంగారం మోసుకుపోకపోతేనేం?" అన్నాడు.

దానికి అతిలోభి, "మిత్రమా, నాకు బంగారం చాలు. మనం బయలుదేరింది దారిద్ర్యం నుంచి విముక్తి పొందటానికే గాని, రాజ్యాలు కొనెయ్యటానికి కాదు. మనం జన్మలో ఎన్నడూ తాకి కూడా ఎరగమే. అలాటి దాన్ని ముష్టి బంగారం అంటున్నావా? నా ప్రాణానికి ఇది ఎంతో విలువైనది. దీనితో నేను యావజ్జీవం ధనవంతుడుగా ఉండి, దారిద్ర్యాన్ని జయించగలను. అంతకుమించి నేనేమీ కోరను. అత్యాశ పనికి రాదు," అన్నాడు.

దానికి అత్యంత లోభి, "ఇంకా నయం. ఆశకొద్దీ అర్జన! ఈ మాట నేను

రుజువు చేస్తాను. ఈ చెత్త ఇక్కడే వదిలేసి, నా వెంటరా,'' అన్నాడు.

''నేనిక ముందుకు రానులే. నీ కోసం ఇక్కడే వేచి ఉంటాను. ఇద్దరమూ కలిసి తిరిగిపోదాం,'' అన్నాడు అతిలోభి.

అత్యంత లోభి ఒంటరిగా ముందుకు సాగాడు. కొండలు పోయినకొద్దీ చాలా మొరటుగానూ, దుస్సహంగానూ ఉన్నాయి. మూడు రోజులు గడిచినా అతని వత్తి మండి, రాలే లక్షణాలు కనబడలేదు. వాడు ఒక లోయ ప్రవేశించాడు. అది నిర్జనంగానూ, నిర్జలంగానూ కనబడింది. ఎండ మండిపోతున్నది. ఎక్కడన్నా చుక్క నీరుగాని, ఒక్క చిన్న ప్రాణిగాని కనబడుతుందేమోనని చూశాడు వాడు. కాని చిన్న పురుగైనా కనబడలేదు. సవ్యమైన మార్గం అంతరించి, మెలికలు తిరిగిన కాలి బాటలూ, వాటినిండా ముళ్ల మొక్కలూ ఉన్నాయి. అయినా ఆశ ప్రేరేపించగా వాడు ముందుకే వెళ్ళాడుగాని, అతిలోభి వద్దకు తిరిగిపోయే ఆలోచన చెయ్యలేదు. బంగారంతో తృప్తి పడదాం లెమ్మన్న ఆలోచన వాడికి కలగలేదు.



పోగా, పోగా ఒక పల్లపు ప్రాంతం వచ్చింది. దాని చుట్టూ కొండలు కమ్ముకుని ఉన్నాయి. అక్కడ ఒక మనిషి ఉన్నాడు. వాడి తల మీద ఒక చక్రం తిరుగుతూ, వాడి రక్తాన్ని మథిస్తున్నది. వాడి ముఖమంతా రక్తం ఓడుతూ, వాడి శరీరం మీదికి కారుతున్నది.

అత్యంత లోభి ఆ మనిషిని సమీపించి, ''అయ్యా, నువ్వెవరు? ఇక్కడ నిలబడి, నీ నెత్తి మీద ఎందుకు చక్రాన్ని తిప్పుతున్నావు? రత్నరాసుల నిధులు కనిపెట్టటానికి ఇదొక యజ్ఞం కాదుగదా? ఇక్కడెక్కడైనా నీరున్నదా?'' అని అడిగాడు.

వాడిలా అన్న మరుక్షణం చక్రం అవతలి మనిషి తలమీది నుంచి ఎగిరి వచ్చి, అత్యంత లోభి తల మీద నిలిచి,

తిరగసాగింది. వాడు కంగారు పడుతూ, "మిత్రమా, ఇదేమిటి? ఎంత బాధగా ఉన్నది!" అన్నాడు.

దానికి రెండోవాడు, "ఆ చక్రం నీ నెత్తి మీదికి దూకినట్టే నా నెత్తి మీదికీ దూకి, ఇంత కాలమూ దుర్భరమైన బాధ కలిగించింది," అన్నాడు.

"అయితే ఇది ఎప్పుడు వదులుతుంది? నెత్తి మీద ఆగకుండా తిరుగుతూ, రక్తం చిలుకుతూ, అమితంగా బాధిస్తున్నది," అన్నాడు అత్యంత లోభి.

"నీలాగే ఎవడన్నా ఒక మంత్రపు వత్తి సంపాదించివచ్చి, నీతో మాట్లాడినప్పుడు ఈ చక్రం నీ నెత్తి నుంచి వాడి నెత్తికి మారుతుంది," అన్నాడు ఆ మనిషి.

"నువు ఈ చక్రాన్ని నెత్తి మీద పెట్టుకుని ఎంత కాలంగా ఇక్కడ నిలబడి ఉన్నావు?" అని అత్యంత లోభి అడిగాడు.

"ఇప్పుడు రాజెవరు?" అని ఆ మనిషి ఎదురు అడిగాడు.

"నీకు తెలియదా? వీణా వత్సరాజు, ఉదయనుడు," అని అత్యంత లోభి జవాబు చెప్పాడు.

"నేను ఎంత కాలం ఇక్కడ నిలబడి ఉన్నానో చెప్పలేను. కాని రాముడు రాజుగా ఉండగా, నేను దారిద్ర్యబాధకు తట్టుకోలేక, నీలాగే ఒక మంత్రపు వత్తి చేత పట్టుకుని వచ్చాను. దురాశతో, నేను సుఖంగా జీవితాంతం సరిపడే దానితో తృప్తి పడక, నా మిత్రులను దాటి ముందుకు వచ్చి, ఇక్కడ ఒక మనిషిని చూశాను. వాడి నెత్తిని ఈ చక్రం మథిస్తున్నది. నేను వాణ్ణి, ఎందుకు ఉన్నావనీ, ఎక్కడన్నా నిధి ఉన్నదా అనీ అడిగాను. మరుక్షణం ఆ చక్రం నా నెత్తికి మారింది. ఎన్నో యుగాల పాటు ఇక్కడ బాధ పడుతూ నిలిచి ఉన్నాను. ఏమంటే ఇటుగా ఎవరూ రారు. దేవుడి దయవల్ల, మంత్రపు వత్తి పట్టుకుని నువు వచ్చావు, నన్ను విముక్తుణ్ణి చేశావు," అన్నాడు ఆ మనిషి,






## 74

"మిత్రమా, ఇలా నిలబడి ఉంటే తిండీ, దాహమూ బాధించవా? కొద్ది రోజులలో ప్రాణాలు పోవా?" అని అత్యంత లోభి అడిగాడు.

"అలా జరగదు. దురాశాపరులు నిధులు కొల్లగొట్టుకుపోకుండా హడల గొట్టటానికి కుబేరుడు ఈ ఏర్పాటు చేశాడు. చక్రం నెత్తి మీద తిరుగుతున్నంతసేపూ ఆకలి దప్పులూ, జరా మరణాలూ ఉండవు, కాని దుర్భరమైన బాధ మాత్రం ఉంటుంది. మరి నేను సెలవు పుచ్చుకుంటాను," అన్నాడు ఆ మనిషి.

"ఇంత కాలం గడిచాక నీకు ఇల్లు ఎక్కడ? నీ వాళ్ళంతా ఎప్పుడో పోయి ఉంటారు. ఎక్కడికి పోతావు?" అని అత్యంత లోభి అడిగాడు.

"నేనామాట ఆలోచించలేదు సుమా! అయితేనేం? ప్రపంచం విశాలమైనది. జీవితం మధురమైనది. యుగాలు మారి, అయినవాళ్ళు అందరూ పోయినా కొత్త జీవితం ప్రారంభించవచ్చు," అంటూ ఆ మనిషి వెళ్ళిపోయాడు.

ఈ లోపల అతిలోభి బంగారునిధి వద్ద అత్యంతలోభి కోసం చాలా కాలం చూసి, అతను ఎంతకూ రాకపోయేసరికి, నిధి నుంచి అయిదువేల నాణాలు తీసుకుని, అత్యంతలోభి కోసం వెతుక్కుంటూ బయలుదేరి వెళ్ళి చిట్ట చివరకు అతన్నీ, అతని నెత్తిని మధిస్తున్న చక్రాన్నీ చూశాడు.

అత్యంతలోభి శరీరంమీదా, ముఖం మీదా ఎడతెరిపి లేకుండా భయంకరంగా రక్తం పారుతున్నది.



తన మిత్రుణ్ణి అలాటి స్థితిలో చూసే సరికి అతిలోభికి కళ్ళ వెంట నీరు వచ్చింది. అతను అత్యంతలోభిని సమీపించి "మిత్రమా, ఏమిటిది?" అని అడిగాడు.

"విధిలిఖితం," అన్నాడు అత్యంతలోభి.

"ఎలా జరిగింది?" అని అతిలోభి అడిగాడు. అత్యంతలోభి తన కథ అంతా చెప్పాడు.

అంతా విని అతిలోభి, "మిత్రమా, దురాశతో ఈ దశకు వచ్చావు. వెనకటికి మందరకుడు అనే సాలెవాడు మంగలి చెప్పిన మంచి మాట విననట్టుగానే, నువు కూడా నా హితవు విన్నావు కావు." అన్నాడు.

"ఏమిటా కథ?" అని అత్యంతలోభి అడిగితే, అతిలోభి ఇలా చెప్పసాగాడు:

### మంథరకుడి కథ

ఒకానొక గ్రామంలో మంథరకుడు అనే సాలెవాడు ఉండేవాడు. ఒకనాడు అతని మగ్గం శీలలు విరిగిపోతే, మగ్గాన్ని మరమ్మతు చేసుకునేటందుకు కర్ర కోసం గొడ్డలి తీసుకుని బయలుదేరాడు. వాడికి సముద్రతీరాన పెద్ద చెట్టు కనబడింది. ఆ చెట్టును నరికి ఎన్ని శీలలైనా చేసుకోవచ్చు గదా అని వాడు అనుకున్నాడు.

అయితే ఆ చెట్టులో నివసిస్తున్న దేవత వాడితో, "బాబూ, ఈ చెట్టు జోలికి రాకు. ఇది నా నివాసం. సముద్రపు గాలి పీల్చుతూ, ఇందులో ప్రశాంతంగా ఉంటున్నాను," అన్నది.

"నన్ను మాత్రం ఏం చెయ్యమన్నావు? నా మగ్గం బాగు చేసుకోకపోతే నాకు తిండి ఉండదు," అన్నాడు సాలెవాడు.

"అయితే ఒకటి చేద్దాం! నువు ఈ చెట్టు జోలికి రాకుండా ఉంటే నేను నువు కోరినది ఇస్తాను," అన్నది వృక్ష దేవత.

"అలాగే కానీ. నేను ఇంటికివెళ్లి, నిన్ను ఏం కోరాలో నా భార్యనూ, మిత్రుణ్ణీ

అడిగి వస్తాను,'' అని సాలెవాడు నగరానికి తిరిగి వచ్చి, తన మిత్రుడైన మంగలిని కలుసుకుని, వాడి సలహా అడిగాడు. ''ఏలటానికి ఒక రాజ్యం కోరుకో. నేను నీకు మంత్రిగా ఉంటాను. ఇద్దరమూ సుఖంగా ఉందాం,'' అన్నాడు మంగలి.

''నా భార్య ఏమంటుందో అడిగి చూస్తాను,'' అన్నాడు సాలె.

''వద్దు! ఆడదానికి నీ చిత్తం వచ్చినంత తిండి పెట్టు, నగలు ఇయ్యి, బట్టలు ఇయ్యి—ఆలోచన మాత్రం అడగకు,'' అన్నాడు మంగలి.

''కాదులే! దాన్ని కూడా అడగాలి,'' అని సాలె, తన భార్యను కలుసుకుని, ఆమె సలహా అడిగాడు. అంతేగాక తనకు మంగలి ఏలటానికి రాజ్యం కోరుకోమని సలహా ఇచ్చాడని కూడా చెప్పాడు.

''మంగలి మాట ఎన్నడూ వినకు. క్షౌరం చెయ్యటం తప్పిస్తే వాళ్ళకేం తెలుసు? రాజులంటే ఏమిటో, రాజ్యాలంటే ఏమిటో, వాళ్ళకు తెలుసునా ఏం? రాజ్యం చెయ్యటమంటే మాటలా? యుద్ధమూ, సంధీ, రాయబారాలూ, ఇంకా ఏమేమిటో వచ్చిపడి, నానా బాధలూ కలుగుతాయి. రాజ్యం కోసం రాజు ప్రాణాలకు వాడి తమ్ములే, వాడి కొడుకులే ఎసరు పెడతారు!'' అన్నది సాలెవాడి భార్య.



''నీ మాట నిజం. ఇంతకూ ఏం అడగమంటావు?'' అని సాలె తన భార్యను అడిగాడు.

''నీకున్న రెండు చేతులూ, ఒక తలా ఉపయోగించి రోజుకు ఒక బట్ట నేస్తున్నావు. దానితో మనకు జరుగుబాటు అవుతున్నది. నీకు మరి రెండు చేతులూ, మరొక తలా కావాలని దేవతను అడుగు. వాటితో రెండు బట్టలు నేస్తావు. ఒకటి ఖర్చు గడవటానికి, రెండోది వినోదించటానికి ఉపయోగపడతాయి,'' అన్నది సాలెవాడి భార్య.

"భేష్!" అని సాలెవాడు చెట్టువద్దకు వెళ్ళి, తన భార్య దేవతను కోరమన్నట్లే అదనంగా రెండు చేతులూ, తలా కోరాడు.

దేవత అలాగే అని వాడికోరిక తీర్చింది.

అయితే వాడు రెండు తలలతోనూ, నాలుగు చేతులతోనూ ఇంటికి తిరిగి వస్తూండగా, జనం వాణ్ణి చూసి భూతం అనుకుని కర్రలతోనూ, రాళ్ళతోనూ కొట్టి చంపేశారు.

అతిలోభి అత్యంత లోభికి ఈ కథ చెప్పి, ఇంకా ఇలా అన్నాడు:

"బంగారం నీకు చాలలేదు. వజ్రాలూ, వైడూర్యాలూ కోరావు. ఏమయింది? చక్రం నీ నెత్తిన తిరుగుతూ, కెంపుల కన్న ఎర్రనైన రక్తబిందువులను చుట్టూ చిమ్ముతున్నది. నువు కోరిన వజ్రాలకన్న మెరిసిపోయే కన్నీటి చుక్కలను నీ కళ్ళు రాల్చుతున్నాయి. మిత్రమా, బంగారం కన్న రత్నాలు విలువైనవని తెలిసినంత మాత్రాన అది జ్ఞానం కాదు, రాబోయే చిక్కులనూ, కలుగబోయే ఫలితాలనూ ముందే గ్రహించే తెలివి కూడా ఉండాలి. అలా కానప్పుడు, ఎంతటి మేధావి అయిన కులీనుడు సైతం ప్రమాదానికి గురి అవుతాడు. లోకజ్ఞానం అన్నిటికన్నా ముఖ్యం. అది లేకపోతే, సింహాన్ని బతికించిన పండితులలాగా నశిస్తాడు.''

''ఏమిటా కథ?'' అని అత్యంతలోభి అడిగితే, అతిలోభి పండితులకథ ఇలా చెప్పాడు:






# 75

### తిరిగి బతికిన సింహం

నలుగురు బ్రాహ్మణ మిత్రులుండే వారు. వారిలో ముగ్గురు సమస్తశాస్త్రాలూ తెలిసిన వారే. కాని వారికి లోకజ్ఞానం లేదు. నాలుగో వాడికి ఏ శాస్త్రమూ రాదు గాని, లోకజ్ఞానం పుష్కలంగా కలవాడు.

ఒకనాడు నలుగురూ ఒక చోట కలిసి, ''చదువుకున్నందుకు ప్రయోజనం ఏమిటి? నానాదేశాలూ తిరిగి, రాజులను మెప్పించి, బహుమానాలు పొందాలి! కనక మనం దేశసంచారం బయలుదేరుదాం,'' అనుకున్నారు.

వాళ్ళు బయలుదేరి కొంత దూరం వెళ్లినాక, వారిలోకెల్లా పెద్దవాడు ఇలా అన్నాడు: ''మనలో ఒకడికి లోకజ్ఞానం ఉన్న దన్నమాట గాని, పాండిత్యం లేదు. పాండిత్యం లేకపోతే, లోకజ్ఞానం ఉన్నందుకు ఏ రాజూ సన్మానించడు. మిగిలిన ముగ్గురూ సంపాదించుకునే బహుమానాల నుంచి వాడికి వాటా రాదుకూడా. అందుచేత వాడు ఇంటికి తిరిగిపోవచ్చు."

రెండో పండితుడు లోకజ్ఞానితో, "నువు పండితుడివి కావు. తిరిగి పో,'' అన్నాడు.

కాని మూడో పండితుడు, ''మనం వాణ్ణి ఇంటికి తిరిగి వెళ్ళమనటం అన్యాయం. మనం నలుగురమూ బాల్యం నుంచీ కలిసి తిరిగి, కలిసి ఆడుకున్నాం. వీణ్ణి మన వెంట రానిచ్చి, మన సంపాదనలో ఒకవంతు ఇద్దాం,'' అన్నాడు.

అందుకు మొదటి ఇద్దరూ సరేనన్న మీదట, నలుగురూ ప్రయాణం కొనసాగించారు.

కొంత కాలానికి వారు అరణ్యం చేరుకుని, అక్కడ చచ్చిన సింహం ఎముకలు



చూశారు. వాటిని చూసి ఒక పండితుడు, "ఇప్పుడు మనం మన విద్యలు నిరూపించుకోవచ్చు. మన శక్తితో మనం ఈ సింహాన్ని తిరిగి బతికించుదాం. నేను ఈ సింహం ఎముకలను ఎక్కడ ఉండవలసినవి అక్కడ అమర్చగలను," అన్నాడు.

"నేను సింహం చర్మమూ, కండరాలూ, రక్తమూ సృష్టించగలను," అన్నాడు రెండో పండితుడు.

"మీరిద్దరూ అలా చేసే మాటైతే నేను సింహానికి ప్రాణం పొయ్యగలను," అన్నాడు మూడో పండితుడు.

అన్నట్టుగానే ఒకడు సింహం అస్థిపంజరం కూర్చి, రెండోవాడు దానికి చర్మమూ, మాంసమూ, రక్తమూ కలిగించి, మూడోవాడు ప్రాణం పోయబోతూండగా, నాలుగోవాడు, "ఇది సింహం! దీనికి ప్రాణం వస్తే ఇది మన అందరినీ చంపేస్తుంది. అందుచేత ప్రాణం పొయ్యవద్దు," అన్నాడు.

దానికి మూడోవాడు, "ఛీ, మూఢుడా! మిగిలిన ఇద్దరూ వాళ్ళ తెలివి తేటలు రుజువు చేసుకున్న తరవాత నన్ను నా శక్తి చూపటం మానుకోమంటావా?" అన్నాడు.

లోకజ్ఞానం కలవాడు, "నీ యిష్టం. నేను ఈ చెట్టు ఎక్కేదాకా ఆగు," అంటూ సమీపంలో ఉన్న చెట్టు ఎక్కేశాడు.

తరవాత మూడో పండితుడు సింహానికి ప్రాణం పోశాడు. ప్రాణం వస్తూనే సింహం గర్జిస్తూ విజృంభించి, తనను బతికించిన ముగ్గురు పండితులనూ చంపేసింది. సింహం వెళ్ళిపోయినాక, లోకజ్ఞాని చెట్టు దిగి, క్షేమంగా ఇల్లు చేరాడు.

అతిలోభి అత్యంతలోభికి ఈ కథ చెప్పి, "ఒక్క తామరపువ్వుతో పుష్కరిణి కాదు. అలాగే ఈ ఒక్క కథలోని నీతి చాలదు. ఇలాటి కథలు ఇంకా చాలా ఉన్నాయి," అని మరొక కథ చెప్పాడు.

## చదువుకున్న మూఢులు

ఒకప్పుడు ఉజ్జయినిలో నలుగురు బ్రాహ్మణ బాలకులు స్నేహంగా ఉండే

వాళ్లు. వాళ్ళు కూడబలుక్కుని, దేశాంతరాలకు వెళ్ళి విద్యాధికుల మవుదాం అనుకున్నారు. తరవాత వాళ్లు కన్యాకుబ్జం వెళ్లి, ఒక ప్రసిద్ధుడైన గురువు వద్ద పన్నెండేళ్ళపాటు అమిత శ్రద్ధగా చదువుకున్నారు.

వాళ్ళు విద్యాభ్యాసం పూర్తి చేసి, గురువుగారి వద్ద సెలవు పుచ్చుకుని, తమ పుస్తకాలతో సహా ఉజ్జయినికి తిరుగు ప్రయాణమయారు. కొత్త ప్రాంతాలు చూసినట్టు ఉంటుందనీ, ఎరగని మార్గంలో ప్రయాణం చేసే తెలివితేటలు తమ కున్నాయనీ, వాళ్లు వచ్చిన మార్గం విడిచిపెట్టి, సరికొత్త మార్గాన ఉజ్జయినికి ప్రయాణమయారు.

వారు కొంతదూరం వెళ్ళాక దారి రెండుగా చీలింది. ఏదారి పుచ్చుకోవాలో వారికి తెలియలేదు. ఒకడు ఇలా అన్నాడు:

"ఏ దారిన వెళ్ళాలన్నది సమస్య. నా పుస్తకం ఏం చెబుతున్నదంటే, చదువుకున్న వాడికి కర్తవ్యం దానంతట అదే తెలుస్తుంది. వాడు మరొకర్ని అడిగేపని ఉండదు. కాని మూఢుడు అస్తమానమూ ఇతరుల సలహాపైనా, సహకారంపైనా ఆధారపడతాడు. అందుచేత మనం ఎటు వెళ్ళాలని ఇతరులను అడిగే ప్రశ్నలేదు. అది మనమే నిర్ణయించుకుందాం."



నలుగురూ దారులు చీలే కూడలిలో కూర్చుని, తమ తమ పుస్తకాలు తెరిచారు. అదే సమయంలో అక్కడి దారులలో ఒకదాని వెంట ఒక శవమూ, దాని వెనకగా అనేకమంది మనుషులూ వచ్చారు. వెంటనే చదువుకున్న నలుగురిలో ఒకడు, "సమస్య తీరిపోయింది! నలుగురు నడిచిన దారినే నడవమని నా పుస్తకం చెబుతున్నది. మనం ఈ జనం వెళ్ళేదారినే వెళదాం," అన్నాడు.

సమస్య ఇంత సులభంగా పరిష్కారమైనందుకు మిగిలిన ముగ్గురూ సంతోషంతో కేరింతాలు కొట్టారు. వాళ్ళు శవం ఊరేగింపు వెనకనే వెళ్లి, త్వరలోనే

శ్మశానం చేరుకున్నారు. దారి అక్కడ ఆగిపోయింది.

విద్యావంతులు చితికి కొంత దూరంగా నిలబడి, ఇప్పుడేం చెయ్యాలి అనుకున్నారు. అక్కడే ఒక గాడిద కూడా నిలబడి ఉండటం వారికి కనబడింది.

"దీనికేదో అర్థం ఉండాలి. మనతో బాటు ఈ గాడిద కూడా నిలబడి ఉండటానికి అర్థం ఏమై ఉంటుంది?" అని ఒకడు అన్నాడు.

వెంటనే మరొకడు పుస్తకంతీసి చూసి, "నాకు తెలిసింది! ఈ గాడిద మన మిత్రుడు. 'రాజద్వారే, శ్మశానే చ యస్తిష్ఠతి సబాంధవః.' అని నా పుస్తకంలో ఉన్నది. అందుచేత మనం ఈ గాడిదను స్నేహపూర్వకంగా పలకరించుదాం," అన్నాడు.

ఒకడు వెళ్ళి గాడిద కంఠాన్ని ఆప్యాయంగా కౌగలించుకున్నాడు. ఇంకొకడు గాడిదను ముద్దు పెట్టుకున్నాడు. మరొకడు దాని పాదాలు కడిగాడు. నాలుగోవాడు, బహుకాలదర్శనం, అని ఆనంద బాష్పాలురాల్చాడు.

వాళ్ళను చూసి, శవంతో వచ్చినవాళ్ళు అంత విషాదంలోనూ విరగబడి నవ్వారు.

అంతలో ఒక ఒంటె, అటుగా పరిగెత్తుకుంటూ వచ్చింది. "దీని అర్థం ఏమై ఉంటుంది?" అని ఒక విద్వాంసుడు అడిగాడు.

"ధర్మస్య త్వరితా గతిః అని నా పుస్తకంలో ఉన్నది. పరిగెత్తుకుంటూ వచ్చింది గనక, ఈ ఒంటె ధర్మం అయి ఉండాలి," అన్నాడు మరొకడు.

మూడోవాడు, "ఇష్టం ధర్మేణ యోజయేత్ అని నా పుస్తకంలో ఉన్నది. అంటే మన కిష్టమైన దాన్ని ధర్మంతో సంధించాలి. కనక మనం గాడిదనూ, ఒంటెనూ కలిపి కట్టుదాం," అన్నాడు.

నలుగురూ కలిసి అతికష్టం మీద గాడిదనూ, ఒంటెనూ తాడుతో కలిపి కట్టి, చాలా తన్నులు తిన్నారు. శ్మశానంలో ఉన్న వాళ్ళంతా పగలబడి నవ్వారు.






## 76

తరవాత ఆ చదువుకున్న మూఢులు రెండు జంతువులనూ కలిపి నడిపించటానికి ప్రయత్నిస్తే, అవి కదలలేదు. అందుచేత పండితులు, తమ గురువు ఎప్పుడూ చెబుతూండినట్టు, గాడిదను నడిపించటానికి రెండు దెబ్బలు వేశారు. అది ఓండ్ర పెట్ట సాగింది. ఒంటె కూడా బెదిరిపోయి అరవసాగింది. వీటి అరుపులు విని గాడిద యజమాని అయిన చాకలీ, ఒంటె యజమాని అయిన వర్తకుడూ వచ్చి, పరిస్థితి అర్థం చేసుకుని, దుడ్డు కర్రలతో నలుగురినీ బాదారు. పండితులు నలుగురూ దూరంగా పారిపోయారు.

"మనని ఆ ఇద్దరూ కొట్టారుగదా, వాళ్ళ ఉద్దేశం ఏమై ఉంటుంది?" అన్నాడు ఒక పండితుడు రొప్పుతూ.

"వాళ్ళు మూర్ఖులు. పండితుల చర్యలు వాళ్ళకు అర్థం కావు," అన్నాడు మరొకడు.

వాళ్ళు కొంత దూరం వెళ్ళేసరికి ఒక లోతైన నది వచ్చింది. దాని నిండా తుంగ ఉన్నది. నది మధ్యలో ఒక ఆకు కొట్టుకు వస్తున్నది. అది చూసి ఒక పండితుడు, "ఆగమిష్యతి యత్పత్రం తదస్మాం స్తారయిష్యతి," (ఆ వచ్చే ఆకు నది దాటిస్తుంది) అనుకుని, నదిలోకి దూకి, మెడ లోతువరకూ కూరుకుపోయి, బయటికి రాలేక పోయాడు.

అప్పుడు మరో పండితుడు తన పుస్తకం తీసి, "సర్వనాశే సముత్పన్నే, అర్ధం త్యజతి పండితః" అని చదివి, మొత్తం పోయేపరిస్థితిలో బుద్ధిమంతుడు సగమైనా దక్కించుకుంటాడని చెప్పి



ఉన్నది గనక, తుంగ మధ్య కూరుకుపోయిన వాడి తల నరికి తీసుకున్నాడు. ఆ తల మాట్లాడలేదని గ్రహించి, దాన్ని వదిలేసి, నది దాటలేక మరొక దిక్కుగా బయలుదేరి ఒక గ్రామం చేరారు.

వీరు పండితులుగా కనిపించే సరికి ముగ్గురు గృహస్థులు ముగ్గురినీ వేరు వేరుగా తమ ఇళ్లకు భోజనానికి పిలిచారు.

మొదటి పండితుడికి తాళ్లు తాళ్ళుగా ఉండే ఫేణీని నేతిలో వేయించి, వడ్డించారు. అది చూసి ఆ మూఢుడు, "దీర్ఘసూత్రీ వినశ్యతి," (పోగులు నాశనం కలిగిస్తాయి) అనుకుని విస్తరి ముందు నుంచి లేచి వెళ్లిపోయాడు.

రెండోవాడికి విస్తట్లో "మండకాలు" అనే అట్లలాటివి వడ్డించారు. వాటిని చూసి ఆ మూఢుడు, "అతివిస్తార విస్తీర్ణ తద్భవేన్న చిరాయుషం," (మరీ వెడల్పయినవి చిరాయువు కలిగించవు) అనుకుని, లేచి పోయాడు.

మూడోవాడికి గారెలు వడ్డించారు. వాడు వాటిలో చిల్లులు చూసి, "ఛిద్రేష్వనర్థా బహులీ భవంతి," (చిల్లులవల్ల అనేక అనర్థాలు) అనుకుని, భోజనం మానేసి వెళ్లిపోయాడు.

ఈ విధంగా పండితులని ముందు గౌరవం పొందినవాళ్లు లోకజ్ఞానం లేని మూఢులుకావటాన నవ్వులపాలయారు.

అత్యంత లోభి ఈ కథ విని, "నువు చెప్పినది నిజమేగాని, నన్నడిగితే, మనుషులు బాగుపడటానికీ, చెడిపోవటానికీ కారణం పాండిత్యమూ కాదు, లోకజ్ఞానమూ కాదంటాను. బొత్తిగా నిస్సహాయులూ, దిక్కులేనివాళ్ళూ తరచు దేవుడి కటాక్షంతో మనగలుగుతారు. అత్యంత బలశాలులూ, రక్షణలు గల వారూ అకస్మాత్తుగా దైవోపహతులవుతారు. నట్టడవిలో చావటం కోసం వదిలి పెట్టబడిన మనిషి దేవుడి దయ ఉంటే బతుకుతాడు. కాని అన్ని సౌకర్యాలూ గలవాడు దేవుడి అనుగ్రహం లేకపోతే

ఇంటనే చచ్చిపోతాడు. సహస్రబుద్ధీ, శతబుద్ధీ, ఏకబుద్ధీ అనేవాళ్ళ కథలు తన కన్న మేధావులైన ఇద్దరూ నశించగా, ఏకబుద్ధి తేరుకోవటం నేను చెప్పే దానికి మంచి నిదర్శనం కాదా? ఈ ప్రపంచంలో మనిషి ప్రారబ్ధాన్ని నిర్ణయించేది విధి, అంతేగాని, దురాశా, ప్రపంచజ్ఞానం లోపించటమూ కాదు."

అతిలోభి ఆ కథ ఏమిటని అడగగా అత్యంతలోభి ఇలా చెప్పాడు :

ఒక కొలనులో సహస్రబుద్ధీ, శతబుద్ధీ అని రెండు చేపలు ఉండేవి. అందులోనే ఏకబుద్ధి అనే కప్ప ఈ చేపలతో సఖ్యంగా ఉండేది. అవి ప్రతిరోజూ సాయంకాలం ఒడ్డున కలుసుకుని, కబుర్లు చెప్పుకుని, తిరిగి నీటిలోకి వెళ్ళిపోయేవి.

ఒక సాయంకాలం ముగ్గురూ మాట్లాడుకుంటూ ఉండగా కొందరు పల్లెకార్లు వలలు చేత బట్టుకుని అటుగా వచ్చారు. వాళ్ళు కొలను కేసి చూసి, "ఇందులో నీరు తగ్గిపోయింది. చేపలు దండిగా ఉన్నాయి. కనక మనం రేపు ఉదయం వచ్చి చేపలు పట్టుదాం," అని నిశ్చయించుకుని, వెళ్ళిపోయారు.

పిడుగుపాటులాటి ఈ మాటలు విని ముగ్గురు మిత్రులూ కర్తవ్యం గురించి చర్చించాయి.



"సహస్రబుద్ధీ, శతబుద్ధీ! మనం ఏం చెయ్యాలి? ఇక్కడి నుంచి పారిపోవాలా? ఇక్కడే ఉండిపోవాలా?" అని కప్ప అడిగింది.

సహస్రబుద్ధి నవ్వి, "మిత్రమా, మాటలకు బెదరకు. పాములూ, దుర్మార్గులూ చేసే ఆలోచనలు ఎల్లప్పుడూ ఫలించవు. కనకనే ప్రపంచం నడుస్తున్నది. ఈ పల్లెకార్లు రేపు ఉదయం రాకనేపోవచ్చు. ఒకవేళ వచ్చినా, నేను నా బుద్ధిచాతుర్యంతో నన్ను రక్షించుకుని, నిన్ను కూడా రక్షించగలను. నీటిలో ఎన్ని రకాల సంచరించవచ్చునో నాకు పూర్తిగా తెలుసు," అన్నది.

శతబుద్ధి ఈ మాటలకు హర్షిస్తూ, "సహస్రబుద్ధి చక్కగా చెప్పింది. బుద్ధిశాలులకు ప్రపంచంలో అసాధ్యమంటూ ఏదీలేదు. అస్త్రధారులైన నందులను చాణక్యుడు తన బుద్ధికుశలతతో నిర్మూలించాడు కాడా? గాలీ, సూర్యుడూ చొరలేని చోటికి కూడా బుద్ధి చొచ్చుకుపోతుంది. అందుచేత, మనం ఈ పల్లెకార్ల మాటలు విని, మన జన్మస్థలమూ, మన తాత ముత్తాతల స్థావరమూ అయిన ఈ కొలనును విడిచిపెట్టి పోరాదు. జన్మస్థలంలో ఉంటే సౌఖ్యం కొద్దిపాటిదే అయినా, స్వర్గసౌఖ్యాలు దానికి సరిరావని పెద్దలు చెప్పరా? మనం ఈ కొలనును విడిచిపోనవసరం లేదు. నేను నా తెలివితో నిన్ను కాపాడతాను," అన్నది.

దానికి కప్ప, "మిత్రులారా, నేను కేవలమూ ఏకబుద్ధిని. నా బుద్ధి నన్ను ఇక్కడి నుంచి వెంటనే పారిపొమ్మంటున్నది. నేను నా భార్యతో సహా ఇవాళే ఇంకో కొలనుకు పోతాను," అన్నది.

మర్నాడు ఉదయం పల్లెకార్లు వచ్చి, వలలు పన్ని, మడుగులోని చేపల నన్నిటినీ పట్టారు. చేపలతోబాటు తాబేళ్ళూ, కప్పలూ, ఎండ్రలూ, ఇతర జలచరాలూ వాళ్ళకి దొరికాయి. సహస్రబుద్ధీ, శతబుద్ధీ తమ భార్యలతో సహా తప్పించుకోవటానికి తమ నేర్పునంతా ఉపయోగించి, ఎన్నిరకాల కదలినా లాభంలేకపోయింది.

పల్లెకార్లు తమకు దొరికిన వాటితో తృప్తిపడి మధ్యాన్నం దాటి ఇళ్ళకు బయలుదేరారు. బరువుగా ఉన్న కారణంచేత శతబుద్ధిని ఒక పల్లెకారి తన భుజాని కెత్తుకున్నాడు. సహస్రబుద్ధిని ఒక తాడుకు వేళ్ళాడగట్టి, ఇద్దరు పల్లెకార్లు మోసుకుంటూ వెళ్లారు.

ఏకబుద్ధి తన కొత్త స్థావరం వద్దనుంచి ఆ పల్లెకార్లు పోతూండటం చూసి, తన భార్యతో, "చూశావా, ప్రియా. సహస్రబుద్ధినీ, శతబుద్ధినీ మనుషులు మోసుకుపోతూంటే, ఏకబుద్ధినైన నేను నిశ్చింతగా జలక్రీడలాడుతున్నాను!" అన్నది.






## 77

సహస్రబుద్ధీ, శతబుద్ధీ, ఏకబుద్ధీల కథ విని అతిలోభి, "నువు చెప్పినది నిజం కాదు. ఇందులో విధినిర్ణయం ఏమీ లేదు. ఏకబుద్ధి లోకజ్ఞానం కలది గనక బతికి బయటపడింది. మిగిలిన ఇద్దరికీ అలాటి జ్ఞానం లేకపోయింది. అంతేగాక దురాశ వల్ల కలిగే దుష్ఫలితాలు "కోతి ప్రతీకారం" అన్న కథలో స్పష్టమవుతాయి," అని ఆ కథ ఇలా చెప్పాడు:

ఒకప్పుడు చంద్రుడు అనే రాజు ఉండేవాడు. అతని కుమారులకు కోతులతో ఆడుకోవడమంటే చాలా సరదా. అందు చేత వాళ్ళు తినుబండారాలు ఇచ్చి అనేక కోతులను రాజప్రాసాదంలోకి చేర్చారు.

కోతులు తిండి బాగా మెక్కి, కొవ్వు పట్టి, రాజభవనం ఆవరణకు బాగా అలవాటు పడ్డాయి. వాటికి నాయకుడైన ముసలికోతి బృహస్పతీ, చాణక్యుడూ లాటి రాజనీతి కోవిదుల రచనలు క్షుణ్ణంగా చదివి, వైద్యమూ, పశువైద్యమూ కూడా నేర్చుకున్నది.

రాజుగారి ఆవరణలో ఒక గొర్రెపొటేళ్ళ మంద కూడా ఉండేది. వాటి మీద చిన్నపిల్లలు సవారి చేసేవాళ్లు. వాటిలో ఒక గొర్రెపొటేలు తిండిపోతు. అది అవకాశం దొరికినప్పుడల్లా వంటసాలలో జొరబడి, అక్కడ ఉన్నదంతా తినేసేది. వంటవాళ్ళు మండిపడి, చేతికి ఏది దొరికితే అది పెట్టి దాన్ని కొట్టేవాళ్లు, వంటకట్టె అయినా సరే, కుండ అయినా, కంచు పాత్ర అయినా సరే!

ఇదిచూసి కోతులనాయకుడు ఇలా అనుకున్నది: "గొర్రెపొటేళ్లకూ, వంటవాళకూ, మధ్య రంధి వల్ల కోతులకు అపాయం.



ఈ పొటేలుకు వంటశాలంటే ఇష్టం. అది చూసి వంటవాళ్లు మండిపడి, ఏది పడితే అది తీసుకుని దాన్ని కొట్టుతున్నారు. యాదృచ్ఛికంగా వాళ్ళ చేతికి మండే కట్టె దొరకవచ్చు. అది పెట్టి కొట్టారంటే, గొర్రెపొటేలు బొచ్చు అంటుకోవచ్చు. అది పరిగెత్తిపోయి, గుర్రపుసాల మూలలో ఉన్న తమ పాకలోచేరి, మంటలకు తట్టుకోలేక నేలమీద ఎండు గడ్డిలో పొర్లవచ్చు. గడ్డి అంటుకుని, గుర్రపు సాలల మీది రెల్లుకప్పు మండవచ్చు. రాజుగారి జాతిగుర్రాలలో కొన్ని చావు తప్పి, కాల్పులతో బయటపడినా, మరి కొన్ని చచ్చి తీరుతాయి. గుర్రాలు కాలి బొబ్బలెక్కితే, కోతులను అప్పటికప్పుడు చంపి, వాటి కొవ్వు పట్టించటం చికిత్స అని శాలిహోత్రుడి వంటి పశువైద్య శ్రేష్ఠుడు చెప్పాడు. కోతి కొవ్వును కాలుడు గాయాల మీద మందంగా పట్టిస్తే, వెంటనే నొప్పి తీస్తుందట. తన జాతిగుర్రాలు కాలి, బొబ్బలెక్కి ఏడుస్తూంటే రాజుగారు ఆస్థాన పశువైద్యుడి సలహా తప్పక అడుగుతాడు. ఆయన ఎలాగూ ఈ చికిత్సే చెబుతాడు. రాజుగారికి గుర్రాలు ఎక్కువ గాని, కోతులంటే ఏం లక్ష్యం? ఆయన కోతులన్నిటినీ చంపించి, తగినంత కోతి కొవ్వు తీయించి, గుర్రాలన్నింటికీ చికిత్స చేయిస్తాడు. ఇదంతా తప్పక జరిగి తీరుతుంది. అందుచేత నా కోతులను రక్షించుకోవటం నా విధి. అందుకు తగిన చర్యలు ముందే తీసుకోవటం మంచిది.''

అది తన కోతులన్నిటినీ సమావేశపరిచి, వాటికి రానున్న ఆపద వివరించి చెప్పింది. చివరకు అది కోతులను ఇలా హెచ్చరించింది:

''పొటేలుకూ, వంటవాళ్ళకూ మధ్య సాగుతున్న రంధి, నేను చెప్పినట్టు, మనకు ప్రమాదకరం. నాలుగు కాలాల పాటు బతకదలచిన వాళ్లు సంఘర్షణ పడేవాళ్ళ మధ్య ఉండరాదు. సంఘర్షణలతో పచ్చ పచ్చని రాజ్యాలు భగ్గు


మంటాయి. దుర్భాషలు దీర్ఘ కాల స్నేహాలను కూడా తుడిచి పెడతాయి. కానిపనులు ఎంతటి కీర్తికీ కళంకం తెస్తాయి. అందుచేత నేమిటంటే, ఆపద వచ్చి పడకముందే మనం మన అరణ్యానికి తిరిగి పోదాం.

కోతులు ఈ హితవు మాటలు విని నవ్వాయి. అవి తమ నాయకుడితో ఇలా అన్నాయి:

"నీకు ముసలితనం వచ్చి, బుద్ధి పెడతల పట్టింది. అందుకనే ఏవేవో ఆపదలు ఊహించుకుని, అర్థంలేని సలహా ఇస్తున్నావు. స్వర్గంలాటి ఈ ప్రదేశాన్ని ఎన్నటికీ వదిలిపెట్టం. రాజకుమారులు పెట్టే కమ్మని తినుబండారాలు వదులుకుని, అడవులు పట్టిపోయి, అక్కడ వుల్లగా, ఉప్పగా, చేదుగా, వగరుగా ఉండే కాయలు తినం."

ఈ మాటలు వినేసరికి ముసలి కోతికి కళ్ళ వెంట నీరు కారింది. అది ఇలా అన్నది:

"మూఢులారా! ఈ సుఖాలు నిలవవని గ్రహించలేకుండా ఉన్నారు. ఈ కమ్మని తినుబండారాలే మీ ప్రాణాలకు కటిక విషమవుతాయి. నా కళ్ళ ఎదట మీరు నాశనం కావటం చూడలేను. నేను ఇప్పుడే అడవికి పోతాను. స్నేహితుడి



దైన్యమూ, తమ ఇళ్ళలో శత్రువులు ప్రవేశించటమూ, తమ దేశాన్ని పరాయి వాళ్ళు కొల్లగొట్టటమూ, తమ కుటుంబాలు నాశనం కావటమూ కళ్ళచూడని వాడు ధన్యుడంటారు!"

ఇలా అని ముసలి కోతి ఒంటరిగా అడవులకు వెళ్లిపోయింది.

అది వెళ్లిపోయిన కొద్ది రోజులకు పొట్టేలు దాని అలవాటు ప్రకారం వంట ఇంట ప్రవేశించి, రాజుగారి కోసం ప్రత్యేకంగా తయారుచేసిన వంటకాలు తిన సాగింది. ఇంకా వంట పూర్తికాను కూడా లేదు. పొయ్యిల మీద ఇంకా పాత్రలలో పదార్థాలు ఉడుకుతున్నాయి.

వంటవాళ్ళకు పట్టరాని ఆగ్రహం వచ్చింది. వాళ్ళ చేతికి ఏమీ అందక పోయేసరికి, మండుతున్న కట్టె తీసి పొటేలును నాలుగు చరుపులు చరిచారు. దాని వీపు మీది బొచ్చు అంటుకున్నది. అది బాధతో అరుస్తూ వెళ్లి, గుర్రపుసాల లోని ఎండుగడ్డి మీద పడి దొర్లి, బాధ నివారణ చేసుకోజూసింది. గడ్డి అంటుకుని, గుర్రపుసాల యావత్తూ తగలబడింది. కొన్ని గుర్రాలు చచ్చిపోయాయి. కొన్నిటికి కళ్ళుపోయాయి. నౌకర్లు కొన్ని గుర్రాలను అతి కష్టం మీద కాపాడగలిగారు. అయితే అవి కూడా ఒళ్ళంతా కాలి, బాధతో సకిలిస్తూ ఆవరణ అంతా పరిగెత్తసాగాయి.

గుర్రాలంటే ఎంతో ప్రేమగల రాజు వచ్చి, వాటి దీనస్థితి చూసి ఎంతగానో బాధ పడ్డాడు. ఆయన ఆస్థాన పశు వైద్యుణ్ణి పిలిపించి, ''ఈ గుర్రాల బాధ నివారణకు మంచి చికిత్స ఏమిటి ?'' అని అడిగాడు.

వైద్యుడు గ్రంథాలు తిరగవేసి, ''మహారాజా, పశువైద్యానికి పితామహుడైన శాలిహోత్రుడు ఇలా చెబుతున్నాడు. అప్పుడు చంపిన కోతుల కొవ్వు గుర్రాల బొబ్బలకు పట్టించినట్టయితే, సూర్యోదయం కాగానే చీకటి విచ్చిపోయినట్టు బాధ తొలగి పోతుందట. అందుచేత వెంటనే ఆ చికిత్స చేస్తాం.'' అన్నాడు.

ఆవరణలో ఉన్న కోతులన్నిటినీ వెంటనే చంపమని రాజు ఉత్తరువిచ్చాడు.

నౌకర్లు తినుబండారాలిచ్చే మిషమీద కోతులన్నిటినీ చేర్చి, వాటిని పట్టుకుని చంపేసి, వాటి కొవ్వు తీసి, గుర్రాల గాయాలకు పట్టించారు.

తన వారంతా చచ్చిన సంగతి ముసలి కోతి ఒక కాకి కబురు చెప్పగా విని, దుఃఖంతో కుప్పకూలి పోయింది. చచ్చిన కోతులలో ఆ ముసలికోతి సంతానమూ, వాటి సంతానమూ, దాయాదులూ ఇతర బంధువులూ ఉన్నాయి.






## 78

ముసలి కోతి చాలాసేపు దుఃఖించి, "ఆనాడు అవి నా మాట వినక, ఈ గతికి వచ్చాయి. దుర్మార్గుడైన రాజు మీద నేను ఎలా పగ తీర్చుకోవాలి? తన వంశానికి జరిగిన అన్యాయాన్ని పిరికితనం వల్లగాని, స్వార్థంతోగాని సహించేవాడు పరమహీనుడని చెబుతారు. నా వంశం నాశనమయినందుకు తప్పక ప్రతీకారం చెయ్యాలి," అనుకున్నది.

పగ తీర్చుకునే పథకం ఆలోచిస్తూ అది అడవి అంతా తెగతిరిగింది. ఎంతసేపు తిరిగినా ఏ పథకమూ తట్టలేదు. ఆ రోజు చాలా వేడిగా ఉన్నది. దానికి దాహం వేసింది. నీటికోసం తిరుగుతూ అది ఒక తామరకొలను వద్దకు వచ్చింది. అక్కడ ఉన్న నిశ్శబ్దం భయం కలిగించేదిగా ఉండి, ప్రమాదాన్ని సూచించింది. అది జాగ్రత్తగా గమనించి ఒక విషయం గ్రహించింది: నీటి కేసి వెళ్ళే అడుగు జాడలున్నాయిగాని, తిరిగి వచ్చిన అడుగు జాడలు లేవు.

"ఈ మడుగులో తప్పకుండా మొసళ్లు ఉండి ఉండాలి. నీటికోసం వచ్చే జంతువులను అవి పట్టి తినేస్తున్నాయి. అందుచేత నేను నీటిలో అడుగుపెట్టకుండా, తామరతూడుతో నీరు తాగేస్తాను," అనుకుని, ముసలికోతి నీటి మట్టానికి ఎగువగా ఉన్న మెట్టు మీదికి దిగి, కర్రతో తామర కాడను పైకి ఎత్తి, దాన్ని నీటినుంచి పీకి, తామరతూడు కుండా నీరు తాగసాగింది.

ఆ సమయంలో ఒక యక్షి నీటి పైకి తల ఎత్తింది. దాని కంఠంలో అత్యద్భుతమైన వజ్రాల హారం ఉన్నది. అది కోతితో, "ఈ మడుగులోకి అడుగు పెట్టినవాళ్ళు



నాకు ఆహారం అవుతారు. నువు అందరికన్నా బుద్ధిగలదానివి. నీటిలో అడుగు పెట్టలేదు. నువు నీరు తాగిన పద్ధతి చాలా తెలివిగా ఉన్నది. మెచ్చాను. నువ్వేదైనా కోరు, ఇస్తాను,'' అన్నది.

కోతికి ఒక బ్రహ్మాండమైన ఆలోచన వచ్చి, ''నువు ఒకేసారి ఎన్ని ప్రాణులను తినగలవు?'' అని అడిగింది.

''నీటిలో అడుగు పెట్టాలేగాని ఎన్ని లక్షల ప్రాణులనైనా తినగలను. నీటి బయటికి వస్తే నేను బక్కనక్కకు కూడా సాటిరాను,'' అన్నది యక్షి.

''నాకు చంద్రుడనే రాజూ, అతని పరివారమూ ప్రబల శత్రువులు. నీ మెడలోని హారం నాకు ఇచ్చావంటే నేను ఆ రాజులోనూ, అతని మనుషులలోనూ దురాశ రేపి, ఇలాటి హారాల కోసం నీ మడుగులో దిగేలాగు చేస్తాను. నీకు కావలసినంత ఆహారం!'' అన్నది కోతి.

యక్షి ఈ మాటకు సంతోషించి, తన వజ్రాలహారాన్ని కోతికి ఇచ్చి, ''మిత్రమా, ఎలాగైనా వారినందరినీ శీఘ్రంగా ఇక్కడికి తీసుకురా. ఇలాటి భోజనం నేను ఎన్నడూ ఎరగను. ఈ పని చేసి, మన స్నేహాన్ని శాశ్వతం చెయ్యి,'' అన్నది.

కోతి హారాన్ని తీసుకుని రాజప్రాంగణానికి వెళ్ళి, దాన్ని తన మెడలో ధరించి, అందరికీ కనపడేలాగా ఒక చెట్టు నుంచి ఇంకో చెట్టుకు ఎగిరింది. రాజోద్యోగులూ, భటులూ దాన్ని చూసి, ''కోతిరాజా, ఇంతకాలమూ ఏమైపోయావు? నీకా మణిహారం ఎక్కడిది? దాని కాంతి సూర్యకాంతిని మించి ఉన్నదే!'' అన్నారు.

''ఇక్కడికి సమీపంలోనే అరణ్యం మధ్య ఒక రహస్య ప్రదేశం ఉన్నది. కుబేరుడు తన నిధులను ఉంచటానికి అక్కడ ఒక తామరకొలను నిర్మించాడు. ఆదివారం ఉదయం ఎవరు వెళ్లి అందులో స్నానం చేస్తే, వాళ్లను కుబేరుడు తన అతిథులుగా భావించి, ఇలాటి హారాన్ని మెడలో వేస్తాడు,'' అని కోతి అన్నది.



ఈ వార్త రాజుకు అందింది. అతను వెంటనే కోతిని రప్పించి, "కోతిరాజా, ఈ మాట నిజమేనా? ఆ మడుగులో స్నానం చేసిన వారికి నిజంగా రత్నహారం లభిస్తుందా?" అని అడిగాడు.

"మహారాజా, నా మెడలో హారం చూశారుగదా! ఇలాంటి హారాలు కావాలంటే నా వెంట కొంతమందిని పంపండి. ఆ మడుగు చూపిస్తాను," అన్నది కోతి.

రాజుకు దురాశ పుట్టింది. అతను కోతితో, "ఎవరినో పంపటం దేనికి? నేనే నా బంధుమిత్ర పరివారులతో వచ్చే ఆదివారం మడుగుకు వస్తాను. అంత శీఘ్రంగా కుబేరుడు మా అందరికీ రత్న హారాలు ఇస్తాడంటావా?" అన్నాడు.

"కుబేరుడికి మీరు ఎప్పుడు వెళ్ళినా ఒకటే. సముద్ర తీరాన ఇసుక కుప్పల లాగా రత్నహారాలు అక్కడ కుప్పలు పోసి ఉన్నాయి," అన్నది కోతి.

"అయితే మేం రావటం ఖాయం!" అని రాజు ఈ సంతోష వార్తను తన రాణులకు చెప్పటానికి వెళ్ళాడు.

ఆదివారం వచ్చింది. ఇంకా తూర్పు తెల్లవారకుండానే రాజూ, రాణులూ, రాజోద్యోగులూ, ఆస్థాన పశువుల వైద్యుడూ, నగర పౌరులందరితోసహా బయలుదేరారు. ముసలికోతి రాజుగారి ఒడిలోనే కూర్చున్నది. ఇద్దరూ పల్లకీలో ప్రయాణం చేశారు.

దురాశాదేవీ, నీకు నమస్కారం! నీ ప్రేరణచేత ధనవంతులు సైతం పూర్తిగా మతిమాలిన పనులు చేస్తారు. దాటరాని ఎడారులు ప్రవేశిస్తారు. నూరు బంగారు మాడలు గలవాడు వెయ్యి కోరుతాడు. వెయ్యి గలవాడు లక్ష కోరుతాడు. లక్ష గలవాడు రాజ్యం కోరుతాడు. రాజ్యం కలవాడు ప్రపంచాధిపత్యం కోరుతాడు. వార్ధక్యంలో జుట్టు నెరుస్తుంది, పళ్ళురాలి పోతాయి, కళ్ళు కనబడవు, చెవులు వినబడవు, కాని వాడి దురాశకు ఎప్పుడూ యౌవనమే.

మడుగుచేరినాక కోతి రాజుతో, "సూర్య బింబం దిక్చక్రం మీదికి సగం లేచేసరికి అందరూ మడుగులో ప్రవేశించటానికి సిద్ధంగా ఉండండి. అదే సరి అయిన ముహూర్తం. అందరూ ఒకేసారి నీటిలోకి దిగాలి. వాళ్ళు తిరిగివచ్చినాకనే మీరూ, నేనూ దిగుదాం. నేను మిమ్మల్ని ఒక రహస్య ప్రదేశానికి తీసుకుపోయి, కుబేరుడి చేత అనేక ప్రత్యేక నాణ్యంగల హారాలు ఇప్పిస్తాను,'' అని కోతి రాజుతో అన్నది. రాజు అందుకు సంతోషంగా ఒప్పుకున్నాడు.

సూర్యుడు సగం ఉదయించే సరికి, రాజూ, కోతీ తప్ప అందరూ ఉత్సాహంగా తోసుకొంటూ మడుగులోకి నడిచారు. వాళ్లు ఎంతకూ తిరిగి రాకపోవటం చూసి రాజు కోతితో, "వీళ్ళు ఎంతకూ రారేం?" అన్నాడు.

కోతి శీఘ్రంగా ఒక మర్రిచెట్టు ఎక్కి, ''ధుష్టరాజా, నీ ప్రజలనందరినీ ఈ మడుగులో ఉండే యక్షి తినేసింది. నీ గుర్రాల వేదన నివారించటానికి నువు నా వాళ్లనందరినీ నిర్దయగా చంపావు. ఇప్పుడు నా వంతు. నేను నీ వారినందరినీ నిర్దయగా యక్షి పొట్టనపెట్టి, నా కడుపు మంట చల్లార్చుకున్నాను. నా పగ తీరింది. నువ్వు రాజువు గనక నిన్ను వదిలేశాను. నువు బతికినన్నాళ్ళూ ఈ వేదన అనుభవించాలి. దెబ్బకు దెబ్బ! హత్యకు హత్య! అదే మా కోతుల నియమం. మనుషులను మేం అనుకరిస్తాం. నువు నా వంశాన్ని నిర్మూలిస్తే, నేను నీ వంశాన్ని నిర్మూలించాను.'' అన్నది.

రాజు ఈ మాటలు విని దుఃఖంతో కుమిలిపోయి, నడుచుకుంటూ తిరిగి పోయాడు. రాజు వెళ్లాక యక్షి మడుగులో నుంచి పైకి లేచి, కోతితో, ''మంచి పని చేశావు, కోతీ. నువు నీ శత్రువులను హతమార్చావు. రత్నహారం సంపాదించావు. మిత్రుణ్ణి సంపాదించుకున్నావు.'' అన్నది.

కోతి సంతోషంగా అరణ్యానికి తిరిగి వెళ్లింది.






## 79

పగతీర్చుకున్న కోతి కథ విని అత్యంత లోభి ఇలా అన్నాడు:

"నీ మాట నిజమే. దురాశాపాశాలలో చిక్కుకున్న మనుషులు కష్టాలు పడటమో, అవహేళన పొందటమో తప్పకుండా జరుగుతుంది. అయితే ఈ సంగతి వారికి అంతా మించిపోయేదాకా తెలిసి రాదు," అన్నాడు.

"అలా అనకు, మిత్రమా. నేను నిన్ను ముందే హెచ్చరించాను. అయినా నువు, గానం చేసిన గాడిదలాగా, నా మాట ఏ మాత్రం వినిపించుకున్నావు కావు," అంటూ అతిలోభి గానం చేసిన గాడిద కథ ఇలా చెప్పాడు:

ఒకప్పుడు ఉద్ధతమనే గాడిద ఉండేది. అది పగలు తన యజమాని అయిన చాకలి బట్టలు మోసి, రాత్రి పూట స్వేచ్ఛగా తిరిగేది. అది అలా పొలాల వెంట తిరుగుతూ ఒక నక్కతో స్నేహం చేసింది. అవి రెండూ జతగా రాత్రివేళ ఒక దోసచేను ప్రవేశించి, తెల్లవార్లూ దోసకాయలు తిని, తెల్లవారేవేళకు తమ తమ నివాసాలకు వెళ్ళిపోయేవి.

ఒక రాత్రి గాడిద దోసకాయలు తెగ తిని మదించి, చేను మధ్యనిలబడి, నక్కతో, "అల్లుడూ, వెన్నెల ఎంత ఉల్లాసకరంగా ఉన్నదో చూడు! అందుకని నేను పాడబోతున్నాను. నీకు యిష్టమైన ఏ రాగం పాడమంటావో చెప్పు," అన్నది.

"మామా, మనం చేస్తున్నది దొంగ పని. అలాటి విషయాలు చర్చించి ఏం లాభం? జారులూ, చోరులూ రహస్యంగా వ్యవహరించాలి. శ్వాసకోశ వ్యాధులు



గలవాళ్ళూ, నిద్రమత్తు గలవాళ్ళూ దొంగతనానికి పనికిరారుట! పైపెచ్చు, నీ సంగీతం ఏమంత శ్రావ్యంగా ఉండకపోగా, శంఖారావంలాగా చాలా దూరం వినిపిస్తుంది. అది విని చేను కాపలావాళ్లు నిద్రలేచి వచ్చి నిన్ను పట్టవచ్చు, చావగొట్టనూ వచ్చు. అందుచేత నా మాటవిని, నీ పాటకచేరీ ఆలోచన వెంటనే కట్టిపెట్టి, తినగలిగినన్ని దోసకాయలు తిను,'' అన్నది.

అందుకు గాడిద, ''నువు అడివి ప్రాణివి. నీకు సంగీతం విలువ ఎలా తెలుస్తుంది? నీ మాటలనుబట్టే ఆ మాట తెలుస్తున్నది. ఆప్తుల మధ్య ఉండి శ్రవణానందకరమైన సంగీతం వినేవారు చరితార్థులని చెబుతారు. ఈ స్వల్ప విషయం కూడా నీకు తెలియదు,'' అన్నది.

''మామా, నీ మాట నిజమే కావచ్చు కాని నీకు సంగీతం రాదే! కర్ణకఠోరంగా ఓండ్ర పెట్టటమే నీకు తెలిసినది. మన పని పాడు. అయే పనికిమాలిన పని చెయ్యానేల?'' అన్నది నక్క.

''ఛీ, మూర్ఖుడా! నాకు పాడటం రాదని ఎవరన్నారు? విను, స్వరాలు ఏడు; స్థాయిలు మూడు; మూర్ఛనలు ఇరవై ఒకటి; రాగాలు ముప్ఫైఆరు; భావాలు నలభై. భరతులవారు రాసిన గాన శాస్త్రంలో 185 అధ్యాయాలున్నాయి. ఆయన సిద్ధాంతం ప్రకారం వేదాలు తప్ప సంగీతాన్ని మించినది లేదు. తన స్నాయువులను ఎండబెట్టి, తంత్రులుగా చేసి సంగీతం పుట్టించి, రావణుడు శివుణ్ణి సంప్రీతుణ్ణి చేశాడు. కనక, అల్లుడూ, నాకు సంగీతం గురించి తెలియదని ఎలా అన్నావు? పాడవద్దని నన్ను ఎందుకు నిరుత్సాహపరుస్తున్నావు?'' అన్నది గాడిద.

''మామా, నువు పాడాలని పట్టుబట్టితే, నేను కంచెలో తెరిపి వద్దకు వెళ్ళి, చేను గలవాళ్ళు యిటుకేసి వస్తారేమో చూస్తూ

ఉంటాను. తరవాత నీ చిత్తం వచ్చినట్టు గానం చెయ్యి." అన్నది నక్క వెళ్ళిపోతూ.

తరవాత గాడిద పాట ఎత్తుకున్నది. అది భయంకరంగా ఓండ్ర పెట్టటం విని, చేనుగలవాడు కోపంతో పళ్ళు కొరుకుతూ, దుడ్డుకర్ర తీసుకునివచ్చి, గాడిదను చావ బాదేసరికి, గాడిద ప్రాణం కడబట్టి, అక్కడే పడిపోయింది.

చేనుగలవాడు గాడిద మెడకు ఒక పెద్ద బండరాయి కట్టి, దోసకాయలు తినటానికి వచ్చే ఇతర మృగాలను పట్టుకుందామని, చేనులోనే పడుకుని నిద్రపోయాడు.

గాడిద త్వరలోనే స్పృహ తెచ్చుకుని, మెడకు కట్టిన రాయితోసహా లేచి, కంచె దాటి పారిపోయింది.

నక్క దాన్ని దూరానే చూసి, "బాగా పాడావు, మామా. నేను వద్దన్నా పాడటం మానావు కావు. నీ సంగీతానికి మెచ్చి నీ మెడకు కట్టిన రత్నం గొప్పగా ఉన్నది." అన్నది.

సంగీతం పాడిన గాడిద కథ విని అత్యంతలోభి, "నిజమే, ఇప్పుడు నేను కూడా తెలుసుకున్నాను. తనంతట ఆలోచించలేనివాడు మిత్రుడి మాట అయినా వినాలి. లేకపోతే అనుభవిస్తాడు అయితే నా బోటివాడికి ఆ జ్ఞానంకూడా ఉండదు;




ఫలించని తన ఊహలతో ఎగిరిపోయి, చేతికి అందిన దాన్ని కూడా పోగొట్టుకుంటాడు. ఈ సంగతి 'గాలి మేడలు' అన్నకథ స్పష్టం చేస్తుంది." అని ఆ కథ ఇలా చెప్పాడు:

ఒకానొక పట్టణంలో స్వభావ కృపణుడు అనే బ్రాహ్మణుడు ఉండేవాడు. ఒకసారి ఏదో అక్కర జరిగితే ఎవరో అతన్ని భోజనానికి పిలిచి, కడుపు నిండా తిండిపెట్టి, కుండెడు పేలపిండి ఇచ్చారు. మిట్టమధ్యాన్నం వేళ ఇంటికి తిరిగివస్తూ, అతను ఒక మర్రిచెట్టు నీడన విశ్రమించి పిండి ఉన్న కుండను దిగువన ఉన్న కొమ్మకు కట్టి, దాన్నే

చూస్తూండగా, చల్లగాలికి కొంచెం కునుకు పట్టింది. ఆ స్థితిలో అతను గాలిమేడలు ఇలా నిర్మించసాగాడు:

"కరువు రావటమే జరిగితే—ఎందుకు జరగకూడదు?—ఈ కుండెడు పిండిని నూరు వెండి కాసులకు అమ్ముతాను. ఆ డబ్బుతో రెండు ఆడమేకలు కొనవచ్చు. ఆరు నెలల కొకసారి అవి ఈనుతాయి. త్వరలోనే మేకలమంద తయారవుతుంది. వాటిలో కొన్నిటిని అమ్మి ఆవులను కొంటాను. ఆవులు ఏటా ఈనుతాయి. కొన్ని ఆవులనూ, దూడలనూ అమ్మి గేదెలను కొంటాను. గేదెలమంద తయారవుతుంది. కొన్ని గేదెలను అమ్మి ఆడగుర్రాలు కొంటాను. వాటికి పిల్లలుపుట్టి, గుర్రాల మంద తయారవుతుంది. గుర్రాలు అమ్మగా వచ్చిన బంగారంతో దివ్యమైన భవనం కట్టించి, చుట్టూ అనేక గదులూ, మధ్యలో మండువా ఉండేలాగు చేస్తాను. నా వైభవం చూసి ఎవడో బ్రాహ్మణుడు అందమైన తన కూతురిని నాకు కన్యాదానం చేస్తాడు. పదినెలల కల్లా నా భార్య ఒక కొడుకును కంటుంది. వాడికి సోమశర్మ అని పేరు పెట్టుతాను. వాడు పాకుతూండే దశలో నేను పుస్తకం తీసుకుని, అశ్వశాల వెనక చదువుకుంటూంటాను. సోమశర్మ నన్ను చూసి తన తల్లి ఒడి నుంచి, నా కేసి పాకుతూ రావటంలో గుర్రపు గిట్టలకు దగ్గిరగా వస్తాడు. నేను కోపంగా, 'పిల్లవాణ్ణి తీసుకో! పిల్లవాణ్ణి తీసుకో!' అని నా భార్యమీద అరుస్తాను. ఆమె ఇంటి చాకిరిలో నిమగ్నురాలై ఉండి నా మాట వినిపించుకోదు. అప్పుడు నేను లేచి ఆమెను కోప్పడుతూ, కర్రతో ఇలా కొట్టుతాను!..."

బ్రాహ్మడు తన కర్రతో గట్టిగా కొట్టేసరికి కుండ కాస్తా పగిలి, వందముక్కలై పోయి, అందులోవున్న పేలపిండి అంతా ఒలికిపోయింది. దానిలో కొంతభాగం బ్రాహ్మణుడి నెత్తినా, భుజాల మీదా పడింది.





# అసమీక్షకారిత్వం

## 80

అతిలోభి గాలిమేడలు అన్న కథ విని, "ఆ బ్రాహ్మణుడు కూడా ఫలించని కోరికల వెంట పరిగెత్తి, తనకు ఉన్నది కూడా పోగొట్టుకున్నాడు," అన్నాడు.

"నిజమే. అయితే ఆ బ్రాహ్మణుడు పోగొట్టుకున్నదీ, ఒంటినిండా పోసుకున్నదీ పేలపిండి మాత్రమే. కాని నేను పోగొట్టుకున్నది బంగారం, ఒంటినిండా పోసుకున్నది రక్తం! ఎంత ఆలోచించినా మనిషి ప్రారబ్ధాన్ని నిర్ణయించేది విధేగాని, వాడి మంచి చెడ్డలు కావని నమ్మకం కలుగుతున్నది," అన్నాడు అత్యంతలోభి.

అతిలోభి, "మిత్రమా, ఈ చక్రం నీ నెత్తిని మథించుతూ, రక్తం చిందిస్తూండటం చూస్తూంటే నాకు వెర్రెత్తి, కోతి బాధ చూడలేక పారిపోయిన రాక్షసుడి లాగా నాక్కూడా పారిపోవాలనిపిస్తున్నది," అని, అత్యంతలోభి అడిగిన మీదట ఆ కథ ఇలా చెప్పాడు:

### మోసపోయిన రాక్షసుడి కథ

ఒక నగరంలో భద్రసేనుడు అనే రాజు ఉండేవాడు. అతనికి రత్నవతి అనే సర్వ లక్షణ సంపన్న అయిన కూతురు ఉండేది. ఆమెను ఒక రాక్షసుడు ప్రేమించి, ఎత్తుకుపోవటానికి ప్రయత్నించాడు. కాని ఆమె రాక్షసనిరోధోపాయాలు అనుసరించటం చేత వాడికి ఆమెను హరించటం సాధ్యం కాలేదు.

ఒకసారి వాడు రహస్యంగా పొంచి ఉండగా, రాజకుమార్తె తన చెలికత్తెతో, "సఖీ, ప్రతి రోజూ ప్రదోషరాక్షసుడు నన్ను వేధిస్తున్నాడు. వాణ్ణి ఎలా నిరోధించటం? ఎంత ఆలోచించినా తెలియకుండా ఉన్నది." అన్నది.



రాక్షసుడు ఆ మాట విని, "ఈమెను నాలాగే మరో రాక్షసుడు కూడా ప్రేమిస్తున్నాడు. ఈమె నన్ను నిరోధించినట్టుగా వాణ్ణి నిరోధించలేకుండా ఉన్నదన్నమాట. వాడి సంగతి ముందు చూడాలి," అనుకుని, ఒక గుర్రం రూపం ధరించి అశ్వశాలలో చేరాడు.

ఆ రాత్రి ఒక గుర్రాల దొంగ రాజుగారి అశ్వశాలలో ప్రవేశించి, అన్ని గుర్రాల కన్న పుష్టిగానూ, ఆకర్షణీయంగానూ ఉన్న మాయగుర్రాన్ని ఎక్కి పారిపోసాగాడు.

తాను దొంగిలించిన గుర్రం వేగంగా పరిగెత్తుతూండటం చూసి దొంగ మొదట సంతోషించినా, తరవాత భయపడి, పగ్గాలు పట్టుకుని గట్టిగా లాగాడు. గుర్రం వేగం తగ్గకపోగా మరింత హెచ్చింది. ఎందుకంటే తనను ఎక్కినవాడు ప్రదోష రాక్షసుడని రాక్షసుడికి అనుమానమూ, భయమూ కలిగి, శక్తికొద్దీ పరిగెత్తసాగాడు.

అలాగే దొంగ కూడా భయపడ్డాడు. ఎందుకంటే పగ్గాలు బిగలాగినకొద్దీ మరింత వేగంగా పరిగెత్తే గుర్రాన్ని వాడు ఎన్నడూ చూసి ఉండలేదు.

"ఇది గుర్రం కాదు. ఏదో పిశాచం అయి ఉండాలి," అనుకుని వాడు, దారిలో దొరికిన మర్రిఊడలు పట్టుకుని పైకి ఎక్కాడు.

ప్రదోషరాక్షసుడు వదిలినందుకు గుర్రం రూపంలో ఉన్న రాక్షసుడు కూడా సంతోషించాడు.

అయితే ఆ చెట్టు మీదనే పైకొమ్మలలో ఉన్న కోతి, తన మిత్రుడైన రాక్షసుడు గుర్రం రూపంలో ఉండటం తెలుసుకుని, "నీ మీద స్వారి చేసినవాడు మనిషే! వాడు నీకు సహజమైన ఆహారం! వాణ్ణి ఎందుకు మోశావు?" అని అడిగింది.

కోతి అన్న ఈ మాట విని, కోతితోక పుచ్చుకొని, లాగి, దాన్ని చెట్టుపంగలో ఇరకబెట్టి పీడించుతూ, దాని తోక కొరక

సాగాడు, దొంగ. కోతి ఆ బాధ భరించలేక, చాలా భయం కలిగించే మొహం పెట్టింది.

అది చూసి రాక్షసుడు, ''ఈ ప్రదోష రాక్షసుడు ఎంతటి భయంకరుడో నీ ముఖం చూస్తేనే తెలుస్తున్నది. వాడికి అందను,'' అంటూ పారిపోయాడు.

అతిలోభి ఈ కథ విని, ''విధి అనుకూలిస్తే హత్యాప్రయత్నాలు కూడా, గుడ్డివాడికీ, గూనివాడికీ, మూడు స్తనాలు గల రాజకుమార్తెకూ లాగ మేలు చేస్తాయి,'' అన్నాడు అత్యంతలోభి.

''మిత్రమా, ఆ కథ ఏమిటి?'' అని అతిలోభి అడగగా, అత్యంతలోభి ఇలా చెప్పాడు:

### త్రిస్తని అయిన రాజకుమార్తె కథ

మధుర రాజు మధుసేనుడు. అతనికి మూడు స్తనాలు గల కుమార్తె పుట్టింది. ఇలాంటి విడ్డూరమైన కూతురు పుట్టినట్టు విని రాజు ప్రతీహారితో, ''ఈ బిడ్డ నాకు కనిపించరాదు. ఆమెను తీసుకుపోయి ఏ అరణ్యంలోనో వదిలిరా.'' అన్నాడు.

దానికి ప్రతీహారి, ''మహారాజా, మూడు స్తనాలు గల కూతురువల్ల తండ్రికి చెరుపు అని నేనూ విన్నాను. అయినా లోకనిందా, వచ్చే జన్మలో పాపఫలమూ అనుభవించకుండా ఉండగలందులకు తమరు విజ్ఞులైన బ్రాహ్మణుల సలహా పొందటం మంచిది. శ్రద్ధగా విచారించి, ఆలోచించేవాడి బుద్ధి, సూర్యకిరణాలకు పద్మం



వికసించినట్టు వికసిస్తుందంటారు. అందు చేత అజ్ఞానంలో ఉండి, అసహాయుడైన వాడు ఎడతెగక ప్రశ్నించాలి. వెనకటికి ఒక బ్రాహ్మణుడు ఒక్క ప్రశ్నతో తనను అవహించిన భూతాన్ని వదలగొట్టుకున్నాడట,'' అన్నాడు.

''ఆ కథ ఏమిటి?'' అని రాజు అడిగాడు.

ప్రతీహారి ఇలా చెప్పాడు:

ఒక భయంకరమైన అరణ్యంలో చండకర్ముడు అనే గొప్ప భూతం ఉండేది. ఒకసారి అది అరణ్యంలో తిరుగుతూ, చెట్లకిందుగా నడిచిపోతున్న ఒక బ్రాహ్మణుణ్ణి చూసి, అతని భుజాలమీద ఎక్కి, ''నడు!'' అన్నది.

బ్రాహ్మణుడు బెదిరిపోయి, నడవ సాగాడు. భూతం కాళ్లు చాలా నాజూకుగా, పద్మాలంత సుకుమారంగా ఉండటం గమనించి ఆ బ్రాహ్మణుడు, "నీ పాదాలు ఇంత అందంగా ఉండటానికి కారణం ఏమిటి?'' అని అడిగాడు.

''నేనొక నియమం పాటిస్తాను. అదేమిటంటే, ఎట్టి పరిస్థితుల్లోనూ తడికాళ్లతో నేలమీద నడవను. ఆ కారణంగా నా పాదాలు అంత సుకుమారంగా ఉంటాయి,'' అన్నది భూతం.


ఈ మాట విన్న మీదట ఆ భూతాన్ని వదిలించుకునే మార్గం బ్రాహ్మణుడికి తట్టింది.

కొద్దిసేపట్లో వాళ్ళు ఒక కొలను వద్దకు వచ్చారు.

''నేను ఈ కొలనులో స్నానం చేసి, దేవుణ్ణి ఆరాధించి వస్తాను. అంతదాకా నువ్వు ఇక్కడే ఉండు, కదలకు!,'' అని భూతం కొలనులో దిగింది.

అప్పుడు బ్రాహ్మణుడు, ''ఈ భూతం స్నానంచేసి, పూజచేసి వచ్చి నన్ను నిశ్చయంగా పారణ చేసేస్తుంది. పారిపోవటానికి ఇదే మంచి సమయం. అది నన్ను వెంటాడలేదు,'' అనుకుని, కాలిసత్తువ కొద్దీ పరిగెత్తాడు. తడి కాళ్లతో భూతం నేలమీద నడవదు గద!






## 81

భూతం కథ విని రాజు బ్రాహ్మణులను పిలిపించి, "అయ్యలారా, నాకు మూడు స్తనాలుగల బాలిక జన్మించింది. ఇందు వల్ల కలిగే అశుభం నుంచి తప్పించుకోవటానికి ఏంచెయ్యాలి?" అని అడిగాడు.

"రాజా, అంగలోపంగాని, అధికాంగాలు గాని గల స్త్రీ నీతివిహీనురాలై, భర్త మరణానికి కారకురాలవుతుంది. మూడు స్తనాలు గల కుమార్తెను తండ్రి చూసిన మరుక్షణం చనిపోతాడు. ఆమె మీ కంట పడకుండా ప్రత్యేక భవనంలో పెరగనియ్యండి. ఆమెకు యుక్తవయసు రాగానే, పెళ్ళాడ గోరినవాడికిచ్చి పెళ్ళి చేసి, ఇద్దరినీ దేశం నుంచి వెళ్ళగొట్టండి. అలా చేసినట్టయితే తమకు ఇహంలో అపయశమూ, పరంలో పాపమూ తప్పుతాయి," అన్నారు బ్రాహ్మణులు.

రాజు వారు చెప్పిన ప్రకారమే చేసి, "రాజుగారికి పుట్టిన మూడు స్తనాల కుమార్తెను ఎవరు పెళ్ళాడితే వారికి లక్ష బంగారు మాడలిచ్చి, భార్యాభర్తలను దేశం నుంచి బహిష్కరించటం జరుగుతుంది," అని దండోరా వేయించాడు.

ఈ దండోరా విని ఎవరూ రాజకుమార్తెను పెళ్ళాడతామని ముందుకు రాలేదు. అనేక సంవత్సరాలు గడిచాయి. ఆమెను పెళ్ళాడితే చావు తప్పదని అందరికీ భయమే. అందుచేత గర్భదరిద్రులు కూడా ఆమెను పెళ్ళాడ సాహసించలేదు. రాజకుమార్తె ఈడేరి, చక్కని సౌందర్యవతిగా తయారయింది. రోజూ నగరంలో దండోరా వేస్తూనే ఉన్నారు.

ఒకనాడు నగరానికి ఒక గుడ్డివాడు ముష్టిఎత్తుకునేటందుకు వచ్చాడు. వాణ్ణి



నడిపించటానికి, వాడి గ్రామానికి చెందిన వాడే ఒక గూనివాడు కూడా అతడి వెంట వచ్చాడు.

ఈ చాటింపు విని గుడ్డివాడు గూనివాడితో, "నన్ను ఆ చాటింపువేసే వాడి వద్దకు తీసుకుపో. నేను వాడి తప్పెట తాకి, నా సమ్మతి తెలుపుతాను. నా భార్య చెడ్డదైతే ఏంగాక, లక్ష బంగారు కాసులు సంపాదించుకుంటాను. హాయిగా బతకవచ్చు! తరవాత చచ్చిపోయినా ఫర్వాలేదు. నా వంటి గర్భదరిద్రుడికి చావు కూడా విమోచనమే. కాకపోతే కొంత కాలంపాటు సుఖాలలో ఓలలాడవచ్చు," అన్నాడు.

మంధరకుడు అనే పేరుగల గూనివాడు, గుడ్డివాణ్ణి చాటింపు వేసేవాడి వద్దకు తీసుకుపోయి, తప్పెట తాకించాడు.

గుడ్డివాడు చాటింపు వేయిస్తున్న అధికారితో, "రాజుగారు నాకు తమ కుమార్తెను ఇయ్యటానికి సిద్ధంగా ఉన్నట్టయితే, ఆమెను పెళ్ళాడతాను," అన్నాడు.

గుడ్డివాణ్ణి రాజుగారి వద్దకు తీసుకుపోయి, వాడు రాజకుమార్తెను పెళ్ళాడటానికి ఇష్టపడుతున్నట్టు చెప్పారు.

"నా నియమానికి ఒప్పుకున్నవాడు ఎలాటివాడైతే నేం? గుడ్డివాడైనా, కుష్ఠువాడైనా, అంటరాని వాడైనా, వాడు నా కూతుర్ని పెళ్ళాడి, దేశం విడిచిపోయే మాటైతే, వాడికి పిల్లతోబాటు లక్ష బంగారు కాసులు ఇస్తాను," అన్నాడు రాజు.

రాజాజ్ఞను పురస్కరించుకుని, రాజుగారి మనుషులు గుడ్డివాణ్ణి తీసుకుపోయి నదిలో స్నానం చేయించి, మేలివస్త్రాలు వాడికి కట్టబెట్టి, శాస్త్రోక్తంగా రాజకుమార్తె నిచ్చి, వివాహం జరిపించి, వాడిచేతిలో లక్ష బంగారుకాసులు పెట్టి, వాణ్ణీ, వాడి వధువునూ, పడవలో ఎక్కించి, యమునా నదిలో వదిలిపెట్టారు. వారితోపాటు గూనివాడు కూడా పడవ ఎక్కాడు. పడవవాడు వాళ్ళను దేశం దాటించి, తిరిగి వెళ్ళిపోయాడు.

వాళ్ళు ఒక పెద్ద నగరం చేరి, పెద్ద భవంతి మాట్లాడుకుని, అందులో వైభవంగా జీవించసాగారు. గుడ్డివాడు తినటమూ, నిద్రపోవటమూ తప్ప ఇంకేమీ చేసేవాడు కాడు. గూనివాడే ఇంటి పనులన్నీ చూసేవాడు.

త్వరలోనే రాజకుమార్తెకూ, గూనివాడికీ మధ్య సంబంధం ఏర్పడింది.

ఒకసారి ఆమె తన ప్రియుడితో, "ఈ గుడ్డివెధవను చంపేస్తే మనిద్దరమూ సుఖంగా ఉండవచ్చు. నువు ఘాటైన విషం తెస్తే నేను గుడ్డివాడి ఆహారంలో దాన్ని కలుపుతాను," అన్నది.

గూనివాడు విషం కోసం చూస్తూండగా వాడికి చచ్చిపోయిన మహానాగు కనిపించింది. వాడు దాన్ని ఇంటికి తీసుకుపోయి, రాజకుమార్తెతో, "దీన్ని ముక్కలుగా తరిగి, మసాలా దినుసులు బాగా దట్టించి, చేపలకూర లాగా ఉండేటట్టు వండి, గుడ్డివాడి చేత తినిపించు. వాడికి చేపలకూర అంటే అమిత ఇష్టం. అందుచేత వాడు దాన్ని తెగమెక్కి, చచ్చి ఊరుకుంటాడు," అని చెప్పి, పనిచూసుకోబోయాడు.

రాజకుమార్తె గూనివాడు చెప్పినట్టే పామును వండి, గుడ్డివాడి వద్దకు గరిటెతో వెళ్ళి, "ప్రియా, నీకు ఇష్టమని చేపల కూర వండాను. నేను వెళ్ళి నీళ్ళు తీసుకు వస్తాను. ఈ లోపల ఈ గరిటెతో కూరను కలుపుతూ ఉండు," అన్నది.



గుడ్డివాడు సంతోషించి, పెదవులు నాకుక్కుంటూ, గరిటెతో పొయివద్దకు వెళ్లి, మధ్యమధ్య కూరను కలపసాగాడు. విషపునాగు నుంచి వెలువడే ఆవిరికి గుడ్డివాడి కంటికి చూపులేకుండా చేసిన పొరలు కాస్తా కరిగిపోయి, వాడికి చూపు వచ్చేసింది.

వాడు పొయి మీద ఉన్నది చేపలు కావనీ, కాలసర్పం ఖండాలనీ తెలుసుకుని, "ఇదేమిటి? ఆమె కాలనాగును వండుతూ చేపలు వండుతున్నానని నాతో ఎందుకు చెప్పింది? అంతా తెలుస్తూనే ఉన్నది! ఈ మూడు స్తనాల ఆడదానికి నీతి ఉండదు. అది గూనివాణ్ణో, మరొకణ్ణో మరిగి నన్ను చంపెయ్యటానికి ఈ ఎత్తు వేసింది. నేను నిజం తెలుసుకుని, దాని నేరం బయటపెట్టాలి," అనుకుని, తనకు కళ్ళురానట్టే నటిస్తూ, కూరను కలపసాగాడు.

తరవాత కొద్ది సేపటికి గూనివాడూ, రాజకుమార్తె కూడా ఇంటికి తిరిగి వచ్చారు. గుడ్డివాడు చూడలేడు గదా అని ఇద్దరూ స్వేచ్ఛగా సరసాలాడారు. ఇది చూసిన గుడ్డివాడు, అందుబాటులో ఆయుధం ఏదీ లేనికారణంచేత, తన సహజ ధోరణిలో తడువుకోసాగాడు. అది కూడా వాళ్లు పట్టించుకోలేదు.

గుడ్డివాడు అకస్మాత్తుగా గూనివాణ్ణి పట్టుకుని పైకెత్తి గిరగిరా తిప్పి రాజకుమార్తె వక్షంమీద బలంగా కొట్టి, ఇద్దరినీ ఒక్క దెబ్బతో చంపుదామనుకున్నాడు. కాని వాస్తవంగా జరిగినదేమంటే, రాజకుమార్తెకు అదనంగా ఉన్న స్తనం కాస్తా అణగారిపోయింది. గూనివాడి వీపు సరిఅయి, గూని కాస్తా పోయింది!

ఈ విధంగా విధి అనుకూలించిన కారణంగా, రాజకుమార్తే, గుడ్డివాడూ, గూనివాడూ చావటానికి జరిగిన ప్రయత్నాలు వారి లోపాలను సరిదిద్దటానికి మాత్రమే ఉపయోగపడి, అంతులేని మేలు చేశాయి.





# అసమీక్షకారిత్వం

## 82

అతిలోభి అత్యంతలోభితో, "విధి అనుకూలించిన కారణంగా అనర్హులు సైతం లాభం పొందేమాట నిజమే. కాని మనిషి దాన్ని నమ్ముకుని, దురాశకు లోనుకావటంవల్ల విధి వక్రించవచ్చు. అప్పుడు నీకు కలిగినట్టుగా తీరని దుఃఖం సంప్రాప్తమవుతుంది. నిన్ను చూసి నేను మనస్ఫూర్తిగా జాలి చెందుతున్నాను. ఇక నేను, యీ ప్రాంతం నుంచి ఇంటికి తిరిగి వెళ్ళాలి. అందుచేత నాకు సెలవు ఇయ్యి." అన్నాడు.

దానికి అత్యంతలోభి, "మిత్రమా, దుర్దశ కలిగినప్పుడు మిత్రులూ, ధనమూ సహాయపడతాయంటారు. మరి నన్ను ఈ స్థితిలో వదిలి ఎందుకు పోతానంటున్నావు? ఆపదలో ఉన్న స్నేహితుణ్ణి నిర్దయగా విడిచిపెట్టేవాడు కృతఘ్నుడనీ, నరకానికి పోతాడనీ అంటారు గద!" అన్నాడు.

"మిత్రుడి కష్టాన్ని తీర్చగల స్థితిలో ఉన్నవాడి విషయంలోనే ఆ మాట వర్తిస్తుంది. నీ కష్టాన్ని మానవమాత్రుడెవరూ తీర్చలేడు. నీకు విముక్తి కలిగించే శక్తి నాకు కాదుగదా మరెవరికి కూడా లేదు. నేను నీ దగ్గిరే ఉండటంచేత నీకు చిన్నమెత్తు మేలు కలగకపోగా, నీ బాధ చూస్తూ నేను కూడా బాధ పెంచుకోవలసి వస్తుంది. నీ ముఖంలోని బాధ చూస్తూంటే నాకు కూడా ఇలాటి దుస్థితే కలుగుతుందేమోనని భయం పుట్టుకొస్తున్నది. అందుచేత, దయ ఉంచి నన్ను త్వరగా వెళ్ళిపోనీ," అన్నాడు అతిలోభి.

అత్యంతలోభి, "సరే, ఇంటికి పోయి, సుఖంగా ఉండు. నా ప్రారబ్ధం గురించి



నా వాళ్ళకు అందరికీ తెలియపరచు.'' అన్నాడు.

అతిలోభి ఆ పర్వతప్రాంతాన్ని విడిచి పెట్టి, మళ్ళీ మనుష్యప్రపంచంలో వచ్చి పడ్డాడు.

ముసలి పులి కథ

దక్షిణారణ్యాలలో ఒక ముసలి పులి ఉండేది. ఒక రోజు అది ఒక మడుగులో స్నానం చేసి, ఒక చేతితో దర్భలూ, రెండో చేతితో సువర్ణ కంకణమూ పట్టుకుని కూర్చుని, దారే పోయే వారితో, ''ఓ పాంథులారా! కొంచెం ఆగండి! ఈ కంకణాన్ని బహుమతిగా పుచ్చుకోండి.'' అనసాగింది.

ఎవరూ దాని మాట వినిపించుకోకుండా, తమ దారిన తాము వెళ్ళారు.

చివరకు ఒక దురాశాపరుడు తనలో, ''నా అదృష్టం! అయినా ఇందులో కించిత్తు ప్రమాదం లేకపోలేదు. అందుచేత జాగరూకత అవసరం! కోరదగినదైనా కోరదగనిచోట, లభించటంలో అపాయం ఉన్నది. విషంతో కూడిన అమృతం కూడా ప్రాణం తీస్తుంది గదా! కాని ఆ మాటకు వస్తే, అంతో ఇంతో అపాయం లేకుండా ధనం ఎలా వస్తుంది? కొంత సాహసం లేనిదే ఎవరూ ధనికులు కాలేరు. ఈ బహుమతి యొక్క లోతుపాతులు క్షుణ్ణంగా విచారింతాం,'' అనుకుని, పులితో, ''కంకణం ఏదీ?'' అన్నాడు.

పులి తన పంజా ముందుకు చాచి, సువర్ణకంకణాన్ని చూపుతూ, ''ఇదుగో!'' అన్నది.

''నీ వంటి క్రూర ప్రాణిని నమ్మటమెలాగ?'' అని పాంథుడు ముసలి పులిని అడిగాడు.

''అయ్యో, నా కథ వింటే నీకే నమ్మకం కలుగుతుంది. యౌవనంలో నేను చాలా పాపిష్ఠిని. నేను ఎంతమంది మనుషులనూ, ఎన్ని పశువులనూ చంపానో లెక్క లేదు. దాని ఫలితంగా నా భార్యా,

బిడ్డలూ చచ్చి, నేను మాత్రమే మిగిలాను. అప్పుడొక సాధువు నన్ను దానధర్మాలూ, పుణ్యకార్యాలూ చెయ్యమన్నాడు. ఆ ప్రకారమే నేనిప్పుడు రోజూ స్నానం చేసి, దానాలిస్తున్నాను. నాకు వృద్ధాప్యం వచ్చేసింది. కోరలూ, గోళ్ళూ తమ శక్తి కోల్పోయాయి. నన్ను నువు అనుమానించవలసిన పని ఏమిటి? యజ్ఞమూ, వేదాధ్యయనమూ, దానమూ, తపస్సూ, సత్యవ్రతమూ, క్షమా, ఓరిమీ, లోభరాహిత్యమూ అనే ఎనిమిది మార్గాల పుణ్యం కలుగుతుందని పురాణాలు చెబుతున్నాయి. ఇందులో మొదటి నాలుగూ ఆడంబరం కావచ్చు. కాని చివరి నాలుగూ మహాత్ములకు మాత్రమే సాధ్యం. నేను నిస్వార్థిని కనకనే అడిగిన వారికి ఈ సువర్ణకంకణం ఇచ్చెయ్యటానికి సిద్ధంగా ఉన్నాను. అయితే, పులి అవకాశం దొరికితే మనిషిని తినకుండా ఉండదన్న అపవాదు ఒకంతట పోదు. నేను ధర్మశాస్త్రాలన్నీ చదివాను. పేదవాడికి ఇచ్చిన దానం ఎడారిలో వర్షంలాటిది; ఆకలిగొన్నవాడికి ఆహారం లాటిది! అందరికీ ప్రాణం అంటే తీపే! సజ్జనులు అందరినీ తమలాగే చూసుకుంటారు. ఏది విసర్జించాలి, ఏది స్వీకరించాలి, ఏది మంచిది, ఏది చెడ్డది అన్న సంగతి మనిషికి తన అనుభవంనుంచే తెలుస్తుంది. నువు చాలా పేదవాడివి. నేను నీకు ఈ విలువగల కంకణం ఇయ్యగోరు



తున్నాను. ధనాన్ని నిర్ధనులకు ఇయ్యాలి గాని, ధనవంతులకు ఇయ్యరాదు. ఔషధం రోగికిగానీ, ఆరోగ్యవంతుడికి కాదు గదా! అందులోనూ ప్రతిఫలాపేక్ష లేకుండా చేసే దానం ఉత్తమోత్తమమని మహర్షులు చెప్పారు. కనక, మడుగులో స్నానం చేసి యీ సువర్ణదానం పుచ్చుకో," అన్నది పులి.

పాంథుడు పులి మాటలు నమ్మి, కంకణం తీసుకోవాలన్న దురాశతో, స్నానం చెయ్యటానికి నీటిలోకి దిగాడు. దిగిన మరుక్షణం అతను మొలబంటి బురదలో కూరుకుపోయి, కదలలేక పోయాడు.

వాడు ఊబిలో కూరుకుపోవటం చూసి పులి, "అయ్యో, ఊబిలో చిక్కుపడ్డావా? భయపడకు. నేను నిన్ను బయటికి లాగుతాను ఉండు," అంటూ తాపీగా వాణ్ణి సమీపించింది.

దాన్ని చూసి పాంథుడు, "ధర్మ శాస్త్రాలూ, వేదాలూ చదివిన మాత్రాన దుర్మార్గుణ్ణి నమ్మరాదు. ఏ మేత మేసినా ఆవుపాలు తియ్యగానే ఉండే తీరుగా, క్రియకు అంతస్స్వభావమే గణనకు వస్తుంది. ఇంద్రియాలూ, బుద్ధీ అదుపులో లేనివాడి చర్యలు ఏనుగు స్నానంలాగా నిరుపయోగమైనవి. ఆచరణ లేకుండా శుష్కోపదేశాలు చెయ్యటం అనాకారిది ధరించిన ఆభరణాలలాగా బరువు చేటు! ఈ ఘాతుకమృగాన్ని నమ్మి నేను పొరపాటు పడ్డాను. నదులనూ, ఆయుధాలు ధరించిన వారినీ, కొమ్ములూ, గోళ్ళూ కల వాటినీ, స్త్రీలనూ, రాజులనూ నమ్మరాదు. చిట్టచివరకు వ్యక్తమయేది అంతస్స్వభావమే! ఆకాశంలో సంచరిస్తూ, అంధకారాన్నీ, పాపాలనూ తొలగించుతూ, సహస్రకిరణాలతో చుక్కల మధ్యగా తిరిగే చంద్రుణ్ణి సైతం విధివశాన రాహువు మింగేస్తూ ఉంటాడు. నుదిటి వ్రాత తప్పించుకోవటం ఎవరితరం?" అనుకుంటూ ఉండగా పులి వచ్చి అతన్ని చంపి తినేసింది.





# అసమీక్షకారిత్వం

## 83

మగధదేశంలో చంపకవతి అనే అరణ్యంలో ఒక కాకీ, ఒక లేడీ చాలా కాలంగా స్నేహం చేస్తూ ఉండేవి. లేడి బాగా కండపట్టి, నేవళంగా ఉండేది.

ఒకనాడు అది అరణ్యంలో యథేచ్ఛగా తిరుగుతూండగా, ఒక నక్క దాన్ని చూసి, "దీని కమ్మని మాంసం ఎలా రుచి చూడాలి? అందుకు ఒకటేమార్గం: దానికి - నాలో నమ్మకం కుదిరేలాగా చేయాలి," అనుకుని, లేడిని సమీపించి, "మిత్రమా, కులాసాగా ఉన్నావా?" అని అడిగింది.

"ఎవరు నువు?" అని లేడి అడిగింది.

"నేను క్షుద్రబుద్ధి అనే నక్కను. నేను నా వారినందరినీ పోగొట్టుకుని ఇక్కడ కుంటి జీవితం గడుపుతున్నాను. ఇప్పుడు మనం మిత్రులమయాం కనక, నా జీవితం ఇంక నాలుగు కాళ్ళమీద నడుస్తుంది. నేను శాశ్వతంగా నీ వెంట ఉండగోరుతున్నాను," అన్నది నక్క.

"అలాగే," అన్నది లేడి.

సూర్యాస్తమయం అయినదాకా ఆ రెండూ కలిసి తిరిగి, లేడి ఇంటికి చేరాయి. లేడితో దీర్ఘకాల స్నేహంగల సుబుద్ధి అనే కాకి ఒక చంపకవృక్షం కొమ్మ మీద కూర్చుని ఉండి, లేడి తన వెంట ఒక నక్కను తీసుకురావటం చూసి, "మిత్రమా, ఇది ఎవరు?" అని అడిగింది.

"ఈ నక్క మనతో స్నేహం కోరుతున్నది," అన్నది లేడి.

దానికి కాకి, "మిత్రమా, అపరిచితులతో ఆకస్మిక స్నేహం మంచిది కాదు. ఒకరి కులగోత్రాలూ, స్వభావమూ తెలియకుండా ఆశ్రయ మియ్యరాదు.



ఒక పిల్లి చేసిన మోసం వల్ల జరద్గవం అనే రాబందు తన ప్రాణాలు కోల్పోయింది,'' అన్నది.

''అది ఎలా జరిగింది?'' అని లేడి కాకిని అడిగింది.

కాకి ఇలా చెప్పింది:

జరద్గవా, దీర్ఘకర్ణులు

గంగాతీరాన గృధ్రకూట మనే కొండ మీద ఒక పెద్ద చెట్టుతొర్రలో జరద్గవం అనే రాబందు నివసిస్తూ ఉండేది. దురదృష్ట వశాన దాని కళ్ళూ, గోళ్ళూ పోయాయి. ఆ చెట్టు మీద నివసించే పక్షులు దాని మీద జాలిపడి, తమ ఆహారంలో నుంచి దానికి కొంత కొంత ఇచ్చేవి. అది వాటిపై ఆధారపడి బతుకుతూ, పెద్ద పక్షులు ఆహారం కోసం వెళ్ళినప్పుడు, వాటి పిల్లలను కనిపెట్టి ఉండేది.

ఒకసారి పెద్ద పక్షులు బయటికి వెళ్ళి ఉన్న సమయంలో వాటి పిల్లలను తినటానికి దీర్ఘకర్ణం అనే పిల్లి వచ్చింది. దాన్ని చూసి పక్షి పిల్లలు భయపడి గగ్గోలుపెట్టాయి. రాబందు రావటం చూసి, దీర్ఘకర్ణం తనలో, ''అయ్యో, నా పని అయిపోయింది! అయినా, అపాయం రానంత వరకే దాన్ని గురించి భయపడాలిగాని, తీరావచ్చి పడ్డాక అపాయం నుంచి బయటపడే మార్గం ఆలోచించాలి. ఇది నన్ను చూడనే చూసింది గనక, పారిపోయి లాభంలేదు. ఏమయితే కానీ, నేను దీన్ని ముందు నమ్మించి, తరవాత సమీపిస్తాను,'' అనుకున్నది.

''అయ్యా, నా నమస్కారాలు స్వీకరించండి,'' అన్నది పిల్లి.

''ఎవరు నువు?'' అని రాబందు అడిగింది.

''నేను పిల్లిని,'' అన్నది దీర్ఘకర్ణం.

''ముందు వెళ్ళిపో. నేను నీ ప్రాణం తీయగలను,'' అన్నది రాబందు.

''నా మాట కాస్త ఆలకించి, నన్ను చంపాలని తమకుతోస్తే అలాగే చెయ్యండి. ఒక కులానికో, జాతికో చెందిన మాత్రాన

ఎవరినిగాని గౌరవించటమూ, చంపటమూ భావ్యమవుతుందా? ఎవరి ప్రవర్తనగాని ఎలా ఉన్నదీ తెలుసుకున్న మీదటనే గదా సన్మానించటమో, చంపటమో చేస్తాం?'' అన్నది పిల్లి.

''నువు ఇక్కడికి ఎందుకు వచ్చావు?" అని రాబందు అడిగింది.

''నేను ఈ పవిత్రమైన గంగాతీరాన నివసించుతూ, రోజూ గంగాస్నానాలు చేస్తూ, బ్రహ్మచర్యం అవలంబించి చాంద్రాయణ వ్రతం చేస్తున్నాను. తమరు స్మృతులు అధ్యయనం చేస్తూంటారని నమ్మకంగా కొన్ని పక్షులు చెప్పగా విని, వయోవృద్ధులూ, జ్ఞానవృద్ధులూ అయిన తమ నుంచి ధర్మసూక్ష్మాలు తెలుసుకోగోరి వచ్చాను. మీకు అతిథిగా వచ్చిన నన్ను తమరు చంపుతాననే సరికి తమకు ధర్మాలు తెలియవని గ్రహించాను. ఇంటికి అతిథిగా వచ్చిన శత్రువుకు కూడా తగిన ఆతిథ్య మియ్యాలని ధర్మశాస్త్రాలు చెబుతున్నాయి. తనను కొట్టటానికి వచ్చిన వాడికి కూడా చెట్టు నీడనిస్తుంది. వెళ్ళగొట్టబడిన అతిథి తనను వెళ్లగొట్టిన గృహస్థు పుణ్యం యావత్తూ పట్టుకుపోతాడు. అధమ వర్ణస్తుడు తన ఇంటికి వచ్చినప్పుడు అగ్రవర్ణస్తుడు కూడా గౌరవించాలి. ఎందుకంటే, అతిథి అందరి దేవతలకూ ప్రతినిధి.'' అన్నది పిల్లి.

దానికి రాబందు, ''పిల్లులకు రెక్కలు రాని పక్షులను తినటం ఇష్టం. ఇక్కడ



రెక్కలురాని పక్షి పిల్లలు ఉన్నాయి. అందుకని నేను అలా అన్నాను,'' అన్నది.


పిల్లి నేలను తాకిన చేతులతో తన చెవులను తాకి, ''నేను స్మృతులు చదువుకున్నాను. వికారాలు వర్జించాను. చాంద్రాయణ ఉపోషాలు చేస్తున్నాను. అనేక విషయాలలో ధర్మశాస్త్రాలు పరస్పరం భేదించినప్పటికీ, అహింస పరమధర్మం అన్న విషయం ఏకగ్రీవంగా ఒప్పుకుంటున్నాయి. దానికి వేరేకారణం లేదు; ఇతరులకు ఎలాటి హానీచేయక, ఇతరులు తనకు చేసిన హానిని క్షమించినవాడు తిన్నగా స్వర్గానికి పోతాడు. చచ్చిపోయినాక సంచితపుణ్యం ఒకటే వెంటవచ్చేది; మిగిలినదంతా దేహంతోపాటే నశిస్తుంది. తినేవాడికి తాత్కాలిక జిహ్వాచాపల్యం మాత్రమే తీరుతుంది. తినబడేవాడు తన ప్రాణాన్నే కోల్పోతాడు. చావు వచ్చి పడుతూంటే మనిషి చెందే ఆవేదన ఇతరులు గ్రహించరానిదీ, వర్ణించలేనిదీనూ. అడవిలో తమంతట తాము పెరిగే ఆకులూ, అలములూ తిని నింపుకోదగిన వెధవపొట్ట కోసం ఎవడైనా ఇతరుల ప్రాణాలు తీసి, పాపం కట్టుకుంటాడా?'' అన్నది.

రాబందు ఈ మాటలకు మోసపోయి, పక్షులకు తెలియకుండా, పిల్లిని చెట్టు తొర్రలో తనతోబాటు ఉండనిచ్చింది.

రాబందును మాటలతో మోసగించి, దానిచెట్టు తొర్రలో చేరిన పిల్లి రోజూ ఏదో ఒక పక్షిపిల్లను పట్టి తొర్రలోకి తెచ్చి, అక్కడ దాన్ని తింటూ వచ్చింది.

కొంతకాలం గడిచినాక తమ పిల్లలను పోగొట్టుకున్న పక్షులు హంతకు డెవరని తేల్చటానికి సమావేశం జరిపాయి. అవి తన ఆచూకీ తెలుసుకునే ప్రయత్నంలో ఉన్నాయని తెలియగానే, పిల్లి చెట్టు తొర్రను విడిచి చల్లగా వెళ్ళిపోయింది.

పక్షులు ఆ ప్రదేశమంతా గాలించి, చివరకు చెట్టుతొర్రలో ఎముకలు చూసి, రాబందే తమ పిల్లలను తిన్నదని నిర్ధారణ చేసుకుని దాన్ని చంపేశాయి






## 84

పిల్లి మూలంగా రాబందు చచ్చిపోయిన కథ చెప్పి, కాకి లేడితో, "కనక, కుల గోత్రాలూ, స్వభావమూ తెలియనివాళ్ళను చేరనియ్యరాదు," అన్నది.

ఈ మాటకు నక్క మండిపడి, "లేడికి నువు మొదట పరిచయమైనప్పుడు దానికి నీ కులగోత్రాలూ, స్వభావమూ తెలుసునా ఏమిటి ? దానికీ, నీకూ రోజుకురోజు మైత్రి ఎలా అభివృద్ధి అవుతున్నది? నీ అల్ప బుద్ధి ఇందులోనే కనబడుతున్నది. 'ఇది నాది, ఇది పరాయిది' అన్న భావం సంకుచిత బుద్ధులకే తోస్తుంది. పండితులు లేని చోట అపండితుడే శ్లాఘించబడతాడు. చెట్టు లేనిచోట ఆముదపు చెట్టే మహా వృక్షం! విశాలహృదయులకు ప్రపంచమంతా తమదే! ఈ లేడికి నేను మిత్రుణ్ణి అయినట్టే నువూ అయావు," అన్నది.

"ఎందుకొచ్చిన కీచులాట? మన మందరమూ సుఖంగా కలిసి ఉందాం. జన్మతః ఎవరికి ఎవరూ మిత్రులుగాని, శత్రులుగాని కారు," అన్నది లేడి.

"అలాగేకానీ," అన్నది కాకి.

అది మొదలు ఆ మూడూ కలిసి ఉంటూ, పగలు ఆహారం కోసం దేని దారిన అది పోతూ ఉండేవి.

ఒకనాడు నక్క ఏకాంతంలో లేడితో, "మిత్రమా, ఈ అరణ్యంలో ఒక మూల పంటకు వస్తున్న చేను ఉన్నది. దాన్ని నీకు చూపుతాను," అని, లేడిని అక్కడికి తీసుకుపోయింది.

తరవాత లేడి రోజూ ఆ చేను వద్దకు పోయి, చేలోపడి మేస్తూ వచ్చింది. చేను గలవాడు ఈ సంగతి గ్రహించి, ఉచ్చు పన్నాడు. లేడి ఆ ఉచ్చులో చిక్కుకున్నది.

''నన్ను ఇప్పుడు చావు నుంచి మిత్రుడు తప్ప మరెవరు కాపాడగలరు?'' అని లేడి అనుకున్నది.

ఇంతలో నక్క అటుగావచ్చి, ఉచ్చులో చిక్కిన లేడిని చూసి, ''నా ఎత్తు పారింది. రైతు వచ్చి దీన్ని కోసి, మాంసం అంటుకున్న ఎముకలనైనా వదలకపోడు. కొంతకాలంపాటు నాకు కడుపునిండా తిండి!'' అని తనలో అనుకున్నది.

లేడి మాత్రం తన మిత్రుణ్ణి చూసి పరమానందం చెంది, ''మిత్రమా, ఉచ్చు తాళ్ళను నీ కోరలతో తెంచి, నన్ను విడిపించు. స్నేహితుడి విలువ ఆపత్సమయంలోనూ, యోధుడి విలువ యుద్ధంలోనూ, నమ్మకస్థుడి విలువ అప్పులలో మునిగి తేలేటప్పుడూ, భార్య విలువ కటిక దారిద్ర్యం సంభవించినప్పుడూ, బంధువుల విలువ శోకసమయంలోనూ తెలుస్తుంది. వినోదంలోనూ, విషాదంలోనూ, కాటకంలోనూ, అరాజకంలోనూ, రాజద్వారానా, శ్మశానంలోనూ తోడుగా నిలిచినవాడే నిజమైన మిత్రుడుగాని, బంధువుగాని అనిపించుకుంటాడు,'' అన్నది.

నక్క ఉచ్చు కేసి ఒకటికి నాలుగు సార్లు జాగ్రత్తగా చూసి, ''ఫరవాలేదు, తాళ్ళు గట్టివి! ఇది తప్పించుకోలేదు!'' అని రూఢిచేసుకుని, లేడితో, ''మిత్రమా, ఈ ఉచ్చును నరాలతో అల్లారు. పవిత్రమైన ఈ ఆదివారంపూట ఈ అపవిత్రమైన జంతు తంతులను నా కోరలతో ఎలా



తాకను? ప్రపంచానికంతకూ కాంతినీ, శౌచాన్నీ ఇచ్చే సూర్యభగవానుడికి ఈరోజు అంకితమయినది గదా! ఇవాళ నేను నీ కోరిక తీర్చలేకపోయినందుకు నన్ను అపార్థం చేసుకోకు. రేపు ఉదయం వచ్చి నువు కోరిన ప్రకారం చేస్తాను,'' అని అది అవతలికి వెళ్ళిపోయి, ఒక పొద చాటున దాగి, ఎప్పుడు చేనుగలవాడు వచ్చి లేడిని కోస్తాడా, ఎప్పుడు తనకు మాంసం అంటుకున్న ఎముకలు లభిస్తాయా అని ఎదురు చూడసాగింది.

సాయంకాలం అయినా లేడి తిరిగి రాలేదని, కాకి దానికోసం అంతటా వెతికి, చీకటిపడేవేళ అది చేనులో ఉచ్చులో తగులుకుని ఉండటం చూసింది.

''మిత్రమా, ఏమిటిది?'' అని కాకి లేడిని అడిగింది.

''నీ సలహా వినకందుకు కలిగిన దుష్ఫలితం! హితం కోరిన మిత్రుడు చెప్పే వివేకంగల సలహాలను విననివాడు కష్టాలపాలవుతాడు. వాణ్ణి చూసి వాడి శత్రువులు ఆనందిస్తారు,'' అన్నది లేడి.

''ఆ ద్రోహి ఎక్కడ?'' అని కాకి అడిగింది.

''నా మాంసం కోసం అంగలార్చుతూ, ఆ పొదవెనక దాగి ఉన్నది,'' అన్నదిలేడి.

''నేను ముందే చెప్పాను. మనం మంచి వాళ్ళమూ, దోషరహితులమూ గదా అని, దుర్మార్గులను నమ్మవలసినపని లేదు. నిర్దోషులు కష్టాలపాలు అయేది దుర్మా



ర్గుల మూలానే! ఎదట తియ్యగా మాట్లాడి, పరోక్షంలో ప్రయత్నాలకు విఘ్నాలు కలిగించే వాళ్ళు, పైన పాలూ, అడుగున విషమూగల పయోముఖవిషకుంభాలు!'' అని కాకి పెద్దగా నిట్టూర్చి, ''ఓరి దురాత్ముడా, ఇంత నీచానికి ఎలా ఒడిగట్టావురా? నీతో సహజీవనం చేస్తూ, నువు చెప్పే తియ్యటి కబుర్లు విని, 'ఆపదలో ఆదుకుంటావని విశ్వసించే మిత్రులకు ద్రోహంచెయ్యటం వల్ల నీ కీర్తి ఏం పెరుగుతుంధి? ఓ భూదేవీ! నమ్మకద్రోహం చేసే వాళ్ళ భారాన్ని నువు ఎలా మోస్తున్నావు? దుర్మార్గుడితో స్నేహం చెయ్యరాదు. వేడిగా ఉంటే చేతిని కాల్చి, ఆరిపోయినాక కూడా చేతిని మసి చేసే బొగ్గు లాటివాడు వాడు! దుర్మార్గుల పద్ధతే ఇంత అని తెలిసిన నేను నక్కను తప్పుపట్టే పనేమున్నది? దుర్మార్గుడు మొదట కాళ్ళ మీద పడతాడు. తరవాత చెవిలో తియ్యగా ఏదో పాడతాడు. చివరకు మనను కాటు వేస్తాడు. వాడి నాలుక మీద తేనే, కడుపులో విషమూ ఉంటాయి! మిత్రమా, తెల్లవారుతూనే రైతు వస్తాడు. నే నేమో నిన్ను కాపాడలేను. అందుచేత రైతు రావటం దూరానే చూసి నేను నీకు హెచ్చరికగా అరుస్తాను. నువు చచ్చిపోయినట్టు నేల మీద పడిపో. నేను మళ్ళీ అరుస్తాను చూడూ! అప్పుడు లేచి పారిపో!" అన్నది.

తెల్లవారుఝామున చేనుగల రైతు దుడ్డుకర్రతో వచ్చాడు. వాణ్ణి దూరాన చూస్తూనే కాకి అరిచింది. లేడి నేల మీద పడి ప్రాణంపోయినట్టు నటించింది. రైతు పరమానందంచెంది, ''నీ అంతట నువే చచ్చావా? భేష్!'' అంటూ ఉచ్చులు ఊడదీసేశాడు. వాడు ఉచ్చులను ముడుస్తూండగా కాకి మళ్ళీ అరిచింది. లేడి చప్పునలేచి, వేగంగా పరిగెట్టుతూ, నక్క దాగిఉన్న పొదనుదాటి వెళ్ళిపోయింది. ఆశాభంగంకలిగిన రైతు, తన దుడ్డుకర్రను పొద కేసి బలంగా విసిరాడు. దాని దెబ్బకు నక్క చచ్చి ఊరుకున్నది.





# 85

### పరధర్మం భయావహం

పవిత్రమైన వారాణసి నగరంలో కర్పూర పటకుడు అనే చాకలి ఉండేవాడు. వాడు ఒకరాత్రి అలసిపోయి గాఢనిద్రలో పడిపోయాడు. వాడి ప్రాంగణంలో వాడి గాడిదా, కుక్కా కట్టివేసి ఉన్నాయి.

ఇంతలో చాకలి ఆవరణలోకి ఒక దొంగ ప్రవేశించాడు.

అది చూసి గాడిద కుక్కతో, "మిత్రమా, నువు వెంటనే మొరిగి, మన యజమానిని నిద్రలేపు. అది నీ ధర్మం కదా?" అన్నది.

"నువు నా విషయాలలో జోక్యం కలిగించుకుని, నా ధర్మం గుర్తుచేయవలసిన పనిలేదు. ఒకప్పుడు నేను ఎంతో విశ్వాసంతో నా యజమాని ఇంటినీ, సొత్తునూ కాచిన సంగతి నీకు తెలుసు. చాలాకాలంగా సుఖమూ, క్షేమమూ మరిగి అతగాడు నా విలువ మరచిపోయి, నాకు చాలినంత తిండి పెట్టకుండా ఉన్నాడు. అంతో ఇంతో అపాయం ఎదురయేదాకా యజమానులు తమ సేవకులను లక్ష్య పెట్టరు. ఇవాళ దొంగను కొన్ని వస్తువులు దోచుకుపోనీ! రేపటి నుంచీ యజమాని నాకు బాగా తిండి పెట్టుతాడు," అన్నది కుక్క.

"నా మాట వినవే, భ్రాష్టమా! తన ధర్మం నిర్వర్తించవలసిన క్షణంలో స్వార్థం ఆలోచించే మనిషి ఎలాటి నౌకరు, ఎలాటి మిత్రుడు?" అన్నది గాడిద.

"సేవకులను తిండికి మాడ్చి, అవసరం పడినప్పుడు మాత్రమే తియ్యటి మాటలాడేవాడు ఏమన్న యజమాని?" అని కుక్క అడిగింది.

ఈ మాటకు గాడిద మండిపోయి, "పాపిష్ఠిదానా! ఇలాటి సమయంలో యజమాని క్షేమాన్ని విస్మరించే నువు ఎంతో హీన ప్రాణివి! చేసేదేముందీ? నేనే శక్తివంచనలేకుండా యజమానిని నిద్ర లేపుతాను. వెచ్చదనం కోసం సూర్యుడికి వీపు చూపాలి, అగ్నికి ముఖం చూపాలి; యజమానిని మనస్ఫూర్తిగా సేవించాలి; నిర్మల చిత్తంతో ఉత్తమ లోకాల కోసం కృషి చెయ్యాలి," అని, గట్టిగా ఓండ్ర పెట్టింది.

గాడిద అరుపు వింటూనే, దొంగ పారిపోయాడు. కాని మంచి నిద్ర పాడుచేసినందుకు చాకలివాడు లేచి, గాడిదను చావగొట్టాడు.

### ఏనుగును చంపిన నక్క

బ్రహ్మారణ్యంలో కర్పూరతిలకం అనే ఏనుగు ఉండేది. దాన్ని చూసి నక్కల మంద, "దీన్ని చంపగలిగితే మనకు నాలుగు నెలలపాటు తిండి కొరత ఉండదు," అనుకున్నవి.

ఒక ముసలినక్క మిగిలిన వాటితో, "నేను నా బుద్ధిబలంతో దానికి చావు తెప్పిస్తాను," అని, ఏనుగు వద్దకు వెళ్ళి, సాష్టాంగ నమస్కారం చేసి, "ప్రభూ, నా మనవి ఆలకించాలి," అన్నది.

"నువు ఎవరు?" అన్నది ఏనుగు.

ముసలినక్క ఇలా చెప్పింది:

"నేను నక్కను. అరణ్యమృగాలు సభ చేసి నన్ను తమ దూతగా మీ వద్దకు



పంపాయి. అవి తమతో ఇలా చెప్పమన్నాయి: 'మేము రాజు లేకుండా జీవించటం భావ్యంకాదు గనక, సకల రాజలక్షణాలూ గల తమరిని మా రాజుగా అభిషేకించ నిశ్చయించాము. గొప్ప వంశంలో పుట్టి, ఉదారమైన శీలమూ, సద్వర్తనా కలిగి, పవిత్రుడై, రాజనీతి తెలిసినవాడు రాజు కావటానికి అర్హుడు. ఎవరుగాని ముందు రాజును చూసుకుని, తరవాత భార్యనూ, సంపదనూ వెతుక్కోవాలి. రాజు లేనిపక్షంలో భార్యా, సంపదా ఉండి మాత్రం ఏం లాభం? వాటిని క్షణంలో దొంగలు కాజేస్తారు! రాజు వర్షం లాగా ప్రాణదాత. కాకపోతే, నీటి ఎద్దడిలోనైనా ప్రాణాలు నిలుపుకోవచ్చును గాని, రాజు లేకుండా సాధ్యం కాదు. సాధారణంగా ప్రజలు రాజభీతి చేతనే సరిగా ప్రవర్తించుతారు. సహజమైన పుణ్యాత్ములు చాలా అరుదు. తమ భర్తలు ముసలివారైనా, అవిటివారైనా, రోగిష్ఠివారైనా, నిర్ధనులైనా భార్యలు వారిపట్ల విశ్వాసంగా ఉంటారంటే, అది దండభీతితోనే కదా! తమరు ఆదర్శ ప్రభువులు! అందుచేత తమరిని రాజుగా అభిషేకించటానికి వేచి ఉన్నాం. కనుక, స్వామీ, తమరు నా వెంట త్వరగా వచ్చి, సుముహూర్తం దాటిపోకుండా మాకు రాజు కండి!''

రాజరికం మీద దురాశకొద్దీ, కర్పూరతిలకం నక్క వెనకగా బయలుదేరింది.



దారిలో ఒక ఊబి ఉన్నది. అది పైకి ఊబిలాగా కనబడదు. నక్క దాని అంచు వెంబడి ఉన్న గట్టి నేల మీద నడుస్తూ ముందుకు పోయింది. కాని ఏనుగు ఊబిలో దిగబడిపోయి, "మిత్రమా, నక్కా! ఇప్పుడు నేనేం చేసేది? నేను ఈ ఊబిలో ఇరుక్కుపోయి, ఘోరమైన చావు చావబోతున్నాను. ఒక్కసారి వెనక్కు తిరిగి, నన్ను చూడు,'' అన్నది, దీనంగా.

నక్క వెనక్కు తిరిగి చూసి, వెటకారంగా నవ్వుతూ, ''నా తోక పట్టుకుని పైకి రా! నా వంటి ప్రాణిని బుద్ధితక్కువగానమ్మినందుకు నీకీ విపత్తుతప్పదు. సజ్జనులతో స్నేహం చేసేవారు బాగుపడతారనీ, దుర్మార్గులతో చేరినవాళ్లు నశిస్తారనీ పెద్దలు చెప్పనే చెప్పారు,'' అన్నది.

ఏనుగు కొంతసేపటికి ఆ ఊబిలోనే చచ్చిపోయింది.

నక్కల మందకు దాని శరీరం చాలా కాలంపాటు ఆహారమయింది.

## పనితీరిన భృత్యుడు

ఆరావళీ పర్వతాలలో ఒక శిఖరం మీద మహావిక్రమం అనే సింహం ఉండేది. అది నిద్రపోయినప్పుడల్లా ఒక చుంచు వచ్చి సింహం మీదికి ఎక్కి, దాని జూలు కొరికేది. సింహానికి తగని చిరాకుపుట్టేది. కాని ఆ చుంచు చలాకీగా సింహానికి అందకుండా తప్పించుకునేది.

చుంచు బెడద ఎలా వదిలించుకోవాలో తెలీక, దానికి అసలైన శత్రువు పిల్లి కనక, ఒక పిల్లిని చేరదీసి, దానికి మాంసం మేపుతూ వచ్చింది సింహం.

పిల్లిని చూసినాక చుంచు తన కలుగులో నుంచి బయటికిరాక, తిండికి మాడసాగింది, కాని అలా ఎంతకాలం మాడుతుంది? అది సాహసించి ఒకసారి బయటికి వచ్చేసరికి, పిల్లి స్వామిభక్తి కొద్దీ ఆ చుంచును పట్టి, చంపేసింది.

అంతే, అటుతరవాత సింహం, పిల్లితో పని తీరిపోయి, దానికి మాంసఖండాలు పెట్టటం మానేసింది.





# 86

## నేరానికి శిక్ష

సింహళ ద్వీపాన్ని ఏలిన జీమూతవాహనుడి కొడుకు కందర్పకేతుడు గొప్ప అందగాడు. ఒకనాడు ఒక వర్తకుడు అతనికి ఒక వింత సంగతి చెప్పాడు. అదేమంటే, ప్రతి చతుర్దశినాడూ, సముద్ర మధ్యంలో, కల్పవృక్షం కింద, ఒక అతిలోక సుందరి ఆభరణ భూషితురాలై ఒక శయ్యమీద కూర్చుని కనిపిస్తుందట.

కందర్పకేతుడికి ఆసక్తి పుట్టుకొచ్చి వర్తకుడు చెప్పిన వేళకు, అతను చెప్పిన చోటికివెళ్ళి కల్పవృక్షం కింద అద్భుత సౌందర్యవతిని చూశాడు. అతన్ని చూడగానే ఆ సుందరి సముద్రంలోకి దిగిపోయింది.

ఆమె అందానికి కట్టుబడి కందర్పకేతుడు కూడా సముద్రంలోకి దూకి, దాని అడుగుకు చేరుకున్నాడు. ఆ సముద్రం అడుగున, ఒక బంగారు భవనంలో, విద్యాధరస్త్రీల మధ్య ఆ సుందరి ఒక బంగారు శయ్యపై కూర్చుని ఉన్నది.

ఆమె అతన్ని చూసి, అతని వద్దకు ఒక విద్యాధరిని పంపింది. ఆ విద్యాధరి అతనితో ఇలా అన్నది:

''ఈ సుందరి కందర్పకేళి అనే విద్యాధరరాజు కూతురు. ఈమె పేరు రత్నమంజరి. తనను చూసి సమ్మోహితుడై, సముద్రంలో సాహసించి దూకి, ఈ బంగారు భవనానికి వచ్చినవాణ్ణి మాత్రమే పెళ్ళాడతానని ఈమె శపథం చేసింది. అందుచేత ఆమె నిన్ను వివాహమాడటానికి సిద్ధంగా ఉన్నది.''

కందర్పకేతుడు సంతోషించి, రత్నమంజరిని గాంధర్వవిధిని పెళ్ళాడాడు.

పంచతంత్రం



వారిద్దరూ కొంతకాలం స్వర్గసుఖాలలో తేలియాడుతూ బంగారు భవనంలో ఉన్నారు.

ఆ భవనంలోని పెద్ద చావడిలో రత్నమంజరి యొక్క బంగారు ప్రతిమ ఒకటి ఉన్నది. "ఆ ప్రతిమను ఎన్నటూ తాకవద్దు. తాకితే సర్వనాశనం అవుతుంది." అని కందర్పకేతుణ్ణి రత్నమంజరి అదివరకే హెచ్చరించి ఉన్నది.

అయినా ఒకనాడు, రత్నమంజరి దగ్గర లేని సమయంలో, కందర్పకేతుడు ఆ ప్రతిమను తాకాడు. వెంటనే ఆ ప్రతిమ అతన్ని గట్టిగా తన్నింది. ఆ తన్నుతో అతను సింహళద్వీపంలో వచ్చిపడ్డాడు.

### మారణహోమం!

శ్రీపర్వతప్రాంతంలో ఉండిన బ్రహ్మపురంలో ఒక వదంతి వ్యాపించింది. ఏమంటే, కొండశిఖరాన ఘంటాకర్ణుడు అనే రాక్షసుడు చేరాడట!

ఈ వదంతి మూలంగా ప్రజలు కొండమీదికి వెళ్ళి కట్టెపుల్లలు తెచ్చుకోవటానికి భయపడ్డారు.

వాస్తవం ఏమిటంటే, గంటను దొంగిలించి పారిపోతున్న ఒక దొంగను పెద్దపులి చంపింది. వాడి చేతిలో ఉండిన గంట కొన్ని కోతులకు దొరికింది. అవి దాన్ని అప్పుడప్పుడల్లా మోగించసాగాయి. ఈ విధంగా బ్రహ్మపురిలో జనానికి గంటమోత ఏవేళ వినిపించినా వినిపించేది. దాన్ని మోగించేవాడు ఘంటాకర్ణుడనే రాక్షసుడు అనుకుని, చాలామంది ఊరు వదిలిపెట్టి పోసాగారు. ఎందుకంటే, ఆ రాక్షసుడు నరభక్షకుడని, మనిషిని తినటం పూర్తిచేసినప్పుడల్లా గంట మోయిస్తూంటాడని ఎవరో పుకారు లేవదీశారు.

ఘంటాకర్ణుణ్ణి మారణహోమం చేయించినవారికి వెయ్యి బంగారు వరహాలు ఇస్తానని రాజా చాటింపు వేయించాడు.

ఆ గంట రహస్యం ఒక నర్తకికి తెలుసును. ఆమె తన ప్రియుడను రహస్యంగా

కలుసుకోవటానికి, నిర్జనంగా ఉన్న కొండ మీదికి వెళుతూ ఉండేది. అలాటి సమయంలో ఒకసారి ఆమె గంట వాయిస్తున్న కోతులను చూసింది.

రాజు చేసిన చాటింపువిని ఆమె రాజు వద్దకు వెళ్ళి, తాను రాక్షసుణ్ణి మారణహోమం చెయ్యగలనని చెప్పింది. తరవాత ఆమె ముగ్గులతో యంత్రాలు వేసి, గణేశప్రార్థనచేసి తాంత్రికక్రియలు జరిపి, ఒక బుట్టనిండా కోతులకు ఇష్టమైన పళ్ళు పెట్టుకుని, కొండ మీదికి వెళ్ళి, ఆ పళ్ళను కోతుల సమీపంలో విసిరింది. కోతులు గంటను వదిలేసి, పళ్ళకోసం పరిగెత్తాయి. ఆమె చల్లగా గంటను సంగ్రహించి, ఊరికి దిగి వచ్చి, రాజుతో, "ఘంటాకర్ణుణ్ణి మారణహోమం చేసి, వాడి గంట పట్టుకొచ్చాను. ఇక మీకు ఈ గంట మోత వినిపించదు." అన్నది.

మళ్ళీ కొండ మీది నుంచి గంట మోత ఎందుకు వినిపిస్తుంది? రాజు ఆమెకు వెయ్యి దీనారాలూ ఇచ్చాడు.

### మువ్వల మోజు

ఒక దేశంలో ఉజ్జ్వలకుడు అనే రథం తోలేవాడు ఉండేవాడు. అయితే వాడి రథానికి ఎన్నడూ కిరాయి దొరికేది కాదు. రథం తోలే వృత్తి వాడికి అచ్చిరాలేదు.

"పొట్టగడవని వృత్తినీ, జరుగుబాటు లేని దేశాన్నీ ఎందుకు అంటిపెట్టుకోవాలి? ప్రపంచమంతా మన మాతృభూమే,



జరుగుబాటుకోసం ఏ వృత్తి చేసుకున్నా చేసుకోవచ్చు." అనుకుని వాడు మరో దేశానికి బయలుదేరాడు.

దారిలో ఒక అరణ్యప్రాంతంలో వాడికి ఒక ఒంటెపిల్ల దొరికింది. దాన్ని దాని తల్లి అక్కడ ఉంచి, వదిలేసి, తన దారిన తాను వెళ్ళిపోయింది.

వాడు ఆ ఒంటెపిల్లను తీసుకుని ఇంటికి తిరిగివచ్చి, అడవి నుంచి గడ్డి తెచ్చి మేపాడు. అది బాగా బలిసి పెద్దదై చాలా పిల్ల ఒంటెలను పెట్టింది. వాడు వాటిని బాడుగకు ఇచ్చి, పొట్ట పోసుకోసాగాడు.


వాడు అప్పుడప్పుడూ ఎడారి మీదుగా రాజస్థానానికీ, గుజరాతుకూ ప్రయాణాలు చేస్తూ, అప్పుడప్పుడూ చిన్న ఒంటెలను కొని, తన మందలో చేర్చేవాడు.

వాడు అలా కొన్న ఒంటెపిల్లలలో ఒకటి చాలా అందంగా ఉండేది. అందుకని వాడు దాని మెడకు వెండిమువ్వలు కట్టాడు. అది నడిచేటప్పుడు వాటి చప్పుడు చెవులకు ఎంతో ఇంపుగా ఉండేది. ఆ కారణంగా ఆ ఒంటెపిల్లకు గర్వంగా కూడా ఉండేది. మువ్వలు లేని ఇతర ఒంటెలకు మంటగానూ ఉండేది.

ఒకసారి ఒంటెల మంద అడవిలో మేయటానికి పోయినప్పుడు, మువ్వల ఒంటె వెనక దిగబడిపోయింది. ఉత్సాహంగా గెంతుతూ, ఆడుకోవటంలో అది ఈ సంగతి గమనించలేదు.

ఒక ముసలి ఒంటె దాన్ని చూసి, "ఒంటరిగా వెనక చిక్కిపోయేవు! సింహమూ, ఇతర క్రూరమృగాలూ హాని చేస్తాయి. నీ మువ్వల చప్పుడు వాటిని ఆకర్షిస్తుంది," అని హెచ్చరించింది.

అయినా మువ్వల ఒంటె ఆ మాటలు వినిపించుకోలేదు. ఒంటెలమంద కనుచూపుమేర దాటిపోయింది. చీకటిపడింది. మువ్వల ఒంటె, దారి తెలియక అటూ ఇటూ పరిగెత్తసాగింది. దాని మువ్వల చప్పుడు విని ఒక సింహం వచ్చి, దాన్ని పొట్టన పెట్టుకున్నది.





# 87

## హంసరాజూ, నెమలిరాజూ

ఉత్తరాన కర్పూరద్వీపంలో పద్మకేళి అనే సరస్సు ఉండేది. అందులో హిరణ్యగర్భుడు అనే రాయంచ నీటిపక్షుల కన్నిటికీ రాజుగా ఉండేది. అది తన ప్రజలైన పక్షులను రక్షిస్తూ, వాటి మన్ననలను పొందుతూండేది.

అక్కడికి అయిదు వందల మైళ్ళు దక్షిణంగా వింధ్యపర్వతాలలో చిత్రవర్ణుడు అనే నెమలి, నేల మీద నివసించే పక్షుల కన్నిటికీ రాజుగా ఉండేది.

ఒకనాడు దీర్ఘముఖుడు అనే కొంగ సంచారం చేస్తూ, వింధ్యపర్వతాలకు వచ్చి, ఆహారం కోసం వెతుకుతూండగా, కొన్ని నేల పక్షులు దాన్ని చూసి, ''నీది ఏ దేశం? మీ రాజు ఎవరు?'' అని అడిగాయి.

''మాది కర్పూరద్వీపం. మా రాజు దైవాంశగల హిరణ్యగర్భుడు. మాది భూలోకస్వర్గం,'' అన్నది కొంగ. అది అంతటితో పోనియ్యక, గర్వంగా, ''మీరంతా ఈ అడివి ప్రాంతం వదిలి, మా కర్పూరద్వీపం వచ్చెయ్యండి,'' అన్నది.

''తిండికోసం మా దేశం వచ్చినవాడికి అంత పొగరు తగదు!'' అని నేలపక్షులు కొంగను మందలించాయి.

అంతతో పోట్లాటసాగింది.

''హిరణ్యగర్భుణ్ణి రాజు చేసినదెవరు?'' అని నేలపక్షులు అడిగాయి.

''చిత్రవర్ణుణ్ణి రాజు చేసినదెవరు?'' అని కొంగ అడిగింది.

''చిత్రవర్ణుడు జంబూ ద్వీపాని కంతటికీ రాజు. మీ కర్పూరద్వీపం అందులోదే!'' అన్నాయి నేలపక్షులు.



"మాటలతో రాజ్యాలు జయించేటట్టుంటే మీరన్నది నిజమే! జంబూద్వీపానికంతటికీ తానే రాజునని మా హిరణ్యగర్భుడు కూడా నిరూపించగలడు," అన్నది కొంగ.

"ఎలా?" అని నేలపక్షులు కోపంగా అడిగాయి.

"యుద్ధంచేసి!" అన్నది కొంగ.

"యుద్ధం మేమూ చెయ్యగలం! మీ రాజు ఎంత బలవంతుడైనా మేం యుక్తితోనైనా జయించగలం," అన్నాయి నేల పక్షులు.

తరవాత అవి కొంగను చిత్రవర్ణుడి వద్దకు తీసుకుపోయాయి. జరిగినదంతా చెప్పాయి. రాయబారిగా పనిచేసే చిలక, కర్పూరద్వీపం జంబూద్వీపం లోనిదేనని చెప్పింది. చిత్రవర్ణుడు కూడా జంబూద్వీపానికంతటికీ తానె రాజు గనక, కర్పూర ద్వీపానికి కూడా తానె రాజు అన్నది.

దీర్ఘముఖుడు అందుకు ఒప్పుకోక, తన రాజు హిరణ్యగర్భుడే జంబూద్వీపానికంతటికీ రాజని వాదించింది.

"ఆ మాట ఎలా రుజువు చేస్తారు?" అని చిత్రవర్ణుడు అడిగింది.

"యుద్ధంచేసి!" అన్నది కొంగ. అది ఇంకా ఇలా అన్నది:

"మీరు ఒక రాయబారిని మా రాజు వద్దకు పంపి, మీ ఏలుబడి ఆమోదించకపోతే యుద్ధం చేస్తామని ప్రకటించి, ఏం జరిగేదీ చూడండి!"

చిత్రవర్ణుడి మంత్రి దూరదర్శనుడు అనే గద్ద చాలా వివేకం గలది. హిరణ్యగర్భుడి మంత్రి ఎవరని అది దీర్ఘముఖుణ్ణి అడిగితే, సర్వజ్ఞు డనే చక్రవాకం అని జవాబు వచ్చింది. చక్రవాకం ఆ దేశానికి చెందినది గనక ఆ పదవికి తగినదే నని గద్ద అన్నది.

తన మంత్రి అయిన గద్దతో సంప్రదించిన మీదట చిత్రవర్ణుడు చిలకను తన రాయబారిగా హిరణ్యగర్భుడి వద్దకు

పంప నిశ్చయించింది. చిలక వెళ్ళటానికి ఒప్పుకున్నది గాని, దుర్మార్గుడైన దీర్ఘముఖుడి వెంట కర్పూరద్వీపానికి వెళ్ళటానికి ఒప్పుకోలేదు.

"నేను ఏ విధంగా దుర్మార్గుణ్ణి?" అని దీర్ఘముఖుడు అడిగింది.

"నువు నీ మాటలతోనూ, ప్రవర్తనతోనూ కయ్యం రేపావు. చాకచక్యంగా మాట్లాడే నేర్పు ఉండినట్టయితే పరిస్థితి సామ్యంగా ఉండటమే గాక, నీకు కొంత కీర్తి కూడా వచ్చేది," అన్నది చిలక.

దీర్ఘముఖుడు కర్పూర ద్వీపానికి తిరిగి వెళ్ళి, హిరణ్యగర్భుడికి జరిగినదంతా చెప్పింది. హిరణ్యగర్భుడు తామరపువ్వుల సింహాసనం మీద కూర్చుని దీర్ఘముఖుడి కథనం వినేటప్పుడు దాని చుట్టూ దాని మంత్రులన్నీ, సర్వజ్ఞ చక్రవాకంతో సహా, కూర్చుని ఉన్నాయి.

అంతా విని హిరణ్యగర్భుడు దీర్ఘముఖుడితో, "నువ్వు యుద్ధం చేస్తామని బెదిరించటంలో తొందరపడ్డావు! నీ దేశం యొక్క బలం నువ్వు పరిగణించలేవు." అన్నది.

"దీర్ఘముఖుడు చాలా మూర్ఖంగా ప్రవర్తించింది. అకారణంగా కలహం తెచ్చి పెట్టింది," అని సర్వజ్ఞుడు హంస రాజుతో ఏకాంతంగా, దీర్ఘముఖుణ్ణి అలా



కయ్యం ప్రేరేపించమని మన సైనికాధికారు లెవరో ప్రోత్సహించి ఉంటారన్నది.

"జరిగిన దాని సంగతి వద్దు. ప్రస్తుతం కర్తవ్యం ఏమిటి, చెప్పు." అన్నది హిరణ్యగర్భుడు.

"మనం జంబూ ద్వీపానికి ఇద్దరు చారులను పంపుదాం. ఒకడు వెళ్ళి అక్కడి పరిస్థితులు గమనించి వస్తాడు. రెండోవాడు మనదూతగా వెళ్ళి, ఆ రాజుకు మన సందేశం అందజేస్తాడు." అన్నది సర్వజ్ఞుడు.

దూతలుగా దీర్ఘముఖుణ్ణి, మరో కొంగనూ పంపి, ఆ ఇద్దరి కుటుంబాలనూ కుదువ ఉంచుకున్నారు.

ఇంతలో చిలక రాయబారి జంబూ ద్వీపం నుంచి వచ్చివేసినట్టు వార్త తెలిసింది. రాయబారికి విడిది చూపించి, రాజుగారి ఆజ్ఞ అయినప్పుడు సభలో ప్రవేశపెట్టమని ఉత్తరువు జారీ అయింది.

హిరణ్యగర్భుడు ఉత్సాహంగా, "అయితే యుద్ధం వచ్చేస్తున్నదన్న మాట!" అన్నది.

సర్వజ్ఞుడు ఇలా అన్నది:

"దేవా, యుద్ధం వాంఛనీయమైనట్టు ఉత్సాహపడవద్దు. శత్రువుకు దాసోహం అయి, దేశాన్ని వాళ్ళ పరం చెయ్యటం ఎంత తప్పో, తొందరపడి యుద్ధానికి దిగటం కూడా అంతే తప్పు. మంచి మాటలూ, బహుమానాలూ, బెదిరింపులూ, రాజకీయ సంబంధాల తెగతెంపులూ పని చేయని పరిస్థితిలోనే యుద్ధానికి దిగాలి. చావు బతుకుల పోరాటం అనుభవం లేనివాడు తానొక మహావీరుణ్ణి అనుకుంటాడు. యుద్ధం వస్తున్నదంటే జనం ఉత్సాహంగా గంటలు వాయిస్తారు, తమవారు యుద్ధంలో చస్తుంటే చెంపలు వాయించుకుంటూ ఏడుస్తారు. ప్రతి యుద్ధమూ ఏదో ఒకనాటికి శాంతితో అంతం కావలసినదే. అందుచేత శాంతే సహజమైనది. యుద్ధంకన్న శాంతే వాంఛనీయమైనది. అయితే ఇప్పుడు యుద్ధం రానేవచ్చింది గనక, అందుకు తగిన ప్రయత్నాలన్నీ జరగవలసిందే. చిత్రవర్ణుడు బలవంతుడన్నది మనం గుర్తుంచుకోవాలి. నీటిపక్షులకన్న నేలపక్షులు సంఖ్యలోనేగాక, బలంలో కూడా మిన్న అయినవి. మన పరిస్థితి ఎలా ఉన్నదంటే, తిమింగిలం నేల మీద ఏనుగుతో పోరాడుతున్నట్టుగా ఉన్నది. బలవంతుడు ఎదిరించినప్పుడు బుద్ధిమంతుడు తాబేలులాగా వెనక్కు తగ్గుతాడు. కాని అవకాశం దొరికినప్పుడు పగబట్టిన పాములాగా దాడి చేస్తాడు. చిలక రాయబారిని విడిదిగృహంలో విశ్రాంతి తీసుకోనియ్యండి. ఈ లోపల మనం మన కోటను చక్కబెట్టుకుందాం."








## 88

కోటను శత్రువుల ముట్టడికి తట్టుకునేలాగా భద్రపరిచే పని సేనాపతి అయిన సారసుడికి అప్పగించబడింది. కోట భద్రంగానే ఉన్నదనీ, తిండి గింజలూ, ఉప్పూ నిలవ ఉంచితే చాలుననీ సేనాపతి అన్నాడు.

ఇంతలో సింహళద్వీప రాజైన మేఘవర్ణుడు సపరివారంగా వచ్చి, హిరణ్యగర్భుణ్ణి చూడగోరుతున్నట్టు కబురు వచ్చింది.

"మేఘవర్ణుడు ఏమిటి! అతన్ని ప్రవేశపెట్టండి," అన్నాడు హిరణ్యగర్భుడు.

"అతనికి ఎలా స్వాగతం చెప్పాలి? మిత్రుడుగానా, శత్రువుగానా, తటస్థుడుగానా?" అని సర్వజ్ఞము అడిగింది.

"అది నేలపక్షి. ఆ కారణంగా చిత్రవర్ణుడి పక్షం అనుకోవాలి. ఒకవేళ అది తనవారైన నేల పక్షులను వదిలేసి వచ్చి ఉంటే దాన్ని ప్రాణాలతో ఉండనియ్యరాదు. అది ఎంతో ప్రయాసపడి చాలా దూరంనుంచి వచ్చిన కారణంగా లోపలికి ప్రవేశపెట్టండి," అన్నాడు హంసరాజు హిరణ్యగర్భుడు.

"అలాగే! కోట భద్రంగానే ఉన్నది గనకనూ, మన చారులు వెళ్ళారుగనకనూ చిలక రాయబారిని కూడా ప్రవేశపెట్టుదాం. అయితే, చాణుక్యుడు నందుణ్ణి తన దూత చేత చంపించాడని మనకు తెలుసుగనక, తమరు రాయబారికి తగినంత దూరంలో, అంగరక్షకుల మధ్య ఉండటం మంచిది," అన్నది సర్వజ్ఞ చకోరం.

సభలోకి చిలకా, మేఘవర్ణుడనే కాకి పిలవబడ్డారు. చిలక వంగి నమస్కారం



చేసి, తనకోసం ప్రత్యేకించిన ఆసనం మీద కూర్చుని, ఇలా అన్నది:

"ఓ హిరణ్యగర్భా, నీకు నీ ప్రాణం మీద ఏమాత్రం తీపి ఉన్నప్పటికీ, రాజ్యం విడిచి పారిపోయే ఉద్దేశంలేని పక్షంలో, రాజాధిరాజైన మహాబలశాలి చిత్రవర్ణుడు వెంటనే నిన్ను తన వద్దకు వచ్చి, లొంగి పొమ్మని ఆజ్ఞాపిస్తున్నాడు."

హిరణ్యగర్భుడు ఆవేశంతో, "ఏది నోరు మూసేవారు ఈ సభలో ఎవరూ లేరా?" అని గట్టిగా అరిచింది.

మేఘవర్ణుడు (కాకి), "మహారాజా, తమరు ఆజ్ఞాపించండి. ఈ నీచుణ్ణి ఇప్పుడే చంపేస్తాను," అన్నది.

"మహారాజా, దూత తన రాజుకు ప్రతినిధి. అతను ఎంత హీనుడైనా, ఎంత అమర్యాదగా మాట్లాడినా అతన్ని శిక్షించ రాదు. అతను శిక్షార్హుడు కాని కారణం చేత, మరింత అమర్యాదగా మాట్లాడ తాడు. అతన్ని విడిచిపెట్టి, తిరిగి పోని య్యండి," అన్నది సర్వజ్ఞుడు.

హిరణ్యగర్భుడు తనను తాను నిగ్రహించుకుని, చిలకను తిరిగి పోనిచ్చింది. సర్వజ్ఞుడు దాన్ని అవతలికి తీసుకుపోయి, అనవాయితీ ప్రకారం దానికి ఇయ్యవలసిన బంగారమూ, ఇతర బహుమతులూ ఇచ్చి సాగనంపింది.

చిలక తన దేశానికి తిరిగి వచ్చింది.

"విశేషాలేమిటి?" అని చిత్రవర్ణుడు అడిగింది.

"మహారాజా, యుద్ధ సన్నాహాలు చెయ్యండి. కర్పూర దేశం భూలోక స్వర్గమే, బలంగల దేశం కూడానూ! కాని రాజు హిరణ్యగర్భుడూ, మంత్రి సర్వజ్ఞుడూ [illegible] ఉన్నారు," అన్నది చిలక రాయబారి.

యుద్ధం తప్పదు గనక, కర్తవ్యం గురించి చిత్రవర్ణుడు తన మంత్రులతో చర్చించింది. దూరదర్శి (గద్ద) మంత్రి, తప్పనిసరి అయితేనే తప్ప యుద్ధానికి దిగరాదనీ, అప్పుడు కూడా తన బలమూ,

ఎదిరి బలమూ చూసుకుని మరీ దిగాలనీ, యుద్ధం తప్పటానికి చిన్న చిన్న రాజీ మార్గాలు చూడాలనీ అన్నది.

గద్ద ఇంకా ఇలా అన్నది:

"మంచి యోధులుగల చిన్న సేన అయినా, పిరికివాళ్ళూ, మంచి శిక్షణ లేనివాళ్ళూగల పెద్ద సేనకన్న మేలు. పిరికివాళ్ళ తిరోగమనం మంచివాళ్ళ ఓటమికి కారణం అవుతుంది. కీర్తీ, సన్మానమూ వీరత్వాన్ని ప్రోత్సహిస్తాయి. మనం అన్ని విషయాలూ క్షుణ్ణంగా ఆలోచించాలి."

రాజు చిరాకుగా, "ఎందుకొచ్చిన నీతి దురద! మనం వెంటనే దాడి చేదాం," అంటూ లేచి, అంతకుముందే జ్యోతిష్కులు నిర్ణయించిన ముహూర్తాన సైన్యంతో సహా బయలుదేరింది.

చిత్రవర్ణుడు దండెత్తి వస్తూ, మలయ పర్వతం మీద విడిసి ఉన్నట్టు హిరణ్యగర్భుడికి త్వరలోనే వార్త అందింది. చిత్రవర్ణుడి గూఢచారి ఎవరో కోటలో ఉన్నట్టు సూచనలు కనబడ్డాయి. అందుచేత కోటను గాలించే అవసరం కలిగింది.

సర్వజ్ఞుడికి మేఘవర్ణుడు (కాకి) మీద అనుమానం పోయింది.

"అది సమంజసం కాదు. శత్రువు గూఢచారి అయితే ఆ కాకి శత్రువు చేత



అయిన చిలకను చంపటానికి ఎందుకు సిద్ధపడింది? అదిగాక, యుద్ధ ప్రకటనకు చాలా ముందుగానే అది మన పక్కకు వచ్చింది." అన్నది హిరణ్యగర్భుడు.

"అయినప్పటికీ, అది పరాయిది. దాన్ని నమ్మరాదు." అన్నది సర్వజ్ఞుడు.

"పరాయివాళ్ళయినంత మాత్రాన శంకించనవసరంలేదు, అయినవారిలాగే, పరాయివారిలో కూడా మంచివాళ్ళూ, చెడ్డవాళ్ళూ, ఏదీకానివాళ్ళూ ఉంటారు," అన్నది రాజు.

"కాని మంత్రులు తమ అభిప్రాయం తెలపటం ధర్మం. రాజు వద్ద నిజం దాచే వైద్యుడూ, పురోహితుడూ, మంత్రీ రాజు

యొక్క ఆరోగ్యాన్ని, నీతినీ, సౌభాగ్యాన్నీ పోగొట్టుతారు,'' అన్నది సర్వజ్ఞుడు.

''ఇప్పుడు ఏం చెయ్యాలి? చిత్రవర్ణుడు తన మంత్రి అయిన గద్ద సలహాను తోసిపుచ్చి, మన మీదికి దండెత్తి వస్తున్నట్టు మన చారుడి ద్వారా తెలుస్తున్నది. శత్రు సైన్యం ప్రయాణంతో బడలి ఉంటుంది. వాటికి ఈ ప్రదేశమూ, ఇక్కడి నదులూ, కొండలూ తెలియవు. మనం దెబ్బ తియ్యటానికి ఇదే మంచి తరుణం. సేనన వెళ్ళి ఈ పని చెయ్యాలి,'' అన్నది రాజు.

ఇలాగే జరిగింది. చిత్రవర్ణుడి బలాలలో ప్రయాణించుతున్నవి కొండల లోనూ, అడవులలోనూ, దారులలోనూ నాశనమయాయి.

ఓటమి పొందిన చిత్రవర్ణుడు దూరదర్శనుణ్ణి సలహా అడిగింది. తొందరపడి యుద్ధం తలపెట్టినందుకు దూరదర్శనుడు రాజును మందలించింది. సేనలను ఉపసంహరించే ఉపాయం చూడమని రాజు అడిగితే, దూరదర్శనుడు, ''నిరాశ పడవద్దు. ఉపాయం ఉన్నది. బలాలను కోట మీద కేంద్రీకరించు.'' అన్నది.

ఈ సంగతి చారుడుగా వెళ్ళిన కొంగ చెప్పగానే, సర్వజ్ఞుడు హిరణ్యగర్భుడితో, ''కోటను భద్రపరుచు. ఖర్చు లెక్క చెయ్యక, సైనికులకు పుష్కలంగా ధనం ఇచ్చి, వాళ్ళు కోటను కాపాడేటట్టు చెయ్యి,'' అన్నది.

కోట నుంచి బయలుదేరి, శత్రువుతో తలపడతానని మేఘవర్ణం (కాకి) అంటే, సర్వజ్ఞుడు ఒప్పుకోక, అందరూ కోటను లోపలినుంచే రక్షించాలన్నది.

అందుచేత, చిత్రవర్ణుడి సేనలు కోటను ముట్టడించినప్పుడు, ద్వారాలన్నిటి వద్దా తీవ్ర పోరాటాలు జరిగాయి. హిరణ్యగర్భుడి సైనికులు ఇలా పోరాడుతూ ఉంటే, మేఘవర్ణుడూ, ఇతర కాకులూ కోట లోపలి ఇళ్ళ మీద మండుతున్న కట్టెలు వేసి, ''నిప్పు! నిప్పు! కోట లొంగిపోయింది!'' అని కేకలు పెట్టాయి.






## 89

మేఘవర్ణుడూ, ఇతర కాకులూ పెట్టిన కేకలకు నీటిపక్షులు బెదిరి, కోటను విడిచి పారిపోయి, అగడ్తలలో చేరాయి.

చిత్రవర్ణుడి సేనాపతి అయిన కోడిపుంజు హిరణ్యగర్భుణ్ణీ, అతని సేనాపతి అయిన సారసుణ్ణీ చుట్టుముట్టి, హింసించింది. సారసుడు తనను రక్షించబోయినప్పుడు హిరణ్యగర్భుడు, "నా పాట్లు నన్ను పడనీ, నా కొడుకు చూడామణిని రాజుగా అభిషేకించు," అన్నది.

"నా బొందిలో ప్రాణం ఉండగా శత్రువులు తమరికి హాని చెయ్యలేరు," అంటూ సారసుడు, కోడిపుంజు ప్రయత్నాలను విఫలంచేసి, హిరణ్యగర్భుణ్ణి అగడ్తలోకి తోసేసింది. తరవాత అది కోడిపుంజుతో హోరాహోరి యుద్ధంచేసి, చంపేసింది. అయితే నేలపక్షులు ఒక్కుమ్మడిగా దాని మీద పడి, కొంగను కూడా చంపాయి.

యుద్ధం చిత్రవర్ణుడి విజయంతో ముగిసింది. జయజయ ధ్వానాల మధ్య అది కోటలో ప్రవేశించింది.

### శాంతి

"మన కోటలోని ఇళ్ళ మీద మండే కొరవులు పడేసినది ఎవరు? శత్రువులా, లేక శత్రువు నియోగించిన కోటలోని వాళ్ళా?" అని హిరణ్యగర్భుడు తన అనుచరులను అడిగింది.

"తమ అవ్యాజమిత్రుడు మేఘవర్ణుడూ, అతని అనుచరులూ కానరారు. ఆ పని చేసినది వాళ్ళే అనుకుంటాను," అన్నది సర్వజ్ఞుడు.

"అంతా మన ప్రారబ్ధం! మన దురదృష్టం!" అన్నది రాజు.

''దురదృష్టాన్ని ఎందుకు నిందించటం? సరిఅయిన హితం విననివాళ్ళు కష్టాలపాలవుతారు,'' అన్నది సర్వజ్ఞుడు.

ఇంతలో ఒక దూత ద్వారా వార్త వచ్చింది: కర్పూరద్వీపం ఓడిపోవటానికి సహకరించినందుకు మేఘవర్ణుడు (కాకి)ని రాజుగా చేస్తానని చిత్రవర్ణుడు అంటే, దూరదర్శనుడు ఒప్పుకోక, నీచుణ్ణి బాధ్యతగల స్థానంలో ఉంచరాదనీ, దానికి బహుమతులు ఇయ్యమనీ అన్నదట! కాకిని రాజు చేస్తే, తనకు రోజూ కాశ్మీరుశాలువలూ, కుంకంపువ్వూ, ఫలాలూ పంపుతూ ఉంటుందని చిత్రవర్ణుడు అంటే, దురాశలకు పోవద్దని గద్ద హెచ్చరించిందట!

''అయితే నన్ను ఏం చెయ్యమంటావు?'' అని నెమలిరాజు గద్దను అడిగింది.

''హంసరాజుతో శాంతి ఒడంబడిక చేసుకుని, వింధ్యకు తిరిగివెళ్లు. వర్షాలు ఆరంభమయేదాకా ఇక్కడే తాత్సారం చేశామంటే, మరొక యుద్ధం జరిగి, నష్టపోతాం. కోటను జయించామన్న కీర్తి ఎటూ రానేవచ్చింది. ఆ కాస్తా ఎందుకు పోగొట్టుకోవాలి? ఉభయ పక్షాలు సమబలం గలవి అయినప్పుడు ఒక్కొక్కసారి యుద్ధంలో రెంటికీ నాశనం కలుగుతుంది. అందుచేత మనకు ఏ మాత్రం తీసిపోని హిరణ్యగర్భుడితో సంధి చేసుకుందాం,'' అన్నది గద్ద.



విజయగర్వం మీద ఉన్న చిత్రవర్ణు డికి ఓడిన శత్రువుతో సంధి, శాశ్వత సఖ్యమూ చేసుకోవటం మొదట నచ్చ లేదు.

అందుచేత హిరణ్యగర్భుడి మంత్రి జంబూద్వీపానికి తమ కొత్త సేనాని అయిన సారసుడి కొడుకును పంపి, అక్కడ అరాజకం కలిగించి, సింహళ ద్వీపాన్ని, జంబూద్వీపం మీద యుద్ధానికి వెళ్ళేటట్టు పురికొల్పించింది.

గద్ద నెమలి రాజుతో మేఘవర్ణుణ్ణి (కాకిని) సలహా అడగమన్నది. హంస రాజుతో సంధి చేసుకోమని సలహా ఇస్తూ, "ఆ రాజూ, మంత్రీ కూడా చాలా దొడ్డ బుద్ధిగల వాళ్ళు," అన్నది కాకి.

"అలా అయితే నువు ఆ రాజునూ, మంత్రినీ ఎలా మోసగించగలిగావు?" అని నెమలిరాజు కాకిని అడిగింది.

"ప్రభూ, నిన్ను విశ్వసించిన మహాత్ము లను వంచించటంలో ఘనత ఏమున్నది? నీ ఒడిలో నిద్రించేవాణ్ణి చంపటంలాటిదే! సజ్జనుడు దుర్మార్గుణ్ణి తనలాంటి వాడు గానే భావించి నమ్మినప్పుడు మోస గించటం తేలిక. అంత మాత్రాన నేను చెప్పినది మంచిసలహా కాకపోదు," అన్నది కాకి.

"మేఘవర్ణా, నువు వారిమధ్య అంత కాలం వారికి విధేయత చూపుతూ ఎలా ఉండగలిగావు?" అని నెమలిరాజు కాకిని మళ్ళీ అడిగింది.



''నా పని పూర్తి కాగలందులకు ఉండక తప్పలేదు. నా మాటవిని హిరణ్య గర్భుడితో సంధి చేసుకోండి,'' అన్నది కాకి.

సర్వజ్ఞుడు ఇందుకు సమ్మతించింది.

''నాకు ఓడిపోయిన హంసరాజు కనీసం నాకు కప్పం కట్టుతూ, నా ఆజ్ఞలకు లోబడి ఉండనీ,'' అన్నది నెమలి రాజు.

అంతలో, జంబూద్వీపం నుంచి వచ్చిన చిలక నెమలిరాజుతో, సింహళద్వీప రాజు కొక్కరాయి, జంబూద్వీపం మీద దాడి చేసినట్టు చెప్పింది.

''మంచి పని చేశావు, సర్వజ్ఞా!'' అన్నది గద్ద ఉత్సాహంగా.

''నేను వెంటనే వింధ్యకు వెళ్ళి, ఆ కొక్కరాయి అంతు తేల్చుతాను.'' అన్నది నెమలి రాజు.

''ప్రభూ, ఆగ్రహించి లాభం లేదు. సరిగా ఆలోచించకుండా చేసే పనులు ఆపద కలిగిస్తాయి,'' అన్నది సర్వజ్ఞుడు.

నెమలిరాజుకు ఈ మాట నిజమనిపించింది. అది గద్దను శాంతి సంధి ఏర్పాటు చేయమన్నది. దూరదర్శనుడు హిరణ్యగర్భుడి వద్దకు శాంతి రాయబారిగా వెళ్ళింది.

హిరణ్యగర్భుడు సర్వజ్ఞుణ్ణి, ''ఇది మళ్ళీ ఒక దొంగ ఎత్తా?'' అని అడిగింది.

''కాదు! గద్ద దొడ్డబుద్ధి గలది. దాన్ని కానుకలతో ఆహ్వానింతాం,'' అన్నది సర్వజ్ఞుడు.

గద్ద సర్వజ్ఞుడితో, ''మనం ఇద్దరు రాజుల మధ్యా శాంతి నెలకొల్పుదాం. వెయ్యి అశ్వమేధాల కన్న సత్యం మీద ఆధారపడిన శాంతి మేలు,'' అన్నది.

సర్వజ్ఞుడు ఇందుకు సంతోషంగా ఒప్పుకున్నది. ఉభయపక్షాల మధ్యా శాంతి సంధి జరిగింది. అటు తరవాత చిత్రవర్ణుడు జంబూద్వీపంలోనూ, హిరణ్యగర్భుడు కర్పూరద్వీపంలోనూ, మేఘవర్ణుడు సింహళంలోనూ రాజ్యం చేశాయి. —(అయిపోయింది.)

